

‘పారిశ్రామిక రంగానికి దీటుగా సేద్యరంగం ఎదగాలి. వ్యవసాయ ఫలాలు పదింతలు పెరగాలి’

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50

సంపుటి: 18 సంచిక: 136

బుధవారం 6-8-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

24 గంటల్లో సుంకాల మోత



- భారత్‌పై ఆక్రోశం వెళ్లగక్కిన అగ్రరాజ్యాధినేత
- 25% కొత్త దిగుమతి టారిఫ్‌లకు అదనంగా సుంకాలు విధిస్తానన్న ట్రంప్
- తమకన్నా రష్యాతోనే భారత్ ఎక్కువ వాణిజ్యం చేస్తోందంటూ మండిపాటు

6లో

భారత్‌కు ఆ హక్కుంది

మాతో వాణిజ్య బంధాన్ని తెంచేసుకోవాలంటూ ఒత్తిళ్లు చేయడం అక్రమం

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ టారిఫ్ బెదిరింపుల నేపథ్యంలో రష్యా స్పష్టీకరణ

ఉత్తరాఖండ్‌లో బురద విలయం

గంగోత్రి సమీప ధరాలీ గ్రామంలో వరద బీభత్సం

- ఎగువ ప్రాంతాల నుంచి ఒక్కసారిగా ముంచెత్తిన వరదనీరు
- పలు ఇళ్లు, రెస్టారెంట్లు భూస్థాపితం.. ఐదుగురు దుర్మరణం
- 50 మంది జాడ గల్లంతు.. వారిలో సైన్యాధికారి, 10 మంది జవాన్లు
- సీఎం పుష్కర్‌కు ఫోన్‌చేసి పరిస్థితిపై ఆరా తీసిన ప్రధాని

6లో



ఉత్తరాఖండ్‌లోని ధరాలీ వద్ద ఇళ్లను ముంచెత్తుతున్న బురద



ఏర్పాట్లపై మాట్లాడుతున్న వాకిటి శ్రీహరి, మహేశ్‌గౌడ్, మల్లు రవి

నేడు ఢిల్లీలో కాంగ్రెస్ ‘రిజర్వేషన్’ ధర్నా

- బీసీలకు 42% రిజర్వేషన్ల సాధనకై జంతర్‌మంతర్‌లో మహాధర్నా
- పాల్గొననున్న ఖర్గే, రాహుల్, సీఎం రేవంత్, మంత్రులు
- ఇండియా కూటమి పార్టీల ఎంపీలూ హాజరయ్యే అవకాశం
- ధర్నాస్థలిని పరిశీలించిన పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్, మంత్రులు

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని అసెంబ్లీలో ఆమోదించి పంపిన బిల్లుపై కేంద్ర ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకునేలా ఒత్తిడి తెచ్చేందుకు కాంగ్రెస్ పార్టీ బుధవారం ఢిల్లీలో మహాధర్నా నిర్వహించనుంది. జంతర్ మంతర్‌లో ఈ కార్యక్రమానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. మహాధర్నాలో పాల్గొనేందుకు సీఎం రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, కొండా సురేఖ, వివేక్, వాకిటి శ్రీహరి, సీతక్క, పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావుతోపాటు కాంగ్రెస్ ఎంపీలు, ఎమ్మెల్యేలు భారీ సంఖ్యలో నేతలు ఢిల్లీకి చేరుకున్నారు. ఈ ధర్నాలో ఏఐసీసీ అగ్రనేతలు మల్లికార్జున ఖర్గే, రాహుల్‌గాంధీలతో పాటు, ఇండియా కూటమి పార్టీల ఎంపీలు పాల్గొననున్నట్లు కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. ధర్నాలో పాల్గొనాలని సమాజ్‌వాదీ, తృణమూల్ కాంగ్రెస్, డీఎంకే, ఆర్‌జేడీ, వామపక్ష పార్టీల ఎంపీలకు కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి లేఖలు రాశారు. కార్యక్రమ ఏర్పాట్లను మంగళవారం మహేశ్‌కుమార్ గౌడ్, పొన్నం ప్రభాకర్,

మిగతా 14వ పేజీలో ▶



తెలంగాణ భవన్‌లో పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తున్న హరీశ్‌రావు

ఏకపక్షం కాదు

కాళేశ్వరం బరాజ్‌ల నిర్మాణం కేసీఆర్ సొంత నిర్ణయం కాదు

ఈ ప్రాజెక్టుకు కేబినెట్‌తోపాటు అసెంబ్లీ ఆమోదం కూడా ఉంది

పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ కార్యక్రమంలో హరీశ్‌రావు స్పష్టీకరణ

- వ్యాప్కోస్ నివేదిక, హై పవర్ కమిటీ సిఫారసులు, సీడబ్ల్యూసీ ఆమోదం మేరకే నిర్మాణం
- వాస్తవాలు లేకుండా వండి వార్చిన నివేదికను ప్రభుత్వం బయటపెట్టింది
- సీఎం రేవంత్‌రెడ్డి రాజకీయ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారు
- కేసీఆర్‌ను హింసించాలన్నదే ఆయన ఉద్దేశం.. కమిషన్ నివేదిక కోర్టు ముందు నిలవదు
- అసెంబ్లీలో పూర్తి నివేదికను పెడితే ప్రభుత్వాన్ని చీల్చిచెండాడతాం..
- కాళేశ్వరం తెలంగాణకు వరప్రదాయిని..అధికారంలోకి రాగానే నిరూపిస్తాం

సాక్షి, హైదరాబాద్: ‘కాళేశ్వరం ప్రాజెక్టుపై వాస్తవాలు లేకుండా వండి వార్చిన నివేదికను రేవంత్ రెడ్డి ప్రభుత్వం బయట పెట్టింది. ఈ ప్రాజెక్టుకు కేబినెట్‌తో పాటు అసెంబ్లీ ఆమోదం కూడా ఉంది. గవర్నర్ ప్రసంగంలో కాళేశ్వరం అంశం ఉండటం కేబినెట్ ఆమోదాన్ని సూచిస్తుంది. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌ల నిర్మాణం నాటి సీఎం కేసీఆర్ సొంత నిర్ణయం కాదు. వ్యక్తుల నిర్ణయం ఆధారంగా బరాజ్‌ల నిర్మాణం జరగలేదు. వ్యాప్కోస్ నివేదిక, హై పవర్ కమిటీ సిఫారసులు, కేబినెట్ నిర్ణయం, సీడబ్ల్యూసీ ఆమోదం మేరకు జరిగాయి. సీఎం రేవంత్‌రెడ్డి పాలనను గాలికి వదిలి రాజకీయ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారు. ‘డబ్బులు దండుకునేందుకు కమీషన్లు..కక్ష సాధింపుల కోసం కమిషన్లు’ అన్నట్లుగా కాంగ్రెస్ ప్రభుత్వం తీరు ఉంది. తన వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు రేవంత్ టీవీ సీరియళ్ల తరహాలో కమిషన్లు, విచారణలతో కాలం గడుపుతున్నాడు. కేసీఆర్‌ను హింసించాలన్నదే ఆయన ఉద్దేశం. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు కలిసి కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నాయి..’ అని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు మండిపడ్డారు. ‘కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ కుట్రలు.. కమిషన్ వక్రీకరణలు, వాస్తవాలు’ అనే అంశంపై మంగళవారం తెలంగాణ భవన్‌లో హరీశ్‌రావు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో పార్టీ ముఖ్య నేతలు, రైతులు దీనిని ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించారు. తుమ్మిడిహెట్టి నుంచి మేడిగడ్డ వద్దకు బరాజ్ మార్చడంలో నాటి సీఎం కేసీఆర్ ఏకపక్ష నిర్ణయం తీసుకున్నారంటూ కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన ఆరోపణలను హరీశ్‌రావు తీవ్రంగా ఖండించారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్

మిగతా 8వ పేజీలో ▶

అంతా ట్రాష్.. గ్యాస్!

కాళేశ్వరంపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదికపై కేటీఆర్



- దమ్ముంటే పూర్తి నివేదిక బయట పెట్టాలని సవాల్
- ఢిల్లీలో కేంద్ర ఎన్నికల సంఘంతో బీఆర్‌ఎస్ బృందం భేటీ
- బ్యాలెట్ పేపర్ విధానంలోనే ఎన్నికలు జరపాలని విజ్ఞప్తి
- విద్య, ఉద్యోగాల్లో కాంగ్రెస్ 42% రిజర్వేషన్లు ఇవ్వాలని డిమాండ్

8లో

న్యాయ వ్యవస్థనే అవమానిస్తారా?

మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఫైర్

- కమిషన్ నివేదికలోని అంశాలను మాత్రమే ప్రభుత్వం వెల్లడించింది
- ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టుకు హైడ్రాలజీ అనుమతులు ఇస్తే దాచి పెట్టారు
- కేబినెట్ ఆమోదం లేకుండానే కాళేశ్వరం చేపట్టారు
- బరాజ్‌లు ఎక్కడ కట్టాలో మీరే నిర్ణయించుకున్నారు..
- బండారం బట్టబయలైనందుకే కమిషన్‌ను తప్పు పడుతున్నారు
- ఇప్పటికైనా నాలుగు కోట్ల ప్రజలకు క్షమాపణలు చెప్పండి



సాక్షి, హైదరాబాద్: ‘ప్రజాస్వామ్య వ్యవస్థలపై బీఆర్‌ఎస్‌కు చులకన భావం. చట్టసభలు, న్యాయ వ్యవస్థపై గౌరవం, నమ్మకం లేదు. సుప్రీంకోర్టు రిటైర్డ్ జడ్జి సారథ్యంలోని జ్యుడీషియల్ కమిషన్ అంటే కూడా లెక్కలేదు. ప్రజలు గత ఎన్నికల్లో బుద్ధి చెప్పినా ఇప్పటికీ వాళ్లలో మార్పు రాలేదు. మేడిగడ్డను కుంగబెట్టిన దుర్మార్గులు ఇప్పుడు ఏకంగా సీనియర్ జస్టిస్ పీసీ ఘోష్‌ను అవమానిస్తున్నారా? న్యాయబద్ధ కమిషన్‌కు అపార్థాలు అంటగట్టే నీచానికి దిగజారటం కూడా మీకే చెల్లింది..’ అని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మండిపడ్డారు. కమిషన్ నివేదికపై బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు చేసిన ఆరోపణలను ఖండిస్తూ మంగళవారం రాత్రి ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.

వారి బండారం బట్టబయలైంది

‘కాళేశ్వరం ప్రాజెక్టు పేరిట గత ప్రభుత్వం ఎన్ని అవకతవకలకు, అక్రమాలకు పాల్పడిందో కమిషన్ విచారణలో బయటపడింది. అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్, ఆనాటి ఇరిగేషన్ మంత్రి హరీశ్‌రావు బండారం బట్టబయలైంది. అందుకే తేలు కుట్టిన దొంగల్లా.. హరీశ్‌రావు మళ్లీ కల్లబొల్లి కబుర్లు చెప్తున్నారు. కమిషన్ ఇచ్చిన నివేదికలోని అంశాలను మాత్రమే ప్రభుత్వం వెల్లడించింది. అది రేవంత్‌రెడ్డి

మిగతా 8వ పేజీలో ▶

మంత్రిపదవి ఇస్తరా.. ఇవ్వరా మీ ఇష్టం

- పదవి కోసం కాళ్లు పట్టుకొని బతిమిలాడే రకం కాదు నేను
- అవసరమైతే మళ్లీ త్యాగం చేస్తా
- నిన్నమొన్న వచ్చిన జూనియర్లకు పదవులు ఇచ్చారన్న ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి



సంస్థాన్ నారాయణపురం: ‘ప్రజల మధ్యనే ఉంటా.. ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకుంటా.. వారి కోసం ఎంత దూరమైనా పోతా.. అవసరమైతే మళ్లీ త్యాగం చేస్తా’ అని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలంలోని లచ్చమ్మగూడెం, చిమిర్యాల గ్రామాల్లో

మిగతా 14వ పేజీలో ▶

సీఎస్ పదవీకాలం మరో 3 నెలలు పొడిగింపు!



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు పదవీకాలం మరో 3 నెలలు పొడిగించాలని రాష్ట్రప్రభుత్వం నిర్ణయించినట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి లేఖ రాసినట్టు అధికార వర్గాల సమాచారం. ఏప్రిల్ 30న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన రామకృష్ణారావు ఈనెల 31న పదవీ విరమణ చేయాల్సి ఉంది. అయితే ఆయన పదవీకాలం పొడిగించడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందించడంతో మరో మూడు నెలలు ఆయన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా కొనసాగే అవకాశం ఏర్పడింది. రామకృష్ణారావు పదవీ విరమణ చేస్తే ఆయన స్థానంలో సీఎస్‌గా ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు జయేశ్‌రంజన్, వికాస్‌రాజ్ పోటీలో ఉన్నారు. కేంద్ర సర్వీసులో ఉన్న సంజయ్ జాజు రాష్ట్రానికి రావడానికి సిద్ధంగా లేరని సమాచారం. అలాగే ఢిల్లీలో తెలంగాణ భవన్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శశాంక్ గోయల్‌కు సీఎస్‌గా అవకాశం లేదని సమాచారం.



సాధించాల్సిన ఘనతలు ఇంకెన్నో..

- ఎన్డీయే ఇప్పటికే ఎన్నో విజయాలు సాధించింది
- బీజేపీ, మిత్రపక్షాలన్నీ కలిసికట్టుగా పని చేయాలి: ప్రధానమంత్రి మోదీ
- ‘సిందూర్’ విజయంపై మోదీకి సత్కారం

6లో

వైఎస్ వివేకానంద హత్య కేసులో దర్యాప్తు పూర్తి

సుప్రీంకోర్టుకు వెల్లడించిన కేంద్ర దర్యాప్తు సంస్థ

- వివరాలు 2లో

బీసీ రిజర్వేషన్ల బిల్లును ఆమోదించండి

పార్లమెంట్‌లో తెలంగాణ కాంగ్రెస్ ఎంపీల వాయిదా తీర్మానం

- చర్చకు పట్టు.. ప్లకార్డులతో నిరసన.. సభను అడ్డుకునే యత్నం
- ఉభయ సభలు పలుమార్లు వాయిదా

- వివరాలు 14లో

నో కామెంట్..

- నేను మంత్రి పదవులు ఇచ్చే స్థాయిలో ఉన్నానా?
- హైకమాండ్‌కు చెప్పే పరిస్థితి లేదు
- తన సోదరుడికి అమాత్య పదవిపై మంత్రి కోమటిరెడ్డి వ్యాఖ్యలు

- వివరాలు 14లో

రూ. 2 లక్షలిస్తే గుడిలో కొలువు

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలు అమ్ముకొంటున్న దళారులు

- పెద్ద దేవాలయాల్లో భారీ దందా
- శానిటేషన్‌కు వారే.. ప్రసాదాల తయారీకి వారే
- సిబ్బందిని మారుస్తున్న ఏజెన్సీలు

- వివరాలు 14లో

సెలవంటే పండగ!

- కుటుంబ సభ్యులంతా కలిసి వంట చేయండి
- సెలవు రోజులను ప్రత్యేకంగా మలుచుకోండి
- ఆరోగ్యానికి ఆరోగ్యం.. డబ్బు కూడా ఆదా
- బంధాలు బలోపేతం.. ఒత్తిడి నుంచి ఉపశమనం


- వివరాలు 7లో

ఇవాల్టి కార్టూన్



లోకలెవరు? కానిదెవరు?

- జీఓ 33తో మొదలైన వివాదం
- పాత జీఓ 114తో అక్రమాలు జరిగాయంటున్న ప్రభుత్వం
- జీవో 33తో స్థానికతను కోల్పోయిన కొందరు తెలంగాణ విద్యార్థులు
- సుప్రీంకోర్టు తీర్పు కోసం ఉత్కంఠగా ఎదురుచూపు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని మెడికల్ కాలేజీల్లో రాష్ట్ర కోటా కింద సీట్ల భర్తీలో నెలకొన్న ‘స్థానికత’ వివాదంపై ఉత్కంఠ వీడటం లేదు. ఈ అంశంపై దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టులో మంగళవారం వాదనలు ముగిసినప్పటికీ, తీర్పును రిజర్వు చేసింది. దీంతో ఉత్కంఠ మరింత పెరిగింది. ఈ నేపథ్యంలో దేశంలో ఎక్కడా లేని స్థానికత వివాదం తెలంగాణలోనే ఎందుకు వచ్చిందనే చర్చ మొదలైంది. ఉమ్మడి ఏపీ విభజన చట్టానికి అనుగుణంగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం 2017 తీసుకొచ్చిన జీఓ 114లో మార్పులు చేస్తూ ప్రస్తుత ప్రభుత్వం తీసుకొచ్చిన జీఓ 33తో వివాదం మొదలైంది. ఈ జీవో వల్ల తెలంగాణకు ఉన్న సానుకూలత ప్రతికూలతలు ఇప్పుడు చర్చనీయంగా మారాయి.

జీవో 33తో మొదలు..

ఏపీ పునర్విభజన చట్టంలో భాగంగా ఏపీ విద్యార్థులకు పదేళ్లపాటు తెలంగాణలోని విద్యా సంస్థల్లో కల్పించిన 15 శాతం రిజర్వేషన్ 2023 విద్యా సంవత్సరంతో ముగిసింది. దీంతో రాష్ట్రంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలల్లో 85%, ప్రైవేటు కళాశాలల్లో 50% సీట్లను తెలంగాణ విద్యార్థులతోనే భర్తీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అయితే, మెడికల్ కాలేజీల్లో లోకల్, నాన్ లోకల్ కోటాను నిర్ణయించే నిబంధనలతో 2017లోనే బీఆర్‌ఎస్ ప్రభుత్వం జీఓ 114ను

మిగతా 5వ పేజీలో ▶

రెండేళ్లు బయట చదివితే స్థానికులు కాదా?

- నీట్ స్థానికత కేసులో రాష్ట్ర ప్రభుత్వానికి సుప్రీం ప్రశ్న
- జీఓ 33ని 2028లో ఎందుకు అమలు చేయకూడదని ప్రశ్నించిన కోర్టు
- తీర్పును రిజర్వ్ చేసిన సీజేఐ ధర్మాసనం

5లో

వైఎస్ వివేకానంద హత్య కేసులో దర్యాప్తు పూర్తి

- సుప్రీంకోర్టుకు వెల్లడించిన కేంద్ర దర్యాప్తు సంస్థ



సాక్షి, న్యూఢిల్లీ: మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో దర్యాప్తు పూర్తయిందని కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) సుప్రీంకోర్టుకు తెలిపింది. గత విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు 'ఈ కేసులో ఇంకా తదుపరి దర్యాప్తు అవసరమని సీబీఐ భావిస్తోందా.. రాష్ట్ర ప్రభుత్వం కడప సెషన్స్ కోర్టులో దాఖలు చేసిన క్లోజర్ రిపోర్టుపై సీబీఐ అభిప్రాయమేంటి.. కేసు ట్రయల్, తదుపరి దర్యాప్తు ఏకకాలంలో కొనసాగించే అవకాశం ఉందా.. అనే ప్రశ్నలకు సమాధానం చెప్పాలని ఆదేశించింది. ఈ నేపథ్యంలో మంగళవారం మరోసారి జస్టిస్ ఎం.ఎం.సుందరేశ్, జస్టిస్ ఎన్.కోటీశ్వర్ సింగ్ లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారణ చేపట్టింది. వివేకా హత్య కేసుకు సంబంధించి దర్యాప్తు పూర్తయిందని సుప్రీంకోర్టుకు సీబీఐ వివరించింది. పిటిషనర్ తరఫు వాదనలేంటని ధర్మాసనం ప్రశ్నించగా.. సునీతా రెడ్డి తరఫు సీనియర్ న్యాయవాది మరో కోర్టులో ఉన్నార ని, వాదనలు వినిపించేందుకు తాము సిద్ధంగా ఉన్నందున పాస్ ఓవర్ ఇవ్వాలని మరో న్యాయవాది ధర్మాసనానికి విజ్ఞప్తి చేశారు. మధ్యాహ్నం తర్వాత బెంచ్ కూర్చోవడం లేదు కాబట్టి మరో రోజు వాదనలు వింటామని స్పష్టం చేసిన ధర్మాసనం.. తదుపరి విచారణ ను ఈనెల 19వ తేదీకి వాయిదా వేసింది.

తప్పుడు సాక్ష్యాలు.. అక్రమ కేసులు

న్యాయం, ధర్మం లేకుండా రాష్ట్రంలో దుర్మార్గ పాలన

వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ సమావేశంలో వైఎస్ జగన్

ఈరోజు మనం వాదిస్తోంది దెబ్బ తిన్న వాళ్ల గురించి. కళ్ల ఎదుటే దొంగ స్టేట్‌మెంట్లు, దొంగ సాక్ష్యాలు, తప్పుడు కేసులు, అక్రమ అరెస్టులు. ఒక కేసులో బయటకు రాగానే, వెంటనే మరో కేసు పెట్టి లోపల వేస్తున్నారు. అలా వరుసగా కేసులు పెట్టి, జైల్లోనే ఉంచేస్తున్నారు. అందుకే ఈ వ్యవస్థలో మార్పు రావాలి. దెబ్బ తగిలిన వ్యక్తికి ఎంత బాధ ఉంటుందో, దెబ్బ తగిలించిన వ్యక్తికి కూడా తెలియాలి. అది వారికి అర్థం కావాలి. అధికారం ఉంది కదా అని, దాన్ని దుర్వినియోగం చేస్తున్న వ్యక్తికి తెలియాలి. ఇందులో మీ పాత్ర కీలకం. మీ సేవలను గుర్తుంచుకుంటాం.

- న్యాయవాదులతో వైఎస్ జగన్



సాక్షి, అమరావతి : ప్రతిపక్షంగా కష్టకాలంలో ఉన్న పార్టీకి లాయర్లు అందిస్తున్న సేవలు అభినందనీయమని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. పార్టీ కార్యకర్తలపై తప్పుడు సాక్ష్యాలతో అక్రమ కేసులు పెట్టి వేధిస్తున్న ఈ సమయంలో పార్టీకి పెద్దన్నల్లా లాయర్లు పని చేస్తున్నారని ప్రశంసించారు. కలియుగం అంటే ఏమిటన్నది ఈ 14 నెలల చంద్రబాబు పాలన చూస్తే అర్థమవుతుందన్నారు. ఎక్కడా న్యాయం, ధర్మం లేదని తేల్చి చెప్పారు. రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలు, చోటుచేసుకున్న పరిస్థితులపై మంగళవారం ఆయన తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాలకు చెందిన పార్టీ లీగల్ సెల్ ప్రతినిధులతో చర్చించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రస్తుతం ప్రత్యేక పరిస్థితులున్నాయని చెప్పారు. 'ఈ సమయంలో మీరు పోషిస్తున్న పాత్ర ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. మీరు పార్టీకి అన్ని విధాలుగా ఒక పెద్దన్న పాత్ర పోషిస్తున్నారు. అడగకపోతే అమ్మ అయినా అన్నం పెట్టదు అన్నట్లుగా.. కోరకపోతే దేవుడు కూడా వరమివ్వడు అన్నట్లుగా.. పిటిషన్లు వేసి, మీరు న్యాయస్థానంలో నిలబడకపోతే, న్యాయం కూడా దక్కదు. అందుకే మీరు పోషిస్తున్న పాత్ర అభినందనీయం ' అని ప్రశంసించారు. వైఎస్ జగన్ ఇంకా ఏమన్నారంటే..

స్వరం వినిపిస్తే జీర్ణించుకోలేని పరిస్థితి

తమకు గిట్టని వారు, నచ్చని వారు ఎవరైనా ఉంటే, ఎవరైనా తమ స్వరం గట్టిగా వినిపిస్తే తట్టుకుని, జీర్ణించుకునే పరిస్థితి లేదు. ఎలాగైనా తీసుకుని పోయి వారిని జైల్లో వేయాలి. ఎలాగైనా వారిని తీసుకెళ్లి చిత్ర హింసలు పెట్టాలి. వారి పరువు తీయాలనే నీచమైన సంస్కృతి ఈరోజు చూస్తున్నాం. ఒక మనిషిని జైల్లో పెట్టడం అంటే తన పరువు, ప్రతిష్టతో ఆడుకోవడం. అవన్నీ తెలిసి కూడా, ఏ తప్పు చేయకపోయినా కూడా బురద చల్లుతున్నారు. తప్పు చేశాడు అని చెప్పి, దాని కోసం దొంగ సాక్ష్యాలు సృష్టిస్తున్నారు. కేసులు పెడుతున్నారు. వాటికి అసలు ఆధారాలు, సాక్ష్యాలు ఉండవు. ఏ కేసు చూసినా మోడస్ ఆపరెండి ఒక్కటే. తొలిసారి ఇలాంటి పరిస్థితులు చూస్తున్నాం. ఇలాంటి పరిస్థితుల మధ్య బాధితుల తరఫున గట్టిగా నిలబడి, వారి స్వరం వినిపించాల్సిన పరిస్థితి ఏర్పడింది. అందుకే మీ పాత్ర చాలా ముఖ్యం. మన భుజాల మీద బాధ్యత మరింత పెరిగింది. ముఖ్యంగా కష్టకాలంలో, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు, వైఎస్సార్‌సీపీకి పెద్దన్నగా మీ పాత్రను పార్టీ ఎప్పటికీ మర్చిపోదు.

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

వారిని చట్టం ముందు నిలబెడతాం

- ఇప్పుడు పార్టీ కోసం పని చేస్తున్న వారెవ్వరినీ జగన్ 2.0లో మర్చిపోము. పక్కాగా డేటా బేస్ తయారు చేయమని మన లీగల్ విభాగం ప్రతినిధులకు చెబుతున్నాను. ఆ డేటా బేస్ ఆధారంగా వారందరికీ తగిన గుర్తింపు ఇస్తాం. త్వరలోనే ఒక యాప్ వస్తుంది. దాని తయారీలో సీనియర్ లాయర్లు కూడా పాలు పంచుకుంటున్నారు.
- రాష్ట్రంలో ఎక్కడ, ఏ వైఎస్సార్‌సీపీ కార్యకర్తకు అన్యాయం జరిగినా.. ఆ యాప్ ఓపెన్ చేసుకుని, తన పూర్తి వివరాలు, తనకు జరిగిన అన్యాయం, అది ఎవరి వల్ల జరిగింది? దానికి సంబంధించి ఉన్న ఆధారాలు అప్‌లోడ్ చేస్తే అది ఆటోమేటిక్‌గా ఇక్కడ మన డిజిటల్ లైబ్రరీలో నిక్షిప్తం అవుతుంది. రేపు మనం అధికారంలోకి రాగానే, ఆ డేటా ఓపెన్ చేసి చూస్తాం. ఇప్పుడు వేధిస్తున్న వారెవ్వరినీ వదిలిపెట్టబోం. చట్టం ముందు నిలబెడతాం. చట్టం తన పని తాను చేసుకుపోతుంది. తప్పు చేసిన వారిని జైలుకు పంపిస్తాం.
- దెబ్బ తగిలిన వ్యక్తికి ఎంత బాధ ఉంటుందో, దెబ్బ తగిలించిన వ్యక్తికి కూడా తెలియాలి. అందుకే లాయర్ల ద్వారా ఆ యాప్‌ను అభివృద్ధి చేస్తున్నాం. ఈ పరిస్థితుల్లో న్యాయవాదుల పాత్ర చాలా ముఖ్యం. పెద్దన్న మాదిరిగా లాయర్లు తోడుగా ఉండాలి. లాయర్ల సేవలను పార్టీ ఎప్పటికీ గుర్తుంచుకుంటుంది.

ప్రైవసీ కోసం.. ఆన్‌లైన్ షాపింగ్..!



దుకాణాలకు బదులు ఆన్‌లైన్‌లో కొనుగోళ్లు

ఆఫ్‌లైన్‌తో పోలిస్తే సౌకర్యాలున్నాయన్న భావన

తమ గురించి నలుగురికీ తెలియకూడదనే ఆలోచన

ఇది మరీ ఎక్కువైతే మానసిక రుగ్మతలు, ఒంటరితనం

ఆన్‌లైన్ షాపింగ్ మన జీవితాల్లో భాగమైపోయింది. కొంతమందికి ఇది గేమ్-ఛేంజర్. కిరాణా సామగ్రి, దుస్తులు, ఆహారం, బహుమతులు, ఫర్నిచర్, ఫోన్లు, ఏసీలు, ఫ్రిజ్‌లు.. ఇలా అన్నీ ఆన్‌లైన్‌లో లభిస్తున్నాయి. వీటిని కొనేవారి సంఖ్య నేడు కోట్లలో ఉంది. ఆన్‌లైన్ షాపింగ్ అంటే సౌకర్యం, ఎంచుకోవడానికి లక్షలాది ఉత్పత్తులే కాదు.. కొందరికి వ్యక్తిగత గోప్యత కూడా. ఆన్‌లైన్ అయితే మనం ఉన్నచోటు నుంచే 24 గంటల్లో ఎప్పుడైనా షాపింగ్ చేయవచ్చు. మరొకరి అభీష్టాలతో కాకుండా సొంత నిర్ణయంతో తమకు నచ్చినవి చేజిక్కించుకోవచ్చు. జనం మధ్యలో కొనాల్సి వస్తోందన్న ఒత్తిడి లేదు. ట్రాఫిక్, ప్రయాణం వంటి అడ్డంకులూ లేవు.

- సాక్షి, స్పెషల్ డెస్క్

కొంత మంది జనంలో కలవడానికి ఇష్టపడరు. మరి కొందరు అధికంగా అవసరానికి మించి కొనుగోలు చేస్తారు. ఖర్చు ఎక్కువగా పెడితే షాపులోని వాళ్లు, చుట్టూ ఉన్నవాళ్లు ఏమనుకుంటున్నారో అని పదేపదే ఆలోచించి ఒత్తిడికి గురి అవుతారు. ఇలాంటి వారికి ఆన్‌లైన్ షాపింగ్ గొప్ప ఉపశమనం. వీరు తమ గురించి ఇతరులు అంచనా వేయకూడదని అనుకోవడం, సామాజిక ఒత్తిడిని తట్టుకోలేకపోవడం వంటి లోతైన మానసిక భావాలను కలిగి ఉంటారని వైద్య నిపుణులు అంటున్నారు. కొంతమందికి బహిరంగ ప్రదేశాల్లో షాపింగ్ అసౌకర్యంగా అనిపించవచ్చు. ఆన్‌లైన్ షాపింగ్‌ను ఇష్టపడే వ్యక్తులు సౌలభ్యం, సమయం, ఆచితూచి ఖర్చు చేసేందుకు ప్రాధాన్యత ఇస్తారు. కొంతమంది అంతర్ముఖులు ఉంటారు. వీరు ఏకాంతంగా ఆన్‌లైన్‌లో షాపింగ్ ఇష్టపడతారు.

అపరాధ భావన ఉండొద్దని..

ఆన్‌లైన్‌లో షాపింగ్ చేసినప్పుడు డబ్బు ఖర్చులోనూ ఇబ్బందులు ఉండవు. సంప్రదాయ నగదు మార్పిడి ఉండదు. చెక్అవుట్ వద్ద ఇబ్బందికరమైన స్వైప్ ఉండదు. ఖర్చు చేశామన్న అపరాధ భావన ఉండకూడదని ఆన్‌లైన్‌లో షాపింగ్ చేసేవారూ లేకపోలేదు. ఇతరులు వారి అభిప్రాయాలను రుద్దకుండా, జన సమూహం లేకుండానే ఆన్‌లైన్ షాపింగ్ పూర్తి చేయవచ్చు. అయితే అవసరం లేకపోయినా కొంత మంది.. ఏమీ తోచక లేదా వెబ్‌సైట్‌లో ఏదో డిస్కౌంట్ సేల్ అని ప్రకటించగానే కొనుగోళ్లు చేస్తున్నారట. కొనేసిన తరవాత.. అవసరానికి మించి కొన్నామన్న అపరాధ భావన వీరిలో ఉంటోందట. క్రెడిట్ కార్డ్‌తో షాపింగ్ చేసేవారిలో ఇది ఎక్కువగా ఉంటోందట. ఆన్‌లైన్ షాపింగ్ చేసే.. అంతర్ముఖ స్వభావం ఉండే వ్యక్తుల్లో మరో ప్రత్యేకత కూడా ఉంటుందట. ఒక ప్లాట్‌ఫామ్‌లో షాపింగ్ చేస్తున్నప్పుడు అది ఏదో సందర్భంలో నచ్చకపోతే.. దానిమీద కోపంతో మరో ప్లాట్‌ఫామ్‌కు వెళ్లిపోతారు. అంతేకాదు, ఆర్డర్ చేసిన వస్తువు కాకుండా వేరేది / క్వాలిటీ లేని వస్తువు వచ్చినా.. రిటర్న్ పెట్టేటప్పుడు ఇబ్బందులు ఎదురైనా కూడా వీరు వేరే వేదికను ఎంచుకుంటారట. తాము బహిష్కరించినట్టు భావించే మొదటి ప్లాట్‌ఫామ్‌ను కొన్నాళ్లు వదిలేస్తారు.

ఈ సమస్యలూ ఉన్నాయి

బయటకు వెళ్లి, ట్రాఫిక్‌లో విసుక్కుంటూ ప్రయాణించి, దుకాణాల్లో షాపింగ్ చేయడానికి కొన్ని గంటలు సమయం పడుతుంది. దీని వల్ల కొందరిలో అలసిపోయిన భావన ఉంటుంది. అదే పనిని కొన్ని క్లిక్‌లతో సాధ్యం చేసే మరింత అనుకూల అవకాశం ఉన్నప్పుడు అటువైపు మొగ్గు చూపేవారూ ఉంటారు. కానీ అధిక ఆన్‌లైన్ షాపింగ్ కొన్నిసార్లు సామాజిక ఆందోళన లేదా అనవసరపు ఖర్చులకు దారితీయవచ్చు. ఆన్‌లైన్ షాపింగ్‌కి పరిమితమవడం వల్ల శారీరక శ్రమ తగ్గుతుంది. జనానికి దూరం అవుతారు. నిశ్శబ్దంగా శారీరక, మానసిక ఆరోగ్య సమస్యలకు ఆన్‌లైన్ షాపింగ్ తలుపులు తెరిచే అవకాశమూ లేకపోలేదు. ఈ విషయంలో అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

ఇలాంటివి నచ్చక..

ఆన్‌లైన్ షాపింగ్‌లో ఏం కొనాలనేది మన నియంత్రణలో ఉంటుంది. ఏం కొన్నామో మరొకరికి తెలియదు. సురక్షితం అన్న భావన ఉంటుంది. నెమ్మదిగా, కావాల్సినంత సమయం షాపింగ్ చేయవచ్చు. 24 బై 7.. రాత్రీ పగలూ అనే తేడా లేకుండా కొనుక్కోవచ్చు. ఎవరో ఏదో అనుకుంటారన్న ఆలోచనే రాదు. మనకు ఇష్టమైన వెరైటీలు చూడొచ్చు, ధరలను పోల్చవచ్చు, కావలసిన దాన్ని ఎంచుకోవచ్చు. కానీ ఈ సౌలభ్యాలేవీ ఆఫ్‌లైన్‌లో ఉండవు. మన రూపం, ఎంపికలు, బడ్జెట్ ఆధారంగా దుకాణదారులు కస్టమర్లను అంచనా వేస్తారు. ఏం కొనాలనేది కస్టమర్ల అభీష్టం. అలాంటిది 'మీకు ఈ డ్రెస్ బాగుంటుంది', 'తక్కువ రేటే' అంటూ షాప్‌వాళ్లు చేసే సూచనలు / సలహాలు చాలామందికి నచ్చవు. ఇవి కూడా ఆన్‌లైన్‌లో ఉండవు. దేనికి, ఎంతకు షాపింగ్ చేస్తున్నారో ఇతరులెవరూ కనుక్కోలేరు. అందువల్ల ఒకరి షాపింగ్ తీరుపై మరొకరు కామెంట్ చేసే అవకాశమూ ఉండదు.

ఆన్‌లైన్ షాపింగ్ శత్రువు కాదు. ఇది మారుతున్న జీవితాలు, అలవాట్లు, ప్రాధాన్యాలను ప్రతిబింబిస్తుంది. కొంతమందికి ఇది సహాయకారి. సమయం ఆదా చేయడం, నచ్చినన్ని వెరైటీలు చూసుకునే వెసులుబాటు.. ఇలాంటి సానుకూల అంశాలు ఉన్నాయి. అదే సమయంలో జీవితం మరింత డిజిటల్‌గా మారుతున్న కొద్దీ వాస్తవ ప్రపంచ అనుబంధాల విలువను, ఉనికిని మర్చిపోకూడదు. మనల్ని మనమే ఒంటరిని చేసుకోకూడదు అంటున్నారు మానసిక వైద్య నిపుణులు.

సమస్యల నుంచి తప్పించుకోవడానికి..: తక్కువ ఆత్మస్థైర్యం లేదా ఆత్మన్యూనత లేదా అంతర్ముఖత్వం కారణంగా దుకాణాలకు వెళ్లకుండా ఆన్‌లైన్‌లో షాపింగ్ చేసేవాళ్లు కూడా ఉంటారు. ఆ భావనను కప్పిపుచ్చుకునేందుకు లేదా అధిగమించే ప్రయత్నంలో.. తెలిసి కొందరు, తెలియక కొందరు అనవసరపు ఖర్చులు చేస్తుంటారని మానసిక వైద్యులు అంటున్నారు.

చంద్రుడు, అంగారకుడి గురించి తెలిసినంతగా మనకు సముద్రాల గురించి అవగాహన లేదు. అత్యంత స్వచ్ఛమైన, మనిషి నీడ కూడా తాకని వాతావరణాలే కాదు.. మనకు తెలియకుండా దాగి ఉన్న విలువైన వనరులు సైతం విశాలమైన సముద్రాల్లో నిక్షిప్తమై ఉండొచ్చని పరిశోధనలు చెబుతున్నాయి. సముద్రం లోపల ఉన్న ఈ విస్తారమైన ప్రాంతాలను అన్వేషించే ప్రయత్నంలో మనదేశం సాహసోపేత 'డీప్ ఓషన్ మిషన్'కు శ్రీకారం చుట్టింది. ఇటీవలే అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలోకి శుభాన్షు శుక్లాను పంపినట్టే.. సముద్ర గర్భంలోకి మనుషులను పంపే దిశగా సముద్రయాన్ ప్రాజెక్టుతో అడుగు ముందుకేసింది.

- 'డీప్ ఓషన్ మిషన్' చేపట్టిన కేంద్ర ప్రభుత్వం
- విలువైన వనరులను వెలికితీయడమే లక్ష్యం
- ఇందుకోసం మత్స్య-6000 వాహనం రెడీ
- పరిశోధనకు ముగ్గురు వెళ్లేలా రూపకల్పన

సాగర గర్భంలో.. రహస్యాల అన్వేషణ



భారత సముద్ర జలాల పరిధిలో విలువైన ఖనిజాలు, ఇంధన వనరులు, ప్రత్యేక జీవవైవిధ్యం వెలికితీయడం లక్ష్యంగా సముద్రయాన్ ప్రాజెక్టు ప్రారంభం అయింది. లోతైన సముద్ర అన్వేషణకు సంబంధించి సముద్రయాన్ ప్రాజెక్టులో భాగంగా నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓషన్ టెక్నాలజీ (ఎన్ఐఓటీ), భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) శాస్త్రవేత్తలు మత్స్య-6000 వాహనం అభివృద్ధి చేశారు. ఇటీవలే ఈ వాహనానికి కీలక వెల్డింగ్ ప్రక్రియను కూడా పూర్తి చేశారు.

- సాక్షి, స్పెషల్ డెస్క్

లక్ష్యాన్ని సాధించడానికి..: 'ప్రస్తుతం మహాసముద్రాల గురించి మనం అర్థం చేసుకున్నది కేవలం 5 శాతమే. 95 శాతం ఇప్పటికీ రహస్యంగానే ఉంది. విశాలమైన సముద్రపు అడుగు భాగాన్ని అర్థం చేసుకోవడానికి మరిన్ని అన్వేషణలు అవసరం. ఈ లక్ష్యాన్ని సాధించడానికి భారత్‌కు సముద్రయాన్ మిషన్ తోడ్పడుతుంది' అని మిషన్‌ను చేపట్టిన భారత ప్రభుత్వ భూవిజ్ఞాన శాస్త్రాల మంత్రిత్వ శాఖ భావిస్తోంది. ఈ మిషన్‌లో భాగంగా మనుషులను సముద్రమట్టానికి 6,000 మీటర్ల లోతుకు పంపుతారు. గుండ్రని సబ్‌మెర్సిబుల్ నౌక అయిన మత్స్య-6000 ద్వారా సముద్రపు లోతుల్లోకి వెళ్లి పరిశోధనలు సాగిస్తారు. నౌక వ్యాసం 2,260 మిల్లీ మీటర్లు. 80 మిల్లీ మీటర్ల మందంతో నౌక గోడ తయారైంది. టైటానియం-మిశ్రమంతో రూపొందిన గోడలు తీవ్రమైన బాహ్య ఒత్తిళ్లను, -3 డిగ్రీల సెంటీగ్రేడ్ వరకు ఉష్ణోగ్రతలను తట్టుకోగలవు.

ఇప్పటికే పలు పరీక్షలు..: సముద్రంలో జీవ, నిర్జీవ వ్యవస్థలను అంచనా వేయడానికి, లోతైన సముద్ర పర్యాటకానికి గల అవకాశాలకు కొత్త దారులు తెరుస్తుందని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. ఈ ప్రయోగం దశలవారీగా చేపట్టేలా ప్రణాళిక రచించారు. సిబ్బందితో, అలాగే సిబ్బంది లేకుండా ఈ వాహనంతో 2025 జనవరి, ఫిబ్రవరిలో పలు పరీక్షలు పూర్తి చేశారు. 500 మీటర్ల లోతుకు వెళ్లే కీలక పరీక్ష 2025 చివరి నాటికి ప్రారంభమయ్యే అవకాశం ఉంది. ఈ పరిధిలో మత్స్య-6000 వాహనం వెళ్లి రావడానికి 8 గంటల సమయం పడుతుంది. ముఖ్యమైన ఇంధన, ఖనిజ వనరులు అయిన మీథేన్, కోబాల్ట్ అన్వేషణ సైతం సాగిస్తారు.

రూ. 4,077 కోట్ల నిధులు..

డీప్ సీ మైనింగ్ మెషీన్ డిజైన్ సైతం పూర్తి అయింది. గత ఏడాది అండమాన్ సమీపంలో 1,173 మీటర్ల లోతుకు వెళ్లి 100 కిలోలకుపైగా కోబాల్ట్ ఆధారిత పాలీమెటాలిక్ నోడ్యూల్స్‌ను (లోహపు రాళ్లు) ఈ మెషీన్ సేకరించింది. ఈ ప్రాంతంలో 47 లక్షల టన్నుల నికెల్, 42.9 లక్షల టన్నుల కాపర్, 5.5 లక్షల టన్నుల కోబాల్ట్, 9.25 కోట్ల టన్నుల మాంగనీస్ నిల్వలు ఉన్నట్టు అంచనా వేశారు. ఇక సర్వే, అన్వేషణ కోసం పరిశోధన నౌక నిర్మించేందుకు ప్రభుత్వం ఆర్డర్ చేసింది. కేవలం ఈ నౌక కోసం రూ.1,277 కోట్లు ఖర్చు చేస్తున్నారు. సముద్ర జీవశాస్త్ర అధ్యయనం కోసం అధునాతన మెరైన్ సెంటర్ రూ.692 కోట్లతో తమిళనాడులో ఏర్పాటుచేస్తున్నారు. కేంద్రం డీప్ ఓషన్ మిషన్‌కు 2021-2026 మధ్య రూ.4,077 కోట్లు వెచ్చించనున్నట్టు ప్రకటించింది. ఈ ఏడాది మార్చి నాటికి సుమారు రూ.1,000 కోట్లు ఖర్చు చేశారు. హిందూ మహాసముద్రంలో 75,000 చదరపు కిలోమీటర్లు, పశ్చిమ హిందూ మహాసముద్రంలో 10,000 చ.కి.మీ. పరిధిలో సర్వే, అన్వేషణ కొనసాగిస్తారు.

- మత్స్య-6000 వాహనం 6,000 మీటర్ల లోతులో 12 గంటల వరకు నిరంతర కార్యకలాపాలు సాగించేలా రూపొందుతోంది.
- హిందూ మహాసముద్రంలో 75,000 చదరపు కిలోమీటర్లు, పశ్చిమ హిందూ మహాసముద్రంలో 10,000 చదరపు కిలోమీటర్ల పరిధిలో సర్వే, అన్వేషణ చేపడతారు.
- సిబ్బందితో, అలాగే సిబ్బంది లేకుండా ఈ వాహనంతో 2025 జనవరి 22 నుంచి ఫిబ్రవరి 14 వరకు పలు పరీక్షలు పూర్తి చేశారు.
- అండమాన్ సమీపంలో 47 లక్షల టన్నుల నికెల్, 42.9 లక్షల టన్నుల కాపర్, 5.5 లక్షల టన్నుల కోబాల్ట్, 9.25 కోట్ల టన్నుల మాంగనీస్ నిల్వలు ఉన్నట్టు ప్రాథమికంగా అంచనా వేశారు.
- దశలవారీగా పరీక్షలు పూర్తి చేసుకుని 2026 చివరినాటికి మిషన్ కార్యరూపంలోకి రానుంది.



2026 చివరినాటికి..

మత్స్య-6000 వాహనం 6,000 మీటర్ల లోతులో 12 గంటల వరకు నిరంతర కార్యకలాపాలు సాగించేలా రూపొందుతోంది. అలాగే లోతైన నీటి పరిశీలన, అన్వేషణను నిర్వహించడానికి అత్యవసర సమయాల్లో 96 గంటల వరకు పనిచేయగలిగే సామర్థ్యమూ దీని ప్రత్యేకత. దేశీయంగా అభివృద్ధి చేసిన వెయ్యికి పైగా విడి భాగాలు, వందలాది సాంకేతికతలు వాహన తయారీలో వినియోగించారు. 25 టన్నుల బరువుండే ఈ అత్యాధునిక వాహనంలో ముగ్గురు ప్రయాణించొచ్చు. దశలవారీగా పరీక్షలు పూర్తి చేసుకుని 2026 చివరినాటికి మిషన్ కార్యరూపంలోకి రానుంది. డీఆర్‌డీఓ, ఐఐటీలు, భారత నావికా దళం, మిశ్ర ధాతు నిగమ్ తదితర సంస్థలు కూడా ఈ మిషన్‌లో పాలుపంచుకున్నాయి.



న్యాయవాదులతో మాట్లాడుతున్న లోకాయుక్త జస్టిస్ రాజశేఖర్‌రెడ్డి

న్యాయవ్యవస్థకు సౌకర్యాలు కల్పిస్తే మెరుగైన సేవలు

లోకాయుక్త జస్టిస్ రాజశేఖర్‌రెడ్డి

నిడమనూరు: న్యాయ వ్యవస్థకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించడం ద్వారా మెరుగైన సేవలు పొందవచ్చని రాష్ట్ర లోకాయుక్త జస్టిస్ యడవెల్లి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. నల్లగొండ జిల్లా నిడమనూరులో నూతనంగా నిర్మించిన జూనియర్ సివిల్ జడ్జి కోర్టు భవనాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. అనంతరం న్యాయవాదులతో సమావేశమై మాట్లాడారు. న్యాయవాదులు, కోర్టు బెంచ్‌కు మధ్య మంచి సంబంధాలు నెలకొల్పాలని సూచించారు. పెరిగిన సాంకేతిక పరిజ్ఞానంతో కోర్టు ఆవరణలోనే ఉద్యోగులకు, న్యాయవాదులకు డిజిటల్ లైబ్రరీ, కంప్యూటర్ సేవలు అందేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. న్యాయవాదులు జిమ్, యోగా వంటి వాటితో ఒత్తిడి తగ్గించుకోవాలని సూచించారు. ఎమ్మెల్సీ కోటిరెడ్డి మాట్లాడుతూ.. జస్టిస్ రాజశేఖర్‌రెడ్డి కృషితో నిడమనూరులో జూనియర్ సివిల్ జడ్జి కోర్టు భవనాన్ని నిర్మించుకున్నామని సంతోషం వ్యక్తంచేశారు. పెరుగుతున్న కేసుల సంఖ్య మేరకు అదనపు సీనియర్ సివిల్ జడ్జి కోర్టును మంజూరు చేయాలని నిడమనూరు బార్ అసోసియేషన్ సభ్యులు ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జడ్జి స్వప్న, పీపీ సాధన, ఏజీపీ ఉన్నం చిన వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌పీసీఏను కలిసిన పోలీసు ఉన్నతాధికారులు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర పోలీస్ ఫిర్యాదుల అథారిటీ (ఎస్‌పీసీఏ) చైర్మన్, జస్టిస్ బి.శివశంకర్ రావు, ఇతర సభ్యులను హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రవి గుప్తా, డీజీపీ జితేందర్, శాంతిభద్రతల అడిషనల్ డీజీ మహేశ్‌భ గవత్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. పోలీస్ వ్యవస్థలో ఉన్న లోటుపాట్లు, పోలీస్ వ్యవస్థ ప్రతిష్ట పెంచేలా ప్రజాహితం వైపు వ్యవస్థను బలోపేతం చేయడం సహా పలు అంశాలపై ఈ సందర్భంగా చర్చించారు. కార్యక్రమంలో అథారిటీ సభ్యులు ప్రమోద్ కుమార్, వర్రె వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.


క్లుప్తంగా...

ఢిల్లీ గ్రామీణాభివృద్ధి డీఎస్‌గా అలుగు వర్షిణి



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ కేడర్‌కు చెందిన 2012 బ్యాచ్ ఐఏఎస్ అధికారి అలుగు వర్షిణిని కేంద్ర ప్రభుత్వం డిప్యుటేషన్‌పై ఢిల్లీ గ్రామీణా భివృద్ధి శాఖ డిప్యూటీ సెక్రటరీగా నియమించింది. ఈ మేరకు కేంద్ర సిబ్బంది, శిక్షణశాఖ (డీఓపీటీ) మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది.

16,458 పాలిటెక్నిక్ సీట్ల భర్తీ



సాక్షి, హైదరాబాద్: పాలిటెక్నిక్ కోర్సుల్లో అంతర్గత స్లైడింగ్ తర్వాత 16,458 సీట్లు భర్తీ అయినట్టు పాలిసెట్ క్యాంప్ కార్యాలయం తెలిపింది. రాష్ట్రంలో మొత్తం 115 కాలేజీల్లో 29, 449 సీట్లు అందుబాటులో ఉన్నాయి. స్లైడింగ్ తర్వాత 12,991 సీట్లు మిగిలిపోయి నట్టు కా ర్యాలయం వెల్లడించింది. ఈడబ్ల్యూ ఎస్ కో టా కింద 675 సీట్లు భర్తీ అయినట్లు పేర్కొంది.

రికార్డు సృష్టించిన అమిత్ షాకు డీకే అరుణ శుభాకాంక్షలు



సాక్షి, న్యూఢిల్లీ: దేశంలోనే ఎక్కువ కాలం కేంద్ర హోంమంత్రిగా కొనసాగు తూ రికార్డు సృష్టించిన అమిత్ షాకు బీజేపీ ఎంపీ డీకే అరుణ శుభాకాంక్షలు తెలిపారు. గతంలో అత్యంత ఎక్కువ కాలం కేంద్ర హోంమంత్రిగా ఎల్.కె.అద్వానీ 2,256 రోజులు పనిచేశారు. 2019 నుంచి ఇప్పటి వర కు 2,258 రోజులు కేంద్రమంత్రిగా పనిచేస్తూ అమిత్ షా రికార్డు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో మంగళవారం అమిత్ షాను ఆయన నివాసంలో కలిసి అరుణ సన్మానించారు.

15 నుంచి రాష్ట్రమంతా భూభారతి

- రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్లపై ఆందోళన వద్దు
- కాళేశ్వరంలో అవినీతి నిగ్గు తేల్చిన ఘోష్ కమిషన్
- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



తిరుమలాయపాలెంలో బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి పొంగులేటి

కూసుమంచి/తిరుమలాయపాలెం: ఈ నెల 15వ తేదీ నుంచి భూ భారతి సేవలు రాష్ట్రవ్యాప్తంగా అందుబాటులోకి వస్తాయని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. పేదలకు శాపంగా మారిన ధరణి చట్టాన్ని బంగాళాఖాతంలో కలిపి భూభారతి వ్యవస్థను తీసుకొచ్చినట్లు చెప్పారు. ఖమ్మం జిల్లా ఖమ్మం రూరల్, తిరుమలాయపాలెం మండలాల్లో మంగళవారం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి.. కూసుమంచిలోని క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా అర్హులైన వారందరికీ కొత్త రేషన్ కార్డులు అందజేస్తామని, ఇందిరమ్మ ఇళ్ల విషయంలో ఎవరూ అభద్రతకు గురికావొద్దని సూచించారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రపంచంలో 8వ వింతగా ప్రచారం చేసుకున్న కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టులో చివరకు రూ.లక్ష కోట్ల అవినీతే మిగిలిందని విమర్శించారు. ఈ విషయాన్ని జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ కూడా తేల్చిందని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు కర్త, కర్మ తానేనని నాటి సీఎం కేసీఆర్ స్వయంగా చెప్పుకున్నారని గుర్తుచేశారు. కానీ, పీసీ ఘోష్ కమిషన్ నివేదిక వచ్చాక కొందరు బీఆర్‌ఎస్ నాయకులు అవాకులు చెవాకులు పేలుతూ అబద్ధాలను నిజాలుగా చిత్రీకరించాలని చూస్తున్నారని విమర్శించారు. ఈ నివేదికపై చట్టపరిధిలో ప్రజల అభిప్రాయాలకు అనుగుణంగా అసెంబ్లీ సాక్షిగా నిర్ణయాలు తీసుకుంటామని ప్రకటించారు.

2.10 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా పంపండి

కేంద్రమంత్రి నడ్డాకు మంత్రి తుమ్మల లేఖ



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఆగస్టు నెలలో యూరియా వినియోగం ఎక్కువగా ఉంటుందని, దాన్ని దృష్టిలో ఉంచుకొని రాష్ట్రానికి 2.10 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను సరఫరా చేయాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. ఈ నెలలో ధాన్యం, పత్తి, మక్క వంటి పంటలకు యూరియాను ఎక్కువగా వాడతారని, యూరియా సరఫరాలో ఏమాత్రం ఆలస్యమైనా పంట దిగుబడిపై ప్రభావం పడే అవకాశముందని మంత్రి స్పష్టం చేశారు. ఈ మేరకు కేంద్ర రసాయనాలు, ఎరువుల శాఖ మంత్రి జేపీ నడ్డాకు మంగళవారం ఆయన లేఖ రాశారు. ప్రస్తుతం రాష్ట్రంలో కేవలం 1.09 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు మాత్రమే అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. కానీ ఈ నెలలో కనీసం 3 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అవసరమవుతుందని అంచనా వేసినట్లు తెలిపారు. గత ఏప్రిల్ 1వ తేదీ నుంచి జూలై 31వ తేదీ వరకు రాష్ట్రానికి 6.60 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేయాల్సి ఉండగా, 4.51 లక్షల మెట్రిక్ టన్నుల సరఫరా మాత్రమే జరిగిందని గుర్తు చేశారు.

గిరిజనుల్లో పేదరికాన్ని రూపుమాపాలి

ట్రైకార్ చైర్మన్ బెల్లయ్యనాయక్

సాక్షి, హైదరాబాద్: గిరిజన సంరక్షణ, సంక్షేమ చట్టాలతో గిరిజనుల్లో పేదరికాన్ని రూపుమాపాలని ట్రైకార్ చైర్మన్ తేజావత్ బెల్లయ్య నాయక్ అన్నారు. మంగళవారం యూసుఫ్‌గూడలోని ఎన్ఐఎంఎస్ఎంఈలో గిరిజన సాంస్కృతిక పరిశోధన శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో 'రాష్ట్ర ప్రాసెస్ ల్యాబ్' పేరిట నాలుగు రోజుల శిక్షణా కార్యక్రమం ప్రారంభమైంది. ఇందులో ఆయా శాఖలకు చెందిన 77 మంది అధికారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ కార్యదర్శి విభు నాయర్ వర్చువల్ కాన్ఫరెన్స్ ద్వారా ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. శిక్షణ పొందుతున్న అధికారులు గిరిజన సంక్షేమ శాఖల అసలైన ప్రతినిధులు, నాయకులని అన్నారు. సంక్షేమ, అభివృద్ధి ఫలాలను అందించేందుకు భారత ప్రభుత్వం గతేడాది 'ఆది కర్మయోగి అభియాన్' అనే పథకాన్ని ప్రకటించిందని తెలిపారు. గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్ కార్యదర్శి అలుగు వర్షిణి మాట్లాడుతూ శిక్షణ పొందుతున్న అధికారులందరూ గిరిజనులతో స్నేహంగా మెలుగుతూ వారి పూర్తిస్థాయి అభివృద్ధి కోసం కృషి చేయాలన్నారు.

ఫోన్ ట్యాపింగ్‌పై దర్యాప్తు జరుగుతోంది

- సుప్రీంకోర్టుకు తెలిపిన తెలంగాణ ప్రభుత్వం
- స్టేటస్ రిపోర్టు దాఖలుకు సమయం ఇవ్వాలని విజ్ఞప్తి

సాక్షి, న్యూఢిల్లీ: ఫోన్ ట్యాపింగ్ కేసులో దర్యాప్తు ఇంకా కొనసాగుతోందని తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టుకు తెలిపింది. అయితే.. స్టేటస్ రిపోర్టు దాఖలు చేసేందుకు మరికొంత సమయం ఇవ్వాలని విజ్ఞప్తి చేసింది. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ఎస్ఐబీ కేంద్రంగా ఫోన్ అక్రమ ట్యాపింగ్‌కు పాల్పడినట్టు పంజగుట్ట పోలీస్‌స్టేషన్‌లో 2023 మార్చి 10న కేసు నమోదైంది. కేసులో ప్రధాన నిందితుడిగా ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావుపై అభియోగాలు మోపారు. అప్పటికే ఆయన అమెరికా వెళ్లిపోయారు. ముందస్తు బెయిల్ మంజూరు చేస్తే తాను భారత్‌కు తిరిగివస్తానని విన్నవిస్తూ.. పిటిషన్ దాఖలు చేయగా, దానిని హైకోర్టు తిరస్కరించింది. దీంతో మే 9న హైకోర్టు తీర్పును ప్రభాకర్‌రావు సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. పిటిషన్‌ను విచారించిన సర్వోన్నత న్యాయస్థానం మే 29న ప్రభాకర్‌రావుకు మధ్యంతర రక్షణ కల్పించింది. అమెరికా నుంచి భారతదేశానికి తిరిగి వచ్చిన ఆయన.. సిట్ దర్యాప్తునకు హాజరవుతున్నారు. తాజాగా బుధవారం జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ విశ్వనాథన్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఎదుట ఆ పిటిషన్ విచారణకు వచ్చింది. కాగా.. దర్యాప్తు సాగుతోందని, స్టేటస్ రిపోర్టు దాఖలుకు సమయం ఇవ్వాలని తెలంగాణ ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది. అందుకు అంగీకరించిన ధర్మాసనం తదుపరి విచారణను ఆగస్టు 25కు వాయిదా వేసింది. తదుపరి విచారణ వరకు సుప్రీంకోర్టు గతంలో ప్రభాకర్‌రావుకు జారీ చేసిన మధ్యంతర రక్షణ కొనసాగుతుందని స్పష్టం చేసింది.

శ్రీవారి ఆలయంలో పవిత్రోత్సవాలు ప్రారంభం

తిరుమల: తిరుమల శ్రీవారి ఆలయంలో పవిత్రోత్సవాలు మంగళవారం శాస్త్రోక్తంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు పవిత్ర ప్రతిష్ఠ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామిని పవిత్ర మండపంలోని యాగశాలకు వేంచేపు చేశారు. అక్కడ హోమాలు తదితర వైదిక కార్యక్రమాలు చేపట్టారు. సంపంగి ప్రాకారంలో వేడుకగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. మధ్యాహ్నం స్వామి, అమ్మవార్లకు విశేష సమర్పణ చేశారు.

ఏకీకృత సర్వీస్ రూల్ అమలు చేయాలి

సాక్షి, హైదరాబాద్: టీచర్లకు ఏకీకృత సర్వీస్ నిబంధనలు అమలు చేయాలని, ప్రాథమిక పాఠశాలల హెచ్ఎం పోస్టులను మంజూరు చేయాలని ఉపాధ్యాయ సంఘం టీఎస్పీటీఏ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. సంఘం అధ్యక్షుడు సయ్యద్ షౌకత్ అలీ, కార్యదర్శి రోహిత్ నాయక్ మంగళవారం ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డిని కలిశారు.

శ్రీశైలానికి తగ్గుముఖం పట్టిన వరద

శ్రీశైలం ప్రాజెక్ట్: శ్రీశైలం జలాశయానికి ఎగువ ప్రాజెక్ట్‌ల నుంచి వస్తున్న వరద ప్రవాహం తగ్గుముఖం పట్టింది. వస్తున్న ఇన్‌ఫ్లోల కన్నా దిగువ ప్రాజెక్ట్‌లకు నీటి విడుదల ఎక్కువగా ఉండడంతో డ్యాం నీటిమట్టం తగ్గింది. శ్రీశైలం నీలం సంజీవరెడ్డిసాగర్ ప్రాజెక్ట్‌లో మంగళవారం సాయంత్రానికి 196.1108 టీఎంసీల నీరు నిల్వ ఉంది. డ్యాం నీటిమట్టం 881.50 అడుగులకు చేరుకుంది. సోమవారం నుంచి మంగళవారం వరకు జూరాల, సుంకేసుల నుంచి శ్రీశైలానికి 73,948 క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరింది. జలాశయం నుంచి దిగువ ప్రాజెక్ట్‌లకు 1,10,585 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. కుడిగట్టు కేంద్రంలో 15.383 మిలియన్ యూనిట్లు, ఎడమగట్టు కేంద్రంలో 17.070 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేశారు. అనంతరం 69,960 క్యూసెక్కుల నీటిని నాగార్జునసాగర్‌కు విడుదల చేశారు. అలాగే బ్యాక్ వాటర్ నుంచి పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటరీ ద్వారా 35వేల క్యూసెక్కులు, హంద్రీనీవా సుజలస్రవంతికి 3,225 క్యూసెక్కులు, కల్వకుర్తి ఎత్తిపోతలకు 2,400 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.



విశ్వమంతా ఒక సహజీవనమనీ,
పరస్పర ఆధారితమనీ మనం గ్రహించినప్పుడు
ఒక గొప్ప ప్రపంచాన్ని మనం నిర్మించగలం.
– బుద్ధదాస భిక్కు (బౌద్ధ ధర్మం)

సాక్షి
బుధవారం, 6 ఆగస్టు 2025

ఈ సంక్షోభాన్ని దాటేదెలా?

రష్యా నుంచి ముడిచమురు కొనుగోళ్లు ఆపాలంటూ వరస బెదిరింపులతో అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ భారత్‌ను లొంగదీసుకోవాలని చూస్తున్న తరుణంలో మన విదేశాంగ శాఖ తొలిసారి నేరుగా బదులీయటం కీలక పరిణామం. దీనికి రెండురోజుల ముందు స్థానిక తయారీ ఉత్పత్తుల్ని, సరుకుల్ని కొనుగోలు చేయాలని ప్రధాని నరేంద్ర మోదీ దేశ పౌరులకు పిలుపునిచ్చారు. అమెరికాలో గత కొన్ని దశాబ్దాలుగా అక్కడి ప్రభుత్వాలు అనుసరిస్తూ వచ్చిన అస్తవ్యస్త విధానాల పర్యవసానంగా ఏర్పడిన ఆర్థిక సంక్షోభానికి ట్రంప్ అమలుచేసిన తప్పుడు నిర్ణయాలు తోడై ఆర్థికవ్యవస్థను ఊపిరాడకుండా చేస్తున్నాయి. వాటి నుంచి బయటపడటం కోసం ఆయన ప్రపంచ దేశాలపై ఆర్థిక దండయాత్ర మొదలుపెట్టారు. చైనాపై 145 శాతం సుంకాల మోత మోగించటంతో మొదలుపెట్టి తన సన్నిహిత దేశాలపై సైతం దాదాపు 50 శాతం సుంకాలు విధిస్తున్నట్టు ప్రకటించి, అనంతరకాలంలో వెనక్కితగ్గారు. ఈ దశలో ఆయన మన జోలికి రాలేదు. మోదీతో 2016 నుంచీ ఉన్న సాన్నిహిత్యంతో ఆయన తాను చెప్పినట్టు వింటారని ట్రంప్ భ్రమపడ్డారు. తీరా కథ అడ్డం తిరిగేసరికి ఆగ్రహోదగ్రుడవుతున్నారు. అందుకే కావొచ్చు... జపాన్, దక్షిణ కొరియా, వియత్నాం, బంగ్లాదేశ్, ఇండొనేసియాలపై 15–20 శాతం మధ్య సుంకాలు విధించిన పెద్ద మనిషి మన దగ్గరకొచ్చేసరికి ఇప్పటికే విధించిన 25 శాతం సుంకాలతోపాటు రష్యా నుంచి ముడి చమురు కొనుగోళ్లు ఆపకపోతే మరిన్ని రెట్లు పెంచుతానని హెచ్చరించారు. స్వదేశంలో సంపన్నులకూ, పారిశ్రామికవేత్తలకూ లక్షల కోట్ల డాలర్ల పన్ను రాయితీలు ప్రకటించి, ప్రపంచ దేశాలపై అదనపు సుంకాలు విధించటం ద్వారా ఆ లోటును భర్తీ చేసుకోవాలన్నది ఆయన పథకం. దీన్ని చూసీచూడనట్టు ఊరుకుంటే ఈ బాణీయే కొనసాగిస్తారు. అమెరికా పాటించే ద్వంద్వ ప్రమాణాలు ఎవరికీ తెలియనివి కాదు. కానీ ట్రంప్ మరింత నిస్సిగ్గుగా వాటిని ఆచరిస్తున్నారు. ఒకపక్క తమ అణు పరిశ్రమలకు కావాల్సిన యురేనియం హెక్సాఫ్లోరైడ్ అయినా, విద్యుత్ వాహనాల తయారీలో అవసరమైన ప్లాటినం రకానికి చెందిన రసాయన మూలకం పలాడియం, ఎరువులు, రసాయనాలు వంటివి రష్యా నుంచి ఇప్పటికీ దిగుమతి చేసుకుంటూ... మనం మాత్రం ముడి చమురు కొనకూడదని శాసిస్తున్నారు.

అందుకే మోదీ స్వదేశీ ఉత్పత్తుల్నీ, సరుకులనూ కొనటం అత్యవసరమని ప్రజలకు పిలుపునిచ్చారు. వర్తమాన తరుణంలో స్వదేశీ నినాదం సరైనది. అయిదేళ్లక్రితమే మోదీ ఆత్మనిర్భర్ భారత్ గురించి మాట్లాడారు. కానీ ఎన్డీయే ప్రభుత్వం ఈ విషయంలో పెద్దగా చేసిందేం లేదు. అంతక్రితం ఉన్న యూపీఏ ప్రభుత్వం గురించి చెప్పనవసరం లేదు. గతంలో ప్రణాళికా సంఘం, ఇప్పుడు నీతి ఆయోగ్... అలాగే సాంకేతిక నిపుణుల మాట చెల్లుబాటవుతూ వచ్చింది. ఆరెస్సెస్ అనుబంధ సంస్థ స్వదేశీ జాగరణ్ మంచ్ ఈ విషయంలో ప్రభుత్వాన్ని గతంలో పలుమార్లు తీవ్రంగా తప్పుబట్టింది. కానీ మారిందేమీ లేదు.

ట్రంప్ ఒక్కరే కాదు...బ్రిటన్, ఈయూలు సైతం తమ వినియోగవస్తువులపై, యంత్ర పరికరాలపై సుంకాలు తగ్గించమంటున్నాయి. అందుకు తలొగ్గితే మన సూక్ష్మ, చిన్న మధ్యతరహా పరిశ్రమలు (ఎంఎస్ఎంఈ) దెబ్బతింటాయి. అమెరికా ఒత్తిళ్లకు లొంగితే మన సాగు రంగం, పాడి పరిశ్రమ రంగం ఇబ్బందుల్లో పడతాయి. ఆ రెండు రంగాలపైనా 70 కోట్లమంది ప్రజానీకం ఆధారపడతారు. ఇవిగాక జన్యుమార్పిడి చేసిన మొక్కజొన్న, సోయాబీన్స్ దిగుమతి చేసుకోవాలని అమెరికా కోరుకుంటోంది. ఇది ప్రమాదకరం. వాటి సంగతలావుంచి వర్తమాన అనిశ్చిత వాతావరణంలో మనమే కాదు...దేశాలన్నీ ఆత్మరక్షణ బాటపట్టాయి. తమ దేశానికొచ్చే విదేశీ సరుకుపై అధిక సుంకాలు విధించటం, విదేశాలకు ఎగుమతయ్యే తమ సరుకుకు తక్కువ సుంకాల కోసం ఒత్తిళ్లు తీసుకురావటం రివాజైంది. ఈ నేపథ్యంలో ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్‌లు, రక్షణ, సౌరశక్తి రంగాలకు పెద్దయెత్తున ప్రోత్సాహకాలు ఇవ్వాల్సివుంది. పెంచిన సుంకాల పరిధిలో ఎలక్ట్రానిక్స్, ఔషధాలు, ఇంధన ఉత్పత్తులు వగైరాలను ట్రంప్ మినహాయించారు. 'జాతీయ ప్రయోజనాల రీత్యా' ఈ నిర్ణయం తీసుకున్నారట. కానీ ఆ ఉత్పత్తుల ధరల్ని పెంచటం ద్వారా అదనపు రాబడికి వ్యూహరచన చేస్తే అమెరికా సృష్టించదల్చుకున్న సంక్షోభం నుంచి ఉపశమనం పొందవచ్చు. అయితే వాటికి మెరుగైన ప్రోత్సాహకాలు అందిస్తేనే ఇదంతా సాధ్యం. ఇప్పటికే స్వావలంబన దిశగా అడుగులేసివుంటే వేరుగా వుండేది. ఇప్పటికిప్పుడు తీసుకునే చర్యల నుంచి వెంటనే ఫలితాన్ని ఆశించలేం. ఈలోగా అమెరికా కోరుతున్నదేమిటో, మన తిరస్కరణకు కారణమేమిటో పార్లమెంటు వేదికగా తేటతెల్లం చేయాలి. అది జరిగితేనే ప్రజలు మరింత దృఢంగా మద్దతిస్తారు.

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు శ్రావణ మాసం, **తిథి:** శు.ద్వాదశి ప.12.39 వరకు, తదుపరి త్రయోదశి, **నక్షత్రం:** మూల ప.12.41 వరకు, తదుపరి పూర్వాషాఢ, **వర్జ్యం:** ప.10.58 నుండి 12.41 వరకు, తదుపరి రా.10.52 నుండి 12.34 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.11.39 నుండి 12.29 వరకు, **అమృత ఘడియలు:** ఉ.5.45 నుండి 7.30 వరకు.

సూర్యోదయం : 5.43
సూర్యాస్తమయం: 6.28
రాహుకాలం : ప.12.00 నుండి 1.30 వరకు
యమగండం : ఉ.7.30 నుండి 9.00 వరకు

మృత్యువు ముంగిట మానవాళి

విశ్లేషణ



జేసన్ ఫారగో

హిరోషిమా పేరు తలచుకోగానే, ఒక కళాత్మక సినిమాలోని ఒక చిన్న దృశ్యం నా మదిలో మెదులుతూ ఉంటుంది. అది రుయుసుకె హమగుచి తీసిన 'డ్రైవ్ మై కార్' సినిమా. దానికి 2021లో ఆస్కార్ అవార్డు లభించింది. అది వియోగం, కళాత్మక స్ఫూర్తి గురించిన కళాఖండం. ఆ సినిమాలో ఒక సన్నివేశం. శరదృతువు. ఆరుబయలులో హాయిగొలిపే గాలిలో రిహార్సల్ చేసేందుకు థియేటర్ నుంచి కొందరు నటులు బయటకు వస్తారు. చెఖోవ్ రాసిన 'అంకుల్ వన్యా' రష్యన్ నాటకంలో ఒక ఘట్టం రిహార్సల్ కోసం ఇద్దరు నటీమణులు నడుస్తూంటే వారి పాదాల కింద నలుగుతున్న ఎండు టాకుల చప్పుడు వినిపిస్తుంది. వారు అప్పటి వరకు విచారం, స్తబ్ధత గురించి చెఖోవ్ రాసిన వాక్యాలను వల్లె వేయడంలో సతమతమవుతూంటారు. బతకలేని జీవితాలు, చిదిమేసిన కలలు, కలలు కల్లలేనా? అనుకుంటూ మథనపడుతుంటారు. కానీ, ఆ పార్క్‌లో వారికి ఏదో తట్టింది. వారు బతికి తీరాలనుకున్నారు. జీవితాన్ని కొనసాగించాల్సిందేనన్న నిర్ణయానికి వచ్చారు.

ఆ నటులకు ఈ పార్క్ విచారం, సహనశక్తికి సంబంధించి మొత్తం విశ్వాన్ని ఎలా చూపినట్లు?

బతకడానికి స్ఫూర్తి


ఎందుకంటే, అది 'హిరోషిమా పీస్ మెమోరియల్ పార్క్'. గొప్ప ఆధునిక ఆర్కిటెక్ట్ కెన్ జో టాంగే 1954లో దాన్ని డిజైన్ చేశారు. అక్కడ 80 ఏళ్ళ క్రితం సుమారు 1,900 అడుగుల ఎత్తున, ఇంచుమించుగా చడీచప్పుడు లేకుండా ఒక కొత్త రకం బాంబు పేలింది. అక్కడ 1945లో నుంచున్నవారందరూ వెంటనే విగత జీవులయ్యారు. తర్వాత మంటలు. మిగిలిన పర్యవసానాలు! ఆగస్టు 6 తర్వాత, అక్కడ కొద్ది రోజులపాటు వర్షం పడింది. నల్లని జిగట చుక్కలు. మసి, శిథిలాల అణువులతో బరువైనవి. హిరోషిమా శిథిలాల మధ్యన కొనప్రాణాలతో ఉన్నవారు ఆర్తిగా ఆ నీటినే తాగారు. కానీ, అవి అణు ధార్మికతతో నిండిన వర్షపు చినుకులు.

''అణువు మరింత విభజనకు గురైంది. ఈ అణు విచ్ఛిత్తితో, మొత్తం ప్రపంచం కుప్పకూలినట్లు నా అంతరాత్మకు అనిపించింది'' అని పెయింటర్ వాసిలి కాండినిస్కీ 1913లో రాశారు. గడచిన శతాబ్దపు ఆరంభంలో ఎర్నెస్ట్ రూథర్ ఫర్డ్, పియరీ, మేరీ క్యూరీ, ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ వంటివారు అణు భౌతిక శాస్త్ర రహస్యాలను విప్పడం ప్రారంభించినపుడు, తదనంతర కాలంలో, నిర్ణీత కాల వ్యవధుల్లో వచ్చిన ఆర్టిస్టులు, రచయితలు, తత్త్వవేత్తలు ఈ కొత్త సైన్స్ సాంస్కృతిక పర్యవసానాలపై ఒకే రకమైన అభిప్రాయాన్ని వెలిబుచ్చుతూ వచ్చారు. ''ప్రతీదీ అస్థిరమైనదిగా, ప్రమాదకరమైనదిగా, నిస్సారమైనదిగా పరిణమించింది'' అని కాండినిస్కీ వ్యాఖ్యానించారు.

> రెండో ప్రపంచ యుద్ధ కాలంలో జపాన్ నగరం హిరోషిమాపై 1945 ఆగస్ట్ 6న అమెరికా తన తొలి అణుబాంబు జారవిడిచింది. ఆగస్ట్ 9న నాగసాకి నగరంపై మరో బాంబు పడింది. ఈ దాడుల్లో 1,50,000 నుంచి 2,40,000 మంది మరణించారు. అత్యధికులు సాధారణ పౌరులు. బతికినవారు రేడియో ధార్మికత ప్రభావంతో నరకం చూశారు.

ఆ వాదన ఎక్కడికి దారితీసిందో చూసేందుకు, అనుభూతి చెందేందుకు ప్రయత్నించడానికి నేను హిరోషిమా వచ్చాను. పీస్ మెమోరియల్ మ్యూజియం జనంతో నిండినా, మౌనం రాజ్యమేలుతూ, అణు శక్తి పార్శ్వాన్ని చూపింది. కాలిపోయిన విద్యార్థుల యూనిఫారాలు. పిల్లల దుస్తులు. హిరోషిమాలోని కుటుంబం ఒకటి ఈ మధ్యనే ఆరు ముడతల తెరను మ్యూజియానికి ఇచ్చింది. దాని బంగారపు అంచులపై నల్లని వాన చారికలు. ఇంత భయం గొలిపే నైరూప్య చిత్రాన్ని నేను ఇంతవరకు ఎక్కడా చూడలేదు.

హిరోషిమాలో హైపోసెంటర్‌కి సుమారు 850 అడుగుల దూరంలో ఓ బ్యాంక్ బిల్డింగ్ ఉంది. సుమారు 3,871 డిగ్రీల సెల్సియస్ లేదా అంతకుమించిన ఉష్ణోగ్రతలో అక్కడ చనిపోయిన ఒక వ్యక్తి శాశ్వత నీడతో బ్యాంకు మెట్లు నల్లని రూపు సంతరించుకున్నాయి. వాటిని చూడడంతోనే ఆధునిక కళారీతి 'ఆటమిక్ ఆప్టిమిజం' దెబ్బకు అదృశ్యమైపోయిందని చెప్పాలి. ఒక డాక్యుమెంటరీలో ఆ మెట్లను చూసిన పెయింటర్ ఈవ్ క్లైన్ కొన్ని భయంకర మానవాకారాలను సృష్టించారు. నీలి రంగు 'ట్రేడ్ మార్క్'గా గుర్తింపు పొందిన ఆయన చిత్రాలు కొన్ని ఆ తర్వాత బూడిద తెలుపునకు మారాయి.



హిరోషిమా నగరంపై అణుబాంబు దాడి జరిగి నేటికి 80 ఏళ్లు

ఏదీ రాజకీయ వివేకం?

హిరోషిమాపై మొదటి బాంబును ప్రయోగించిన మూడు రోజులకే నాగసాకిపై రెండవ బాంబు వదిలారు. 1945 ఆగస్టు 6 తదనంతర దశాబ్దాలలో చిత్రకళ, సినిమా, సాహిత్య రంగాలు పరస్పర విధ్వంసం వల్ల ఉత్పన్నమయ్యే వినాశకర పరిస్థితులను రూపుకట్టించేందుకు నడుం బిగించాయి. 'ఆన్ ద బీచ్' (1959) సినిమాలో, మూడవ ప్రపంచ యుద్ధం నుంచి బతికి బట్టకట్టిన వారు, అణు ధార్మికత ఆస్ట్రేలియాను తాకనుందని బితుకు బితుకుమంటూ ఉంటారు. జార్జ్ ఆర్వెల్, ఫిలిప్ కె. డిక్, కిమ్ స్టాన్లీ రాబిన్‌సన్ వంటివారు అణు ఉత్పాతం తర్వాత జీవితం ఎలా ఉండగలదో లేదా ఏం మిగిలి ఉంటుందో ఊహించారు. వారంతా అణు భవిష్య ప్రవక్తలు. మన సంస్థలు, మన నాయకులు ప్లుటోనియం మాదిరిగానే అస్థిరమైనవారని వారు కనుగొన్నారు.

హిరోషిమాపై దాడి జరిగిన 80 ఏళ్ళ తర్వాత, మనం మన నడవడికను సరిదిద్దుకోకపోగా అణు వినాశనపు నూతన శకంలోకి అడుగులు వేసే పెద్ద పొరపాట్లు చేస్తున్నాం. ఉక్రెయిన్‌పై రష్యా దురాక్రమణ తర్వాత, క్యూబా క్షిపణుల సంక్షోభం తర్వాత తిరిగి, ఈ భూగోళం అణు యుద్ధపు అత్యంత ప్రమాదాన్ని ఎదుర్కొంటోందని అమెరికా మాజీ అధ్యక్షుడు బైడెన్ అన్నారు. ''మునుపెన్నటికన్నా కూడా అణ్వస్త్రాలతో నిర్మూలనం కాగల ప్రమాదం అంచున'' మనం ఉన్నట్లు అధ్యక్షుడు ట్రంప్ పాలనా యంత్రాంగంలో జాతీయ ఇంటెలిజెన్స్ డైరెక్టర్ తులసీ గబ్బార్డ్ ఈ ఏడాది మొదట్లో హెచ్చరించారు. ఇరాన్‌లోని అణుశక్తి అభివృద్ధి ప్రదేశాలపై అమెరికా, ఇజ్రాయెల్ జూన్‌లో బాంబులు కురిపించాయి. అణు సామర్థ్య శక్తులను ఆధునీకీకరించే పనులను ఉత్తర కొరియా కొనసాగిస్తోంది. అణ్వస్త్ర అగ్ర రాజ్యాలు రెండు కాదు మూడు అని తెలుసుకుని తీరాలన్నట్లుగా చైనా అణ్వాయుధాలను విస్తరిస్తోంది. అమెరికా–రష్యాల మధ్య కుదిరిన కడపటి ఆయుధ నియంత్రణ ఒడంబడికకు ఇంకో ఆరు నెలల్లో కాలం చెల్లనుంది. ఆయుధాల నియంత్రణ అనే సూత్రానికే దాంతో కాలం చెల్లుతుందని అనుకోవచ్చు.

ఇంత జరుగుతున్నా ప్రజల నుంచి ఆగ్రహావేశాలు ఏమంత లేవు. అమెరికా అధ్యక్ష పదవికి జరిగిన ఎన్నికల ప్రచారంలో ఎక్కడా గతంలోలా శాంతి కాముక అడ్వర్టయిజ్‌మెంట్లు లేవు. పైగా, గ్రహాంతరవాసులు, ఏ దిశగా దూసుకెళతాయో చెప్పలేని గ్రహ శకలాలు, అత్యంత తాజాగా అయితే కిల్లర్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి వాటివల్ల ఈ భూగోళానికి ప్రమాదం పొంచి ఉన్నట్లుగా పుస్తకాలు, సినిమాలు వస్తున్నాయి.

ప్రస్తుతం వివిధ దేశాల వద్ద 12,000 అణ్వాయుధాలు ఉన్నట్లు 'ఫెడరేషన్ ఆఫ్ అమెరికన్ సైంటిస్ట్స్' అంచనా. అయినా, అవేవో రెండవ ప్రపంచ యుద్ధం నాటివనే భ్రమల్లోనే మనం ఇప్పటికీ ఉన్నాం. హిరోషిమా దాడిపై ఆగ్రహావేశాలు వ్యక్తం కావడానికి బదులు అణుబాంబు అంత విధ్వంసాన్ని సృష్టించిందా అనే ఆశ్చర్యమే అమెరికన్లలో ఎక్కువ వ్యక్తమైంది.

బతికి ఉండగలమా?

'ద న్యూయార్కర్' పత్రిక 1946లో తెచ్చిన ప్రత్యేక సంచికలో హిరోషిమాపై జాన్ హెర్సే రాసిన వార్తా కథనాన్ని మినహాయిస్తే, అణు విధ్వంసాన్ని మొదట్లో విహంగ వీక్షణంగానే చూశారు. అమెరికా ఆక్రమిత దళాలు 1945 నుంచి 1952 వరకు ఆ రెండు విధ్వంస నగరాలలోని దృశ్యాలను నిష్ఠగా సెన్సార్ చేస్తూ వచ్చాయి. హిరోషిమాలో అమెరికా సైన్యం తీసిన ఫోటోలలో జనం అరకొరగానే కనిపిస్తారు. అవి చికిత్స పొందుతున్నవారిని చూపుతాయి. ప్రజలు ఎంత బాధకు ఓర్చుకున్నదీ తెలియదు.

నాగసాకిలో ఎట్సుయాకీ మాట్సీ అనే హైస్కూలు టీచరు ఉన్నారు. తీరిక వేళల్లో ఆయన హైకూలు రాస్తూంటారు. ఆయన 1945 ఆగస్టు 9న ఒక ఆహార పంపిణీ కేంద్రం వద్ద పనిచేస్తున్నారు. అర్ధరాత్రి మంటలను దాటుకుంటూ ఎలాగో ఇంటికి పరుగెత్తారు. ఆయన పిల్లల్లో ఇద్దరు అప్పటికే చనిపోయారు. ఇంకో పిల్లాడు ఆ మర్నాడు కన్నుమూశాడు. భార్య వారం లోపలే గతించింది. అణు విస్ఫోటం గురించి 1946లో నాగసాకిలోని ఒక జర్నల్‌లో ఆయన కవితలను ప్రచురించాలని కోరుకున్నప్పుడు దాని ఎడిటర్లు అందుకు నిరాకరించారు. దానికి విరుద్ధంగా 1960లు, 1970లలో అమెరికాలో చాలామంది ఆర్టిస్టులకు ఈ బాంబులు కథా వస్తువుగా మారాయి.

> హిరోషిమాపై దాడి జరిగిన 80 ఏళ్ళ తర్వాత, మనం మన నడవడికను సరిదిద్దుకోకపోగా అణు వినాశనపు నూతన శకంలోకి అడుగులు వేసే పెద్ద పొరపాట్లు చేస్తున్నాం. ఉక్రెయిన్‌పై రష్యా దురాక్రమణ తర్వాత, క్యూబా క్షిపణుల సంక్షోభం తర్వాత తిరిగి ఈ భూగోళం అణు యుద్ధపు అత్యంత ప్రమాదాన్ని ఎదుర్కొంటోంది.

అణుబాంబు దాడి వంటి అత్యంత వినాశకర ఘట్టాన్ని నిజంగా పూర్తిగా అర్థం చేసుకోవడం సాధ్యం కాని పని. టోక్యో నుంచి హిరోషిమాకు బులెట్ రైలులో వెళుతూ నేను గుంథర్ యాండర్స్ రాసిన పుస్తకాన్ని చదవడం ప్రారంభించా. ఆయన 1945 ఆగస్టు 6న న్యూయార్క్‌లో ఉన్నారు. ఆ రోజు రేడియోలో వార్తలు విన్నప్పుడు ఆయన మెదడు మొద్దుబారిపోయింది.

తర్వాత కొన్నేళ్ళపాటు ఆయన కాగితంపై కలం పెట్టలేకపోయారు. సవ్యంగా లేదా సత్ప్రవర్తనతో జీవించడం గురించిన పరిశీలనే 2,500 ఏళ్ళుగా తత్త్వశాస్త్రానికి మూల బిందువుగా ఉంటూ వస్తోంది. అది కాస్తా, ఒక్క రోజులో, ఒక్క చర్యతో, తుడిచిపెట్టుకుపోయింది. హిరోషిమా తర్వాత, ''గత యుగాల మౌలిక నైతిక ప్రశ్నను విప్లవాత్మకంగా పునర్ నిర్వచించుకోవాల్సిన అవసరం ఉంది'' అని యాండర్స్ వాదించవచ్చు. ''మనం ఎలా జీవించాలి? అని ప్రశ్నించుకోవడానికి బదులుగా, అసలు మనం జీవించి ఉంటామా?'' అని ప్రశ్నించుకుని తీరాలి. మన ముఖ్య నైతిక వైఫల్యం అందులోనే ఉంది.

వ్యాసకర్త కళా విమర్శకుడు ('న్యూయార్క్ టైమ్స్' సౌజన్యంతో)

సోషల్ టాక్

ప్రకృతి హక్కు



'నీరు మానవ హక్కు' అన్నారు. కానీ నది హక్కులను, ప్రకృతి హక్కులను పరిరక్షించాకే నీరు మానవ హక్కు అవుతుంది. నది స్వచ్ఛంగా ప్రవహించకుండా, ప్రకృతి ఆరోగ్యంగా లేకుండా మానవ హక్కులను నిర్ధారించలేరు. (ప్రభుత్వాలను ఉద్దేశించి).

– రాజేంద్ర సింగ్, 'వాటర్‌మ్యాన్ ఆఫ్ ఇండియా'

సరైన ఆలోచన



ఒక ఆలోచన గురించి అస్సలు సంకోచించనట్లయితే అది సరైన ఆలోచన కాదు. అలాగే, జీవితంలోని చెడు సమయాలు ఎప్పుడూ కూడా గొప్ప సమయాలకే దారి తీస్తాయి. ఈ రెండూ గుర్తు పెట్టుకోండి.

– మనోజ్ నైట్ శ్యామలన్, సినీ దర్శకుడు

మంచి అతిథి



ఈసారి పర్వత ప్రాంతాల సందర్శనకు వెళ్లినప్పుడు మీ దగ్గరున్న ప్లాస్టిక్ బాటిళ్ల నుంచి కాకుండా, అక్కడి కుళాయి నీరు తాగండి. ఇయర్ ఫోన్స్ పెట్టుకుని బిగ్గరగా సంగీతాన్ని వినటానికి బదులు అక్కడి అడవి ఏం మాట్లాడుతోందో వినండి. చెప్పొచ్చేదేమంటే, చికాకును కలిగించని అతిథిగా ఉండండి.

– రిజుతా దివేకర్, లైఫ్ కోచ్

తల్లి బాధ్యత



ఎదుగుతున్న పిల్లల పట్ల తల్లి కఠినంగా ఉండాలి. వాళ్లను వెళ్లవలసినంత దూరమే వెళ్లనివ్వటం తల్లి బాధ్యత. ఎటు వైపు వెళ్లాలో కూడా తల్లే చెప్పాలి. నియమాలు పెట్టాలి. పిల్లలు తమ పరిమితులను తాము తెలుసుకునేలా దారి చూపుతుండాలి.

– కాజల్, సీనియర్ బాలీవుడ్ నటి

జీడీపీ ఆట



ఒక ఆర్థిక వ్యవస్థను నాశనం చేయడానికి మార్గం, దాన్ని ఒకే లక్ష్యం చుట్టూ నిర్మించడం: అది జీడీపీ! అప్పుడు ప్రభుత్వం జనాన్ని విస్మరించి, కొంతమంది ధనికుల సంపదను పెంచడానికి పనిచేయొచ్చు. సరిగ్గా పనిచేస్తే జీడీపీ పెరుగుతుంది. ఇక అదే జనాన్ని బ్రెయిన్ వాష్ చేస్తే ఆ జీడీపీ పెరుగుదల పట్ల చప్పట్లు కొడతారు.

– కౌశిక్ బసు, ఆర్థికవేత్త

ఆఫ్రికా నుంచి తరలింపు?



యూఏఈలో బంగారం గనులు లేవు. అయినా ప్రపంచంలో 20 శాతం బంగారాన్ని ఆ దేశం ఎగుమతి చేస్తోంది. అది ఎక్కడి నుంచి, ఎలా వస్తుందో ఊహించగలరా!

– కిరణ్ కుమార్ ఎస్., వ్యాఖ్యాత

తెలంగాణ ముద్దుబిడ్డ

ఇన్ బాక్స్

ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ సార్ తెలంగాణ తొలి, మలి ఉద్యమాల్లో తనదైన పాత్ర పోషించి చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయారు. 1934 ఆగస్టు ఆరవ తేదీన వరంగల్ జిల్లా ఆత్మకూరు మండలం, అక్కంపేట గ్రామంలో జన్మించారు. ఉన్నత విద్యాభ్యాసం తర్వాత అర్థశాస్త్ర అధ్యాపకులుగా జీవితాన్ని ప్రారంభించారు. కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్‌గా, వైస్ ఛాన్సలర్‌గానూ పనిచేశారు. తెలంగాణ సమస్యలపై పరిశోధన ప్రచురణలు జరిపే 'సెంటర్ ఫర్ తెలంగాణ స్టడీస్'కు ఛైర్మన్‌గా వ్యవహరించారు.

తెలంగాణ సాధన మూడు దశలుగా కొనసాగాలని సూచించారు. అందులో మొదటిది భావజాల వ్యాప్తి, రెండవది ఉద్యమ కార్యాచరణ, మూడవది రాజకీయ ప్రక్రియ. ఈ మూడూ సమాంతరంగా సాగాలన్నారు. తెలంగాణపై ప్రజలలో చైతన్యం తీసుకు రావడానికి 'తెలంగాణ రాష్ట్రం ఒక డిమాండ్', 'తల్లడిల్లుతున్న తెలంగాణ', 'తెలంగాణ రాష్ట్రంపై విస్తృత అంగీకారం' వంటి రచనలు చేశారు. 'నాన్ ముల్కీ గో బ్యాక్' ఉద్యమంలోనూ, 1956 లో 'ఇడ్లీ సాంబార్ గో బ్యాక్' ఉద్యమంలోనూ, 1969 తొలిదశ తెలంగాణ ఉద్యమంలోనూ, 1996 మలిదశ ఉద్యమంలోనూ కీలక పాత్ర పోషించారు. మొదటి ఎస్ఆర్‌సీ కమిషన్ నుంచి శ్రీకృష్ణ కమిటీ వరకు, అన్నింటి ముందరా తన వాణిని బలంగా వినిపించిన మేధావి ఆయన.

తెలంగాణ ఉద్యమకారుడు కేసీఆర్‌కు సంబంధించి రెండు పార్శ్వాలు నచ్చేవి. అవి ఒకటి తెలంగాణ యాక్టివిటీ, రెండు తెలంగాణ యాస్పెక్ట్ (తెలంగాణ సమస్యను, తెలంగాణ ప్రజల్లోకి, తెలంగాణ భాషలో తీసుకుపోవడం). అందుకనే కేసీఆర్ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు కోసం చేసిన నిరాహార దీక్షకు మద్దతు తెలిపారు. ఆయన మానవత్వం మూర్తీభవించిన మనిషి. బ్రెయిన్ ట్యూమర్‌తో బాధపడుతున్న ఒక వ్యక్తికి ఒక్కరోజులో 12 లక్షల రూపాయలు పోగుచేసి ఇచ్చిన మహా మనీషి ఆయన.



ప్రొ॥ కె. జయశంకర్

విద్యార్థుల ఆత్మహత్యలను చూసి చలించిపోయేవారు. 'అయ్యో పిల్లలు పిట్టలా రాలిపోతున్నా'రంటూ ఆవేదన వ్యక్తం చేసేవారు. 'దశాబ్దాలుగా తెలంగాణ ప్రజలు పడే బాధ... నేను క్యాన్సర్‌తో పడే బాధ కంటే ఎన్నో రెట్లు ఎక్కువ. వారి బాధతో పోలిస్తే ఇది ఎంత' అనేవారు. 'నా చివరి శ్వాస తెలంగాణ రాష్ట్రంలో ఆగితే నాకెంతో సంతృప్తి' అనేవారు. 2011 జూన్ 21న తెలంగాణ రాష్ట్రం సిద్ధించక ముందే జయశంకర్ సార్ తుదిశ్వాస వీడడం బాధాకరం. కొంపల్లి వెంకట్ గౌడ్ రాసిన 'వొడవని ముచ్చట' జయశంకర్ సార్ జీవితంపై వచ్చిన మంచి పుస్తకం.

– నర్సింగు కోటయ్య, చరిత్ర అధ్యాపకులు
(నేడు ప్రొ॥ కె. జయశంకర్ జయంతి)

సాక్షి ఎడిటోరియల్ పేజీ ఈ–మెయిల్: editpage@sakshi.com
ఎడిట్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలను ఆ యా రచయితల వ్యక్తిగత అభిప్రాయాలుగా గమనించాలి.

డేటా పాయింట్

ఐటీలో ఊడుతున్న కొలువులు

దేశంలో 2012-13తో పోలిస్తే ఇంజనీరింగ్ కాలేజీలు, విద్యార్థుల సంఖ్య భారీగా పెరిగింది. కానీ, ఫ్రెషర్ల జీతాలు మాత్రం 2010లో ఉన్న రూ. 3.5 లక్షల దగ్గరే ఇప్పటికీ ఆగిపోవడం గమనార్హం. 2010-23 మధ్య టాప్ ఐటీ కంపెనీల్లో ఉద్యోగుల సంఖ్య పెరిగింది. ఆ తరవాత మాత్రం టీసీఎస్, ఇన్ఫోసిస్, విప్రో వంటి కంపెనీల్లో తగ్గింది.

దేశంలో 2012-13లో ఇంజనీరింగ్ కాలేజీల సంఖ్య: 3,371
2023-24 నాటికి కాలేజీల సంఖ్య: 8,876
పెరుగుదల శాతం: 163

2012-13లో బీటెక్‌లో చేరినవారు: 23.4 లక్షలు
2023-24లో విద్యార్థుల సంఖ్య: 42.4 లక్షలు
పెరుగుదల శాతం: 81

2010లో కంప్యూటర్ సైన్స్, ఐటీలో చేరినవారు: 4.76 లక్షలు
2023-24లో వీరి సంఖ్య: 21.6 లక్షలు
పెరుగుదల శాతం: 354

పెరుగుదల శాతం

ఆతప స్నానం

జ్యోతిర్మయం

కార్తీక స్నానం, మాఘస్నానం, పుష్కరస్నానం, త్రివేణీసంగమ స్నానం... ఇలా రకరకాల స్నానాల విశిష్టతను గూర్చి మన శాస్త్రాలు చెప్పాయి. కోట్లాది ప్రజలు పుణ్య తిథులలో, బ్రహ్మ ముహూర్తంలో, సూర్యోదయానికి కాస్త ముందే ఆ పుణ్యస్నానాలు చేయటానికి పుణ్యనదీ తీరాలకు చేరుకుంటారు. అయితే క్రియాయోగాన్ని ప్రపంచానికి అందించిన పరమహంస యోగానంద 'ఆతపస్నాన' విశిష్టతను గూర్చి చెప్పారు.

ఆతపస్నానం అంటే ఏమిటో, ఎలా చేయాలో, ఎంతసేపు చేయాలో వారు ఇలా వివరించారు: 'మందులకంటె ఉత్తమ మైనవి సూర్యకిరణాలు. వాటిలో ఉంది రోగాలను నయంచేసే అద్భుత శక్తి. ప్రతి దినం పది నిమిషాలసేపు ఆతపస్నానం చేయాలి (ఒంటి మీద ఎండపడేలా చేయాలి). అప్పుడోసారి, ఇప్పుడోసారి ఎక్కువసేపు ఎండలో ఉండడం కంటె దినానికి పదేసి నిమిషాల చొప్పున ఎండలో ఉండడం మంచిది. ఆరోగ్యపరమైన అలవాట్లు, మంచి అలవాట్లు ఏర్పరచుకోవడంతో పాటు ప్రతి రోజూ కొద్ది సేపు చేసే ఆతపస్నానం, హానికరమైన సూక్ష్మ జీవులను నాశనం చేయడానికి తగినంత ప్రాణ శక్తిని శరీరానికి సరఫరా చేస్తూ ఉంటుంది' (పుట 100– మానవుడి నిత్యాన్వేషణ – శ్రీ పరమహంస యోగానంద).

మనకు సూర్యుడు కేవలం ఒక అగ్ని గోళం కాదు, 'సూర్య భగవానుడు', 'శక్తి ప్రదాత'. కాబట్టే భక్తిని జత చేసి సూర్యనమస్కారాలు చేయమన్నారు మహర్షులు.

ఈ ఆతపస్నానం ఆచరించటానికి మనం ఎక్కడికో పోవాల్సిన పనికానీ, డబ్బు ఖర్చు చేయాల్సిన అవసరం కానీ లేదు. లక్షణంగా మన ఇంటి ముందో, మిద్దెపైననో ప్రశాంతంగా, భక్తి పూర్వకంగా చేసుకోవచ్చు. **'ఆదిదేవ! నమస్తుభ్యం ప్రసీద మమ భాస్కర! దివాకర! నమస్తుభ్యం ప్రభాకర నమోస్తుతే'** అని ప్రతి రోజూ సూర్యోదయ సమయాన ప్రార్థిద్దాం. శారీరక, మానసిక, ఆధ్యాత్మిక లాభాలను పొందుదాం.

– రాచమడుగు శ్రీనివాసులు

రెండేళ్లు బయట చదివితే స్థానికులు కాదా?



నీట్ స్థానికత కేసులో రాష్ట్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు ప్రశ్న

- పదేళ్ల గడువు ముగిసినందునే జీఓ 33 తెచ్చామన్న ప్రభుత్వం
- ఆ జీఓను 2028లో ఎందుకు అమలు చేయకూడదని ప్రశ్నించిన కోర్టు
- వాదనలు ముగించి, తీర్పును రిజర్వ్ చేసిన సీజేఐ ధర్మాసనం
- వచ్చే శుక్రవారం వరకు లిఖితపూర్వక వాదనలు సమర్పించాలని ఆదేశం

సాక్షి, న్యూఢిల్లీ: విద్యార్థి కేవలం రెండేళ్లు వేరే రాష్ట్రంలో చదువుకోవడానికి వెళితే తప్పు ఏంటని సుప్రీంకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. ఉన్నత చదువుల కోసమో.. తల్లిదండ్రుల బదిలీ కారణంగానో రెండేళ్లపాటు రాష్ట్రం బయట చదివితే వారిని స్థానికత కోటా నుంచి తప్పించడం సరికాదని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ అన్నారు. వచ్చే శుక్రవారంలోపు స్థానికత అంశంపై లిఖితపూర్వకంగా వాదనలు సమర్పించాలని తెలంగాణ ప్రభుత్వాన్ని ఆదేశించారు. మెడికల్ సీట్ల భర్తీలో స్థానికత అంశంపై రాష్ట్ర ప్రభుత్వం గత ఏడాది సెప్టెంబర్ 11న దాఖలు చేసిన స్పెషల్ లీవ్ పిటిషన్‌పై సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కే వినోద్ చంద్రన్‌లతో కూడిన ధర్మాసనం మంగళవారం వాదనలు ముగించి, తీర్పును రిజర్వ్ చేసింది.

2028లో ఎందుకు అమలు చేయకూడదు?

తెలంగాణ విద్యార్థుల ప్రయోజనం కోసమే రాష్ట్ర ప్రభుత్వం జీఓ 33ను తీసుకొచ్చిందని తెలంగాణ ప్రభుత్వం తరఫు సీనియర్ న్యాయవాది అభిషేక్ మనుసింఘ్వీ తెలిపారు. ప్రస్తుత విధానం రాజ్యాంగంలోని ఆర్టికల్ 371 (డి) ప్రకారం ఉందని చెప్పారు. ఏపీ విభజన చట్టంలో ఏపీ విద్యార్థులకు కల్పించిన గడువు ముగిసిపోవటంతో ఈ జీఓ తెచ్చినట్లు వివరించారు. దీని ప్రకారం సివిల్ సర్వీసెస్ (ఐఏఎస్, ఐపీఎస్), ఇతర ఉద్యోగాల్లో తల్లిదండ్రులు డిప్యుటేషన్‌పై వెళితే, ఇతర రాష్ట్రాల్లో చదువుకొన్న వారి పిల్లలకు మినహాయింపు కల్పిస్తున్నట్లు చెప్పారు. ఈ అంశాన్ని కొన్ని ప్రత్యేక కేసులతో ముడి పెట్టకుండా లక్షలాది మంది తెలంగాణ స్థానిక విద్యార్థుల దృష్టితో ఆలోచించాలని కోరారు. ఈ సమయంలో కలగజేసుకున్న సీజేఐ జస్టిస్ గవాయ్.. పదేళ్లు మాత్రమే నిబంధనలు వర్తిస్తాయని చెబుతున్న రాష్ట్ర ప్రభుత్వం, 2028లో జీఓ 33ను ఎందుకు అమలు చేయకూడదు అని ప్రశ్నించారు. పదేళ్ల గడువు ముగిసినంత మాత్రాన అందరికీ రాజ్యాంగంలోని ఆర్టికల్ 371 (డీ)లోని అంశాలు తెలియవని అభిప్రాయపడ్డారు. 2028లో కొత్త నిబంధనలు తీసుకువస్తే వచ్చే నాలుగేళ్లలో స్థానికంగా చదివే విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు ఉండవని పేర్కొన్నారు. కాళోజీ వర్సిటీ తరఫు సీనియర్ న్యాయవాది గోపాల్ శంకర్ నారాయణన్ వాదనలు వినిపిస్తూ ఆంధ్రప్రదేశ్‌తోపాటు మహారాష్ట్ర, తమిళనాడులోనూ ఇలాంటి స్థానికత అమలులో ఉందని గుర్తుచేశారు. ఏపీ పునర్విభజన చట్టం ప్రకారం ఉన్న పదేళ్ల గడువు ముగిసినందున తెలంగాణ ప్రభుత్వం కొత్త నిబంధనలు రూపొందించిందని తెలిపారు. దీంతో జస్టిస్ చంద్రన్ స్పందిస్తూ.. 'తెలంగాణలో వరుసగా నాలుగేళ్లు విద్యనభ్యసించి ఉండాలని రూల్ తెస్తున్న విషయం స్థానిక ప్రజలందరికీ తెలుసు అని భావించడం సరికాదు' అని వ్యాఖ్యానించారు. 'ప్రతి విద్యార్థి ఆర్టికల్ 371 (డి) గురించి తెలుసుకోవాలని అన్నట్లుగా మీ వాదన ఉంది. 8వ తరగతిలోనే రాజ్యాంగాన్ని చదువుకోవాలన్నట్లు మాట్లడటం సరికాదు. చదువురాని తల్లిదండ్రులు కూడా ఉంటారు కదా' అని ప్రశ్నించారు.

పదేళ్లు చదివినా నాన్ లోకల్ అవుతున్నాం

ప్రభుత్వం తరఫున సుదీర్ఘ వాదనల అనంతరం విద్యార్థుల తరఫు న్యాయవాదులు వాదనలు వినిపించారు. తెలంగాణలో పుట్టి 10వ తరగతి వరకు రాష్ట్రంలోనే చదివినా జీఓ 33 కారణంగా స్థానిక కోటా దక్కడం లేదని తెలిపారు. 11, 12వ తరగతులు చదవని కారణంగా నీట్‌లో స్థానిక కోటా దక్కక నష్టపోతున్నట్లు నివేదించారు. దాదాపు 2 గంటలపాటు సుదీర్ఘ వాదనలు విన్న ధర్మాసనం ఇంక ఏమైనా అభ్యంతరాలు ఉంటే రాతపూర్వకంగా సమర్పించాలని సూచిస్తూ తీర్పును రిజర్వ్ చేసింది.

విద్యుదాఘాతంతో యువ రైతు సజీవ దహనం



ద్విచక్రవాహనంతో పాటు కాలిపోయిన రాజు



రాజు(ఫైల్)

గుండాల: చేను వద్దకు వెళ్తున్న ఒక యువ రైతు విద్యుదాఘాతంతో సజీవ దహనమయ్యాడు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గుండాల మండలం వెన్నెలబైలు గ్రామంలో మంగళవారం జరిగిన ఈ సంఘటనపై స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన పర్శిక రాజు (28) గ్రామ సమీపంలో మొక్కజొన్న సాగు చేస్తున్నాడు. కాగా తెల్లవారుజామున కోతుల నుంచి పంట కాపలా కోసం ద్విచక్ర వాహనంపై చేలోకి వెళ్లేందుకు రోడ్డు దిగాడు. అప్పటికే అక్కడ తెగిపడిన విద్యుత్ తీగ రాజు మెడకు తగిలి బైక్‌తో సహా కిందపడ్డాడు. ఈ క్రమంలో విద్యుదాఘాతంతో మంటలు చెలరేగి రాజు అక్కడికక్కడే మృతి చెందాడు. ద్విచక్రవాహనం కూడా పూర్తిగా దగ్ధమైంది. మృతునికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. విద్యుత్ స్తంభంపై ఇన్సులేటర్ ఫెయిలై తెగిన తీగ రాజు మెడకు తగలడంతో ఈ ప్రమాదం జరిగింది. దీనిపై విద్యుత్‌శాఖ ఏడీఏ కోటేశ్వర రావును వివరణ కోరగా.. వర్షాకాలంలో అప్పుడప్పుడూ ఇన్సులేటర్‌లు ఫెయిలవుతాయని, ఉడతలు సైతం తీగలను పాడు చేస్తాయని తెలిపారు.

అప్పులతో ఇద్దరు రైతుల బలవన్మరణం



పడిపెల్లి విలాస్ (ఫైల్)

బజార్‌హత్నూర్/మంగపేట: అప్పుల బాధ తాళలేక వేర్వేరు జిల్లాల్లో ఇద్దరు రైతులు బలవన్మరణానికి పాల్పడ్డారు. ఆదిలాబాద్ జిల్లా బజార్‌హత్నూర్ మండల కేంద్రానికి చెందిన పడిపెల్లి విలాస్ (52)కు భార్య, కుమారుడు, కూతురు సంతానం. తనకున్న 30 గుంటల భూమి సాగు చేసుకోవడంతో పాటు.. కూలి పనులకు వెళ్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఇటీవల ఇందిరమ్మ ఇల్లు మంజూరవగా.. నిర్మాణ పనులు చేపట్టాడు. అయిదేళ్ల క్రితం కూతురి వివాహం నిమిత్తం రూ.3 లక్షలు, ఇతర అవసరాల నిమిత్తం మరో రూ.2 లక్షల వరకు అప్పు తెచ్చాడు. అప్పు పెరగడంతో ఎలా తీర్చాలోనని కొద్ది రోజులుగా మదనపడుతున్నాడు. ఈ క్రమంలో భార్య సోమవారం పొలం పనులకు వెళ్లిన తర్వాత పురుగు మందు తాగాడు. ఆమె సాయంత్రం ఇంటికి వచ్చి చూసి.. భర్తను బోథ్ ఏరియా ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సంజయ్‌కుమార్ తెలిపారు.

ఎరువుల వ్యాపారి బెదిరింపులతో..



సమ్మయ్య (ఫైల్)

ములుగు జిల్లా మంగపేట మండలం కమలాపురం గ్రామానికి చెందిన పరమాత్ముల సమ్మయ్య (58) కొన్నేళ్లుగా కౌలు వ్యవసాయం చేస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన ఎరువుల వ్యాపారి వేమ సురేశ్ (కౌలు భూమి దళారీ) ఐదేళ్లుగా రైతు సమ్మయ్యకు వ్యవసాయ భూమిని కౌలుకు ఇప్పిస్తున్నాడు. విత్తనాలు, ఎరువులు, పురుగు మందులకు తన దుకాణం నుంచి పెట్టుబడి పెట్టి.. పంట చేతికి వచ్చిన అనంతరం లెక్కలు చూసుకునేవారు. మూడేళ్లుగా పంట పెట్టుబడి డబ్బులను సమ్మయ్య.. వ్యాపారి సురేశ్‌కు చెల్లిస్తున్నా.. లెక్కలు వేయడం లేదు. ఈ ఏడాది వ్యాపారి సురేశ్ ఇప్పించిన 9 ఎకరాల పొలంలోనే రైతు సమ్మయ్య వరి సాగు చేశాడు. ఈనెల 3న ఇద్దరూ పంట పెట్టుబడుల లెక్కలు చూసుకున్నారు. లెక్కల్లో వ్యాపారి సురేశ్.. సమ్మయ్యకు రూ.1.4 లక్షలు ఇవ్వాల్సి ఉందని తేలింది. ఈ మేరకు సమ్మయ్య 4వ తేదీన సురేశ్ ఇంటికి వెళ్లి డబ్బు ఇవ్వమని కోరాడు. కాగా, లెక్కల్లో పొరపాటు జరిగిందని.. సమ్మయ్యే తనకు రూ.4,61,750 ఇవ్వాలని సురేశ్ స్పష్టం చేశాడు. బాకీని 10 రోజుల్లో తీర్చాలని లేదా చావమని సదరు వ్యాపారి హెచ్చరించడంతో మనస్తాపానికి గురైన సమ్మయ్య సోమవారం గడ్డి మందు తాగాడు. కుటుంబ సభ్యులు వెంటనే వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ రాత్రి 10.50 గంటలకు మృతి చెందాడు. తన చావుకు వ్యాపారి సురేశ్ కారణమని వాంగ్మూలం ఇచ్చినట్లు ఎస్‌ఐ టీవీఆర్ సూరి తెలిపారు. మృతుని భార్య కొమురమ్మ ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

లోకలెవరు? కానిదెవరు?

▶ మొదటి పేజీ తరువాయి

జారీచేసింది. ఆ జీఓను సవరిస్తూ గతేడాది కాంగ్రెస్ ప్రభుత్వం జీఓ 33ను తీసుకొచ్చింది.

జీఓ 114 ఏముంది?

ఎంబీబీఎస్ సీట్ల కేటాయింపులో స్థానికతను నిర్ధారిస్తూ 2017 జూలై 5న బీఆర్‌ఎస్‌ప్రభుత్వం ఈ జీఓను తీసుకొచ్చింది. దీనిలో స్థానికత నిర్ధారణకు రెండు క్లాజ్‌లను పొందుపరిచారు. మొదటి క్లాజ్ ప్రకారం 6వ తరగతి నుంచి 12 వరకు కనీసం 4 ఏళ్లపాటు ఎక్కడ చదివితే అక్కడే స్థానికులుగా పరిగణిస్తారు. రెండో క్లాజ్ ప్రకారం 9వ తరగతి నుంచి 12వ తరగతి (ఇంటర్) వరకు ఒకే దగ్గర చదివిన విద్యార్థులను స్థానికులుగా గుర్తిస్తారు. ఈ రెంటిలో ఏది ఉన్నా స్థానికులే.

జీఓ 33లో ఏముంది?

రేవంత్‌రెడ్డి ప్రభుత్వం జీఓ 114ను సవరిస్తూ 2024 జూలై 19న ఈ జీఓను తీసుకొచ్చింది. 114 జీఓలోని మొదటి క్లాజ్ (6 నుంచి 12 తరగతి వరకు ఎక్కడ నాలుగేళ్లు చదివితే అక్కడే స్థానికులు అనే నిబంధన) జీఓ 33 ద్వారా తొలగించారు. 9వ తరగతి నుంచి 12వ తరగతి వరకు తెలంగాణలో చదివిన వారే స్థానికులు అని స్పష్టం చేశారు.

జీఓ 114 దుర్వినియోగం

జీఓ 33 ఆధారంగానే గత సంవత్సరం కాళోజీ ఆరోగ్య విశ్వ విద్యాలయం మెడికల్ సీట్ల కౌన్సెలింగ్ కోసం దరఖాస్తులు ఆహ్వానించగా పలువురు విద్యార్థులు హైకోర్టును ఆశ్రయించారు. దీంతో వారందరికీ తహసీల్దార్ ఇచ్చే నివాస ధ్రువీకరణ పత్రం ఆధారంగా సీట్లు కేటాయించాలని కోర్టు ఆదేశించింది. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు వెళ్లింది. అక్కడ వాదనలు జరుగుతుండగానే ఈ ఏడాది కూడా కాళోజీ వర్సిటీ జీఓ 33 ప్రకారమే ఎంబీబీఎస్, బీడీఎస్ ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానించడంతో గత నెల 24న సుప్రీంకోర్టు కేసును విచారించి, స్థానికత అంశం తేలే వరకు పాత నిబంధనల ప్రకారమే రిజిస్ట్రేషన్లు చేసుకోవాలని వర్సిటీని ఆదేశించింది. కాగా, 6 నుంచి 12వ తరగతి వరకు నాలుగేళ్లు ఎక్కడ చదివితే అక్కడే స్థానికత అనే నిబంధనతో మెడికల్ సీట్లలో భారీగా అక్రమాలు జరిగినట్లు కాళోజీ యూనివర్సిటీ 2023లో గుర్తించింది. ఏపీకి చెందిన పలువురు విద్యార్థులు 6 నుంచి 9 వరకు (నాలుగేళ్లు) తెలంగాణలో చదివినట్లు ప్రైవేటు స్కూళ్ల నుంచి నకిలీ స్టడీ, బోనఫైడ్ సర్టిఫికేట్లు తెచ్చి ఎంబీబీఎస్ సీట్లు పొందినట్లు తేల్చి ఏడుగురి సీట్లను రద్దు చేసింది. ఈ అక్రమాలను నివారించేందుకు బోర్డు పరీక్షలు ఉన్న 10వ తరగతిని తప్పనిసరి చూస్తూ 9 నుంచి 12 (ఇంటర్మీడియట్) తరగతులు తెలంగాణలో చదివితేనే స్థానికులుగా పేర్కొంటూ ప్రభుత్వం జీఓ 33ను తెచ్చింది.

జీఓ 33తో తెలంగాణవారూ నాన్ లోకల్

జీవో 33 వల్ల కొందరు తెలంగాణ విద్యార్థులు కూడా లోకల్ స్టేటస్ కోల్పోవటంతో వివాదం ముదిరింది. నల్లగొండ, ఖమ్మం, గద్వాల జిల్లాలకు చెందిన తెలంగాణ విద్యార్థులు 10వ తరగతి వరకు స్థానికంగా చదివి, ఇంటర్మీడియట్ ఏపీలో చదివారు. వారు జీఓ 33 ప్రకారం స్థానికులు కాదు.

లోతుగా పరిశీలించాల్సిందే!

- ఇంజనీరింగ్ కాలేజీల్లో తనిఖీలపై ప్రత్యేక కమిటీ నిర్ణయం
- లెక్కల ఆడిట్, భూమి అనుమతులపై ప్రత్యేక దృష్టి
- ఉప కమిటీలకు బాధ్యతలు అప్పగింత



సాక్షి, హైదరాబాద్: ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీలను పూర్తిస్థాయిలో పరిశీలించాలని ఫీజులపై ప్రభుత్వం నియమించిన ప్రత్యేక కమిటీ నిర్ణయించింది. కొన్ని కాలేజీలను నేరుగా తనిఖీ చేయాలని భావిస్తోంది. ఫీజుల పరిశీలన కమిటీలో ఆడిట్, టౌన్‌ప్లానింగ్, సాంకేతిక విద్య, ఉన్నత విద్య ఉన్నతాధికారులు ఉన్నారు. వీళ్లంతా ఉప కమిటీలను ఏర్పాటు చేసుకున్నారు. ఈ కమిటీల్లోని నిపుణులు ఆయా విభాగాలకు సంబంధించిన అంశాలకు ప్రాధాన్యమిస్తారు. అఫిలియేషన్ జాబితాలో ఉన్న ప్రతి ప్రైవేటు కాలేజీని అన్ని కమిటీలు పరిశీలిస్తాయి. వారంరోజుల్లో ఈ ప్రక్రియ పూర్తి చేయాలని తాజా భేటీలో ప్రత్యేక కమిటీ నిర్ణయించింది.

నిబంధనల ఉల్లంఘనపై దృష్టి

అఖిల భారత సాంకేతిక విద్యా మండలి (ఏఐసీటీఈ) బృందాలు పూర్తిస్థాయిలో తనిఖీలు చేయకుండానే కాలేజీలకు అనుమతులు ఇస్తున్నాయనే విమర్శలున్నాయి. ముఖ్యంగా కాలేజీలకు ఒక చోట అనుమతులు తీసుకుని, మరో చోట నిర్వహిస్తున్నారు. ఏఐసీటీఈకి సమర్పించిన డాక్యుమెంట్లలో అనేక లొసుగులు ఉంటున్నాయని ప్రభుత్వానికి ఫిర్యాదులు వచ్చాయి. హైదరాబాద్ పరిధిలో కొన్ని కాలేజీల భూములు నిషేధిత ప్రాంతాల్లో ఉన్నాయి. అయినా అనుమతులు ఎలా వచ్చాయనే అంశాలను నగర ప్లానింగ్ విభాగం అధికారులు పరిశీలిస్తారు.

ఆడిట్ కథేంటి?

ప్రతి కాలేజీ గత మూడేళ్ల (2022–2025) ఆడిట్ నివేదికలను తెలంగాణ అడ్మిషన్లు, ఫీజుల నియంత్రణ కమిటీ (ఎఫ్‌ఆర్‌సీ)కి సమర్పించాయి. ఎఫ్‌ఆర్‌సీ కొంతమంది ఆడిటర్లను నియమించుకుని కాలేజీల ప్రతిపాదనలను పరిశీలిస్తుంది. ఆడిట్ విభాగం ఉన్నతాధికారులు ప్రతి కాలేజీ డాక్యుమెంట్లను పరిశీలిస్తారు. ఈ లెక్కల్లో ఎక్కడ తేడా వచ్చినా ఆ కాలేజీలను బ్లాక్ లిస్ట్‌లో పెట్టే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. 20 కాలేజీలపై సీరియస్‌గా ఫిర్యాదులు వచ్చాయి. ఫ్యాకల్టీ లేకుండానే ఎమర్జింగ్ కోర్సులు నిర్వహిస్తున్నాయి. అధ్యాపకులు, సిబ్బందికి వేతనాలు ఇవ్వడం లేదని తేలింది. ఈ నేపథ్యంలో వాటి బ్యాంకు లావాదేవీలపైనా దృష్టి పెడతామని అధికారులు అంటున్నారు. ఈ కాలేజీలపై చర్యలకు ప్రభుత్వానికి సిఫార్సు చేసే అవకాశం ఉందని ఓ అధికారి తెలిపారు.

కుక్కను తప్పించబోయి స్కూల్ ఆటో బోల్తా

- 14 మంది విద్యార్థులకు గాయాలు
- ఒకరి పరిస్థితి విషమం



రిజ్వాన్‌కు వైద్యం అందిస్తున్న వైద్యులు

ఎల్లారెడ్డిపేట (సిరిసిల్ల): రాజన్నసిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో ఒక ప్రైవేట్ పాఠశాలకు చెందిన ఆటో బోల్తా పడటంతో.. అందులోని 14 మంది విద్యార్థులు గాయపడ్డారు. ఒక విద్యార్థి కాలు విరిగింది. వివరాలివి. ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్‌కు చెందిన విద్యార్థులు 14 మంది మండల కేంద్రంలోని రెండు ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్నారు. అదే గ్రామానికి చెందిన ఎస్‌కే మలంగ్.. తన ఆటోలో నిత్యం విద్యార్థులను పాఠశాలకు ఉదయం తీసుకొచ్చి, సాయంత్రం ఇంటికి తీసుకెళ్తుంటాడు. ఈక్రమంలో మంగళవారం ఉదయం తన ఆటోలో విద్యార్థులను ఎక్కించుకుని మండల కేంద్రానికి వస్తుండగా.. సిరిసిల్ల–కామారెడ్డి ప్రధాన రహదారిపై గాయత్రి డిగ్రీ కళాశాల వద్ద కుక్క అడ్డుగా వచ్చింది. దాన్ని తప్పించే ప్రయత్నంలో ఆటో అదుపుతప్పి రెండు పల్టీలు కొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న 14 మంది విద్యార్థులు గాయపడ్డారు. వెంటనే స్థానికులు క్షతగాత్రులను స్థానిక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం పిల్లల్ని తల్లిదండ్రులు ఇంటికి తీసుకెళ్లారు. ప్రమాదంలో కాలు విరిగిన విద్యార్థి హర్షత్ రిజ్వాన్ ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాహుల్‌రెడ్డి తెలిపారు.

సెల్ఫీ దిగుతూ నదిలో గల్లంతు

కృష్ణా నదిలో పడిపోయిన యువకుడు



మంథని శివ(ఫైల్)

నాగార్జునసాగర్: సెల్ఫీ తీసుకుంటూ ప్రమాదవశాత్తు కృష్ణా నదిలో ఒక యువకుడు పడి గల్లంతయ్యాడు. నాగార్జునసాగర్ వద్ద కృష్ణా నదిపై కొత్త వంతెన సమీపంలో జరిగిన ఈ సంఘటనపై పోలీసులు తెలిపిన వివరాలివి. రంగారెడ్డి జిల్లా మంచాల మండలం జాపాల గ్రామానికి చెందిన మంథని శివ (23).. తన స్నేహితులు దూసరి ప్రసాద్ (గణేశ్), సొప్పరి శివ, పండుగ నర్సింహతో కలిసి నాగార్జునసాగర్‌కు సోమవారం వచ్చాడు. వీరు నందికొండ మున్సిపాలిటీ పరిధిలోని పైలాన్ కాలనీలోని కృష్ణానదిపై కొత్త వంతెన వద్దకు చేరుకున్నారు. కొత్త వంతెనపై నిల్చుని ఫొటోలు దిగే క్రమంలో.. మంథని శివ కృష్ణా నదిలో పడి గల్లంతయ్యాడు. దీంతో శివ స్నేహితులు ఈ విషయాన్ని అతని తండ్రి కొమురయ్యకు ఫోన్ చేసి తెలియజేశారు. శివ తండ్రి కొమురయ్య మంగళవారం హిల్‌కాలనీ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బందితో పాటు సాగర్ సీఐ శ్రీను నాయక్, విజయపురి టౌన్, హాలియా ఎస్‌ఐల ఆధ్వర్యంలో కృష్ణా నదిలో గాలింపు చర్యలు చేపట్టారు.

మద్యం తాగించి.. చెవిలో గడ్డి మందుపోసి

- భర్తను హత్య చేయించిన భార్య
- ప్రియుడు మరో వ్యక్తితో కలిసి పథకం
- ముగ్గురిని అరెస్టుచేసిన పోలీసులు



కేసు వివరాలను వెల్లడిస్తున్న సీపీ గౌస్ ఆలం

కరీంనగర్‌రూరల్: నిత్యం తనపై అనుమానంతో తాగొచ్చి కొడుతున్నాడని, ప్రియుడు, మరో వ్యక్తితో కలిసి భర్తను ఓ భార్య హత్య చేయించింది. ఈ ఘటన జూలై 29న కరీంనగర్ శివారులో చోటు చేసుకుంది. కేసును ఛేదించిన పోలీసులు మంగళవారం ఆ వివరాలు వెల్లడించారు. సీపీ గౌస్ ఆలం కథనం ప్రకారం.. కరీంనగర్‌లోని సుభాశ్‌నగర్‌కు చెందిన ఐలవేణి సంపత్ (45) జిల్లా గ్రంథాలయంలో స్వీపర్‌గా పని చేస్తున్నాడు. జూలై 29న కరీంనగర్ శివారులోని రైల్వేట్రాక్‌పై అనుమానాస్పదంగా మృతి చెంది ఉన్నాడు. కరీంనగర్ రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు. మృతుడి భార్య రమాదేవిపై అనుమానంతో అదుపులోకి తీసుకొని విచారించగా సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. రమాదేవికి కిసాన్‌నగర్‌కు చెందిన కర్రె రాజయ్యతో వివాహేతర సంబంధం ఉంది. సంపత్ మద్యానికి బానిసై తరచూ కొడుతుండటంతో భర్తను హత్య చేసేందుకు రాజయ్యతోపాటు దూరపు బంధువు అయిన ఖాదర్‌గూడేనికి చెందిన కీసరి శ్రీనివాస్‌ను రమాదేవి సంప్రదించింది. ప్రణాళిక ప్రకారం రాజయ్య, శ్రీనివాస్ కలిసి సంపత్‌ను జూలై 29న బొమ్మకల్ ఫ్లై ఓవర్‌బ్రిడ్జి వద్దకు తీసుకెళ్లారు. అక్కడ మద్యం తాగించారు. రమాదేవి ఆదేశాల మేరకు మద్యం మత్తులో ఉన్న సంపత్ చెవిలో రాజయ్య, శ్రీనివాస్ గడ్డిమందు పోసి హత్య చేశారు. అనంతరం సమీపంలోని రైల్వేట్రాక్ వద్ద మృతదేహాన్ని పడేసి వెళ్లిపోయారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకున్న రూరల్ పోలీసులు సంపత్ భార్యను విచారించారు. హత్యకు వివాహేతర సంబంధమే కారణమని గుర్తించారు. నిందితులు కర్రె రాజయ్య, కీసరి శ్రీనివాస్, ఐలవేణి రమాదేవిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచి రిమాండ్‌కు తరలించారు. కేసును చాకచక్యంగా ఛేదించిన కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి, ఎస్సైలు టి.నరేశ్, లక్ష్మారెడ్డిని సీపీ అభినందించారు.

ఉత్తరాఖండ్‌లో...

బురద విలయం

గంగోత్రి సమీప ధరాలీ గ్రామంలో బీభత్సం



ఉత్తరకాశీ జిల్లా ఖీర్ గాడ్ వద్ద కుంభవృష్టితో సంభవించిన బురద వరదతో తీవ్ర నష్టం వాటిల్లిన ధరాలీ మార్కెట్ ఏరియా

- ఎగువ ప్రాంతాల నుంచి కొట్టుకొచ్చిన వరదనీరు
- పలు ఇళ్లు, రెస్టారెంట్లు భూస్థాపితం
- ఐదుగురు దుర్మరణం
- 50 మంది జాడ గల్లంతు
- సుందరమైన గ్రామం సర్వనాశనం
- 10 మంది ఆర్మీ జవాన్లు, ఒక సైన్యాధికారి జాడ గల్లంతు
- సీఎం పుష్కర్‌కు ఫోన్‌చేసి పరిస్థితిపై ఆరాతీసిన ప్రధాని

ఉత్తరకాశీ(ఉత్తరాఖండ్): ఆధ్యాత్మిక ధామాలను దర్శించే పర్యాటకులతో ప్రకృతి సోయగాలతో అలరారే రమణీయమైన హిమాలయ గ్రామం 'ధరాలీ'పై వరద విలయం కరాళ నృత్యంచేసింది. క్లౌడ్‌బరస్ట్ కారణంగా ఎగువ ప్రాంతాల నుంచి కొట్టుకొచ్చిన బురద వరద ఆ గ్రామంలోని ఇళ్లు, హోటళ్లు, రెస్టారెంట్లు, హోమ్‌స్టేలను భూస్థాపితం చేసింది. అప్పటి దాకా ప్రకృతి అందాలతో తులతూగిన ఉత్తరాఖండ్‌లోని ఆ గ్రామం ఇప్పుడు మరుభూమిని తలపిస్తోంది. ఎగువ ప్రాంతాల వరద నీరు, బురద ముంచెత్తిన దుర్ఘటనలో ఐదుగురు ప్రాణాలు కోల్పోయారని ఉత్తరకాశీ జిల్లా మేజిస్ట్రేట్ ప్రశాంత్ ఆర్య చెప్పారు. 50 మందికిపైగా జనం జాడ గల్లంతైందని స్థానికులు చెబుతున్నారు. జాతీయ భద్రత, నిఘా కార్యక్రమంలో భాగంగా సమీప హార్సిల్‌లోయ ప్రాంతంలో ఏర్పాటుచేసిన భారత ఆర్మీ 14 రాజ్‌రిఫ్ యూనిట్ బేస్‌క్యాంప్‌పైనా బురద దూసుకొచ్చింది. దీంతో 10 మంది జవాన్లు, ఒక సైన్యాధికారి(జూనియర్ కమీషన్డ్ ఆఫీసర్) జాడ సైతం గల్లంతైంది. తోటి జవాన్ల జాడ తెలీకుండాపోయినాసరే సడలని ధైర్యంతో ఇతర జవాన్లు సహాయక, అన్వేషణ కార్యక్రమంలో నిమగ్నమయ్యారు. నలుగురు చిన్నారులు, 11 మంది మహిళలు, 22 మంది పురుషులను ఘటనాస్థలి నుంచి సహాయక బృందాలు కాపాడాయి. డజన్ల కొద్దీ హోటళ్లు భారీ బురదలో కూరుకుపోయాయి. సమీప హెలిప్యాడ్ సైతం నాశనమైంది. మంగళవారం మధ్యాహ్నం ఉత్తరాఖండ్‌లోని ఉత్తరకాశీ జిల్లాలోని గంగోత్రీ ధామం సమీపంలోని ధరాలీ గ్రామంపైకి ఎగువ ప్రాంతాల వరద ముంచెత్తిన వీడియో దృశ్యాలు ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. హరిశీలా పర్వతం సమీపంలోని సత్‌తాల్ దగ్గరి కుంభవృష్టి కారణంగా ఒక్కసారిగా పెరిగిన



ధరాలీలో బురద మట్టితో నిండిపోయిన నివాస ప్రాంతం

ఖీర్‌గంగా నదీప్రవాహం హద్దులు దాటి దిగువకు దూసుకొచ్చింది. ఈ వరదనీటితోపాటు వరద దిగువకు గంటకు 43 కిలోమీటర్ల వేగంతో కొట్టుకొచ్చి అక్కడ ఉన్న ధరాలీ గ్రామాన్ని ముంచెత్తి వినాశనం సృష్టించింది. ప్రకృతి ప్రకోపం వార్త తెల్సి ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్‌ఎఫ్, అగ్నిమాపక దళం, ఉత్తరాఖండ్ పోలీసులు, భారత ఆర్మీ బలగాలు హుటాహుటిన రంగంలోకి దిగారు. ఇండో–టిబెటన్ బోర్డర్ పోలీస్ బలగాలూ ఇప్పటికే సహాయక చర్యల్లో నిమగ్నమయ్యాయి. బురదలో కూరుకుపోయిన ఇళ్ల నుంచి మట్టిని తొలగిస్తున్నారు. బురదలో చిక్కుకుపోయి కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్న వారి కోసం అన్వేషణ మొదలుపెట్టారు. యుద్ధ ప్రాతిపదికన సహాయక చర్యలు కొనసాగిస్తున్నామని ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్‌సింగ్ ధామీ చెప్పారు. కుండపోతగా వర్షం కురుస్తుండటంతో సహాయక చర్యలకు తీవ్ర ఆటంకం తలెత్తుతోంది. ఎగువ ప్రాంతాల్లో అతి తక్కువ సమయంలో అత్యంత తీవ్రస్థాయిలో క్లౌడ్ బరస్ట్ కుండపోత వర్షం కారణంగా ఈ బురద ముంచెత్తిందని వాతావరణశాఖ అధికారులు వివరించారు. ఘటన తర్వాత కేదార్‌నాథ్ వైపు యాత్రికుల రాకను తాత్కాలికంగా ఆపేశారు.

దిగ్భ్రాంతి వ్యక్తంచేసిన ప్రధాని

సహాయక, అన్వేషణ చర్యల్లో పురోగతిపై ఆరా తీసేందుకు సీఎం ధామీకి ప్రధాని ఫోన్ చేశారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా సైతం ఫోన్‌చేసి వివరాలు ఆరాతీశారు. కేంద్ర ప్రభుత్వం తరఫున అదనంగా జాతీయ విపత్తు స్పందన దళం(ఎన్‌డీఆర్‌ఎఫ్) బలగాలను పంపిస్తున్నట్లు సీఎంకు అమిత్‌షా చెప్పారు. ''ధరాలీ దుర్ఘటనలో సర్వం కోల్పోయిన బాధితుల కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నా. ప్రాణాలతో బయటపడిన వాళ్లు ఈ విషాదఘటన నుంచి త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నా. గ్రామస్థులకు అన్నిరకాలుగా సాయపడేందుకు మా ప్రభుత్వం సదా సిద్ధంగాఉంది''అని ప్రధాని మోదీ 'ఎక్స్'లో పోస్ట్‌చేశారు. మృతుల కుటుంబాలకు రక్షణమంత్రి రాజ్‌నాథ్, కాంగ్రెస్ చీఫ్ ఖర్గే తమ ప్రగాఢ సానుభూతి వ్యక్తంచేశారు. సహాయక చర్యల్లో నిమగ్నమై బాధితులకు సాయపడాలని స్థానిక కాంగ్రెస్ కార్యకర్తలు, నేతలకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విజ్ఞప్తిచేశారు. బాధిత కుటుంబాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణ ఆర్థిక సాయం అందించాలని కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంకాగాంధీ వాద్రా కోరారు.



ఆకస్మిక వరదల్లో కొట్టుకుపోతున్న ఇళ్ల దృశ్యాలు



నేలకొరుగుతున్న నివాస భవనం

ఎటు చూసినా బురదమయమే

మెరుపు వరద ధాటికి గ్రామం చాలా వరకు ధ్వంసమైంది. ఇళ్లన్నీ బురదలో కూరుకుపోయాయి. కొండవాలు కింద ఇళ్లు నిర్మించుకున్న వాళ్లకు తప్పించుకునే అవకాశం లేకుండా పోయింది. పలువురిని బురద సజీవంగా కప్పేసింది. సమీప కొండ మీద నుంచి ఒకవ్యక్తి తీసిన వీడియో ఒకటి ఇప్పుడు వైరల్‌గా మారింది. అద్భుతం జరిగినట్లుగా ఆ బురదలోంచి ఒకరిద్దరు బయటికొచ్చి శక్తినంతా కూడదీసుకుని ముందుకు కదిలారు. అప్పటికే అలసిపోయి నాలుగు అడుగులేసి అక్కడే కుప్పకూలిపోయారు. మరో వ్యక్తి కాస్తంత బలం కూడదీసుకుని ఎగువ ప్రాంతం వైపు నడక ప్రారంభించాడు. ''నీ దగ్గర్లో పడిపోయిన ఆ వ్యక్తిని కూడా పైకి లాక్కొని రా''అని కొండ మీద జనం అరుస్తున్నట్లు ఆ వీడియోలో రికార్డయింది. ఒకతను సాయం చేయండండూ ఆ బురద మధ్యలో ఏడుస్తూ కనిపించాడు. కొందరు తమ వాళ్లకు వీడియోకాల్స్ చేసి తాము ఎక్కడ చిక్కుకుపోయామో వివరించే ప్రయత్నం చేశారు. ''అంతా ముగిసిపోయింది''అని ఒకతను మాట్లాడుతున్న వీడియో ఒకటి బయటికొచ్చింది. కొందరు ఊపిరిబిగబట్టిమరీ తమ వారి జాడ కోసం వెతుకుతూ కనిపించారు. డెహ్రాడూన్‌లో రాష్ట్ర విపత్తు నిర్వహణ కేంద్రం నుంచి సహాయక, అన్వేషణ కార్యక్రమాలను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని స్టేట్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ కార్యదర్శి వినోద్ సుమన్ చెప్పారు. సమీప హార్సిల్, సుఖీ లోయ ప్రాంతాలనూ వరదనీరు ముంచెత్తే ప్రమాదం ఉండటంతో అక్కడి స్థానికులను పాలనాయంత్రాంగం అప్రమత్తంచేసింది. తక్షణం ఎగువ ప్రాంతాలకు వెళ్లాలని అధికారులు హెచ్చరించారు. ధరాలీ విలయవార్త తెలిసి సమీప దిగువ గ్రామాల్లో భయాందోళనలు నెలకొన్నాయి. సుఖీ గ్రామంలోనూ కుండపోత వర్షం కురిసింది. అక్కడ కొండచరియలు విరిగిపడటంతో హార్సిల్, ధరాలీ మధ్యలో అప్పటికప్పుడు ఒక కృత్రిమ సరస్సు ఏర్పడింది. ఇందులోని నీరు పెరిగితే దిగువ ప్రాంతాలకు కొత్త ముప్పు ఏర్పడనుంది. 20–30 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో కేవలం 60 నిమిషాల్లోపు 10 సెంటీమీటర్ల స్థాయి వర్షపాతం నమోదైతే దానిని క్లౌడ్‌బరస్ట్‌గా చెబుతారు. వీటిని ముందస్తుగా ఊహించడం చాలా కష్టం. క్లౌడ్‌బరస్ట్ కారణంగా స్వల్ప వ్యవధిలోనే అపారజలరాశి వర్షపు నీటిబిందువుల రూపంలో స్వల్పప్రాంతంలో పడటంతో అక్కడ వరద పోటెత్తుతుంది. కొండప్రాంతమైతే కొండమట్టి నీటితో తడిసిపోయి మెత్తబడి కొండచరియలు విరిగిపడతాయి. దీంతో దిగువ ప్రాంతాల్లో అపార ప్రాణ, ఆస్తినష్టం సంభవించవచ్చు.

ప్రకృతి ఒడిలో ప్రశాంత గ్రామం

ప్రకృతి ఒడిలో ప్రశాంతంగా ఉండే ధరాలీ గ్రామం ఒక్కసారిగా మెరుపు వరదలకు పూర్తిగా కొట్టుకుపోవడంతో అసలు ఈ గ్రామం ఎక్కడుంది? అని చాలా మంది గూగుల్‌లో వెతకడం మొదలెట్టారు. యాపిల్స్‌కు ప్రసిద్ధిగాంచిన రాష్ట్రంలోని హార్సిల్ లోయ సమీపంలో ధరాలీ గ్రామం ఉంది. గంగోత్రి ధామాన్ని దర్శించే వాళ్లు కాసేపు విడిది కోసం మార్గమధ్యంలో ఉన్న ఈ గ్రామాన్ని సందర్శిస్తుంటారు. ఈ గ్రామ సమీపంలో భాగీరథి నది ప్రవహిస్తోంది. గ్రామం మీదుగా జాతీయ రహదారి వెళ్తుండటంతో ఇక్కడి పర్వతమయ ప్రకృతి సుందర దృశ్యాలను చూసేందుకు ఎక్కువ మంది యాత్రికులు ఇక్కడ ఆగుతారు. చార్‌ధామ్ సహా ఇతర తీర్థయాత్రల సమయాల్లో ఈ గ్రామానికి పెద్దసంఖ్యలో జనం వస్తారు. ఇక్కడ అతిథి గృహాలు, లాడ్జీలు ఎక్కువ. అది కూడా తక్కువ ధరలకే విడిది సౌకర్యాలు లభిస్తుండటంతో సందర్శకులు, భక్తులు, యాత్రికులు ఈ గ్రామంలో కాసేపు విశ్రాంతి తీసుకునేందుకు ఎక్కువ ఆసక్తి కనబరుస్తారు. సముద్రమట్టానికి దాదాపు 2,680 మీటర్ల ఎత్తులో ఈ గ్రామం ఉంది. ఈ ఘటనకు తోడు సమీపంలో కొండచరియలు విరిగి పడినఘటనల్లో ఐదు జాతీయరహదారులు సహా 163 చోట్ల రోడ్లపై రాకపోకలు పూర్తిగా స్తంభించిపోయాయి. ఏడు రాష్ట్రరహదారులు, రెండు సరిహద్దు రోడ్లపైనా కొండచరియలు విరిగిపడ్డాయి. బుధవారం సైతం భారీ వర్షాలు కురిసే వీలుందని వాతావరణ శాఖ మంగళవారం ప్రకటించింది. నైనిటాల్, చంపావత్, ఉధమ్‌సింగ్ నగర్, బగేశ్వర్, పౌరీ తెహ్రీ, హరిద్వార్, డెహ్రాడూన్ జిల్లాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. హిమాలయ దిగువ ప్రాంతాల్లో కుండపోత వర్షాలు, కొండచరియలు విరిగిపడే ఘటనలు సర్వసాధారణం. మిగతా హిమాలయ ప్రాంతాలతో పోలిస్తే ఉత్తరాఖండ్‌లో క్లౌడ్‌బరస్ట్ ఘటనలు మరీ ఎక్కువ.

సత్యపాల్ మాలిక్ కన్నుమూత

- సుదీర్ఘ రాజకీయ అనుభవం కలిగిన నేత
- చికిత్స పొందుతూ ఆస్పత్రిలో తుదిశ్వాస



న్యూఢిల్లీ: ఐదు దశాబ్దాల సుదీర్ఘ రాజకీయ అనుభవం కలిగిన సీనియర్ నేత, జమ్మూకశ్మీర్ మాజీ గవర్నర్ సత్యపాల్ మాలిక్(79) కన్నుమూశారు. తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న మాలిక్ మంగళవారం మధ్యాహ్నం ఢిల్లీలోని రామ్ మనోహర్ లోహియా ఆస్పత్రిలో తుదిశ్వాస విడిచారని వ్యక్తిగత సిబ్బంది వెల్లడించారు. మే నుంచి ఆస్పత్రి ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌లోనే చికిత్స పొందుతున్నారన్నారు. రాజకీయ అంశాలపై ముక్కుసూటిగా మాట్లాడే వ్యక్తిగా మాలిక్‌కు పేరుంది. 1946 జూలై 24న యూపీలోని భాగ్‌పట్ జిల్లాలో మాలిక్ జన్మించారు. సుదీర్ఘ రాజకీయ ప్రస్థానంలో లోక్‌సభ, రాజ్యసభ ఎంపీగా పని చేశారు. గోవా, బిహార్, మేఘాలయ, ఒడిశా తదితర రాష్ట్రాలకూ గవర్నర్‌గా సేవలందించారు. జమ్మూకశ్మీర్ గవర్నర్‌గా ఉన్న సమయంలోనే 2019 ఆగస్ట్ 5వ తేదీన కేంద్రం 370వ ఆర్టికల్‌ను రద్దు చేయడం, రాష్ట్రాన్ని రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా విడగొట్టడం జరిగాయి. ఈ నిర్ణయానికి మంగళవారంతో ఐదేళ్లవుతున్న వేళ ఆయన తుది శ్వాస విడవటం యాదృచ్ఛికం. సత్యపాల్ మాలిక ఎన్నో వివాదాలకు సైతం కేంద్ర బిందువుగా మారారు. గవర్నర్‌గా ఉండగా కశ్మీర్‌లో చేపట్టాల్సిన రెండు ప్రధాన ప్రాజెక్టుల ఫైల్స్‌పై సంతకం కోసం పెద్ద మొత్తంలో తనకు లంచం ఇవ్వజూపారంటూ ఆయన చేసిన ఆరోపణలు సంచలనం రేపాయి. అదేవిధంగా, పుల్వామా ఉగ్ర దాడి, వివాదాస్పద వ్యవసాయ చట్టాలపై మాలిక్ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వమే లక్ష్యంగా విమర్శలు చేశారు. రూ.2,200 కోట్ల కిరు జలవిద్యుత్ ప్రాజెక్టులో అవకతవకల ఆరోపణలపై దర్యాప్తు చేపట్టిన సీబీఐ ఈ ఏడాది మేలో కోర్టులో ఆయనపై చార్జిషీటు దాఖలు చేసింది. కేంద్రం వైఖరిని ఆయన ఆస్పత్రి నుంచే తీవ్రంగా ఖండించారు. తనపై జరుగుతున్న రాజకీయ వేధింపులుగా పేర్కొన్నారు. కాగా, జనతాదళ్ టిక్కెట్‌పై అలీగఢ్ లోక్‌సభ స్థానంలో విజయం సాధించిన మాలిక్ అప్పటి వీపీ సింగ్ ప్రభుత్వంలో కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాలు, పర్యాటక శాఖలకు సహాయ మంత్రిగా వ్యవహరించారు. అనంతరం జనతాదళ్ సంక్షోభంలో చిక్కుకుపోవడంతో బీజేపీలో చేరారు. బీజేపీ ఉపాధ్యక్షుడిగా, కిసాన్ మోర్చా ఇన్‌చార్జిగా కూడా ఉన్నారు. జనతాదళ్‌లో రాకమునుపు భారతీయ క్రాంతి దళ్‌లో, తర్వాత కాంగ్రెస్‌లో పని చేశారు. 1974లో భారతీయ క్రాంతి దళ్ తరఫున గెలిచి ఉత్తరప్రదేశ్ అసెంబ్లీలో అడుగుపెట్టిన మొట్టమొదటి జాట్ నేతగా రికార్డు సృష్టించారు. సత్యపాల్ మాలిక్ మృతి పట్ల రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సంతాపం ప్రకటించారు.

గాజా ఆక్రమణకు నెతన్యాహూ చర్యలు



జెరూసలేం: గాజా ప్రాంతం మొత్తాన్ని ఆక్రమించుకునేందుకే ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహూ మొగ్గుచూపుతున్నారు. ఇప్పటికే గాజాలోని మూడొంతుల ప్రాంతం ఇజ్రాయెల్ ఆర్మీ నియంత్రణలోనే ఉంది. తాజాగా, బందీల విడుదలపై హమాస్ సానుకూలంగా లేకపోవడం కారణంగా నెతన్యాహూ తీసుకున్న నిర్ణయం ఫలితంగా మిలటరీ ఆపరేషన్ ఈ ప్రాంతంలో మరింతగా విస్తరించనుంది. హమాస్ బందీలను దాచి ఉంచిన ప్రాంతం కూడా ఇందులో ఉందని మీడియా అంటోంది. గాజా పూర్తి స్థాయి ఆక్రమణ ప్రయత్నాలపై నెతన్యాహూ కార్యాలయం స్పందించలేదు. సైనిక చర్యపై ఇజ్రాయెల్ ప్రభుత్వం ఇప్పటికే ఒక నిర్ణయానికి వచ్చినట్లు ఇజ్రాయెల్ సీనియర్ అధికారిని ఉటంకిస్తూ 'చానెల్ 12' పేర్కొంది. 'హమాస్ పూర్తిగా లొంగిపోకుండా మిగతా బందీలను విడుదల చేయదు. మేం కూడా లొంగిపోము. ఇప్పుడు ఎలాంటి చర్యా తీసుకోకుంటే బందీలు ఆకలితో చనిపోతారు, గాజా హమాస్ నియంత్రణలోనే ఉంటుంది'అని ఆ అధికారి చెప్పినట్లు వెల్లడించింది. ఇజ్రాయెల్ ప్రణాళికలపై పాలస్తీనా విదేశాంగ శాఖ ఆందోళన వ్యక్తం చేసింది.

ఎస్‌ఐఆర్‌పై చర్చించాల్సిందే

- అనుమానాలున్నాయ్.. ప్రభుత్వం నివృత్తి చేయాలి

సాక్షి ప్లస్ జాతీయం పేజీలో...

24 గంటల్లో సుంకాల మోత

భారత్‌కు ట్రంప్ మళ్లీ బెదిరింపు



న్యూయార్క్/మాస్కో: ఉక్రెయిన్‌తో యుద్ధం చేస్తున్న రష్యాను నిలువరించే సత్తాలేని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ దిక్కుతోచని స్థితితో భారత్‌పై తన ఆగ్రహాన్ని టారిఫ్‌ల రూపంలో తీర్చుకుంటున్నారు. మరో 24 గంటల్లో భారత్‌పై మరోమారు దిగుమతి సుంకాలను భారీగా పెంచుతానని ట్రంప్ మంగళవారం ప్రకటించారు. సుసంపన్న దేశమైన రష్యాకు భారత చమురు కొనుగోళ్ల కారణంగా మాత్రమే అపార లాభాల పంట పండుతున్నట్లు ట్రంప్ చెప్పుకొచ్చారు. కేవలం ఈ ఒక్క కారణాన్నే చూపి భారత్‌పై తన అక్కసును వెళ్లదీస్తూ మరోసారి సుంకాల మోత మోగిస్తానని సీఎన్‌బీసీ స్క్వాక్ బాక్స్ ఇంటర్వ్యూలో ట్రంప్ ప్రకటించారు. భారత్ నుంచి ఆర్జిస్తున్న చమురు లాభాల కారణంగానే ఉక్రెయిన్‌తో యుద్ధాన్ని రష్యా విజయవంతంగా నెలల తరబడి కొనసాగిస్తోందని ట్రంప్ మరోమారు నోరుపారేసుకున్నారు. తమతో కంటే రష్యాతోనే అధిక వాణిజ్యం చేస్తోందని, ఆ వాణిజ్యం పరోక్షంగా ఉక్రెయిన్ యుద్ధాగ్నికి ఆజ్యంపోస్తోందని ఆరోపించారు. ''భారత్ ఇప్పటికీ మంచి వాణిజ్య భాగస్వామిగా ఎదగలేకపోయింది. భారత్ మాతో పెద్దస్థాయిలో వ్యాపారం చేస్తోందిగానీ మేం వాళ్లతో పెద్దగా వాణిజ్యం చేయట్లేదు. అందుకే ఇప్పటికే ఇటీవల 25 శాతం టారిఫ్‌ను విధించా. మరో 24 గంటల్లో మరోసారి దిగుమతి సుంకాలను పెంచుతా. దీనికి ప్రధాన కారణం వాళ్లు రష్యా ముడి చమురును కొనుగోలు చేయడమే. అక్కడ ఇంధనాన్ని కొంటూ రష్యాకు నగదు ఇంధనాన్ని సమకూర్చుతున్నారు. ఆ ఇంధనంతో రష్యా యుద్ధయంత్రంగా ఉగ్రరూపం దాల్చుతోంది. ఈ పద్ధతి వాళ్లకు నచ్చుతుందేమోగానీ నేనైతే అస్సలు సంతోషంగా లేను''అని అన్నారు. భారత్‌తో వాణిజ్య సంబంధాలపై అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ.. ''మా సరకులపై భారత్ అత్యంత ఎక్కువ టారిఫ్‌లను మోపుతోంది. మేం టారిఫ్‌లు పెంచడానికి ఇది కూడా ఒక ప్రధాన కారణం''అని చెప్పారు. ''మా ఈ సుంకాల మోత తర్వాత భారత్ దిగిరావొచ్చు. మా సరకులపై సున్నా దిగుమతి సుంకాన్ని ఆఫర్‌చేయొచ్చు. కానీ ఇది మాకు ముఖ్యం కాదు. రష్యా నుంచి భారత్ ముడి చమురు కొనుగోళ్ల అంశమే మాకు ప్రధానం''అని ట్రంప్ స్పష్టంచేశారు.

ఆ హక్కు భారత్‌కు ఉంది

వాణిజ్య బంధం తెంచుకోవాలంటూ ఒత్తిళ్లు చేయడం అక్రమం: రష్యా

మాస్కో: సార్వభౌమ దేశాలకు సొంత ప్రయోజనాల ప్రాతిపదికన వాణిజ్య, ఆర్థిక సహకార భాగస్వాములను ఎంపిక చేసుకునే హక్కుందని రష్యా పేర్కొంది. రష్యా నుంచి చమురును కొనుగోలు చేస్తున్నందుకు భారత్‌పై టారిఫ్‌లను మరింతగా పెంచుతామంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన హెచ్చరిక నేపథ్యంలో రష్యా మంగళవారం ఈ మేరకు స్పష్టం చేసింది. 'సార్వభౌమ దేశాలు తమ వాణిజ్య భాగస్వాములను, వాణిజ్య, ఆర్థిక సహకారంలో భాగస్వాములను, స్వతంత్రంగా ఎంచుకునే హక్కుంటుంది. అవి తమ ప్రయోజనాలకు అనుగుణంగా వాణిజ్యం, ఆర్థిక సహకార విధానాలను నిర్ణయించుకుంటాయి'అని రష్యా అధ్యక్షభవనం క్రెమ్లిన్ ప్రతినిధి దిమిత్రీ పెష్కోవ్ పేర్కొన్నారు.

నిజమైన భారతీయుడెవరో జడ్జీలు నిర్ణయించలేరు

రాహుల్‌పై సుప్రీంకోర్టు వ్యాఖ్యలకు స్పందించిన ప్రియాంకా గాంధీ

న్యూఢిల్లీ: 2022 నాటి కేసులో సుప్రీంకోర్టు సోమవారం కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీపై తీవ్ర వ్యాఖ్యలు చేయడం తెలిసిందే. దీనిపై తన సోదరుడు రాహుల్ గాంధీని వెనకేసుకొచ్చారు ఎంపీ ప్రియాంకా గాంధీ వాద్రా. అసలైన భారతీయులెవరో తేల్చాల్సింది జడ్జీలు కాదంటూ వ్యాఖ్యానించారు. దేశ సైన్యంపై రాహుల్‌కు ఎనలేని గౌరవముందని ఆమె చెప్పారు. ఆర్మీకి వ్యతిరేకంగా రాహుల్ ఎన్నడూ మాట్లాడలేదని స్పష్ట చేశారు. లోక్‌సభలో ప్రతిపక్ష నేతగా ప్రభుత్వాన్ని ప్రశ్నించే, సవాల్ చేసే హక్కు ఆయనకు ఉందని పేర్కొన్నారు. నిజమైన భారతీయుడెవరూ అటువంటి వ్యాఖ్యలు చేయరంటూ సుప్రీంకోర్టు ఆక్షేపించడంపై మంగళవారం ప్రియాంక ఈ మేరకు స్పందించారు.

ఎల్‌వోసీ వెంట పాక్ ఆర్మీ కాల్పుల ఉల్లంఘన

జమ్మూ: పాకిస్తాన్ ఆర్మీ మంగళవారం జమ్మూకశ్మీర్‌లోని పూంఛ్ జిల్లాలో నియంత్రణ రేఖ వెంబడి(ఎల్‌వోసీ) ఎటువంటి కవ్వింపు లేకుండా కాల్పులకు పాల్పడింది. మేలో ఆపరేషన్ సిందూర్ తర్వాత పాకిస్తాన్ కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించడం ఇదే మొదటిసారని అధికార వర్గాలు తెలిపాయి. భారత ఆర్మీ కూడా దీటుగా స్పందించింది. మంకోటె సెక్టార్‌లో రాత్రి 7.40 గంటల సమయంలో ఇరు సైన్యాల మధ్య పావు గంట సేపు కాల్పులు కొనసాగాయని అధికారులు వెల్లడించారు. పహల్గామ్ ఉగ్రదాడి నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం మేలో ఆపరేషన్ సిందూర్ చేపట్టడం తెలిసిందే.

సాధించాల్సిన ఘనతలు ఇంకెన్నో..

బీజేపీ, మిత్రపక్షాలన్నీ కలిసికట్టుగా పని చేయాలి

- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు



న్యూఢిల్లీ: బీజేపీ నేతృత్వంలోని జాతీయ ప్రజాస్వామ్య కూటమి(ఎన్డీయే) ఇప్పటికే ఎన్నో విజయాలు సాధించిందని ప్రధాని నరేంద్ర మోదీ చెప్పారు. సాధించాల్సిన ఘనతలు ఇంకెన్నో ఉన్నాయని ఉద్ఘాటించారు. 1998లో కూటమి ఏర్పాటైందని, అప్పటి నుంచి ప్రజాసేవే పరమావధిగా ముందుకు సాగుతోందని వివరించారు. పాకిస్తాన్‌పై ఆపరేషన్ సిందూర్ విజయాన్ని పురస్కరించుకొని ఎన్డీయే ఎంపీలు ప్రధాని మోదీని మంగళవారం ఘనంగా సత్కరించారు. బీజేపీ, మిత్రపక్షాలన్నీ కలిసికట్టుగా పనిచేయాలని ప్రధాని మోదీ ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. అధికార కూటమిలో భాగస్వామ్య పక్షాలుగా.. సొంత బలానికి అతీతంగా వేర్వేరు ఉమ్మడి కార్యక్రమాల్లో చురుగ్గా పాలుపంచుకోవాలని సూచించారు. దాదాపు ఏడాది కాలంలో ఎన్డీయే ఎంపీల సమావేశంలో మోదీ మాట్లాడడం ఇదే మొదటిసారి. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాపై ఆయన ప్రశంసల వర్షం కురిపించారు. అత్యధిక కాలం హోంమంత్రిగా పనిచేసిన నాయకుడిగా అమిత్ షా రికార్డుకెక్కారని, ఎల్.కె.అద్వానీ పేరిట ఉన్న రికార్డును అధిగమించారని తెలిపారు.

చిన్నపిల్లాడిలా మాట్లాడుతున్న రాహుల్

ఆపరేషన్ సిందూర్‌పై చర్చ చేపట్టాలని, ప్రభుత్వం సమాధానం చెప్పాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తుండడాన్ని ప్రధాని మోదీ తప్పుపట్టారు. అందుకు వారు చింతించక తప్పదన్నారు. భారతదేశ ప్రాదేశిక సమగ్రత, భద్రతపై ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ చిన్నపిల్లాడిలా మాట్లాడుతున్నాడని, ఆధారాల్లేకుండా ఆరోపణలు చేస్తున్నాడని మండిపడ్డారు. న్యాయస్థానం అతడికి తగిన పాఠం నేర్పిందన్నారు. తిరంగా యాత్ర, జాతీయ అంతరిక్ష దినం గురించి ప్రధానమంత్రి ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఆయా కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాలుపంచుకోవాలని ఎన్డీయే ఎంపీలకు సూచించారు. కొన్ని చోట్ల మిత్రపక్షాలు ఉన్నంత బలంగా బీజేపీ లేకపోవచ్చని, అందరూ ఎన్డీయే ఎంపీలుగానే వ్యవహరిస్తూ కలిసి పని చేయాలని చెప్పారు. 2019లో సరిగ్గా ఇదే రోజు(ఆగస్టు 5) ఆర్టికల్ 370ని రద్దు చేశామని, 2020లో ఇదే రోజు అయోధ్యలో రామ మందిర నిర్మాణానికి భూమిపూజ చేశామని మోదీ గుర్తుచేశారు. ఇదొక చరిత్రాత్మక దినమని పేర్కొన్నారు. ఎన్డీయే ప్రభుత్వం రాజ్యాంగాన్ని ఉన్నది ఉన్నట్లుగా అనుసరిస్తోందని స్పష్టంచేశారు.

సంబంధాలు ఉన్నత స్థాయికి

ఫిలిప్పీన్స్ అధ్యక్షుడు ఫెర్డినాండ్‌తో ప్రధాని మోదీ భేటీ

- తొమ్మిది ఒప్పందాలపై సంతకాలు

న్యూఢిల్లీ: భారత్, ఫిలిప్పీన్స్ దేశాలు ఇష్టపూర్వకంగా మిత్రులుగా, విధిలిఖితం వల్ల భాగస్వాములుగా మారాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. ఆయన మంగళవారం ఢిల్లీలో ఫిలిప్పీన్స్ అధ్యక్షుడు ఫెర్డినాండ్ ఆర్.మార్కోస్ జూనియర్‌తో భేటీ అయ్యారు. భారత్–ఫిలిప్పీన్స్ ద్వైపాక్షిక సంబంధాలపై చర్చించారు. ఇరుదేశాల మధ్య సంబంధాలను వ్యూహాత్మక భాగస్వామ్యం స్థాయికి పెంచుకోవాలని నిర్ణయించారు. రక్షణ రంగంలో పరస్పర సహకారాన్ని మరింత బలోపేతం చేసుకోవాలని తీర్మానించారు. మోదీ, ఫెర్డినాండ్ సమావేశం సందర్భంగా తొమ్మిది ఒప్పందాలపై భారత్, ఫిలిప్పీన్స్ సంతకాలు చేశాయి. వ్యూహాత్మక భాగస్వామ్యం ప్రకటన, అమలు.. రెండుదేశాల సైన్యాల మధ్య చర్చలకు సంబంధించిన నియమ నిబంధనలు..



ఫెర్డినాండ్‌తో ప్రధాని మోదీ

అంతరిక్ష రంగంలో సహకారానికి సంబంధించి ఈ ఒప్పందాలు కుదిరాయి. భేటీ అనంతరం ప్రధాని మోదీ, అధ్యక్షుడు ఫెర్డినాండ్ మీడియాతో మాట్లాడారు. హిందూ మహాసముద్రం నుంచి పసిఫిక్ సముద్రం దాకా రెండు దేశాలు ఉమ్మడి విలువలతో ఐక్యంగా పని చేస్తున్నాయని మోదీ ఉద్ఘాటించారు. యాక్ట్ ఈస్ట్ పాలసీతోపాటు 'మహాసాగర్'లో ఇండియాకు ఫిలిప్పీన్స్ అత్యంత కీలకమైన భాగస్వామి అని స్పష్టంచేశారు. ఇండో–పసిఫిక్ ప్రాంతంలో శాంతి, భద్రత, సౌభాగ్యానికి రెండు దేశాలు కట్టుబడి ఉన్నాయని తెలిపారు. అంతర్జాతీయ చట్టాలకు అనుగుణంగా ఇండో–పసిఫిక్‌లో నౌకలు స్వేచ్ఛగా రాకపోకలు సాగించాలన్నదే తమ విధానమని పేర్కొన్నారు. భారత్–ఫిలిప్పీన్స్ సంబంధాలను వ్యూహాత్మక భాగస్వామ్యం స్థాయికి చేర్చాలని నిర్ణయించడం పట్ల చాలా గర్విస్తున్నామని వ్యాఖ్యానించారు. కీలక రంగాల్లో పరస్పర సహకారానికి ఒక సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తున్నట్లు వెల్లడించారు.

ప్రత్యేక స్టాంప్ విడుదల

భారత్–ఫిలిప్పీన్స్ సంబంధాలకు 75 ఏళ్లు పూర్తి కాబోతున్నాయి. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని స్మారక తపాలా బిళ్లను మోదీ, ఫెర్డినాండ్ విడుదల చేశారు. పహల్గాం ఉగ్రవాద దాడిని ఖండించినందుకు ఫిలిప్పీన్స్ ప్రభుత్వానికి మోదీ కృతజ్ఞతలు తెలియజేశారు.

క్లుప్తంగా...

యాదగిరీశుడి సన్నిధిలో పవిత్రోత్సవాలు



యాదగిరిగుట్ట

యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో పవిత్రోత్సవాలు కొనసాగుతున్నాయి. మంగళవారం ఉదయం ఉత్సవ మూర్తులకు స్నపన తిరుమంజనం నిర్వహించారు. అనంతరం ద్వార తోరణ, ధ్వజ కుంభారాధన, అగ్ని ప్రతిష్ఠ, పవిత్ర తోరణం పూజలు నిర్వహించారు. రాత్రి దివ్య విమాన స్వర్ణ గోపురంపై ఉన్న శ్రీసుదర్శన చక్రానికి పవిత్ర మాలలు వేసి, పూజలు చేపట్టారు. ఆయా వేడుకల్లో ఆలయ ఈవో వెంకట్రావ్, అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తి, ప్రధానార్చకులు కాండూరి వెంకటాచార్యులు, ఆలయ అర్చక బృందం, అధికారులు, భక్తులు పాల్గొన్నారు. యాదగిరి క్షేత్రానికి అనుబంధ ఆలయమైన శ్రీపూర్వగిరి లక్ష్మీనరసింహ స్వామి వారి ఆలయంలో కూడా పవిత్రోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి.

'ప్రొఫెసర్ జయశంకర్ స్ఫూర్తిని కొనసాగిస్తాం'



సాక్షి, హైదరాబాద్: ప్రత్యేక రాష్ట్ర సాధనే ఉచ్ఛ్వాస నిశ్వాసలుగా జీవిత పర్యంతం గడిపిన ప్రొఫెసర్ జయశంకర్‌ను తెలంగాణ సమాజం సదా గుర్తుంచుకుంటుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఆగస్టు 6న తెలంగాణ జాతిపిత ప్రొఫెసర్ జయశంకర్ జయంతి సందర్భంగా తెలంగాణ రాష్ట్ర సాధనకు ఆయన చేసిన నిర్విరామ కృషిని, సేవలను ముఖ్యమంత్రి గుర్తు చేసుకున్నారు. జయశంకర్ స్వరాష్ట్ర కలల జెండాను.. భవిష్యత్ ఎజెండాను ఎన్నడూ వదలిపెట్టలేదని తెలిపారు. కోట్లాది సకల జనుల్లో ఉద్యమ స్ఫూర్తిని రగిలించారన్నారు. ఉమ్మడి ఏపీలో తెలంగాణ ప్రాంతం, ప్రజలు ఏవిధంగా నష్టపోయారో గణాంకాలతో సహా ఎప్పటికప్పుడు వివరిస్తూ ప్రత్యేక తెలంగాణ ఉద్యమాన్ని ఆరు దశాబ్దాలు సజీవంగా ఉంచిన ఘనత ఆయనదేనని ముఖ్యమంత్రి కొనియాడారు. జయశంకర్ ఆశయ సాధనకు ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉంటుందని చెప్పారు.

గద్దర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్తాం: సీఎం రేవంత్

సాక్షి, హైదరాబాద్: ప్రజాయుద్ధ నౌక గద్దర్ వర్ధంతి (ఆగస్టు 6) పురస్కరించుకొని ఆయన చేసిన సేవలను సీఎం రేవంత్‌రెడ్డి స్మరించుకున్నారు. ప్రత్యేక రాష్ట్ర ఉద్యమానికి ఆయువుపట్టుగా నిలిచిన వ్యక్తి గద్దర్ అని, ఆయనతో ఉన్న ఆత్మీయ అనుబంధాన్ని ఈ సందర్భంగా సీఎం గుర్తు చేసుకున్నారు. పేద కుటుంబంలో పుట్టి ఇంజనీరింగ్ విద్యను అభ్యసించిన గద్దర్ ఉన్నత కొలువుల వైపు దృష్టిసారించకుండా ప్రతి ఒక్కరికీ కూడు, గూడు, నీడ లభించాలనే లక్ష్యంతో జీవితాంతం తన పాటలతో ప్రజలను చైతన్యపర్చారని తెలిపారు. గద్దర్ సాంస్కృతిక, సాహితీ రంగాలకు చేసిన సేవలకు గుర్తింపుగా జూన్ 14న గద్దర్ పేరిట తెలంగాణ ఫిల్మ్ అవార్డులను సినీ కళాకారులకు, సినీ ప్రముఖులకు అందించినట్లు సీఎం వెల్లడించారు. గద్దర్ జయంతి, వర్ధంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడంతో పాటు, వారి ఆలోచనలు, ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు ప్రజా ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.

సెలవంటే పండగ!



సెలవొచ్చిందంటే సువెన్ చక్ర ఇల్లు సందడిగా ఉంటుంది. బంధువులో, స్నేహితులో వస్తారని కాదు. సెల'వంటే' ఆ ఇంట పండగ. అవును.. వంటల పండగ. ఆ రోజు వంటకు కావాల్సిన కూరగాయలు, సరుకులు పొద్దున్నే తెచ్చుకోవడం మొదలు.. భోజనం అయ్యేదాకా ఇంటిల్లిపాది చేయిపడాల్సిందే. 'అమ్మ చేతి వంట. భార్య చేతి వంట ఎప్పుడూ ఉండేదే.. రెస్టారెంట్‌కు వెళ్లి విందు ఆరగించడం, నిమిషాల్లో ఇంటికొచ్చే ఆన్‌లైన్ ఫుడ్ ఆర్డర్లూ కొత్త కాదు. వారంలో ఒక్కరోజే అందరూ కలిసి ఉండేది. కాబట్టి సెల'వంటే' పండగ అని అంటారు చక్ర.

సెలవు రోజును ఎలాగైనా ప్రత్యేకంగా మలుచుకోవాలి. ఆ మధుర క్షణాలు వారమంతా గుర్తుండాలి. సెలవు మళ్లీ ఎప్పుడొస్తుందా అని కుటుంబ సభ్యులు అందరూ ఎదురు చూడాలి. ఇదంతా సాధ్యం చేయడానికి పెద్దగా ఖర్చు చేయాల్సిన అవసరం లేదు. ఇల్లు దాటాల్సిన అవసరం అంతకన్నా లేదు. సింపుల్.. అందరూ కలిసి 'వంట' చేయడమే. యస్.. ఫుడ్ అంటే ఎవరికి ఇష్టం ఉండదు. పైగా వారం వారం కొత్త రుచులను ఆస్వాదించే చాన్స్ వస్తే ఎవరు కాదనుకుంటారు? ఇంటర్నెట్ వచ్చాక వంట చేయడం చాలా సులభం అయింది. యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్‌లో విహరించి కొత్త వంటకం నిర్ణయిస్తాం. ఉద్యోగం చేసే మగవాళ్లు సెలవు రోజు వంట చేయడం పాత కాన్సెప్ట్. ఇంటిల్లిపాదీ కలిసి వంట చేయడంలో కొత్త ట్రెండ్.

- సాక్షి, స్పెషల్ డెస్క్

అందరూ కలిసి..



ఆడవాళ్లే వంట చేయాలన్న మూస పద్ధతికి స్వస్తి పలకాల్సిందే. కుటుంబం అంటేనే సమిష్టి బాధ్యత. కనీసం సెలవు రోజైనా కుటుంబ సభ్యులంతా కలిసి సరదాగా కబుర్లు చెప్పుకొంటూ వంట చేస్తే? ఒక్కసారి చేసి చూడండి. ఆదివారం, సెలవు రోజు ఎప్పుడొస్తుందా అని ఎదురు చూడడం మీ వంతు అవుతుంది. ఇలా అందరూ కలిసి వంట చేస్తే బోలెడన్ని ప్రయోజనాలు ఉన్నాయి అంటున్నారు వైద్యులు, మానసిక నిపుణులు.

తినేది తెలుస్తుంది

బంధువులు, స్నేహితులు ఇంటికి వచ్చిన సందర్భాల్లోనూ, వారాంతాలు, పండుగలప్పుడు రెస్టారెంట్లకు వెళ్లడం పరిపాటి అయింది. వంట చేసే సమయం లేకపోతే ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేసేస్తున్నారు. మనకు నచ్చినవి తింటున్నాం సరే.. ఆ ఆహారం ద్వారా చక్కెరలు, నూనెలనూ పరిమితికి మించి తీసుకుంటున్నాం. అలాకాకుండా మనమే వంట చేస్తే ఈ పదార్థాలను మితంగా వాడొచ్చు. ఇంట్లోని పిల్లలు, పెద్దలను అందరినీ దృష్టిలో పెట్టుకుని వంట చేస్తాం. అవసరమైతే ఉప్పు, కారం తక్కువగా ఉన్నవి ముందు తీసిపెడతాం. ప్రాసెస్డ్, అల్ట్రా ప్రాసెస్డ్ ఆహార పదార్థాల వాడకం మన చేతుల్లో ఉంటుంది. మితంగానూ వాడొచ్చు.. పూర్తిగా వాడకుండానూ ఉండొచ్చు. ఇంటిల్లిపాదికీ ఎంత ఆరోగ్యం!

కుటుంబ సభ్యులంతా కలిసి వంట చేయండి	సెలవు రోజులను ప్రత్యేకంగా మలుచుకోండి	ఆరోగ్యానికి ఆరోగ్యం.. డబ్బు కూడా ఆదా	బంధాలు బలోపేతం.. ఒత్తిడి నుంచి ఉపశమనం

ఖర్చు తగ్గుతుంది

రెస్టారెంట్లు గల్లీకి ఒకటి పుట్టుకొచ్చాయి. వినూత్న వంటకాలు, రుచులతో ఒకదాన్ని మించి ఒకటి పోటీపడుతున్నాయి. ఖర్చూ అలాగే ఉంటోంది. నలుగురున్న కుటుంబానికి ఓ మోస్తరు రెస్టారెంట్లో భోజనానికి కనీసం రూ.3 వేల నుంచి రూ.5 వేల వరకు వెచ్చించాల్సిందే. కానీ, కాస్త మనసు పెట్టి.. ఇంట్లోని అందరూ తలో చేయి వేసి వండిన భోజనం.. అంతకు మించిన రుచి అందిస్తుంది. పైగా రెస్టారెంట్లో అయిన ఖర్చులో సగం కూడా కాదు. ప్రతీవారం రెస్టారెంట్‌కు వెళ్లే కుటుంబం నెలకు ఎంతకాదన్నా ఓ రూ.10 వేలు ఆదా చేసుకోవచ్చన్న మాట.

ఆరోగ్య ప్రయోజనాలు

బయట ఎక్కువగా తిన్నా, ఫుడ్ డెలివరీ యాప్ నుంచి ఆర్డర్ చేసినా.. ఆ ఆహారం ఆరోగ్యంపై ప్రభావం చూపుతుందనేది జగమెరిగిన సత్యం. ఆ ఫుడ్‌లో రుచి కోసం ఏం కలిపారో తెలియదు. తాజాగా చేసిందో.. వేడి చేసి పంపిందో తెలీదు. ఏ నూనెలు వాడారో తెలియదు. అదే, ఇంట్లో అందరూ కలిసి చేసుకుంటే.. ఇంట్లో బీపీ, షుగర్, ఇతర సమస్యలు ఉన్నవారికి తగినట్టుగా.. పిల్లలకు కూడా నచ్చినట్టుగా.. మనమే జాగ్రత్తగా 'స్వయంపాకం' చేసుకోవచ్చు. ఇంట్లోని అందరూ నిర్భయంగా ఇంటి ఫుడ్‌ని తీసుకోవచ్చు. అందరితో ఎంజాయ్ చేస్తూ రుచులు ఆస్వాదించొచ్చు.

పరిమితాహారం

ఎంత రుచికరంగా ఉన్నా మితంగా తినాలన్నది పెద్దల మాట. మనం రెస్టారెంట్‌కి వెళ్లేటప్పుడు తెలియకుండానే అపరిమితంగా తినేస్తాం. డబ్బులు పెట్టాం కదా అని టేబుల్ మీద మిగిలిన ఆహారాన్ని, లేదా స్విగ్గీ/జొమాటో ద్వారా ఇంటికి వచ్చిన ఫుడ్‌ను పాడేయకుండా ఆ కాస్తా మనమే లాగించేస్తాం. అంటే మన స్థాయికి మించి అతిగా తింటాం అన్నమాట. దాంతో అనారోగ్య సమస్యలూ మనమే కొని తెచ్చుకున్నట్టు అవుతుంది. అదే ఇంట్లో వంట అయితే ఎంత తినాలనేది మనమే నిర్ణయించుకుని అందుకు తగ్గట్టుగా వండుకుంటాం. వృథా పోదు.. అపరిమితంగా మన పొట్టలోకీ పోదు.

బంధాలు బలంగా

ఈ సెల'వంట'ద్వారా అందే అతి ముఖ్యమైన రహస్య పోషకాహారం.. బంధాలు మరింత బలపడటం. భార్య, తల్లిదండ్రులు, పిల్లలు, బంధువులతో ముచ్చట్లు పెట్టుకుంటూ ఇంట్లో వంట చేయడం, కలిసి తినడం వల్ల కుటుంబ సభ్యుల మధ్య అనుబంధాలు మరింత బలపడతాయి. ఒకవేళ అప్పటివరకూ నామమాత్రంగా ఉంటే.. బలంగా అతుక్కోవడం మొదలవుతుంది. పని ఒత్తిడితో అలసిపోయిన వారికి ఇదో మంచి స్ట్రెస్ బస్టర్ అవుతుంది. పిల్లలకు పనులు అలవాటవుతాయి. కూరగాయలు, సరుకులపై అవగాహన ఏర్పడుతుంది. ఇచ్చిపుచ్చుకోవడం అలవడుతుంది. ప్రేమ, ఆప్యాయతలు కరువవుతున్న నేటి రోజుల్లో.. ప్రతివారం వంటతో పండగ చేసుకుంటే.. కుటుంబ బలం పెరుగుతుంది.

ఎన్నో ప్రయోజనాలు

వృథా ఉండదు, మితంగా తింటాం, ఖర్చూ తగ్గుతుంది	అనారోగ్య సమస్యలు ఉన్నవారికి ప్రత్యేకంగా వండుకోవచ్చు	ఒత్తిడి నుంచి ఉపశమనం
వారంలో 6 రోజులూ వండిపెట్టిన శ్రీమతికి మీ చేత్తో వండి పెట్టారన్న సంతృప్తి		

షరతు: వంట చేస్తున్నంతసేపూ.. దాన్ని తృప్తిగా ఆస్వాదిస్తున్నంతసేపూ.. స్మార్ట్ ఫోన్‌ని (వంటల కోసం చూడాల్సి వస్తే తప్ప) దూరంగా పెడితే.. ఈ వంటకి మరింత ప్రేమానుభూతుల 'రుచి' చేకూర్చినవాళ్లవుతారు.

'కాళేశ్వరం' ఇంజనీర్లకు పదోన్నతులు నై

విజిలెన్స్ నివేదిక నేపథ్యంలో సీనియర్లు పక్కకు..

- 8 మందికి సీఈలుగా ప్రమోషన్ ఇచ్చిన ప్రభుత్వం
- ఏళ్ల తరబడి పదోన్నతుల కోసం నిరీక్షించినా చివరకు నిరాశ



సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టు బరాజ్‌ల నిర్మాణంలో పాల్గొన్న ఇంజనీర్లకు రాష్ట్ర ప్రభుత్వం పదోన్నతులు నిరాకరించింది. ఆరోపణలు ఎదుర్కొంటున్న సీనియర్ ఇంజనీర్లను పక్కనబెట్టి మంగళవారం 8 మంది సూపరింటెండింగ్ ఇంజనీర్లకు చీఫ్ ఇంజనీర్లుగా తాత్కాలిక ప్రమోషన్లు ఇచ్చింది. బరాజ్‌ల నిర్మాణంలో అవకతవకల ఆరోపణలపై విచారణ జరిపిన విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం మొత్తం 38 మంది ప్రస్తుత, మాజీ ఇంజనీర్లపై చర్యలకు సిఫారసు చేయగా, ఆ జాబితాలో ఉన్నవారిని పక్కనబెట్టింది. వాస్తవానికి వీరంతా చాలా కాలంగా పదోన్నతుల కోసం నిరీక్షిస్తూ రిటైర్మెంట్‌కు దగ్గర్లో ఉండడం గమనార్హం.

పదోన్నతులు పొందింది వీరే..

నాగర్‌కర్నూల్ ఎస్‌ఈ ఎ.సత్యనారాయణరెడ్డికి మహబూబ్ నగర్ సీఈగా, సీడీఓ ఎస్‌ఈ ఎం.సత్యనారాయణరెడ్డికి అదే విభాగం సీఈగా, కాగజ్‌నగర్ ఎస్‌ఈ ఎస్.కుమారస్వామికి ములుగు సీఈగా, వాలంతరి ఎస్‌ఈ వి.శ్రీనివాస్‌కు గజ్వేల్ సీఈగా, కొత్తగూడెం ఇన్‌చార్జి సీఈ ఎ.శ్రీనివాసరెడ్డికి అక్కడే సీఈగా, పెద్దపల్లి ఎస్‌ఈ ఎ.సత్యరాజాచంద్రకు మంచిర్యాల సీఈగా, వరంగల్ ఎస్‌ఈ కె.వెంకటేశ్వర్లుకు వరంగల్ సీఈ గా పదోన్నతి కల్పిస్తూ నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

పదోన్నతులు లేకుండానే రిటైర్మెంట్లు

కాళేశ్వరంపై విచారణకు సంబంధించి పలు ఇంజనీర్లపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని, జరిమానాలు విధించాలని విజిలెన్స్ విభాగం సిఫారసు చేసింది. వీరందరికీ గత నెలలో నీటిపారుదల శాఖ షోకాజ్ నోటీసులు జారీ చేయగా, పలువురు గడువులోగా సమాధానమిచ్చారు. మరికొందరు అదనపు సమయం కోరారు. కాగా కోర్టు కేసులతో నీటిపారుదల శాఖలో ఏళ్ల తరబడి పదోన్నతులు కల్పించకపోవడంతో కీలకమైన పోస్టులన్నీ ఖాళీగా ఉన్నాయి. ఒక్కో సీనియర్ ఇంజనీర్‌కు రెండు మూడు పోస్టులను అదనపు బాధ్యతలుగా అప్పగించి నెట్టుకు వస్తున్నారు. ఇటీవల న్యాయపరమైన చిక్కులు తొలగిపోవడంతో సీనియారిటీ ఆధారంగా అన్ని స్థాయిల్లోని ఇంజనీర్లకు పదోన్నతులు కల్పించేందుకు ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. ఈలోగా ఆరోపణలు ఎదుర్కొంటున్న ఇంజనీర్లపై చర్యలకు విజిలెన్స్ విభాగం సిఫారసు చేయడంతో గత నెలలో ప్రభుత్వం పదోన్నతుల ప్రక్రియను నిలుపుదల చేసింది. పదోన్నతుల జాబితాలో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఇంజనీర్లూ ఉండడమే దీనికి కారణం. తాజాగా జాబితాల నుంచి వారి పేర్లను తొలగించిన ప్రభుత్వం ఎట్టకేలకు పదోన్నతులు కల్పించింది. మరోవైపు చివరి నిమిషంలో పదోన్నతులు నిలిచిపోవడంతో గత నెలలో పెద్ద సంఖ్యలో ఇంజనీర్లు పదోన్నతులు పొందకుండానే రిటైర్ అయ్యారు. వీరిలో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఇంజనీర్లు సైతం ఉన్నారు. బరాజ్‌ల నిర్మాణంలో అక్రమాలపై విచారణ జరిపిన జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ సైతం పెద్ద సంఖ్యలో ఇంజనీర్లను బాధ్యులుగా తేల్చి వారిపై చర్యలు తీసుకోవాలని సిఫారసు చేసిన సంగతి తెలిసిందే.

రూ.4.2 కోట్ల విలువైన గంజాయి స్వాధీనం

- మల్కన్‌గిరి నుంచి ఉత్తరప్రదేశ్‌కు తరలిస్తున్న ముఠా
- శంషాబాద్ వద్ద ఇద్దరిని అరెస్ట్ చేసిన ఈగల్ టీమ్

సాక్షి, హైదరాబాద్ : ఉత్తరప్రదేశ్‌కు తరలిస్తున్న 847 కిలోల హైగ్రేడ్ (అత్యధిక నాణ్యత) గంజాయిని ఈగల్ (ఎలైట్ యాక్షన్ గ్రూప్ ఫర్ డ్రగ్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్) టీమ్ స్వాధీనం చేసుకుంది. పట్టుబడిన గంజాయి విలువ రూ.4.2 కోట్లు ఉంటుందని ఈగల్ టీం డైరెక్టర్ సందీప్‌శాండిల్య తెలిపారు. ఒడిశాలోని మల్కన్‌గిరి నుంచి ఉత్తర ప్రదేశ్‌కు భారీ మొత్తంలో గంజాయి సరఫరా చేస్తున్నట్టు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు ఖమ్మం ఆర్‌ఎన్‌సీసీ (రీజినల్ నార్కోటిక్స్ కంట్రోల్ సెల్), ఈగల్ టీమ్ శంషాబాద్ సమీపంలోని తొండపల్లి వద్ద అనుమానాస్పదంగా ఉన్న వాహనాన్ని సోమవారం సాయంత్రం ఐదు గంటలకు అడ్డగించింది. సోదాలు చేయగా, పెద్ద మొత్తంలో గంజాయి పట్టుబడింది. వాహనంలో ఉన్న మల్కన్‌గిరికి చెందిన ఖిలాధన, రాజేందర్ బజింగ్‌లను అరెస్టు చేశారు. ఈ ముఠాతో సంబంధమున్న రమేశ్ సుక్రి, జగదీశ్ కులదీప్, షిబో అలియాస్ షిబా, బసు, షఫీక్ అలియాస్ షఫీల కోసం గాలిస్తున్నారు.

గంజాయిని సరిహద్దు దాటించడంలో ఆ ఇద్దరూ దిట్ట

మల్కన్‌గిరికి చెందిన ఖిలాధన, రాజేందర్ బజింగ్‌లు గంజాయిని రాష్ట్ర సరిహద్దులు దాటించడంలో దిట్ట అని ఈగల్ డైరెక్టర్ సందీప్‌శాండిల్య తెలిపారు. ఖిలాధన 2019లో 20 కిలోల గంజాయి రవాణా చేస్తూ ఏపీలోని డొంకరాయి వద్ద పోలీసులకు పట్టుబడి రాజమండ్రి సెంట్రల్ జైలులో 4 నెలలు ఉన్నాడు. బెయిల్‌పై బయటకు వచ్చిన తర్వాత ఉత్తరప్రదేశ్‌కు ఈ ఏడాదిలో 350 కిలోలు, 500 కిలోలు, 600 కిలోల చొప్పున గంజాయి తరలించిన చరిత్ర ఉంది. పోలీసులకు చిక్కకుండా స్థానిక రోడ్ల మీదుగా దూర ప్రాంతాలకు డ్రైవింగ్ చేయడంలో నిపుణుడు.


- మరో నిందితుడు రాజేందర్ బజింగ్ 2023లో 150 కిలోల గంజాయి రవాణా చేస్తూ ఏపీలోని నర్సీపట్నం పోలీసులకు చిక్కాడు. విశాఖ సెంట్రల్ జైలు నుంచి 10 నెలల తర్వాత బెయిల్‌పై విడుదలయ్యాడు. గ్రామీణ ప్రత్యామ్నాయ రహదారుల గురించి లోతైన అవగాహన ఉంది.
- పెద్ద మొత్తంలో గంజాయి పట్టివేతలో కీలకంగా వ్యవహరించిన ఆర్‌ఎన్‌సీసీ ఖమ్మం బృందం డీఎస్పీ సీహెచ్ శ్రీధర్, ఇన్‌స్పెక్టర్ విజయ్, ఎస్సై రవిప్రసాద్, సైబరాబాద్ నార్కోటిక్స్ డీఎస్పీ హరీశ్‌చంద్రారెడ్డి, ఇన్‌స్పెక్టర్లు రమేశ్‌రెడ్డి, రామునాయక్, సిబ్బందిని ఈగల్ డైరెక్టర్ సందీప్ శాండిల్య అభినందించారు.

టెండర్ల సవాల్‌కు బిడ్డరే కానవసరం లేదు

- రైల్వే లాండ్రీ టెండర్ల తిరస్కరణపై హైకోర్టు


సాక్షి, హైదరాబాద్: టెండర్ల ప్రక్రియను సవాల్ చేయడానికి బిడ్డరే కానవసరం లేదని, పారదర్శకంగా జరగలేదని తెలిసినప్పుడు ఎవరైనా దాన్ని సవాల్ చేస్తూ పిటిషన్ దాఖలు చేయవచ్చని హైకోర్టు స్పష్టం చేసింది. టెండర్ల ప్రక్రియ ఏకపక్షంగా, దురుద్దేశాలతో సాగుతోందన్న భావన ఉన్నప్పుడు జోక్యం చేసుకునే అధికారం తమకు ఉందని తేల్చిచెప్పింది. రూ.435 కోట్ల లాండ్రీ సర్వీస్ కాంట్రాక్ట్‌లో సాంకేతిక కారణాలతో కొన్ని టెండర్లను తిరస్కరించి ప్రజాధనం వృథా అయ్యేలా వ్యవహరించకూడదని రైల్వే అధికారుల తీరును తప్పుబట్టింది. పిటిషనర్ బిడ్‌ను పరిశీలించకుండా ఎక్కువ మొత్తం దాఖలు చేసిన బిడ్‌ను రైల్వే అధికారులు ఆమోదించిన పక్షంలో ప్రజాధనానికి నష్టం వాటిల్లుతుందని చెప్పింది. కౌంటర్ దాఖలు చేయాలని రైల్వే అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. తదుపరి విచారణ ఈనెల 18కి వాయిదా వేసింది. సుప్రీం లాండ్రీ సర్వీస్‌కు చెందిన ఎంవోఏ, ఏఓఏలను అప్‌లోడ్ చేయలేదన్న కారణంగా టెండర్లలో అనర్హత ప్రకటించడాన్ని సవాల్ చేస్తూ సుప్రీం లాండ్రీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌పై జస్టిస్ ఎన్వీ శ్రవణ్‌కుమార్ ధర్మాసనం విచారణ చేపట్టింది. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి.. సాంకేతిక కారణాలతో పిటిషనర్ బిడ్‌ను తిరస్కరించడం ఆమోదనీయం కాదన్నారు. దీనిపై సమగ్ర విచారణ జరగాల్సిన అవసరం ఉందని తెలిపారు. కౌంటర్ దాఖలుకు ఆదేశాలిస్తూ విచారణ వాయిదా వేశారు.

టుడేస్ గ్రాఫిక్



ఉద్యాన పంటల కోసం రిమోట్ సెన్సింగ్ ల్యాబ్

- శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన వర్సిటీలో త్వరలో ఏర్పాటు



డాక్టర్ డి.రాజిరెడ్డి

సాక్షి, సిద్దిపేట: రాష్ట్రంలో ఉద్యాన పంటలు ఎంత విస్తీర్ణంలో సాగవుతున్నాయి? ఎంత దిగుబడి వస్తోంది? పంటలకు సోకే తెగుళ్ల వంటి అంశాలను ఆధునిక పద్ధతుల్లో నిర్ధారించేందుకు శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయంలో ప్రత్యేక ప్రయోగశాల (ల్యాబ్)ను ఏర్పాటు చేయనున్నారు. రిమోట్ సెన్సింగ్ టెక్నాలజీతో నడిచే ఈ ల్యాబ్ ఏర్పాటు కోసం ఇటీవల ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రిమోట్ సెన్సింగ్ (ఐఐఆర్‌ఎస్) డెహ్రాడూన్‌లో వర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ సతీశ్ 3 నెలల పాటు శిక్షణ పొందారు. దాదాపు రూ.3 కోట్లతో ఈ ల్యాబ్‌ను ఏర్పాటు చేయనున్నారు. శాటిలైట్ ద్వారా పంటల ఫొటోలు తీయడం, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషీన్ లెర్నింగ్ టెక్నాలజీలను ఉపయోగించి ఉద్యాన పంటలను వివిధ అంశాల్లో అంచనా వేయనున్నారు. రిమోట్ సెన్సింగ్ ల్యాబ్‌ను త్వరలో ఏర్పాటు చేస్తామని, ఈ టెక్నాలజీ రైతులకు ఎంతో ఉపయోగపడుతుందని వర్సిటీ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ డి.రాజిరెడ్డి తెలిపారు.

కాంగ్రెస్ కార్యకర్తను.. అయినా ఇందిరమ్మ ఇల్లు రాలేదు!

- పెట్రోలు పోసుకుని ఆత్మహత్యాయత్నం



ఆత్మహత్యకు యత్నించిన శ్రీనివాస్,, సృజన దంపతులు

చిగురుమామిడి: కాంగ్రెస్ కార్యకర్తనైనప్పటికీ ఇందిరమ్మ ఇల్లు ఇవ్వలేదంటూ కరీంనగర్ జిల్లా సుందరగిరిలో దంపతులు పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు యత్నించారు. బాధితుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన వంతడ్పుల శ్రీనివాస్, సృజన దంపతులు కరీంనగర్‌లో అద్దెకుంటున్నారు. సుందరగిరిలో వీరికి సొంత ఇల్లు లేదు. ఇందిరమ్మ ఇల్లు కోసం మేలో గ్రామ కమిటీ సభ్యులను శ్రీనివాస్ నిలదీసినా మంజూరు కాలేదు. ఇటీవల మంత్రి పొన్నం ప్రభాకర్ తన కోటా నుంచి సుందరగిరికి మరో 20 ఇళ్లు మంజూరు చేశారు. జాబితాలో శ్రీనివాస్ పేరు లేదు. దీంతో దంపతులు మంగళవారం సుందరగిరిలోని హుస్నాబాద్-కరీంనగర్ ప్రధాన రహదారిపై బైఠాయించారు. శ్రీనివాస్ భార్యపై పెట్రోల్ పోసి.. తన ఒంటిపై, నోట్లో కూడా పోసుకున్నాడు. పోలీసులు వెంటనే వచ్చి వారిని 108లో హుస్నాబాద్ ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

నకిలీ ఫోన్ కాల్స్‌తో జాగ్రత్త

ఏసీబీ డీజీ విజయ్‌కుమార్

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారుల పేరిట కొందరు ప్రైవేటు వ్యక్తులు, ప్రభుత్వ ఉద్యోగులకు ఫోన్ చేసి బెదిరిస్తున్న ఘటనలు తన దృష్టికి వచ్చాయని ఏసీబీ డీజీ విజయ్‌కుమార్ తెలిపారు. ఏసీబీ అధికారుల పేరిట వచ్చే ఫోన్ కాల్ నమ్మి మోసపోవద్దని ఆయన హెచ్చరించారు. ఏసీబీ అధికారులు ఎట్టి పరిస్థితుల్లోనూ అలాంటి ఫోన్ చేయబోరని మంగళవారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. ఇదే తరహాలో జరిగిన ఘటనపై అబిడ్స్ పోలీస్ స్టేషన్‌లో ఒక కేసు నమోదు చేసినట్టు పేర్కొన్నారు. ఫేక్ ఫోన్‌కాల్ వస్తే ఏసీబీ టోల్‌ఫ్రీ నంబర్ 1064లో ఫిర్యాదు చేయాలని సూచించారు.


'భూదాన్'లో జోక్యం చేసుకుంటే ఇంటికే..

- పోలీసులను హెచ్చరించిన హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: రంగారెడ్డి జిల్లా నాగారంలోని భూదాన్ భూముల వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటే సస్పెన్షన్ వేటు తప్పదని పోలీసులను హైకోర్టు హెచ్చరించింది. పిటిషనర్‌ను బెదిరించడం, కేసు ఉపసంహరించుకోవాలని ఒత్తిడి తెచ్చే ప్రయత్నం చేస్తే కఠిన నిర్ణయాలు తప్పవని తేల్చి చెప్పింది. నాగారంలోని భూములను ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు అక్రమంగా తమ పేరిట పట్టా చేయించుకున్నారని, విచారణ కమిషన్ వేయాలని కోరుతూ పిటిషన్ దాఖలు చేసిన పడమటి తండాకు చెందిన రాములును బెదిరించారన్న ఆరోపణలను హైకోర్టు తీవ్రంగా పరిగణించి.. ఆరోపణలు ఎదుర్కొంటున్న మహేశ్వరం ఠాణా కానిస్టేబుల్ వెంకటేశ్‌ను తమ ముందు హాజరుకావాలని ఆదేశించిన విషయం తెలిసిందే. రాములు దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ లక్ష్మణ్ మంగళవారం విచారణ చేపట్టారు. రాములుకు ఫోన్ చేశావా?.. ఎవరు చేయమంటే చేశావ్.. పిటిషన్ ఉపసంహరించుకోవాలని అతన్ని బెదిరించారా? అని కానిస్టేబుల్‌ను న్యాయమూర్తి ప్రశ్నించారు. విలేజీ హిస్టరీ రికార్డు నమోదులో భాగంగా ఫోన్ చేశానని కానిస్టేబుల్ బదులిచ్చారు. పాతిక మంది ఉన్నతాధికారులకు సంబంధించిన అంశం, దేశవ్యాప్తంగా చర్చ సాగుతోందని, ఇందులో పోలీసులు తలదూరిస్తే కఠిన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని హెచ్చరించింది. జోక్యం చేసుకోకుండా ఉత్తర్వులివ్వాలని పిటిషనర్ తరఫు న్యాయవాది విజయలక్ష్మి కోరగా.. అవసరం లేదంటూ న్యాయమూర్తి విచారణను ముగించారు.

యాంత్రికంగా నిర్బంధానికి ఇవ్వొద్దు

మేజిస్ట్రేట్ కోర్టులకు సూచించిన హైకోర్టు



సాక్షి, హైదరాబాద్: క్రిమినల్ కేసుల్లో రిమాండ్‌లను యాంత్రికంగా ఇవ్వొద్దని..న్యాయపరమైన అంశాలను పరిశీలించాలని మేజిస్ట్రేట్ కోర్టులకు హైకోర్టు సూచించింది. అరెస్టు చేసి 24 గంటలు దాటి.. గంట 20 నిమిషాలు ఆలస్యంగా కోర్టులో నిందితుడిని ప్రవేశపెట్టడంపై పోలీసుల తీరును తప్పుబట్టింది. ఎలాంటి కారణాలు లేనిపక్షంలో 24 గంటల్లోపు నిందితుడి కోర్టు ముందు హాజరుపరచాలన్న నిబంధనను పాటించలేదని వ్యాఖ్యానించింది. ఏడేళ్లలోపు శిక్షలు పడే కేసుల్లో బీఎన్‌ఎస్ సెక్షన్ 35 ప్రకారం నోటీసులు ఇవ్వాల్సి ఉన్నా.. పోలీసులు అదీ అమలు చేయలేదని స్పష్టం చేసింది. ఇద్దరి పూచీకత్తు, వ్యక్తిగత బాండ్ ట్రయల్‌కోర్టులో సమర్పించాలని, పిటిషనర్‌ను విడుదల చేయాలని ఆదేశించింది. మలక్‌పేట్ పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసులో తనను జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపడాన్ని సవాల్ చేస్తూ విద్యార్థి సయ్యద్ దస్తగిరి హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ తుకారాంజీ ధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టింది. వాదనలు విన్న న్యాయమూర్తి.. జ్యుడీషియల్ రిమాండ్‌కు మేజిస్ట్రేట్ కోర్టు ఆదేశించిన తీరును కూడా తప్పుబట్టారు. రిమాండ్ డైరీ ప్రకారం.. జూలై 7న 10.15న పిటిషనర్‌ను అరెస్టు చేశారని.. మరుసటి రోజు 11.35కు మేజిస్ట్రేట్ ముందు హాజరుపరిచారన్నారు. అరెస్టు చేసిన సమయం నుంచి 24 గంటలకు మించి ఒక గంట ఇరవై నిమిషాల ఆలస్యంతో పిటిషనర్‌ను హాజరుపరిచారని ఏపీపీ అంగీకరించారని స్పష్టం చేశారు. ఏడేళ్ల లోపు శిక్షలు పడే కేసులో బీఎన్‌ఎస్ సెక్షన్ 35 ప్రకారం నోటీసులివ్వాలని లేదా అరెస్టుకు మేజిస్ట్రేట్ నుంచి వారెంట్ లేదా ముందస్తు అనుమతి అవసరమని చెప్పారు. అది లేకుండా అరెస్టు చేసే అధికారం పోలీసులకు లేదన్నారు. జ్యుడీషియల్ కస్టడీకి ఇచ్చే ముందు న్యాయపరమైన అంశాలను పరిశీలించడంలో మేజిస్ట్రేట్ విఫలమయ్యారని అభిప్రాయపడ్డారు. మేజిస్ట్రేట్‌లు యాంత్రికంగా నిర్బంధానికి అధికారం ఇవ్వకూడదంటూ జ్యుడీషియల్ రిమాండ్ ఉత్తర్వులను కొట్టివేశారు.

అత్తమామలపై కక్ష సాధింపు కేసు చెల్లదు

- తేల్చిచెప్పిన హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: గృహ హింస, వరకట్నం కేసుల్లో ఆరోపణలతో, భర్తపై కక్ష సాధింపుతో అత్తమామలపై పెట్టే కేసు చెల్లదని హైకోర్టు తేల్చిచెప్పింది. ఎలాంటి ఆధారాలు లేకుండా వారిని నిందితుల జాబితాలో చేర్చడాన్ని తప్పుబట్టింది. పిటిషనర్లపై ఎఫ్ఐఆర్‌ను రద్దు చేసింది. తమ కోడలు సెక్షన్ 498-ఏ కేసులో తమను నిందితులుగా చేర్చడాన్ని సవాల్ చేస్తూ.. మహారాష్ట్ర చోర్పుర్జికి చెందిన 74 ఏళ్ల గోవింద్ ప్రసాద్, అతని భార్య ఉషాశర్మ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ జువ్వాడి శ్రీదేవి విచారణ చేపట్టారు. పిటిషనర్ల తరఫున కపీష్‌కుమార్ వాదనలు వినిపించారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. పిటిషనర్లపై ఆరోపణలకు నిర్దిష్ట ఆధారాలు లేవని అభిప్రాయపడ్డారు. పిటిషనర్లకు వ్యతిరేకంగా ఫిర్యాదీ ఎలాంటి వివరాలను సమర్పించలేదని పేర్కొన్నారు. వేధింపులు, క్రూరత్వం, వరకట్నం డిమాండ్‌కు సంబంధించిన ఏదైనా ప్రత్యేక సందర్భాన్ని వివరించలేకపోయారన్నారు. దీంతో పిటిషనర్లపై దాఖలైన ఎఫ్ఐఆర్‌ను రద్దు చేస్తున్నామని ఉత్తర్వులు జారీ చేశారు.

క్లుప్తంగా...

ఈసీ మొదట రద్దు చేయాల్సింది బీఆర్‌ఎస్ పార్టీనే

కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి



సాక్షి, న్యూఢిల్లీ: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేయని పార్టీల గుర్తింపును రద్దు చేయాలని కేటీఆర్ ఈసీని కోరడంపై కాంగ్రెస్ ఎంపీల ఫోరం రాష్ట్ర కన్వీనర్ మల్లు రవి మండిపడ్డారు. కేంద్ర ఎన్నికల సంఘం ఈ అంశంపై చర్యలు తీసుకుంటే.. మొట్ట మొదట రద్దు చేయాల్సింది బీఆర్‌ఎస్ పార్టీ గుర్తింపునే అని పేర్కొన్నారు. హామీలు అమలు చేయని పార్టీల్లో దేశంలోనే బీఆర్‌ఎస్‌ది అగ్రస్థానమని దుయ్యబట్టారు. రైతు రుణ మాఫీ, నీళ్లు, నిధులు, నియామకాలు సహా ఎన్నో హామీలను బీఆర్‌ఎస్ అమలు చేయలేదని ఆరోపించారు. మంగళవారం ఢిల్లీలోని తెలంగాణభవన్‌లో రవి మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తోందన్నారు. రూ.10 లక్షల బీమా, మహిళలకు ఉచిత బస్సు, ఇందిరమ్మ ఇళ్లు, 25 లక్షల మంది రైతులకు రుణమాఫీ చేసిందని గుర్తుచేశారు. మరో మూడేళ్లలో మిగిలిన హామీలతోపాటు మేనిఫెస్టోలో లేని అంశాలను కూడా చేసి చూపిస్తామని రవి తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం గురించి మాట్లాడే నైతిక హక్కు బీఆర్‌ఎస్‌కు ఎక్కడుందని రవి ప్రశ్నించారు.

భుజాలు తడుముకుంటున్న హరీశ్

ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



సాక్షి, హైదరాబాద్: జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదికపై మాజీ మంత్రి హరీశ్‌రావు భుజాలు తడుముకుంటున్నారని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ వ్యాఖ్యానించారు. అది రేవంత్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డిలు ఇచ్చిన రిపోర్టు కాదని, జ్యూడీషియల్ కమిషన్ ఇచ్చిన నివేదికన్న విషయం గ్రహించాలని హితవు పలికారు. ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ.. జస్టిస్ పినాకి చంద్రఘోష్ మచ్చలేని మనిషి అని, ఆయనపై విమర్శలు చేయడం ఆకాశంపై ఉమ్మి వేయడం లాంటిదేనన్నారు. కేసీఆర్, హరీశ్‌రావులతో పాటు అందరి వాదనలు విని, అన్ని పత్రాలు పరిశీలించిన తర్వాతే కమిషన్ సుదీర్ఘ నివేదిక ఇచ్చిందని గుర్తు చేశారు. హరీశ్‌రావు తెలంగాణ భవన్‌లో గొంతు చించుకోవాల్సిన అవసరం లేదన్నారు. అసెంబ్లీలో ఈ కమిషన్ నివేదికపై చర్చ పెడతామని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారని గుర్తు చేశారు. అప్పుడే కేసీఆర్‌ను అసెంబ్లీకి తీసుకొచ్చి మాట్లాడించవచ్చని సూచించారు.

బీఆర్‌ఎస్ వ్యాఖ్యలు హాస్యాస్పదం

ఎమ్మెల్సీ దయాకర్



సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టు నివేదికపై బీఆర్‌ఎస్ నేతలు, హరీశ్‌రావు చేస్తున్న వ్యాఖ్యలు చూస్తుంటే నవ్వొస్తోందని కాంగ్రెస్ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ ఎద్దేవా చేశారు. ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ.. మేడిగడ్డ ఎందుకు కూలిపోయిందో సమాధానం చెప్పకుండా.. కూలిపోయేలా కాళేశ్వరాన్ని కట్టేందుకు అన్ని జాతీయ సంస్థలు అనుమతినిచ్చినట్లు హరీశ్‌రావు మాట్లాడుతున్నారన్నారు. కాళేశ్వరంపై అన్ని ప్రశ్నలకు అసెంబ్లీలో సమాధానం చెప్పాలని హరీశ్‌కు సూచించారు. ఈలోపే ప్రజల ముందు ముద్దాయిలుగా నిలబడాల్సి వస్తుందనే ఆందోళనతో అబద్ధాలు ఆడుతున్నారని విమర్శించారు.

కాంగ్రెస్‌వి జనరహిత పాదయాత్రలు

బీజేపీ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ



సాక్షి, హైదరాబాద్: 'కాంగ్రెస్ పార్టీవి జనరహిత పాదయాత్రలు... జనాలను దగా చేసే యాత్రలు' అని బీజేపీ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణగుప్తా ఎద్దేవా చేశారు. రాష్ట్ర ప్రజలను మరోసారి మోసం చేయాలనే యోచనతోనే కాంగ్రెస్ పార్టీ యాత్ర చేపట్టిందన్నారు. గ్రామాల్లో కాంగ్రెస్‌ను ఎవరు నమ్మే పరిస్థితి లేక యాత్రకు డబ్బులిచ్చి జనసమీకరణ చేస్తూ యాత్రను అపహాస్యం చేశారని చెప్పారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ...తెలంగాణ ప్రజలకు ఏం ఒరగబెట్టారని కాంగ్రెస్ పాదయాత్ర చేస్తుందో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. గత 20 నెలలుగా ప్రభుత్వం చేసిన అభివృద్ధిపై చర్చించడానికి కాంగ్రెస్ నాయకులకు దమ్ము ఉంటే చర్చకు రావాలని సవాల్ విసిరారు. కాంగ్రెస్ సర్కార్‌కు బీసీలపై నిజంగా ప్రేమ ఉంటే కామారెడ్డి బీసీ డిక్లరేషన్ ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు.

శిబు సోరెన్ అంత్యక్రియలకు బీఆర్‌ఎస్ నేతలు

సాక్షి, హైదరాబాద్: బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ ఆదేశాల మేరకు జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి శిబు సోరెన్ అంత్యక్రియల్లో మాజీ మంత్రి ప్రశాంత్‌రెడ్డి, ఎమ్మెల్యే కోవ లక్ష్మి పాల్గొన్నారు. శిబుసోరెన్ కుమారుడు ప్రస్తుత సీఎం హేమంత్ సోరెన్‌ను కలిసి బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ తరపున సంతాపం తెలిపారు. అనంతరం శిబుసోరెన్ పార్థివ దేహానికి నివాళి అర్పించారు.

ఏకపక్షం కాదు

▶ మొదటి పేజీ తరువాయి

పూర్తి వివరాలు ఆయన మాటల్లోనే..

కుట్ర పూరిత విచారణ!

కాళేశ్వరం ప్రాజెక్టులో ఎలాంటి రహస్యాలూ లేవు. అన్ని అంశాలు డీపీఆర్‌లో ఉన్నాయి. మేడిగడ్డ నుంచి మిడ్‌మానేరుకు నేరుగా తరలించలేమని నిపుణులు చెప్పారు. పీసీ ఘోష్ కమిషన్ విచారణ కుట్రపూరితంగా జరిగినట్లు కనిపిస్తోంది. కమిషన్ ఎదుట విచారణకు రావాలని మాకు నోటీసులు రాకముందే మీడియాలో లీకులు ఇచ్చారు. సంక్షిప్త నివేదిక పేరిట అవాస్తవాలు, రాజకీయ కక్ష సాధింపులతో 60 పేజీలు వండి వార్చారు. నచ్చిన పేరాల లీకులు, నచ్చని నాయకులు బాధ్యులు అన్నట్లుగా నివేదిక తీరు ఉంది. ఒక వైపే చూసి, విని, నిలబడి ఇచ్చిన నిరాధార నివేదిక ఇది. అసెంబ్లీలో 665 పేజీల పూర్తి నివేదికను పెడితే వాస్తవాలను నిగ్గు తేల్చేలా నిలదీసి చీల్చి చెండాడతాం.

అనుమతుల్లేని 'కొడంగల్'కు ఎలా శంకుస్థాపన చేస్తారు?

కాళేశ్వరం ప్రాజెక్టుకు అనుమతులు ఇచ్చిన కేంద్ర ప్రభుత్వ సంస్థలను కూడా ఈ నివేదిక తప్పు పట్టింది. 11 కేంద్ర ప్రభుత్వ ఏజెన్సీలు ప్రాజెక్టును ఆమోదించాయి. ప్రాణహితకు జాతీయ హోదా ఇవ్వాలని కేసీఆర్ గతంలో ప్రధానికి లేఖ రాశారు. ఏ అనుమతులు లేని కొడంగల్ ఎత్తిపోతల పథకానికి రేవంత్ ఎలా శంకుస్థాపన చేశారు? దీనిపై కూడా అసెంబ్లీలో దుమ్ము దులిపి అన్ని ఆధారాలు బయట పెడతాం. కానీ మైక్ కట్ చేయకుండా, సభను వాయిదా వేసుకోకుండా వాస్తవాలు చెప్పే అవకాశం మాకు ఇవ్వాలి. గతంలో దేశంలో వేసిన అనేక కమిషన్ల తరహాలోనే ఈ కమిషన్ నివేదిక కూడా న్యాయస్థానం ముందు నిలవదు.

ప్రాజెక్టును పూర్తి చేసేందుకే మేడిగడ్డకు మార్పు

తుమ్మిడిహెట్టి వద్ద ఏ ప్రాతిపదికన గతంలో బరాజ్‌ను ప్రతిపాదించారో కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పాలి. అక్కడ నీటి లభ్యత లేదని సీడబ్ల్యూసీనే చెప్పింది. అందుకే మేడిగడ్డకు మార్చాం. ప్రతిపాదిత 165 టీఎంసీల్లో ఎగువ రాష్ట్రాల వాటా ఉంది. దాన్ని కాంగ్రెస్ దాచిపెట్టింది. ప్రాణహిత-చేవెళ్లకు హైడ్రాలజీ అనుమతి ఇచ్చినట్లు కాంగ్రెస్ చెప్తోంది. కానీ 152 మీ. ఎత్తులో బరాజ్ నిర్మించవద్దని మహారాష్ట్ర స్పష్టంగా చెప్పింది. ఈ నేపథ్యంలో ప్రాజెక్టు పూర్తి కావాలన్న ఉద్దేశంతోనే తుమ్మిడిహెట్టి నుంచి మార్చాం. తుమ్మిడిహెట్టి వద్ద 152 మీటర్ల ఎత్తున నిర్మించేందుకు ఒప్పందం చేసుకున్నట్లు నిరూపిస్తే సీఎం పదవికి రాజీనామా చేస్తానని కేసీఆర్ సవాలు చేసినా నాటి టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్ కుమార్‌రెడ్డి స్పందించ లేదు.



తెలంగాణభవన్‌లో కాళేశ్వరం ప్రాజెక్టుపై ప్రజెంటేషన్‌కు హాజరైన బీఆర్‌ఎస్ నేతలు

అధికారంలోకి రాగానే మరమ్మతులు చేస్తాం

కాళేశ్వరం ప్రాజెక్టు పూర్తి స్థాయిలో బాగుంది. ప్రాజెక్టు ద్వారా రెండు పంటలు పండాయి. సుందిళ్ల, అన్నారం బరాజ్‌లు సురక్షితంగా ఉన్నాయని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అసెంబ్లీ వేదికగా చెప్పాడు. మేడిగడ్డలో రెండు పియర్లు కుంగితే కాళేశ్వరం కూలిందని తప్పుడు ప్రచారం చేశారు. బీఆర్‌ఎస్ తిరిగి అధికారంలోకి వచ్చిన తర్వాత కుంగిన రెండు పియర్లను బాగు చేసి కాళేశ్వరం ప్రాజెక్టును తెలంగాణకు వరప్రదాయని అని నిరూపిస్తాం.

అప్పట్లో ఖర్చు చేసింది రూ.3,700 కోట్లే..

గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం రూ.11 వేల కోట్లతో 32 శాతం ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు పనులు పూర్తి చేసినట్లు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చెప్పాడు. కానీ ఈ ప్రాజెక్టు కోసం నాటి కాంగ్రెస్ ప్రభుత్వం ఖర్చు చేసిన మొత్తం రూ.3700 కోట్లే. అందులోనూ మొబిలైజేషన్ అడ్వాన్సుల పేరిట రూ.2 వేల కోట్లు ఖర్చు చేశారు. కేసీఆర్ వందేళ్ల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం చేశారు. నారాయణపేట- కొడంగల్ ఎత్తిపోతల పథకానికి ఏ అనుమతి ఉందని రేవంత్‌రెడ్డి కొబ్బరికాయ కొట్టిండు. డీపీఆర్ లేకుండానే రేవంత్‌రెడ్డి పనులు ప్రారంభించాడు. ఎలాంటి అనుమతులు లేకుండానే బిల్లులు కూడా చెల్లించారు. దీనికి ఒక్క అనుమతైనా ఉంటే ఉత్తమ్ చూపించాలి. కాళేశ్వరం కూలిందని ప్రచారం చేస్తున్న రేవంత్ గందమల్ల రిజర్వాయర్‌కు కొబ్బరికాయ కొట్టి, మల్లన్నసాగర్ నుంచి మూసీకి నీళ్లు తెస్తానని టెండర్లు పిలుస్తున్నాడు. కాళేశ్వరం తెలంగాణ వరప్రదాయని. ప్రజల గుండెల్లో కేసీఆర్ దేవుడిలా నిలుస్తారు.

హరీశ్ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్.. కొన్ని ముఖ్యాంశాలు

- ప్రాణహిత-చేవెళ్లకు హైడ్రాలజీ క్లియరెన్స్ ఉందని కేంద్ర మంత్రి ఉమాభారతి లేఖ రాసినట్లు కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పడం సరికాదు. ప్రాణహిత చేవెళ్లకు కాంగ్రెస్ ఒక్క అనుమతి తేలేదు. తుమ్మిడిహెట్టి వద్ద 160 టీఎంసీల నీటి లభ్యత లేదని చెప్పిన విషయాన్ని కమిషన్ గుర్తించలేదా? లేక ప్రభుత్వం దాచిపెట్టిందా?
- మేడిగడ్డ వద్ద నీటి లభ్యత ఉందని సమర్పించిన కాళేశ్వరం డీపీఆర్‌ను సీడబ్ల్యూసీ ఆమోదించింది.
- మేడిగడ్డ బరాజ్ నిర్మాణాన్ని రిటైర్డు ఇంజనీర్లు వ్యతిరేకించలేదు. మేడిగడ్డ నుంచి మిడ్ మానేరుకు నేరుగా తరలించడం సాధ్యం కాదని చెప్పారు. నదీ మార్గం ద్వారా మేడిగడ్డ నుంచి అన్నారం, సుందిళ్ల ద్వారా ఎల్లంపల్లికి నీరు తరలించాలని సూచించారు. విచారణ కమిషన్ ఎదుట రిటైర్డు ఇంజనీర్లు ఈ మేరకు అఫిడవిట్ కూడా ఇచ్చారు.
- వాప్కోస్, లైడార్ సర్వే నివేదిక మేరకే మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల ఎంపిక జరిగిందని రిటైర్డు ఇంజనీర్లు కమిషన్‌కు చెప్పారు.
- 2018 మే 27, 2021 ఆగస్టు 1న మేడిగడ్డ బరాజ్ నిర్మాణానికి కేబినెట్ ఆమోదం తెలిపింది.
- 2016 మార్చి 10న గవర్నర్ ప్రసంగం, 2016 ఏప్రిల్ 16న ఆర్థిక మంత్రి బడ్జెట్ ప్రసంగం కేబినెట్, గవర్నర్, అసెంబ్లీ ఆమోదానికి నిదర్శనం.

రాజకీయ కుట్రతోనే ఎన్‌డీఎస్‌ఏ నివేదిక

గోదావరి నదిపై పోలవరం ప్రాజెక్టు మూడుసార్లు కుప్పకూలినా స్పందించని ఎన్‌డీఎస్‌ఏ మేడిగడ్డ బరాజ్‌లో చిన్న ఘటన జరగ్గానే వచ్చింది. రాజకీయ కుట్రతోనే నివేదిక ఇచ్చింది. మేడిగడ్డలో రెండు పిల్లర్లు కూలితే కేసీఆర్‌ను బాధ్యులుగా చేస్తున్న వారు పోలవరం కట్టిన ఎన్‌డీఎస్‌ఏ చైర్మన్ చంద్రశేఖర్ అయ్యర్‌పై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదు? పోలవరం కట్టిన ప్రధాని మోదీపై చర్య తీసుకుంటారా? శ్రీశైలం ఎడమగట్టు కాలువ సొరంగం కూలిన ఘటనకు సీఎం రేవంత్, మంత్రిఉత్తమ్ బాధ్యత వహించాలి.

రాజకీయం.. రసవత్తరం!

కాళేశ్వరం ప్రాజెక్టుపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదికతో రాష్ట్రంలో ప్రకంపనలు

- చేతికి మట్టి అంటకుండా ముందుకెళ్లేలా పావులు కదుపుతున్న అధికార కాంగ్రెస్
- అందులో భాగంగానే అసెంబ్లీకి రిపోర్టు.. అనివార్యంగా కేసీఆర్‌ను అసెంబ్లీకి రప్పించే వ్యూహం
- నివేదికలోని లోపాలను ఎత్తిచూపుతూ హరీశ్ పవర్ పాయింట్ ప్రజంటేషన్
- తమ వాదన క్షేత్రస్థాయికి తీసుకెళ్లేందుకు జిల్లాల్లో ప్రత్యక్ష ప్రసారం ద్వారా వివరణ
- నివేదికను సమర్థించాలో, వ్యతిరేకించాలో అర్థం కాని పరిస్థితుల్లో బీజేపీ

సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవకతవకలపై ఏకసభ్య కమిషన్ ప్రభుత్వానికి ఇచ్చిన సుదీర్ఘ నివేదిక రాష్ట్ర రాజకీయాలను రసవత్తరంగా మార్చేసింది. మూడు ప్రధాన పార్టీలూ.. నివేదికను, అనంతర పరిణామాలను రాజకీయంగా తమకు ఎలా అనుకూలంగా మలుచుకోవాలా అన్న దానిపై దృష్టి సారించాయి. ఈ రిపోర్టు ఆధారంగా బీఆర్‌ఎస్‌ను ప్రజాక్షేత్రంలో దోషిగా నిలబెట్టాలని అధికార కాంగ్రెస్ పార్టీ తహతహలాడుతుండగా, అందులోని లోపాలను ఎత్తిచూపుతూ కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో ఎలాంటి అక్రమాలు జరగలేదని ప్రజలకు వివరించేందుకు బీఆర్‌ఎస్ ప్రయత్నిస్తోంది. మరో ప్రధాన రాజకీయ పక్షం బీజేపీ ఈ నివేదికపై ఎలాంటి వైఖరి తీసుకోవాలన్న దానిపై మల్లగుల్లాలు పడుతోంది.

అధికార కాంగ్రెస్ ద్విముఖ వ్యూహం

కాళేశ్వరం నివేదిక విషయంలో తమ చేతికి మట్టి అంటకుండా ఉండాలనే వ్యూహంతోనే అధికార కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ పాచిక విసిరిందనే చర్చ రాజకీయ వర్గాల్లో జరుగుతోంది. ఈ నివేదికను అసెంబ్లీ ముందు పెట్టడం ద్వారా ద్విముఖ వ్యూహాన్ని ప్రభుత్వం అమలు చేస్తోంది. అసెంబ్లీ వేదికగా అన్ని పార్టీలతో మాట్లాడించి.. నివేదికకు అసెంబ్లీ ఆమోదం ఇప్పించి.. అక్కడే కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతిపై దర్యాప్తునకు ఆదేశించడం ఈ వ్యూహంలో ప్రధాన భాగం అయితే, మరో ఎత్తుగడ కూడా ఉందని ఆ పార్టీ వర్గాలే అంటున్నాయి. ప్రతిపక్ష నాయకుడిగా అసెంబ్లీకి రాని కేసీఆర్‌ను అక్కడకు రప్పించే వ్యూహం కూడా ఇందులో ఉందనే చర్చ జరుగుతోంది. ఈ నివేదిక ద్వారా అసెంబ్లీలో జరిగే చర్చలో పాల్గొని తన వాదనను వినిపించాల్సిన అనివార్యతను కేసీఆర్‌కు కల్పించామని, ఆయన వచ్చి మాట్లాడే ప్రయత్నం చేస్తే ఆయన చేసిన తప్పులను అక్కడే ఎండగడతామని ఆ పార్టీ నేతలు చెపుతున్నారు. ఒకవేళ కేసీఆర్ అసెంబ్లీకి రాకపోతే కాళేశ్వరంలో అక్రమాలు జరిగాయనే సంకేతాలు ప్రజల్లోకి వెళ్తాయని వారంటున్నారు.

దూకుడుగానే బీఆర్‌ఎస్

నివేదిక విషయంలో బీఆర్‌ఎస్ కూడా దూకుడుగానే వ్యవహరించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇప్పటికే జస్టిస్ ఘోష్ నివేదికను ఆ పార్టీ నేతలు చాలామంది ఖండించగా, మాజీ మంత్రి హరీశ్‌రావు ఓ అడుగు ముందుకేసి పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా నివేదికలోని లోపాలను ఎత్తిచూసే ప్రయత్నాలు చేశారు. అంతేకాకుండా తమ వాదనను ప్రజల్లోకి తీసుకెళ్లేలా వ్యూహం రచించారు. అన్ని జిల్లాల్లోనూ స్క్రీన్‌లు పెట్టి పార్టీ నాయకులకు ప్రజెంటేషన్‌ను చూపించారు.



ప్రజాక్షేత్రంలోకి దూకుడుగా వెళ్లాలనే ఆలోచనలో గులాబీ పార్టీ ఉన్నప్పటికీ.. భవిష్యత్ పరిణామాలపై కూడా బీఆర్‌ఎస్ దృష్టి పెట్టింది. ముఖ్యంగా పార్టీ అధినేత కేసీఆర్ లక్ష్యంగా కాంగ్రెస్ వ్యవహరిస్తున్న తీరును ఆ పార్టీ నేతలు నిశితంగా గమనిస్తున్నారు. ఇప్పటికే కమిషన్ విచారణ పేరుతో పిలిపించడంతో పాటు నివేదిక ప్రజల్లో పెట్టి ఆయన ఇమేజ్‌ను దెబ్బతీసే ప్రయత్నాలు చేయగా.. అసెంబ్లీ వేదికగా మరో విచారణ ప్రకటించి మానసికంగా పార్టీ నేతలను ఇబ్బంది పెట్టవచ్చనే అభిప్రాయం పార్టీ నేతల్లో వ్యక్తం అవుతోంది. ఏదిఏమైనా ఘోష్ నివేదిక ఆధారాల్లేనిదని, బీఆర్‌ఎస్‌ను బద్‌నాం చేయడమే లక్ష్యంగా ఇచ్చిందనే విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడమే తమ ముందున్న తక్షణ కర్తవ్యమని గులాబీ నేతలంటున్నారు.

బీజేపీ అటా..ఇటా?

జస్టిస్ ఘోష్ నివేదిక కమలం పార్టీకి గొంతులో వెలక్కాయ పడినంత పని చేసిందని రాజకీయ వర్గాలంటున్నాయి. కాళేశ్వరం నిర్మాణంలో పెద్ద ఎత్తున అవినీతి జరిగిందని, కేసీఆర్ కుటుంబం ఈ ప్రాజెక్టుతో అయాచిత లబ్ధి పొందిందని మొదటి నుంచి ఆరోపిస్తున్న బీజేపీ.. ఇప్పుడు ఘోష్ నివేదికను సమర్థించాలో, వ్యతిరేకించాలో అర్థం కాని పరిస్థితుల్లోకి వెళ్లిపోయింది. ఈ నివేదికను బీజేపీ సమర్థించకపోతే.. బీజేపీ, బీఆర్‌ఎస్‌లు ఒక్కటేనని, అందుకే ఇన్నాళ్లు ఆరోపణలు చేసినా ఇప్పుడు మౌనంగా ఉందని కాంగ్రెస్ ఆరోపించే అవకాశాలున్నాయి. ఒకవేళ నివేదికతో ఏకీభవిస్తే.. ఆ నివేదిక తప్పుపట్టినట్టుగా తమ పార్టీకి చెందిన ఎంపీ ఈటల రాజేందర్ కూడా తప్పు చేశారని అంగీకరించాల్సిన పరిస్థితి. ఈ నేపథ్యంలో ఏం చేయాలన్న దానిపై కమలనాథులు మల్లగుల్లాలు పడుతున్నారు.

కింకర్తవ్యంపై ప్రభుత్వం మల్లగుల్లాలు

ప్రస్తుత పరిస్థితుల్లో కింకర్తవ్యం ఏమిటనే దానిపై రాష్ట్ర ప్రభుత్వం మల్లగుల్లాలు పడుతోంది. ఇప్పటికే ఫార్ములా ఈ-రేసు, ఫోన్‌ట్యాపింగ్ కేసుల్లో ఎటూ తేల్చకుండా నాన్చుడు ధోరణిలో కాంగ్రెస్ ప్రభుత్వం వెళుతుందనే అభిప్రాయం ప్రజల్లో ఉంది. ఇప్పుడు కాళేశ్వరం విషయంలోనూ అదే జరిగితే బీఆర్‌ఎస్ హయాంలో అక్రమాలు జరిగాయన్న కాంగ్రెస్ ఆరోపణల్లో వాస్తవం లేదని ప్రజలు భావించవచ్చనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అందువల్ల అసెంబ్లీ వేదికగా ప్రకటించే విచారణను త్వరగా పూర్తి చేసి కాళేశ్వరం అక్రమాల బాధ్యులపైనైనా చట్టపరంగా చర్యలు తీసుకుంటేనే ప్రజల్లో పార్టీపై నమ్మకం కలుగుతుందని అంటున్నారు. మరోవైపు అప్పట్లో ఆర్థిక శాఖ కార్యదర్శిగా పనిచేసిన అధికారిని కూడా కమిషన్ తప్పుపట్టింది. ఈ నేపథ్యంలో ఆయన పట్ల రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి వైఖరి అవలంబిస్తుందనేది కూడా ప్రభుత్వ వర్గాల్లో చర్చనీయాంశమవుతోంది.

న్యాయ వ్యవస్థనే అవమానిస్తారా?

▶ మొదటి పేజీ తరువాయి

ఉత్తమ్‌కుమార్ రెడ్డి రాసిన రిపోర్టు కాదనే విషయాన్ని హరీశ్‌రావు మరిచిపోయినట్లున్నారు.

ఇంకెన్ని సార్లు మోసం చేస్తారు..

కాళేశ్వరం ప్రాజెక్టు ఆలోచన మొదలైనప్పటి నుంచి డిజైన్లు, నిర్మాణంలో లోపాలు, మేడిగడ్డ బరాజ్ కుంగుబాటు వరకు అవకతవకలన్నింటిపై కమిషన్ సమగ్రంగా విచారణ జరిపింది. ఎవరెవరు తప్పులు చేశారో.. ఎవరెవరు అందుకు బాధ్యులనే వివరాలను నివేదికలో వెల్లడించింది. మేమేం తప్పు చేయలేదంటూ మీ పార్టీ ఆఫీసులో తప్పులు మాట్లాడి తెలంగాణ ప్రజలను ఇంకెన్ని సార్లు మోసం చేస్తారు? ఇప్పుడు పార్టీ ఆఫీసులో పెడబొబ్బలు పెడుతున్న హరీశ్‌రావు.. ఆరోజు కమిషన్ ముందు ఎందుకు ఈ వివరాలు చెప్పుకోలేదు?..' అని ఉత్తమ్ నిలదీశారు.

ప్రభుత్వం చర్యలపై భయం పట్టుకుంది..

'హరీశ్ అబద్ధపు సాక్ష్యాలు, బుకాయింపులన్నీ.. న్యాయ వ్యవస్థ ముందు అబద్ధాలుగా తేలిపోయాయి. ఆయన చేసిన తప్పులన్నీ బయట పడ్డాయి. కేసీఆర్ పాత్ర ఏమిటో, హరీశ్‌రావు చేసిన ఘనకార్యాలేమిటో కమిషన్ విచారణలో తేలిపోయాయి. దాంతో ఇప్పుడు ప్రభుత్వం ఈ నివేదికపై ఎలాంటి చర్యలు తీసుకుంటుందనే భయం వాళ్లను వెంటాడుతోంది. అందుకే కమిషన్‌ను తప్పుబట్టే దుర్మార్గానికి ఒడిగట్టారు.

అసెంబ్లీలో చర్చించేందుకు సిద్ధం

ప్రజాస్వామ్య వ్యవస్థలు, న్యాయ వ్యవస్థలు, చట్టసభలపై మా ప్రభుత్వానికి గౌరవముంది. అందుకే అసెంబ్లీలో ఈ నివేదికపై చర్చించేందుకు సిద్ధంగా ఉంది. కాళేశ్వరంలో దోషులుగా తేలిన బాధ్యులు.. అసెంబ్లీకి వచ్చి చర్చలో పాల్గొనాలని కూడా ప్రభుత్వం ఆహ్వానించింది. ఫార్మ్ హౌస్‌లో మామ డైరెక్షన్, పార్టీ ఆఫీస్‌లో అల్లుడి యాక్టింగ్ ఇకనైనా ఆపాలి. ఇప్పటికైనా అసెంబ్లీకి వచ్చి చేసిన తప్పులు ఒప్పుకుని 4 కోట్ల తెలంగాణ ప్రజలకు క్షమాపణలు చెప్పుకోవాలి. మీరు వేలకోట్ల అవినీతి చేస్తే ఒప్పు.. మేం విచారణ చేసి నిజాలు నిగ్గుతేలిస్తే అది రాజకీయ కక్షసాధింపా?..'అని మంత్రి ప్రశ్నించారు.

బీఆర్‌ఎస్ నేతలకు మాట్లాడే హక్కే లేదు..

'కమీషన్ల కక్కుర్తితో ప్రజలను, రైతులను పదేళ్ల పాటు మోసం చేశారు, ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టుకు హైడ్రాలజీ అనుమతులు ఇస్తే దాచిపెట్టారు. నిపుణుల కమిటీ మేడిగడ్డ వద్ద బరాజ్‌ల నిర్మాణం వద్దని చెపితే తొక్కిపెట్టారు. బరాజ్‌లు ఎక్కడ కట్టాలో మీరే నిర్ణయించుకున్నారు. కుంగి పోయే ప్రాజెక్టు కట్టినందుకు సిగ్గుపడాల్సింది పోయి హరీశ్‌రావు కొత్త రికార్డు సృష్టించారు. జనం చెవిలో పువ్వులు పెట్టే ప్రయత్నం చేశారు. ఒక్క మాట కూడా నిజం చెప్పకుండా మరోసారి డూప్ ప్రజెంటేషన్ ఇచ్చారు. నారాయణపేట కొడంగల్ ప్రాజెక్టుకు ఉమ్మడి రాష్ట్రంలోనే జీవో ఇచ్చారు. మా ప్రభుత్వం ఒక్క రూపాయి బిల్లు కూడా ఇప్పటివరకు ఆ ప్రాజెక్టు కాంట్రాక్టర్లకు ఇవ్వలేదు. కేబినెట్ ఆమోదం లేకుండానే మామా అల్లుళ్లు సంతకాలు చేసుకుని కాళేశ్వరం ప్రాజెక్టు కట్టి.. తెలంగాణ ప్రజలను దగా చేశారు. తెలంగాణ ప్రయోజనాలను పాతరపెట్టి, ఆర్థికంగా లక్ష కోట్ల దుర్మార్గానికి ఒడిగట్టిన బీఆర్‌ఎస్ నేతలకు నైతికంగా మాట్లాడే హక్కే లేదు..' అని ఉత్తమ్ విమర్శించారు.

మేడిగడ్డను పరిశీలించిన శాస్త్రవేత్తలు



మేడిగడ్డ బరాజ్ వద్ద సీడబ్ల్యూపీఆర్‌ఎస్ బృందం సభ్యులు

కాళేశ్వరం: కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ బరాజ్‌ని పుణేకు చెందిన సీడబ్ల్యూపీఆర్‌ఎస్ హైడ్రాలాజికల్ సైంటిస్టుల బృందం సభ్యులు.. ఎన్‌డీఎస్‌ఏ సూచనల మేరకు పరిశీలించారు. సైంటిస్టులు ప్రసాద్ కుంజీర్‌జీ, హర్షచౌదరిజీల ఆధ్వర్యంలో బృంద సభ్యులు మంగళవారం పరిశీలించి ఇరిగేషన్ ఈఈ తిరుపతిరావుతో మాట్లాడారు. మేడిగడ్డ బరాజ్‌లో పిల్లర్ కుంగిపోవడం తెలిసిందే. ఆ నేపథ్యంలో పలు పరీక్షలు చేయాల్సి ఉంది. బరాజ్‌లోని కంట్రోల్‌రూమ్‌ను కూడా పరిశీలించారు. కుంగిపోయిన పియర్లను పరిశీలించారు. వరద తగ్గుముఖం పట్టిన తరువాత పరీక్షలు చేపట్టనున్నారని తెలిసింది. బృందం వెంట డీఈ సురేశ్ తదితరులు ఉన్నారు.

అంతా ట్రాష్.. గ్యాస్!

కాళేశ్వరంపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదికపై కేటీఆర్

- 655 పేజీల నివేదికను 60 పేజీలకు కుదించినప్పుడే బాగోతం అర్థమైంది
- దమ్ముంటే 655 పేజీల నివేదిక బయట పెట్టాలని సవాల్
- ఢిల్లీలో కేంద్ర ఎన్నికల సంఘంతో బీఆర్‌ఎస్ బృందం భేటీ
- బ్యాలెట్ పేపర్ విధానంలోనే ఎన్నికలు జరపాలని విజ్ఞప్తి



ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతున్న కేటీఆర్. చిత్రంలో కవిత, వద్దిరాజు రవిచంద్ర, వినోద్‌కుమార్, బాల్క సుమన్, సురేశ్‌రెడ్డి

సాక్షి, న్యూఢిల్లీ: కాళేశ్వరంపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదిక అంతా ట్రాష్, గ్యాస్ అని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీమంత్రి కె.తారక రామారావు కొట్టిపారేశారు. 655 పేజీల నివేదికను కేవలం 60 పేజీలకు కుదించినప్పుడే వారి బాగోతం అర్థమైందని ధ్వజమెత్తారు. సాయంత్రం రిపోర్టు ఇస్తే అర్ధరాత్రి ఆస్థాన మీడియాకు లీకులు ఇచ్చారని..రెండు పత్రికలు ఈయన పాపాల భైరవుడు, ఆయన పాపాల భైరవుడు అంటూ అడ్డమైన రోత వార్తలు రాశాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. దమ్ముంటే 655 పేజీల నివేదిక బయట పెట్టాలని సవాల్ విసిరారు. త్వరలో జరగబోయే అసెంబ్లీ సమావేశాల్లో బీఆర్‌ఎస్ మైక్ కట్ చేయకూడదని, ఆ నివేదికపై కాంగ్రెస్‌ను చీల్చి చెండాడతామని అన్నారు. మంగళవారం ఢిల్లీలోని కేంద్ర ఎన్నికల సంఘం కార్యాలయంలో ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్, కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషీలతో కేటీఆర్, పార్టీ ప్రధాన కార్యదర్శి వినోద్‌కుమార్, రాజ్యసభ ఎంపీలు వద్దిరాజు రవిచంద్ర, కేఆర్ సురేశ్‌రెడ్డి, మాజీ ఎంపీ బాల్క సుమన్ భేటీ అయ్యారు. ఈసీ పిలుపు నేపథ్యంలో ఢిల్లీ వచ్చిన బీఆర్‌ఎస్ బృందం..ఎన్నికల నియమావళిపై సుమారు గంట పాటు చర్చలు జరిపింది. అనంతరం పార్టీ నేతలతో కలిసి కేటీఆర్ విలేకరులతో మాట్లాడారు.

బ్యాలెట్ పేపర్ విధానంలో ఎన్నికలు జరగాలి

'ఇకపై దేశంలో బ్యాలెట్ పేపర్ విధానంలోనే ఎన్నికలు జరగాలి. ఈవీఎంలపై దేశ ప్రజల్లో అనేక అనుమానాలు ఉన్నాయి. వాటిపై ప్రజలు విశ్వసనీయతను కోల్పోతున్న నేపథ్యంలో బ్యాలెట్ విధానం వైపే మొగ్గు చూపాల్సిన అవసరం ఉందని కేంద్ర ఎన్నికల సంఘానికి చెప్పాం. నవంబర్‌లో బిహార్‌లో జరిగే ఎన్నికలతోనే ఇది ప్రారంభం కావాలని ఈసీకి స్పష్టం చేశాం. ఆ తర్వాత వచ్చే సాధారణ ఎన్నికలు అన్నీ కూడా ఈవీఎంలతో కాకుండా పేపర్ బ్యాలెట్ విధానంలోనే జరగాలని చెప్పాం. అమెరికా, యూకే, జర్మనీ, ఇటలీ తదితర దేశాలు కూడా ఈవీఎంలను రద్దు చేసి బ్యాలెట్ విధానాన్నే అమలు చేస్తున్నాయి. ప్రజాస్వామ్య దేశమైన భారత్‌లో దాదాపు 100 కోట్ల మంది ఓటర్లు ఉన్నారు. నేను వేసిన వారికి ఓటు పడటం లేదు అనే అభిప్రాయం ఓటర్లలో ఉంటే.. ప్రజాస్వామ్యానికి చోటు లేనట్లే. కాబట్టి ఈవీఎంలను పక్కనపెట్టి, పేపర్ బ్యాలెట్‌లను తేవాలి. ఓటర్ల జాబితాకు సంబంధించి ప్రస్తుతం బిహార్‌లో జరిగిన లోపాలను అరికట్టకపోతే రేపు తెలంగాణలో కూడా జరగొచ్చు. ఇది బిహార్‌లో ఉన్న రాజకీయ పార్టీల సమస్య కాదు.. దేశంలో ఉన్న అన్ని పార్టీల సమస్య అని ఈసీకి చెప్పాం..' అని కేటీఆర్ తెలిపారు.

కాంగ్రెస్ అరచేతిలో వైకుంఠం చూపించింది

'ఎన్నికల్లో పార్టీలు ఇచ్చే అడ్డగోలు వాగ్దానాలు, హామీలను కేంద్ర ఎన్నికల సంఘం వద్ద ప్రస్తావించాం. వంద రోజుల్లో అమలు చేస్తామని ఏకంగా 420 హామీలు ఇచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీది. వాగ్దానాల గ్యారంటీ కార్డులను ముద్రించి, స్టాంప్ పేపర్లపై అఫడవిట్‌లను తయారు చేసి మరీ ఇచ్చారు. కొందరు గుడిలో దేవుడి దగ్గర కూడా బాండ్ పేపర్లను ఉంచి ప్రజలను మోసం చేశారు. ఇలా ప్రజలకు కాంగ్రెస్ పార్టీ అరచేతిలో వైకుంఠం చూపించింది. ఎన్నికల మేనిఫె స్టోకు రాజకీయ పార్టీలు కట్టుబడి ఉండకపోతే వారిని శిక్షించాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉందని చెప్పాం. ఎన్ని కల్లో ప్రజల్ని వంచించి, అధికారంలోకి వచ్చిన తర్వాత మో సానికి పాల్పడితే.. వారి సభ్యత్వం రద్దు చేయాలని, వారు ఎన్నికల్లో పోటీ చేయకుండా అనర్హత వేటు వేయాలని ఎన్నికల సంఘాన్ని కోరాం..' అని మాజీమంత్రి వివరించారు.

సంస్కరణలు రావాలి

'ఎన్నికల విధానంలో సంస్కరణలు రావాల్సిన అవసరం ఉందని, ఎన్నికల నియమావళి సవరణ పారదర్శకంగా చేయాల్సిన అవసరం ఉందని ఈసీకి చెప్పాం. ఎన్నికల ఖర్చు, ప్రలోభాలు, హామీలు ఇచ్చి అమలు చేయకపోవడం వంటి విషయాల్లో సంస్కరణలు రావాలని కోరాం. కారు గుర్తు అంశంపై బీఆర్‌ఎస్ 20 ఏళ్లుగా పోరాటం చేస్తోంది. కారు గుర్తును పోలిన సింబల్స్ దాదాపు 9 వరకు ఉన్నాయి..' అని కేటీఆర్ పేర్కొన్నారు.

విద్య, ఉద్యోగాల్లో 42% రిజర్వేషన్లు ఇవ్వాలి

'కాంగ్రెస్ పార్టీ బీసీలను మోసం, దగా చేస్తోంది. సీఎం 42% రిజర్వేషన్లు అని ఢిల్లీ వచ్చి డ్రామాలు ఆడుతున్నారు. ఎంబీసీ మంత్రిత్వ శాఖ ఏమైంది? బీసీ సబ్‌ప్లాన్ ఎందుకు పెట్టలేదు? రాజకీయాల్లో 42% వాటా వస్తే రాజకీయ నేతలకు లాభం చేకూరుతుంది. బీసీ జాతికి లాభం చేయాలంటే.. విద్య, ఉపాధి, కాంట్రాక్టుల్లో 42% చేయూతను ఇవ్వాల్సిందే. ఢిల్లీ వచ్చి డ్రామాలు చేసి, ఎవరో అడ్డుపడుతున్నారంటూ ఊహాజనితమైన శత్రువులను చూపి తప్పించుకుంటే కుదరదు..' అని కేటీఆర్ ధ్వజమెత్తారు.

సాక్షి హైదరాబాద్

బుధవారం । 6 । ఆగస్టు । 2025



కదలని కారిడార్లు.. తేలని పరిహారం

కంటోన్మెంట్‌లో చేపట్టనున్న రెండు ఎలివేటెడ్ కారిడార్‌ల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. అటు పరిహారం తేలక, ఇటు అద్దెలు రాక యజమానులు సతమతమవుతున్నారు. -12లో



సిస్టర్స్.. స్పోర్ట్స్..

సిస్టర్స్ ఇన్ స్వెట్ సంస్థ ఆటాడుకుందాం రా అని ఆహ్వానిస్తోంది. నగరానికి చెందిన పలువురు మహిళలు ఈ సంస్థలో సభ్యులుగా ఉన్నారు. - సిటీప్లస్‌లో

గరిష్టం/కనిష్టం
32.0/22.0

వాతావరణం

నగరంలో బుధవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. తేలికపాటి వర్షం కురిసే అవకాశముంది. గరిష్టంగా 32, కనిష్టంగా 22 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయని అంచనా.

వరద సాఫీగా సాగేలా చూడండి

నీట మునిగిన ప్రాంతాలను పరిశీలించిన హైడ్రా కమిషనర్



నీట మునిగిన ప్రాంతాలను పరిశీలిస్తున్న ఏవీ రంగనాథ్

బంజారాహిల్స్: ఒక్కసారిగా 15 సెంటీమీటర్ల వర్షపాతం నమోదవ్వడంతో నీట మునిగిన అమీర్‌పేట మెట్రోస్టేషన్ పరిసరాలను మంగళవారం హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ పరిశీలించారు. సోమవారం సాయంత్రం భారీ వర్షానికి జూబ్లీహిల్స్, కృష్ణానగర్, యూసుఫ్‌గూడ, ఎల్లారెడ్డిగూడ ప్రాంతాలతో పాటు మధురానగర్, శ్రీనివాస్‌నగర్ వెస్ట్ నుంచి భారీగా వరద రావడంతో రహదారిపై నీరు నిలిచిందని స్థానిక అధికారులు కమిషనర్‌కు వివరించారు. 40 అడుగుల వెడల్పుతో పైనుంచి వచ్చిన వరద కాలువలు అమీర్‌పేట-సంజీవరెడ్డినగర్ ప్రధాన రహదారి దాటే సమయంలో 10 అడుగులకు కుంచించుకుపోవడంతో ఈ సమస్య తలెత్తిందని చెప్పారు. అమీర్‌పేట మెట్రోస్టేషన్ కింద నిర్మించిన కల్వర్టులో ఉన్న పైపులైన్లలో ఒకటి పూడికతో మూసుకుపోవడంతో సమస్య తీవ్రమైందన్నారు. వెంటనే పైపులైన్లలో పూడికను తొలగించాలని కమిషనర్ సూచించారు. అప్పటికీ సామర్థ్యం సరిపోకపోతే ఎగువ ప్రాంతాల్లో వాహన రాకపోకలకు ఆటంకం కలగకుండా టన్నెల్ మాదిరి పనులు చేపట్టి అదనంగా పైపులైన్లు ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం లక్డీకాపూల్ ప్రాంతాలను పరిశీలించారు. ఇక్కడి చౌరస్తాలో పైపులైన్ల పనులు త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ప్రస్తుత వర్షాకాలంలో వరద ముంచెత్తకుండా తక్షణ చర్యలతో ఉపశమనం లభించేలా, సమస్య పరిష్కారమయ్యేలా చూడాలని సూచించారు.

తాగునీటి సరఫరాలో అంతరాయం నేడు



సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని లింగంపల్లి నుంచి సనత్‌నగర్ రిజర్వాయర్ వరకు నీటి సరఫరా చేసే 1143/700 ఎంఎం డయా, 1050/600 ఎంఎం డయా పైపులైన్లకు జంక్షన్ పనులు నేపథ్యంలో బుధవారం ఉదయం 6 నుంచి రాత్రి 10 గంటల వరకు పలు ప్రాంతాల్లో తాగునీటి సరఫరాలో అంతరాయం, కొన్ని చోట్ల లోప్రెజర్‌తో నీటి సరఫరా అవుతుందని జలమండలి వర్గాలు పేర్కొన్నాయి.

అంతరాయం ఏర్పడే ప్రాంతాలివే: రాజీవ్ గాంధీ నగర్, ఎన్టీఆర్ నగర్, శ్రీశ్రీ నగర్, ప్రశాంత్ నగర్, దీన్ దయాళ్ నగర్, జింకలవాడ, ప్రభాకర్ రెడ్డి నగర్, సమతానగర్, వెంకటేశ్వర నగర్, కార్మిక నగర్, శివ శంకర్ నగర్, ఎల్‌బీఎస్ నగర్, ఫతే నగర్, చరబండ రాజు కాలనీ, బాలానగర్, జనతా నగర్, చైతన్య బస్తీ, వడ్డార్ బస్తీ, ఎరుకల్ బస్తీ, శాస్త్రి మార్గం, జిల్లా బస్తీ, శ్రీరాం కాలనీ, 15వ ఫేజ్, కైత్లాపూర్, రాఘవేంద్ర కాలనీ, హనుమాన్ చౌక్, యాదవ్ బస్తీ, హెచ్‌పీ రోడ్, భవానీ నగర్, సర్దార్ పటేల్ నగర్, గుడ్‌షెడ్ రోడ్, జేపీ నగర్ ఈడబ్ల్యూఎస్, ఎంజీఐహెచ్, హెచ్ఐజీ, ఎల్ఐజీ, సత్య సాయి నగర్, డీఎస్ఎం కాలనీ, బీజేఆర్ నగర్, అశోక్ కాలనీ, అల్లాద్దీన్ కోటి, రేణుకా నగర్, సుప్రభాత్ నగర్, నీమ్‌కర్ నగర్. అంతరాయం ఏర్పడనున్న ప్రాంతాల్లోని వినియోగదారులు నీటిని పొదుపుగా వాడుకోవాలని జలమండలి సూచించింది.

బహదూర్‌పల్లిలో ప్లాట్ల వేలం.. రూ.100 కోట్ల ఆదాయం

రూ.46,500 పలికిన గజం స్థలం



సాక్షి, సిటీబ్యూరో: రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ బహిరంగ వేలం ద్వారా చేపట్టిన ఓపెన్ ప్లాట్ల విక్రయాలకు అనూహ్య స్పందన లభిస్తోంది. గత రెండు రోజులుగా నగరంలోని పలు ప్రాంతాల్లో ఓపెన్ ప్లాట్ల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. మంగళవారం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని బహదూర్ పల్లి ప్రాంతంలోని 68 ప్లాట్లకు సంబంధించిన బహిరంగ వేలం ప్రక్రియ చేపట్టారు. వేలం నిర్వహించిన 50 ప్లాట్ల విక్రయానికి సంబంధించి దాదాపు రూ.100 కోట్ల మేర ఆదాయం వచ్చిందని రాజీవ్ స్వగృహ మేనేజింగ్ డైరెక్టర్ వి.పి.గౌతం తెలిపారు. అవుటర్ రింగ్ రోడ్డుకు అతి సమీపంలోని ఈ భూములను కొనుగోలు చేయడానికి సుమారు 119 మంది బిడ్డర్‌లు పాల్గొన్నారు. 200- 1000 చదరపు గజాల విస్తీర్ణంలో ఉన్న ప్లాట్లలో, కార్నర్ ప్లాట్‌కు రూ 30 వేలు, ఇతర ప్లాట్లకు రూ.27 వేలు ఆఫ్ సెట్ ధరగా నిర్ణయించారు. ఒక్కో ప్లాట్ కోసం దాదాపు 30 మంది వరకు పోటీ పడ్డారు. కార్నర్ ప్లాట్లకు మంచి డిమాండ్ రేటు పలికింది. రాత్రి 8 గంటల వరకు నిర్వహించిన 50 ప్లాట్లకు సంబంధించిన వేలంలో గరిష్టంగా చదరపు గజానికి రూ. 46,500 ధర పలికింది.

బంజారాహిల్స్‌లో రోడ్డు కుంగడంతో నాలాలో కూరుకుపోయిన వాటర్ ట్యాంకర్



- నగరంలో తరచూ కూలిపోతున్న ఘటనలు
- మరమ్మతుల్లేవు.. కనీస పర్యవేక్షణ కరువు
- వాహనాలు దిగబడుతున్నా పట్టింపే లేదు
- ఇన్వెంటరీ కొరవడిన బల్దియా యంత్రాంగం

నాలా.. డీలా

దేనికింద ఏముందో.. ఏది కుంగనుందో?

సాక్షి, సిటీబ్యూరో

నాలాలు కుంగిపోయి వాహనాలు దిగబడుతున్నా దిక్కేలేకుండా పోయింది. కుహరాల్లా కుంగిపోతున్నా బల్దియాకు సోయే లేకుండాపోతోంది. గత ఏడాది బంజారాహిల్స్ రోడ్ నెంబర్- 11 ఉదయ్‌నగర్‌లో నాలా శ్లాబ్‌తో పాటు రిటైనింగ్ వాల్ కూలింది. గోషామహల్ చాక్నవాడి ప్రాంతంలో నాలాశ్లాబ్ స్వల్ప సమయంలోనే ఐదారుసార్లు కుంగింది. ఈ సంవత్సరం కూడా ఆ శ్లాబ్ కూలింది. వాహనాలు దిగబడ్డాయి. గతంలో నల్లకుంట ఫీవర్ హాస్పిటల్ ప్రాంతంలోనూ నాలాపైనున్న రోడ్డు కుంగిపోయింది. ఇలా ఎంతోకాలంగా నగరంలోని నాలాల పైకప్పులు, నాలాలపై ఉన్న రోడ్లు కుంగిపోవడం, వాహనాలు అందులో దిగడం పరిపాటిగా మారినా ప్రమాదాలు జరగకుండా గత ప్రభుత్వం కానీ, ప్రస్తుత ప్రభుత్వం కానీ ఎలాంటి శ్రద్ధ చూపడం లేదు.

పురాతన కాలం నాటివెన్నో..

నగరంలోని నాలాలు ఎన్నో ఏళ్ల క్రితం నిర్మించినవి. నిజాం కాలం నాటి నాలాలూ వాటిల్లో ఉన్నాయి. దశాబ్దాల క్రితం నిర్మించిన నాలాలు, వాటి పైకప్పులు (రోడ్లు) ఎలా ఉన్నాయి.. ఏమేర దెబ్బతిన్నాయి వంటి అంశాలను అధికారులు ఏనాడూ పట్టించుకోలేదు. నాలాల కింద ఎక్కడెక్కడ ఏమేమున్నాయో తెలిసే ఇన్వెంటరీ కూడా జీహెచ్ఎంసీ వద్ద లేదు. దీంతో.. ఏ నాలా కింద ఏముందో, ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందో తెలిసే పరిస్థితి లేదు. తాజాగా బంజారాహిల్స్‌లో నాలాలో వాటర్ ట్యాంకర్ దిగబడటంతో ఈ అంశం మళ్లీ తెరమీదికొచ్చింది. భారీ వాహనం కావడంతో నాలాలో పడిపోయింది. కనీసం నాలాలున్న ప్రాంతాల్లో జాగ్రత్తగా ప్రయాణించేందుకు హెచ్చరికల బోర్డుల వంటివి సైతం ఎక్కడా ఏర్పాటు చేయలేదు. గతంలోనూ నాలాలపై రోడ్లు కుంగినప్పుడు సైతం ఏ నాలా పరిస్థితి ఏమిటో, వాటికింద ఏమేమున్నాయో, రిటైనింగ్ వాల్స్ పరిస్థితేమిటో తెలుసుకోవాలనుకోలేదంటే అధికారుల తీరును అంచనా వేయవచ్చు.

రూ.55 కోట్లు ఖర్చు చేస్తున్నా..

జీహెచ్ఎంసీ పరిధిలో 955 కిలోమీటర్ల మేర నాలాల్లో పూడికతీతల కోసం దాదాపు రూ. 55 కోట్లు ఖర్చు చేస్తున్నారు. కానీ.. రోడ్ల దిగువనున్న నాలాల పరిస్థితిని పట్టించుకోవడం లేదు. అదృష్టవశాత్తు నాలాల్లో వాహనాలు దిగబడినప్పుడు ఎలాంటి ప్రాణాపాయం జరగలేదు.అదే వాహనాల్లో ఎక్కువమంది ఉండి ప్రమాదం తీవ్రమైతే పరిస్థితి ఏమిటో ఊహించుకోవచ్చు.

ఆధునికీకరణ సరే.. ఆపదల మాటేమిటి?

వరద ముంపు సమస్యల పరిష్కారం కోసం వ్యూహాత్మక నాలా అభివద్ధి పథకం కింద ఇప్పటికే దాదాపు రూ. 950 కోట్లు ఖర్చుచేశారు. నాలాల ఆధునికీకరణ, నీటి పారుదలకు బాక్స్ డ్రెయిన్ల నిర్మాణాల వంటివి చేపట్టారు కానీ.. పురాతన నాలాలపై కనీస శ్రద్ధ పెట్టలేదు. వీటిలో కాలనీలు, స్లమ్స్ మధ్యన ఉన్నవి కూడా ఎన్నో ఉన్నాయి. నాలా రిటైనింగ్ వాల్స్‌నే ఆనుకుని వెలసిన అపార్ట్‌మెంట్లు సైతం ఉన్నాయి. అయినప్పటికీ, నాలాల వల్ల కలిగే ప్రమాదాల గురించి అధికారులు పట్టించుకోకపోవడం శోచనీయం. నాలా సేఫ్టీ ఆడిట్ పేరిట ప్రతి నాలానూ అధికారులు తనిఖీలు చేసి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు చెబుతున్నప్పటికీ, నాలాల శ్లాబ్ (రోడ్)లు దెబ్బతిన్నా పట్టించుకోవడం లేరు. శిథిల భవనాల విషయంలో మొక్కుబడి సర్వేలు చేస్తున్నప్పటికీ, పురాతన నాలాలు, వాటిపై ఉన్న రోడ్ల స్టెబిలిటీ గురించి మాత్రం కనీసం పట్టించుకోవడం లేదు. అధికారులు ఇప్పటికైనా కళ్లు తెరవకపోతే.. ఏ నాలా ఎప్పుడు కుంగుతుందో తెలియని దుస్థితి దాపురించింది.

కాగితాలకే పరిమితం..

నాలా సేఫ్టీ చర్యల్లో భాగంగా ఇంజినీర్లు క్షేత్రస్థాయిలో నడుచుకుంటూ వెళ్లి పరిశీలించాలి. రెండు మీటర్ల కంటే ఎక్కువ వెడల్పున్న ఓపెన్ నాలాలకు అన్ని ప్రాంతాల్లో ఫెన్సింగ్ ఉండాలి. పైకప్పులున్న నాలాల్లో ఎక్కడైనా కప్పులు దెబ్బతిన్నా, ఓపెన్‌గా ఉన్నా గుర్తించి అవసరమైన చర్యలు చేపట్టాలన్నది కాగితాలకే పరిమితమైంది. వరదనీరు ఏ నాలా నుంచి ఎక్కడకు వెళ్తుందో కూడా తెలియని అధికారులున్నారంటే అతిశయోక్తి కాదు.

బలహీనంగా నాలా కప్పులు

నగరంలో ప్రస్తుతమున్న నాలా వ్యవస్థ గంటకు 20 మి.మీ వర్షపాతాన్ని మాత్రమే తట్టుకోగలదు. సగటున గంటకు 60 మి.మీ.లకు పైగా వర్షపాతం నమోదవుతుండటంతో ఉన్న నాలాలు వర్షాన్ని తట్టుకునేలా లేవు. దాంతో నాలాల పైకప్పులూ బలహీనమవుతున్నాయి.

- 2000లో కురిసిన భారీ వర్షాలతో అప్పటి ఎంసీహెచ్ పరిధి వరకు వరద కాలువలపై అధ్యయనం చేసిన కిర్లోస్కర్ కమిటీ సమగ్ర నివేదిక రూపొందించింది.
- 170 కి.మీ పొడవున్న 71 నాలాలను తక్షణం విస్తరించాలని సూచించింది.
- 2007లో జీహెచ్ఎంసీగా రూపాంతరం చెందాక గ్రేటర్ పరిధి మొత్తానికి వాయెంట్స్ సొల్యూషన్స్ వరదనీటి కాలువలపై అధ్యయనం చేసింది.
- 20మి.మీ మించి వర్షం కురిసిన ప్రతిసారీ నగరం నీట మునుగుతోంది.
- 390 కి.మీ మేర మేజర్ నాలాలను ఆధునికీకరించాలని వాయెంట్స్ సొల్యూషన్స్ సూచించింది.
- నాలాల వెంబడి బఫర్‌జోన్ పరిధిలో మొత్తం 28వేల అక్రమ నిర్మాణాలున్నట్లు గుర్తించింది.

రోడ్డు కుంగి నాలాలో కూరుకుపోయిన వాటర్ ట్యాంకర్

బంజారాహిల్స్: రోడ్ నెం- 1లోని మహేశ్వరి చాంబర్స్ అపార్ట్‌మెంట్ వీధిలో ఓ వాటర్ ట్యాంకర్ నాలాలో దిగబడిన ఘటన మంగళవారం ఉదయం చోటు చేసుకుంది. సోమవారం కురిసిన భారీ వర్షానికి ఈ రోడ్డులోని నాలా కుంగిపోయింది. దీంతో అపార్ట్‌మెంట్‌కు వస్తున్న వాటర్ ట్యాంకర్ ఒక్కసారిగా కుప్పకూలడంతో స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. అపార్ట్‌మెంట్ రోడ్డు నుంచి ప్రధాన రోడ్డుకు రాకపోకలు నిలిచిపోయాయి. వాటర్ ట్యాంకర్‌ను వెలికితీసేందుకు 70 టన్నుల క్రేన్ కావాల్సి ఉంటుందని, ఇంత పెద్ద క్రేన్ నిలిపేందుకు అక్కడ స్థలం లేకపోవడంతో సాయంత్రం వరకు అధికారులు తర్జనభర్జన పడ్డారు. రాత్రి వరకు క్రేన్ ద్వారా నాలాలో పడిపోయిన ట్యాంకర్‌ను తొలగిస్తామని ఈఈ విజయ్‌కుమార్ తెలిపారు. సుమారు 40 ఏళ్ల క్రితం నిర్మించిన పురాతన నాలా కావడంతో కుంగిపోయిందని అధికారులు గుర్తించారు.

మాస్టర్‌ప్లాన్ ఏదీ?

- నాలాలపై ఉన్న రోడ్లపై వాహనాల రాకపోకలతో దెబ్బతినే ప్రమాదాలున్నందున నిర్ణీత వ్యవధుల్లో తనిఖీలు చేయాల్సి ఉన్నా ఆ పని జరగడం లేదు.
- వర్షం వచ్చినప్పుడు నీరు నాలాల్లో చేరినప్పటి నుంచి ఎక్కడి నుంచి వెళ్లి ఎక్కడ కలుస్తోంది వంటి వివరాలు లేవు. నిర్వహణ లేదు. నాలాలకు మాస్టర్‌ప్లాన్ అనేదేమీ లేదు.
- అక్రమ నిర్మాణాల కారణంగానూ నాలా పరిసరాలు బలహీనమవుతున్నాయి.
- నాలాలకు అడ్డుగా ఉన్న పైపులైన్లు తదితర యుటిలిటీస్‌ను తరలించడం, నాలాల్లో చెత్తా చెదారాలు చేరకుండా చూడాల్సి ఉంది.
- పైకప్పుల్ని బలోపేతం చేయాల్సి ఉంది.

కాంక్రీట్ కప్పుల వల్లే..

నాలాలపై కాంక్రీట్ కప్పుల (రోడ్ల) వల్ల లోపల మరమ్మతులు చేయలేని పరిస్థితులుంటున్నాయి. లీకేజీలు గుర్తించలేకపోతున్నారు. చాలాకాలం క్రితం నిర్మించిన నాలాల పైకప్పులు బీటలు పడుతున్నా పట్టించుకోవడం లేదు. అంబర్‌పేట, బేగంబజార్, విజయ్‌నగర్ కాలనీ, మలక్‌పేట తదితర ప్రాంతాల్లోనూ కప్పులు దెబ్బతిని ప్రమాదాలు జరిగాయి. వీటికి తగిన పరిష్కారాలపై దృష్టి సారించాల్సి ఉంది.

ఇబ్బందులు ‘దారి’కొచ్చేలా..

ఏఓసీ ప్రత్యామ్నాయ రోడ్ల కోసం రూ. 960 కోట్లు



సాక్షి, సిటీబ్యూరో: సికింద్రాబాద్ కంటోన్మెంట్ నుంచి రాకపోకలు సాగించే వాహనదారులకు పలు సందర్భాల్లో ఎదురవుతున్న ఇబ్బందులు త్వరలో తొలగిపోనున్నాయి. ఆయా సందర్భాల్లో కొన్ని మిలిటరీ రోడ్లను మూసివేస్తుండటంతో పడరాని పాట్లు పడుతున్నారు. తీవ్ర ట్రాఫిక్ చిక్కులు ఎదురవుతున్నాయి. ఎంతో కాలంగా ప్రజలు పడుతున్న ఈ బాధలకు చెక్ పెట్టేలా ఏఓసీ (ఆర్మీ ఆర్డినెన్స్ కార్ప్స్) సెంటర్ దగ్గర ప్రత్యామ్నాయ మార్గాల నిర్మాణానికి జీహెచ్ఎంసీ సిద్ధమైంది. మూడు ఫ్లై ఓవర్లు, ఒక ఆర్‌ఓబీ, కొన్ని గ్రేడ్ రోడ్ల నిర్మాణాల కోసం ఇప్పటికే టెండర్లు పిలిచింది. వీటి నిర్మాణాల అంచనా వ్యయం రూ.307 కోట్లు కాగా, స్థలాల సేకరణ తదితరాలు కలిపి మొత్తం ప్రాజెక్టు వ్యయం దాదాపు రూ.960 కోట్లుగా అధికారులు తెలిపారు. ఫ్లై ఓవర్లను వెల్లింగ్టన్ రోడ్ -ఎలివేటెడ్ రోటరీ, ఈస్ట్ మారేడ్‌పల్లి-ఎలివేటెడ్ రోటరీ, ఎలివేటెడ్ రోటరీ -సఫిల్‌గూడ వరకు నిర్మించనున్నారు. వీటితో పాటు ఎస్ఎం సైడింగ్స్‌పై ఆర్వోబీని, వెల్లింగ్టన్ రోడ్, ఈస్ట్ మారేడ్‌పల్లి రోడ్, మహేంద్రహిల్స్ - ఆర్‌కేపురం ఆరోఓబీ వద్ద ఎట్‌గ్రేడ్ రోడ్లు నిర్మించనున్నారు.

నిర్మాణాలు ఇలా..

వీటిల్లో వెల్లింగ్టన్ రోడ్-ఎలివేటెడ్ రోటరీ వరకు ఫ్లై ఓవర్ నాలుగులేన్లతో, ఫుట్‌పాత్‌లతో, 12 మీటర్ల క్యారేజ్‌వేలతో ఉంటుందని అధికారులు తెలిపారు. ఈస్ట్ మారేడ్‌పల్లి-ఎలివేటెడ్ రోటరీ కూడా నాలుగులేన్లు, ఫుట్‌పాత్‌లతో 15 మీటర్ల క్యారేజ్‌వేలతో ఉంటుందని, ఆర్‌ఓబీ 22 మీటర్ల క్యారేజ్‌వేతో నిర్మించనున్నట్లు పేర్కొన్నారు. ఫ్లై ఓవర్ల మీద వాహన వేగం 30 కేఎంపీహెచ్‌గా, గ్రేడ్‌రోడ్ల వద్ద 40కేఎంపీహెచ్‌గా కనిష్టంగా ఉండేలా డిజైన్లు ఉంటాయని తెలిపారు. ఈ నిర్మాణాలు పూర్తయితే మల్కాజిగిరి, సఫిల్‌గూడ, సైనిక్‌పురి, ఆర్‌కేపురం తదితర ప్రాంతాల వారికి సాఫీ ప్రయాణం సాధ్యమవుతుందని అధికారులు తెలిపారు.

డిప్యుటేషన్‌పై ఫ్యూచర్ సిటీకి పలువురు అధికారులు

సాక్షి, సిటీబ్యూరో: ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ (ఎఫ్‌సీడీఏ)లో కొంత మంది అధికారులను డిప్యుటేషన్‌పై నియమిస్తూ పురపాలకశాఖ కార్యదర్శి ఇలంబర్తి ఉత్తర్వులు జారీ చేశారు. టీజీబీపీఏఎస్ఎస్‌లో ఆన్ డ్యూటీ బేసిస్‌పై పనిచేస్తున్న జీహెచ్ఎంసీ డిప్యూటీ సిటీ ప్లానర్ కె.స్నేహ మాలను బదిలీ చేస్తూ డిప్యుటేషన్‌పై ఎఫ్‌సీడీఏలో డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ టౌన్ ప్లానింగ్‌గా నియమించారు. నల్లగొండ డీటీసీపీఓగా పని చేస్తున్న లక్ష్మీనారాయణ బదిలీ చేస్తూ డిప్యుటేషన్‌పై ఎఫ్‌సీడీఏలో అసిస్టెంట్ ప్లానింగ్ ఆఫీసర్/ అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ టౌన్ ప్లానింగ్‌గా పోస్టింగ్ ఇచ్చారు. హెచ్ఎండీఏ ఏపీఓ జి.సురేష్‌కు ఎఫ్‌సీడీఏలో ఏపీఓగా, జీహెచ్ఎంసీ నార్త్ జోన్ ఈఈ బి.గోపాల్‌ను ఎఫ్‌సీడీఏ ఈఈగా పోస్టింగ్ ఇచ్చారు. నల్లగొండ మున్సిపాలిటీలో పబ్లిక్‌హెల్త్ ఈఈగా పనిచేస్తున్న సత్యనారాయణను బదిలీ చేస్తూ డిప్యుటేషన్‌పై ఎఫ్‌సీడీఏలో ఈఈగా నియమించారు. జీహెచ్ఎంసీ శేరిలింగంపల్లి ఓఅండ్ఎం డివిజన్‌లో డిప్యూటీ ఈఈగా పనిచేస్తున్న పి. ఆనంద్‌ను బదిలీ చేస్తూ డిప్యుటేషన్‌పై ఎఫ్‌సీడీఏలో డిప్యూటీగా నియమించారు. జీహెచ్ఎంసీ ఎస్ఎన్‌డీపీలో డిప్యూటీ ఈఈగా పని చేస్తున్న వెంకట్ కిరణ్ రెడ్డిని బదిలీ చేస్తూ డిప్యుటేషన్‌పై ఎఫ్‌సీడీఏలో డిప్యూటీ ఈఈగా నియమించారు.

రూ.13 కోట్లు ఫట్!

వెలుతురు వెనుక అవినీతి చీకటి?



ఎల్ఈడీ వీధిదీపాల పేరిట లూటీ

- ఏడేళ్లు సాగిన అక్రమాల తంతు
- కళ్లు మూసుకున్న బల్దియా

సాక్షి, సిటీబ్యూరో: ఒకటి కాదు.. వంద కాదు.. ఏకంగా 72,549 వీధిదీపాలు లేకుండానే వాటి ఏర్పాటు, నిర్వహణ పేరిట కాంట్రాక్టు ఏజెన్సీకి నిధులు చెల్లించారు. ఈ అవినీతి తంతు ఏకంగా ఏడేళ్లు సాగింది. ఇవి ఎల్ఈడీ వీధిదీపాల నిర్వహణకు గాను జీహెచ్ఎంసీ ఈఈఎస్ఎల్ (ఎనర్జీ ఎఫిషియెన్సీ సర్వీసెస్)కు గత ఏప్రిల్ నెలాఖరు వరకు ముగిసిన ఏడేళ్ల కాంట్రాక్టు కాలంలో చెల్లించిన నిధులు. ఒక్కో వీధి దీపం నిర్వహణకు నెలకు రూ.22 వంతున ఏడేళ్ల కాలానికి దాదాపు రూ.13,40,70,552 చెల్లించారు. ఇవి కేవలం నిర్వహణ పేరిట. ఇక వీధిదీపాల ఏర్పాటు ఖర్చు మరింత అ‘ధనం’. ఎంతో కాలంగా నగరంలో కారుచీకట్లు అలుముకున్నా, ఒప్పందం మేరకు 98 శాతం వీధిదీపాలు వెలగకున్నా, ఈఈఎస్ఎల్‌పై జీహెచ్ఎంసీ ఎప్పటికప్పుడు తగిన చర్యలు తీసుకోలేదు. మరోవైపు జీహెచ్ఎంసీ తమకు కోట్ల నిధులు చెల్లించాల్సి ఉందంటూ ఈఈఎస్ఎల్ ప్రచారం చేసుకుంది. కాంట్రాక్టు ఒప్పందం మేరకు డ్యాష్‌బోర్డు పని చేయకున్నా, సీసీఎంఎస్ (సెంట్రల్ కంట్రోల్ అండ్ మానిటరింగ్ సిస్టమ్) బాక్స్‌లు పని చేయకున్నా జీహెచ్ఎంసీ పట్టించుకున్న పాపాన పోలేదు.

తప్పుడు లెక్కలు

ఈఈఎస్ఎల్ ఒప్పందం ముగియడానికి ముందు.. తిరిగి వీధిదీపాల నిర్వహణ బాధ్యతలు కొత్తగా ఎవరికివ్వాలన్న అంశం చర్చకు రాగా, అప్పటి కమిషనర్ ఇలంబర్తి, అడిషనల్ కమిషనర్ శివకుమార్ నాయుడు అసలు నగరంలో వాస్తవంగా ఉన్న వీధిదీపాలెన్నో లెక్క తీయాలని భావించి క్షేత్రస్థాయి సర్వే నిర్వహించగా, 4,77,539 వీధిదీపాలు మాత్రమే లెక్క తేలాయి. ఒప్పందం ప్రకారం 5,50,088 వీధిదీపాలు ఏడేళ్లపాటు వెలుగులు విరజిమ్మాలి. అగ్రిమెంట్ కాలపరిమితి ముగిసేంత వరకు కూడా అసలెన్ని వీధిదీపాలున్నాయో, ఎన్ని వెలిగాయో కూడా చూడకుండానే చెల్లింపులు చేశారంటే నిజంగా నిద్రపోయారా, లేక నిద్ర నటించి అవినీతిని ప్రోత్సహించారా? అన్నది జీహెచ్ఎంసీకే తెలియాలి.

పర్యవేక్షణ లేమి..

- జీహెచ్ఎంసీ విద్యుత్ విభాగాన్ని చాలా కాలంగా నిర్లక్ష్యం చేశారు. ప్రజల నుంచి జీహెచ్ఎంసీకి అందుతున్న ఫిర్యాదుల్లో సింహభాగం వీధిదీపాలవే అయినా సమస్యను పరిష్కరించలేకపోయారు. శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి, సికింద్రాబాద్ జోన్లలో ఇప్పటికీ 50 శాతం వీధిదీపాలు వెలగడం లేవు. పేరెన్నికగన్న దుర్గంచెరువు బ్రిడ్జిమీద సైతం నెలలో సగం రోజులు చీకట్లే అలుముకుంటున్నాయి. ఫిర్యాదు చేస్తే సమస్య పరిష్కారమైనట్లు మెసేజ్ తప్ప నిజంగా పరిష్కారానికి నోచుకోవడం లేదు. ఫిర్యాదు చేసేందుకు ప్రజలు కార్యాలయాలకు వెళ్లినా అక్కడ కంప్యూటర్ ఆపరేటర్లు, అటెండర్లు తప్ప సంబంధిత ఇంజినీర్లు కనిపించరు. అదేమంటే క్షేత్రస్థాయి విధులకు వెళ్లారని చెబుతారు. కానీ, వారు క్షేత్రస్థాయిలోనూ కనిపించరు.
- పనులకు సంబంధించిన ఎస్టిమేట్స్ సైతం ఫోన్లు చేసి చెప్పి ఆపరేటర్ల ద్వారానే వేయిస్తున్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. రాత్రి 9 గంటల వరకు క్షేత్రస్థాయి విధులు నిర్వహించాల్సిన ఇంజినీర్లు దాదాపు 7 గంటల సమయంలో క్షేత్రస్థాయిలో ఉన్నట్లు సంబంధిత వాట్సాప్ గ్రూపులో ఒక ఫొటో పెడుతూ ఉన్నతాధికారులను మభ్యపెడుతున్నట్లు సమాచారం. జెన్‌కో నుంచి వచ్చిన డీఈఈ స్థాయి వారికే సదుపాయాలతో కలిపి ఏటా దాదాపు రూ. 50 లక్షల జీతం చెల్లిస్తున్నారు. అయినప్పటికీ క్షేత్రస్థాయి పర్యవేక్షణ లేదు. ఏడేళ్లు దాటినా వీధిదీపాల లెక్కలే సరిగ్గా లేవంటే పనితనం అంచనా వేసుకోవచ్చు.

తాత్కాలికం పేరుతో..

పండుగలు, ప్రత్యేక దినోత్సవాల పేరిట ఆయా సందర్భాల్లో తాత్కాలిక వీధిదీపాల పేరుతో ఏటా దాదాపు రూ.30 కోట్లు ఖర్చు చేస్తున్నారు. వాస్తవానికి నగరమంతా ఎల్ఈడీ వీధిదీపాల నిర్వహణ అన్నప్పుడు విడిగా మళ్లీ తాత్కాలికం పేరిట నిధుల ఖర్చెందుకో అర్థం కాదు. ప్రత్యేక సందర్భాల్లో రంగుల కాంతుల వంటివి తాత్కాలికంగా ఏర్పాటు చేయవచ్చు కానీ.. వీధిదీపాలు తాత్కాలికం ఏమిటో అంతుపట్టదు. వివిధ పనుల్లోనూ అవినీతి చేతివాటం ఎంతో జరుగుతున్నట్లు తెలుస్తోంది. విద్యుత్ పోల్స్ మార్చడం తదితర పనులకు కాంట్రాక్టర్లు 60 శాతం లెస్‌కు టెండర్లు వేస్తున్నారంటే, వాటి వెనుక అవినీతి ఎంతో అంచనా వేసుకోవచ్చు.

దారి మళ్లుతున్న కేబుల్?

శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి, ఎల్‌బీనగర్ జోన్లలో అవసరం లేకున్నా కేబుల్ తదితర సామగ్రి భారీగా కొనుగోళ్లు చేస్తున్నట్లు తెలుస్తోంది. వాటిని ఎక్కడ వినియోగించారో, ఏంచేశారో లెక్కాపత్రం ఉండదు. వక్రమార్గంలో అవి ప్రైవేట్ కాంట్రాక్టర్ల పరం అవుతాయనే ఆరోపణలున్నాయి. అయినప్పటికీ, ఏనాడూ పట్టించుకున్న పాపాన పోలేదని సమాచారం.

వస్తే .. కదలరు

ఇతర విభాగాల నుంచి జీహెచ్ఎంసీకి వచ్చే అధికారులు గరిష్టంగా ఐదేళ్ల వరకు డిప్యుటేషన్‌లో కొనసాగవచ్చు. విద్యుత్ విభాగంలో పని చేస్తున్న ఇంజినీర్లు మాత్రం ఆ కాలపరిమితి దాటినా కొనసాగుతున్నారు. బాధ్యతల అప్పగింతలోనూ వివక్ష కొనసాగుతోందనే ఆరోపణలున్నాయి. కొందరు ఈఈలకు ఒక్క సర్కిల్ పర్యవేక్షణ మాత్రమే ఉండగా, కొందరికి ఆరేడు సర్కిళ్లు కూడా ఉండటం వెనుక మతలబు ఏమిటో సంబంధీకులకే తెలియాలి మరి.



వేలల్లో ఇచ్చి లక్షల్లో స్వాహా!

రెంటల్ రిఫరల్ పేరుతో నేరగాళ్ల ఎర

ఆపై పెట్టుబడులు పెట్టాలంటూ స్వాహా

రూ.35 లక్షలు కోల్పోయిన నగర వాసి

సాక్షి, సిటీబ్యూరో: తొలుత అద్దెకు, విక్రయానికి సిద్ధంగా ఉన్న స్థిరాస్తుల జాబితా ఇస్తే కమీషన్ అన్నారు... ఆపై తమ వ్యాపారంలో భాగస్వామిగా మారితే భారీ లాభాలని పేర్కొన్నారు... ఇలా నగరవాసికి ఎర వేసిన సైబర్ నేరగాళ్లు రూ.వేలల్లో లాభాలు ఇచ్చి రూ.లక్షలు కాజేశారు. మొత్తమ్మీద రూ.35 లక్షలు కోల్పోయిన బాధితుడు సిటీ సైబర్ క్రైమ్ ఠాణాను ఆశ్రయించడంతో కేసు నమోదైంది. ముషీరాబాద్‌కు చెందిన ఓ వ్యక్తికి (42) గత నెల 21న వాట్సాప్ ద్వారా సందేశం వచ్చింది. రెంట్/స్టడీలీజ్.నెట్ సంస్థ ప్రతినిధులుగా, కేరళకు చెందిన నికితా జీవన్, శివ ప్రకాష్ అంటూ పరిచయం చేసుకున్న వ్యక్తులు చాటింగ్ చేశారు. తమ సంస్థ దేశ వ్యాప్తంగా ఉన్న స్థిరాస్తుల్ని విక్రయించడం, లీజుకు–అద్దెకు ఇవ్వడంలో మధ్యవర్తిత్వం చేస్తుందని చెప్పారు. ఆపై ఫోన్ చేసి మాట్లాడిన సైబర్ నేరగాళ్లు మీ ప్రాంతంలో ఉన్న అలాంటి స్థిరాస్తుల వివరాలను తమకు తెలపాలని కోరారు. తొలినాళ్లల్లో ఇతడికి ప్రతి సమాచారానికీ కొంత మొత్తం చెల్లించారు.

ఆపై తమ వ్యాపారంలో భాగస్వామివి కావాలని, భారీ కమీషన్లు ఉంటాయని, పెట్టుబడిపైన ఎక్కువ లాభం వస్తుందని నమ్మించారు. ఇవి నమ్మి రూ.10 వేలు డిపాజిట్ చేసిన బాధితుడికి రూ.10,748 వచ్చింది. రూ.31,259 పెట్టుబడి పెట్టి నిర్ణీత మొత్తం లాభం పొందాడు. ఇలా వారి ట్రాప్‌లో పడిపోయిన బాధితుడు మొత్తం రూ.35,26,677 చెల్లించాడు. ఈ డబ్బును తిరిగి ఇవ్వడానికి నిరాకరించిన సైబర్ నేరగాళ్లు అలా కావాలంటే మరో రూ.12 లక్షలు డిపాజిట్ చేయాలని, అప్పుడే మొత్తం తిరిగి ఇస్తామని చెప్పారు. దీంతో తాను మోసపోయినట్లు గుర్తించిన బాధితుడు సైబర్ ఠాణాను ఆశ్రయించాడు.

సరోగసి పేరిట అరాచకం!

- 'సృష్టి' ముసుగులో నమ్రత చేసిన నేరాలు ఎన్నో
- ఇప్పటి వరకు నమోదైన కేసుల ద్వారా వెలుగులోకి
- బాధితుల సంఖ్య మరింత పెరిగే అవకాశం: పోలీసులు

సాక్షి, సిటీబ్యూరో: యూనివర్సల్ సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ ముసుగులో డాక్టర్ నమ్రత చేసిన అరాచకాలు అన్నీ ఇన్నీ కావు. కొందరిని సరోగసి పేరుతో, మరికొందరిని ఐవీఎఫ్ ఫెర్టిలిటీ పేరుతో నమ్మించి అందినకాడికి దండుకుంది. సరోగసి అంటూ ఖరీదు చేసిన శిశువును అప్పగించి రాజస్థాన్ దంపతుల నుంచి రూ.35 లక్షలు కాజేసిన కేసులో నమ్రత అరెస్టు కావడం విదితమే. ఈ విషయం తెలిసి, ఆమె చేతిలో మోసపోయిన మరో నలుగురు బాధితులు గోపాలపురం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసులు నమోదయ్యాయి. వీరి నుంచి నమ్రత అండ్ గ్యాంగ్ రూ.60.72 లక్షలు కాజేసినట్లు తేలింది. బాధితుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని చెప్తున్న పోలీసులు పరారీలో ఉన్న నిందితుల కోసం గాలిస్తున్నారు. మరోపక్క 'రాజస్థాన్ కేసు'లో నమ్రత పోలీసు కస్టడీ మంగళవారంతో పూర్తి కావడంతో కోర్టులో హాజరు పరిచి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. ఆమె గ్యాంగ్‌పై నమోదైన ఆ నాలుగు కేసుల వివరాలు ఇలా...

సరోగసి పేరిట నమ్మించి...

నగరానికి చెందిన ఓ ప్రైవేట్ ఉద్యోగికి 2020లో వివాహమైంది. 2024 వరకు వేచి చూసినా సంతానం కలగకపోవడంతో గత ఏడాది నవంబర్‌లో సికింద్రాబాద్‌లోని సృష్టి సెంటర్‌ను సంప్రదించారు. అప్పట్లో వీరికి కౌన్సిలింగ్ చేసిన డాక్టర్ నమ్రత సరోగసీ ఒక్కటే మార్గమని సూచించారు. చట్ట బద్ధంగా అన్ని అనుమతులతో ఈ ప్రక్రియ చేయడతామని రూ.20 లక్షలకు ఒప్పందం చేసుకుంది. వీరి నుంచి దఫదఫాలుగా రూ.12.72 లక్షలు తీసుకుని సరోగసి ప్రక్రియ నడుస్తున్నట్లు నమ్మించింది. తాజాగా నమ్రత అరెస్టుతో ఆరా తీసిన ఈ దంపతులు తాము మోసపోయినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు నమోదు చేసిన కేసులో నమ్రతతో పాటు డాక్టర్ సదానందం, చిన్నారావు, సురేఖ నిందితులుగా ఉన్నారు.

ప్రవాసభారతీయుడి నుంచి రూ.12 లక్షలు...

అమెరికాలో స్థిరపడిన నగరవాసికి 2018లో వివాహమైంది. సంతాన లేమితో బాధపడుతున్న ఈ భార్యభర్తలు అక్కడే కొన్నాళ్ల పాటు ఐవీఎఫ్ విధానం కోసం ప్రయత్నించారు. కొందరు స్నేహితుల ద్వారా సృష్టి సెంటర్ వివరాలు తెలిశాయి. 2019లో ఫోన్ ద్వారా ఈ సెంటర్‌ను సంప్రదించిన భార్యభర్తలు తమ మెడికల్ హిస్టరీ చెప్పారు. నమ్రత సూచనల మేరకు హైదరాబాద్ వచ్చి నేరుగా సంప్రదించారు. అప్పట్లో ఐవీఎఫ్‌కు రూ.7 లక్షలు వసూలు చేసిన నమ్రత... ప్రొసీజర్ చేయడంతో తిరిగి అమెరికా వెళ్లిపోయారు. ఈ ప్రక్రియ ఫెయిల్ కావడంతో 2020 జనవరిలో మరోసారి నమ్రతను సంప్రదించారు. అప్పుడు సరోగసి సలహా ఇచ్చిన ఆమె దానికి రూ.25 లక్షలు డిమాండ్ చేశారు. తొలి దఫా రూ.12 లక్షలు చెల్లించిన సదరు ఎన్నారై చట్ట ప్రకారం అన్ని అనుమతులతో సరోగసి జరుగుతున్నట్లు భావించారు. ఆపై ఆమె అందుబాటులోకి రాకపోవడంతో ఇటీవల నగరానికి వచ్చిన భార్యభర్తలు నమ్రత అరెస్టు విషయం తెలుసుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మరో ఇద్దరి నుంచి ఇదే పంథాలో...

నగరానికి చెందిన మరో మహిళ గత ఏడాది జూలైలో ఐవీఎఫ్ కోసం సృష్టి సెంటర్‌ను ఆశ్రయించారు. ఈమెకు చికిత్స చేసిన డాక్టర్ నమ్రత సరోగసి చేయించుకోవాలని సూచించారు. తన అండం, భర్త వీర్యంతోనే పిండాన్ని అభివృద్ధి చేసి, చట్ట బద్ధంగా సరోగసి చేస్తామని పేర్కొంది. ఈ విధానానికి సదరు మహిళ అంగీకరించడంతో రూ.16.5 లక్షలు వసూలు చేసిన నమ్రత 14 హార్మోన్ల ఇంజెక్షన్లు ఇచ్చింది. ఆపై సరోగసి నడుస్తోందని చెప్పిన నమ్రతకు డాక్టర్ విద్యుల్లత సహకరించారు. ఈ ఏడాది జూన్ 24న విశాఖకు రప్పించిన నమ్రత, విద్యుల్లత సరోగసి మహిళకు సిజేరియన్ చేయాలంటూ మరో రూ.1.5 లక్షలు వసూలు చేసింది. ఆపై ఆడ శిశువు జన్మించిందంటూ సమాచారం ఇచ్చిన విద్యుల్లత కొన్ని రోజులకు శిశువును అప్పగించింది. గత నెల్లో డీఎన్ఏ పరీక్షలు చేయించిన ఆ దంపతులకు ఆ శిశువు తమ సంతానం కాదని తెలిసింది. ఈ మేరకు బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదుతో నమ్రతతో పాటు విద్యుల్లత, కళ్యాణి, శేషగిరి, శ్రీనివాసరెడ్డిల్ని నిందితులుగా చేర్చారు. హైదరాబాద్‌కు చెందిన మరో వ్యక్తి ఐవీఎఫ్ కోసం రాగా... అతడికీ సరోగసి సలహా ఇచ్చిన నమ్రత రూ.23 లక్షలకు ఒప్పందం చేసుకుంది. రూ.11 లక్షలు తీసుకున్న నమ్రత సరోగసికి సంబంధించిన ఎలాంటి వివరాలు చెప్పలేదు. తాజా పరిణామాల నేపథ్యంలో తాను మోసపోయానని తెలుసుకున్న బాధితుడు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు నమ్రతతో పాటు అర్చన, సదానందం, చిన్నారావు, సురేఖలపై కేసు నమోదు చేశారు.

మరో నాలుగు సెంటర్ల ద్వారానూ...

సరోగసి దందా వ్యవహారంలో కీలక నిందితురాలిగా ఉన్న డాక్టర్ నమ్రతను గోపాలపురం పోలీసులు ఐదు రోజుల పాటు తమ కస్టడీలోకి తీసుకుని విచారించారు. ఈ నేపథ్యంలోనే పలు కీలకాంశాలు వెలుగులోకి వచ్చాయి. ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, గుజరాత్‌ల్లో ఉన్న శిశు విక్రయాల గ్యాంగ్స్‌తో ఈమెకు సంబంధాలు ఉన్నట్లు వెలుగులోకి వచ్చింది. ఈ తరహా చైల్డ్ ట్రాఫికింగ్ కేసుల్లో గతంలో అరెస్టు అయిన ఏజెంట్లు నందిని, హర్ష, పవన్‌లతో కలిసి నమ్రత దందాలు చేసినట్లు వెలుగులోకి వచ్చింది. నమ్రత నేతృత్వంలోని గ్యాంగ్ నగరంలోని మరో నాలుగు సెంటర్లకు శిశువుల్ని విక్రయించినట్లు పోలీసులు గుర్తించారు. దళారుల ద్వారా యువతీ యువకుల్ని ట్రాప్ చేస్తున్న నమ్రత ముఠా వారి అండం, వీర్యాలను సేకరించి విక్రయిస్తున్నట్లు తేల్చారు.

ప్రేమ పేరిట మోసం..కేసు నమోదు


పోచారం: కపట ప్రేమకు ఓ బ్యాంక్ ఉద్యోగిని మోసపోయిన ఘటన పోచారం ఐటీ కారిడార్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఈ ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. ఈ ఏడాది మార్చిలో ఘట్‌కేసర్‌లోని ఓ బ్యాంక్‌లో పర్సనల్ లోన్ విభాగంలో పనిచేస్తున్న యువతి (28)కి సహోద్యోగి పప్పూరి ఉమాశంకర్ (30)తో పరిచయం ఏర్పడింది. ప్రేమిస్తున్నానని, పెళ్లి కూడా చేసుకుంటానని చెప్పడంతో యువతి నమ్మింది. ఇద్దరూ సన్నిహితంగా మెలగడంతో యువతి గర్భం దాల్చింది. దీంతో రామంతాపూర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో గర్భస్రావం చేయించాడు. ఇద్దరు కొండాపూర్‌లో ఓ ఫ్లాట్‌ను అద్దెకు తీసుకుని నివసిస్తున్నారు. మరోసారి గర్భం రావడంతో మళ్లీ గర్భస్రావం చేయించాడు. వివాహం విషయం గుర్తు చేయడంతో మోతీనగర్‌లోని సోదరి అనూష ఇంటికి తీసుకెళ్లి పెళ్లి చేసుకుంటానన్నాడు. అందుకు సోదరి అంగీకరించపోవడంతో కొండాపూర్‌లోనే ఉంటున్నారు. జులై 7న ఒంగోలు ఎస్ఐగా చెప్పుకుంటున్న చౌడయ్య, మరో ముగ్గురు వ్యక్తులు వచ్చి ఉమాశంకర్‌ను తీసుకెళ్లారు. యువతి ఇంట్లోలేని సమయంలో ఉమాశంకర్ తిరిగి వచ్చి ఆమెకు సంబంధించిన 25 గ్రాముల బంగారు నగలు, సామాగ్రి తీసుకెళ్లాడు. దీంతో ప్రేమ, పెళ్లి పేరిట ఉమాశంకర్ మోసం చేశాడని మాదాపూర్‌లోని పోలీస్ స్టేషన్‌లో ఆమె ఫిర్యాదు చేసింది. అక్కడ పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి, దర్యాప్తు కోసం పోచారం పోలీస్ స్టేషన్‌కు కేసును బదిలీ చేశారు.

కానిస్టేబుల్ ఆత్మహత్యాయత్నం

- సస్పెన్షన్ ఎత్తివేయకపోవడంతో మనస్తాపం చెంది..
- ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్న వైనం

చిలకలగూడ: పలుమార్లు విజ్ఞప్తి చేసినా సస్పెన్షన్ ఎత్తివేయకపోవడం, ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో ఓ కానిస్టేబుల్ ఒంటిపై పెట్రోలు పోసుకుని నిప్పంటించుకున్న ఘటన చిలకలగూడ ఠాణా పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ అనుదీప్ తెలిపిన వివరాల ప్రకారం..సికింద్రాబాద్ రాణిగంజ్ అంబేడ్కర్‌నగర్‌కు చెందిన తూము కిరణ్ బాబు 2010లో పోలీస్ కానిస్టేబుల్‌గా సెలెక్ట్ అయ్యాడు. నగరంలోని మీర్‌చౌక్ ఠాణాలో విధులు నిర్వహిస్తున్న సమయంలో 2017లో సస్పెన్షన్‌కు గురయ్యాడు. అప్పటి నుంచి సస్పెన్షన్ తొలగించాలని పలుమార్లు పోలీస్ ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేసుకున్నా ఫలితం లేకపోయింది. ఆర్థిక ఇబ్బందులు చుట్టుముట్టాయి. పిల్లలకు స్కూలు ఫీజు కట్టలేని దుస్థితి నెలకొంది. జీవితం భారమైంది. ఈ నేపథ్యంలో సోమవారం రాత్రి చిలకలగూడ ఠాణా పరిధిలోని శ్రీనివాసనగర్ మోహన్‌రెడ్డి నగర్‌లోని అత్తవారింటికి వచ్చాడు. తాను పడుతున్న ఇబ్బందులు భార్య సారికకు వివరించాడు. అందరూ ఇంట్లో ఉన్న సమయంలో వీధిలోకి వచ్చి బాటిల్‌తో వెంట తీసుకువచ్చిన పెట్రోల్‌ను ఒంటిపై పోసుకుని నిప్పంటించుకున్నాడు. బాధకు తాళలేక గట్టిగా కేకలు వేయడంతో కుటుంబ సభ్యులతోపాటు స్థానికులు గమనించి మంటలను ఆర్పివేసి చికిత్స నిమిత్తం సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించారు. 60 శాతం కాలిన గాయాలతో చికిత్స పొందుతున్న కిరణ్ ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. బాధితుడు కిరణ్‌కు భార్య సారిక, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. చేయని తప్పుకు సస్పెండ్ చేశారని, సస్పెన్షన్ తొలగించాలని కోరినా ఫలితం లేకపోయిందని, ఎనిమిదేళ్ల పాటు తీవ్ర మానసిక క్షోభ అనుభవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డానని బాధితుడు కిరణ్ తన వాంగ్మూలంలో పేర్కొన్నట్లు తెలిసింది. గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కిరణ్‌ను చిలకలగూడ ఏసీపీ శశాంక్‌రెడ్డి మంగళవారం ఉదయం పరామర్శించి, ఆత్మహత్యయత్నానికి గల కారణాలపై ఆరా తీశారు. తమ కుటుంబానికి న్యాయం చేయాలని కిరణ్ భార్య సారిక పోలీస్ ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేసింది.

పట్టపగలు రౌడీషీటర్ దారుణ హత్య



మహబూబ్

దుండిగల్: పట్టపగలు అందరూ చూస్తుండగానే ముగ్గురు గుర్తు తెలియని వ్యక్తులు మారణాయుధాలతో అతి కిరాతంగా దాడి చేసి ఓ వ్యక్తిని హతమార్చారు. ఈ సంఘటన జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. బాలానగర్ డీసీపీ సురేష్ కథనం ప్రకారం.. కూకట్‌పల్లి ఎల్లమ్మబండ ప్రధాన రహదారిలో ఉన్న గుడ్‌విల్ హోటల్‌లో మంగళవారం మధ్యాహ్నం ఓ వ్యక్తి టీ తాగుతున్నాడు. అదే సమయంలో ఆటోలో వచ్చిన ముగ్గురు గుర్తు తెలియని వ్యక్తులు ఒక్కసారిగా మూకుమ్మడిగా అతడిపై కత్తులతో దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన ఆ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. వచ్చిన ఆటోలోనే ముగ్గురు వ్యక్తులు పరారయ్యారు. స్థానికుల సమాచారం మేరకు అక్కడి చేరుకున్న పోలీసులు శవపంచనామా నిర్వహించారు. సంఘటన స్థలానికి చేరుకున్న బాలానగర్ డీసీపీ సురేష్ కుమార్ వివరాలపై ఆరా తీశారు. మృతుడు ముషీరాబాద్ ప్రాంతానికి చెందిన ఎం.డి మహబూబ్(35)గా గుర్తించారు. మృతుడు రౌడీషీటర్ అని, అతనిపై ఇప్పటికే 13 కేసులు ఉండగా..పటాన్‌చెరులో ఓ హత్య కేసులో నిందితుడిగా పోలీసులు గుర్తించారు.

పాత కక్షలతోనే హత్య?

పాత కక్షల నేపథ్యంలోనే ఈ హత్య జరిగిందా..లేక ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయా అన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మహబూబ్‌పై ఇప్పటికే 13 కేసులు నమోదు కాగా అందులో ఒక హత్య కేసు, మిగతా అన్ని దొంగతనాల కేసులు ఉన్నాయి. ముషీరాబాద్ నుంచి ఇక్కడికి ఎవరైనా రప్పించి హత్య చేశారా..అని ఆరాతీస్తున్నారు. ఇప్పటికే పరిసర ప్రాంతాల్లోని సీసీ కెమెరాల పుటేజీని పోలీసులు పరిశీలిస్తున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నోటీసులు ఇచ్చేందుకు వెళ్లిన పోలీసులపై దాడి

రహమత్‌నగర్: నోటీసులు జారీ చేసేందుకు వెళ్లిన పోలీసులపై దాడి చేసిన ఘటన బోరబండ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఆర్ఆర్ పురం సైట్–3 బస్తీకి చెందిన జయమ్మ ఆమె ఇద్దరు కూమారులు ఓ ఇంట్లోకి అక్రమంగా ప్రవేశించారన్న ఫిర్యాదు మేరకు బోరబండ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో వారికి నోటీసులు జారీ చేసేందుకు సోమవారం సెక్టార్ ఎస్ఐ స్వప్నా రెడ్డి, మహిళా కానిస్టేబుళ్లు భావన, కృష్ణవేణి సైట్–3లోని జయమ్మ నివాసానికి వెళ్లారు. ఆగ్రహించిన జయమ్మ ఎస్సై, కానిస్టేబుళ్లపై దాడికి పాల్పడింది. దీంతో జయమ్మను పోలీసులు స్టేషన్‌కు తీసుకొచ్చారు. సమాచారం అందుకున్న జయమ్మ కూమారులు విజయ భాస్కర్, రాజశేఖర్ ఠాణాకు వచ్చి విధి నిర్వహణలో ఉన్న ఏఆర్ కానిస్టేబుల్ శ్రీకాంత్‌పై దాడి చేశారు. వారిని అదుపులోకి తీసుకున్న పోలీసులు కానిస్టేబుల్ భావన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వాటర్ ట్యాంకర్ ఢీకొని యువకుడి దుర్మరణం



నిఖిల్ (ఫైల్)

నిజాంపేట్: నగర శివారులోని ప్రగతినగర్ ఎలీప్ సర్కిల్ సమీపంలో మంగళవారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. వేగంగా వస్తున్న ఒక వాటర్ ట్యాంకర్ అదుపుతప్పి ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో బైకు నడుపుతున్న బీటెక్ విద్యార్థి నిఖిల్ అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం మధ్యాహ్న సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. వాటర్ ట్యాంకర్ డ్రైవర్ నిర్లక్ష్యంగా, అతివేగంగా నడపడమే ఈ ప్రమాదానికి ప్రధాన కారణమని తెలుస్తోంది. ప్రమాదం జరిగిన వెంటనే ట్యాంకర్ డ్రైవర్ వాహనాన్ని వదిలి పారిపోయినట్లు సమాచారం. ఈ ఘటనతో ఆ ప్రాంతంలో భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని యువకుడి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ట్యాంకర్ డ్రైవర్ కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

కొండాపూర్‌లో అక్రమ బ్లాస్టింగ్

- స్కూల్‌లో పడ్డ బండరాళ్లు
- తృటిలో తప్పిన పెను ప్రమాదం

గచ్చిబౌలి: కొండాపూర్‌లో నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన బ్లాస్టింగ్‌తో పక్కన్నే ఉన్న చిరెక్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో బండ రాళ్లు పడటంతో విద్యార్థులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. రాళ్లు పడ్డ ప్రాంతంలో విద్యార్థులు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. పోలీసులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. కొండాపూర్‌లో ఓ రియల్‌ఎస్టేట్ సంస్థ సైట్‌లో మంగళవారం మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో బండ రాళ్లు పగులగొట్టేందుకు బ్లాస్టింగ్ చేపట్టారు. కాంట్రాక్టర్ కంట్రోల్ బ్లాస్టింగ్ చేయకపోవడంతో సైట్‌ను ఆనుకొని ఉన్న చిరెక్ ఇంటర్నేషనల్ స్కూల్ ఆవరణలో ఎగిరి బండ రాళ్లు పడ్డాయి. ఆ సమయంలో కొంత మంది విద్యార్థులు ఆటలు ఆడుకుంటుండగా మరికొంత మంది లంచ్ బ్రేక్ కావడంతో ఆవరణలో ఉన్నారు. బండరాళ్లు ఉవ్వెత్తున దూసుకురావడంతో విద్యార్థులు ఆందోళనతో తరగతి గదుల్లోకి పరుగులు తీశారు. సరైన జాగ్రత్తలు తీసుకోకుండా బ్లాస్టింగ్ చేయడంతో బండరాళ్లు స్కూల్‌లో పడ్డాయని వైస్ ప్రిన్సిపాల్ రంజిత్ గచ్చిబౌలి పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. బ్లాస్టింగ్ ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

బెట్టింగ్‌లో నష్టపోయి..

పోస్టల్ ఉద్యోగి ఆత్మహత్య

హస్తినాపురం: ఆన్‌లైన్ బెట్టింగ్‌లో ఆర్థికంగా నష్టపోయిన పోస్టల్ ఉద్యోగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వనస్థలిపురం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మన్సురాబాద్ డివిజన్ సహారా స్టేట్స్ కాలనీలో నివాసం ఉంటున్న ఆనెం నరేశ్(38) స్థానికంగా ఉన్న ఆటోనగర్ పోస్టాఫీస్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. భార్య కీర్తి, పాపతో కలిసి నివాసం ఉంటున్నాడు. గత కొన్నేళ్లుగా ఆన్‌లైన్ బెట్టింగ్‌కు బానిసై రూ.15 లక్షలు నష్టపోయాడు. దీంతో ఆర్థికంగా ఇబ్బందుల్లో కూరుకుపోయిన నరేశ్ అప్పులు తీర్చేందుకు వచ్చిన జీతం సరిపోకపోవడంతో ఆందోళనకు గురయ్యాడు. ఈ క్రమంలో మంగళవారం భార్య బయటికి వెళ్లిన సమయంలో ఇంట్లోనే ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇంటికి వచ్చిన భార్య కీర్తి ఉరివేసుకున్న భర్తను చూసి భయంతో గట్టిగా కేకలు వేయడంతో ఇరుగు పొరుగువారు వచ్చారు. వనస్థలిపురం పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతుని జేబులో సూసైడ్ లెటర్ దొరికిందని, అందులో తన చావుకు ఎవరూ కారణం కాదని, బెట్టింగ్ గేమ్‌లో డబ్బులు పెట్టి నష్టపోయాయని, దీంతో ఏంచేయాలో అర్థంకాక ఆత్మహత్యకు పాల్పడుతున్నట్లు రాశాడని పోలీసులు తెలిపారు. కీర్తి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉస్మానియా ఆసుపత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నెల్లూరు ఎంపీ కుమారుడిని అంటూ..

మోసాలకు పాల్పడుతున్న వ్యక్తి అరెస్టు



డాక్టర్‌గా చెలామణి అవుతున్న వెంకటేశ్వర్లు (ఫైల్)

కేపీహెచ్‌బీకాలనీ: నెల్లూరు ఎంపీ కుమారుడిని అంటూ నగరంలోని ప్రముఖ ఆసుపత్రిలో న్యూరో సర్జన్‌గా పనిచేస్తున్నట్లు నమ్మించి మోసాలకు పాల్పడుతున్న కరుడు గట్టిన మోసగాడిని కేపీహెచ్‌బీ పోలీసులు అరెస్టు చేసి మంగళవారం రిమాండ్‌కు తరలించారు. ఇతనిపై గతంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రాంతాల్లో 14 చీటింగ్ కేసులు ఉన్నట్లు గుర్తించారు. కేపీహెచ్‌బీ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్‌రెడ్డి మీడియాకు తెలిపిన వివరాల ప్రకారం ఏపీలోని నెల్లూరు జిల్లాకు చెందిన వాయిల వెంకటేశ్వర్లు (29) బీటెక్ వరకు చదువుకున్నాడు. చదువుకు తగిన ఉద్యోగం రాకపోవడంతో పాటు జల్సాలకు అలవాటు పడి మోసాలకు పాల్పడటం మొదలు పెట్టాడు. తనకు తాను నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కొడుకుగా చెప్పుకుంటూ వీఐపీగా చెలామణి అవుతూ నగరంలోని ప్రముఖ ఆసుపత్రిలో న్యూరో సర్జన్ డా.విక్రాంత్ రెడ్డి అనే నకిలీ పేరుతో కాలం గడుపుతున్నాడు. ఇదే క్రమంలో కేపీహెచ్‌బీ కాలనీలోని సితార ఉమెన్స్ పీజీ హాస్టల్‌లో తన బంధువులు, జూనియర్లను చేర్పించే నెపంతో నిర్వాహకురాలితో పరిచయం పెంచుకున్నాడు. నాలుగుసార్లు హాస్టల్‌ను సందర్శించి..భోజనం చేసి తాను జూబ్లీహిల్స్‌లో జ్యువెలరీ షాపు కూడా నడుపుతున్నానని నమ్మించాడు. హాస్టల్ నిర్వాహకురాలి మెడలోని నాలుగు తులాల బంగారు గొలుసును రీ మోడలింగ్ చేస్తానని తీసుకున్నాడు. రీమోడలింగ్ కోసం మరింత బంగారం అవసరమని చెప్పి, ఆమె వద్ద నుంచి ఆన్‌లైన్‌లో 55 వేలు, నగదు రూపంలో 45 వేల రూపాయలు తీసుకున్నాడు. మొత్తం లక్ష నగదుతో పాటు, 4 తులాల బంగారు గొలుసు తీసుకున్న తర్వాత ఫోన్ స్విచ్ ఆఫ్ చేశాడు. దీంతో బాధితురాలు కేపీహెచ్‌బీ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టి నకిలీ డాక్టర్ గుట్టు రట్టు చేశారు. జేఎన్‌టీయూ ట్రాఫిక్ సిగ్నల్ వద్ద కారులో వెళుతున్న వెంకటేశ్వర్లును సోమవారం సాయంత్రం అదుపులోకి తీసుకున్నారు. స్టేషన్‌కు తరలించి విచారించగా చేసిన నేరాన్ని అంగీకరించాడు. ఇతనిపై జూబ్లీహిల్స్, గోపాలపురం పోలీస్‌స్టేషన్‌లో కూడా చీటింగ్ కేసులు ఉన్నట్లు గుర్తించారు. ఆంధ్రప్రదేశ్‌లోని పలు జిల్లాల్లో ఇతనిపై వివిధ పోలీస్ స్టేషన్‌లలో 11 కేసులు నమోదయ్యాయి. వీఐపీగా నమ్మించేందుకు పెద్దపెద్ద కార్లు, చుట్టూ బౌన్సర్లను కూడా పెట్టుకుని తిరగడం ఇతని ప్రత్యేకత అని పోలీసులు తెలిపారు. కాగా మోసగాడిని అరెస్టు చేసిన కేపీహెచ్‌బీ పోలీసులను బాలానగర్ డీసీపీ కె.సురేష్ కుమార్, కూకట్‌పల్లి ఏసీపీ ఇ.రవి కిరణ్‌రెడ్డి అభినందించారు.

బర్త్ డే రోజే.. డెత్ డే..


విషాదం నింపిన రోడ్డు ప్రమాదం..



ప్రమాదానికి ముందు కేక్ కట్ చేస్తున్న అనిల్

బంజారాహిల్స్: స్నేహితులతో కలిసి పుట్టిన రోజు వేడుకలు జరుపుకుని హాస్టల్‌కు బైక్‌పై తిరిగి వెళ్తుండగా అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టడంతో కేక్ కట్ చేసిన అరగంటకే యువకుడు మృత్యువాత పడ్డ ఘటన జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే..నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి మండలం ముక్కురాళ్ల గ్రామానికి చెందిన ఎర్రగొల్ల అనిల్ (23) అమీర్‌పేటలోని ఓ హాస్టల్‌లో ఉంటూ సమీపంలో ఉన్న మైండ్ మ్యాప్స్ వీఎఫ్ఎక్స్ స్టూడియోస్‌లో ఎడిటింగ్ పనిచేస్తుంటాడు. మంగళవారం పుట్టినరోజు కావడంతో అనిల్ తన స్నేహితులు జాన్‌పాల్, మహేష్, నాగరాజు, వెంకటేష్, భాను తదితరులతో కలిసి బైక్‌లపై సోమవారం అర్ధరాత్రి ఒంటి గంట ప్రాంతంలో దుర్గం చెరువు కేబుల్ బ్రిడ్జికి వెళ్లారు. తమతో పాటు తెచ్చుకున్న కేక్‌ను అనిల్ కట్ చేసిన అనంతరం స్నేహితులంతా అక్కడే సరదాగా గడిపి తెల్లవారుజామున 2 గంటల సమయంలో బయలుదేరారు. ఈ క్రమంలో జాన్‌పాల్ బైక్ నడుపుతుండగా అనిల్ వెనుక కూర్చొన్నాడు. మిగతా స్నేహితులంతా ఎవరి బైక్‌లపై వారు అనుసరించారు. అనిల్ ఎక్కిన బైక్‌ను జాన్‌పాల్ అధిక వేగంతో దుర్గం చెరువు కేబుల్ బ్రిడ్జి మీద నుంచి జూబ్లీహిల్స్ రోడ్డు నెంబర్–45 ఫ్లైఓవర్ వైపు దూసుకెళ్తుండగా మలుపు వద్ద బైక్ అదుపుతప్పింది. దీంతో అనిల్ కిందపడగా కొద్ది దూరం వరకు రోడ్డుపై రాసుకుంటూ వెళ్లి అక్కడికక్కడే మృతి చెందాడు. బైక్ నడుపుతున్న జాన్‌పాల్‌కు స్వల్ప గాయాలయ్యాయి. వెనుక వస్తున్న స్నేహితులంతా తల పగిలి రక్తపు మడుగులో విలవిల్లాడుతున్న అనిల్‌ను వెంటనే ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. పుట్టినరోజు కావడంతో అంతకు ఆరు గంటల ముందే వీరు హాస్టల్‌లోనే మద్యం సేవించినట్లు పోలీసుల అదుపులో ఉన్న జాన్‌పాల్ వెల్లడించారు. జాన్‌పాల్‌కు బ్రీత్ ఎనలైజర్ టెస్ట్ నిర్వహించగా మద్యం సేవించినట్లుగా నమోదైంది. అర్ధరాత్రి మద్యం మత్తులో అదుపుతప్పిన వేగంతో బైక్‌పై దూసుకెళ్తుండడంతో మలుపు వద్ద కంట్రోల్ చేయలేక డివైడర్‌ను ఢీకొట్టినట్లుగా పోలీసుల దర్యాప్తులో తేలింది. కేబుల్ బ్రిడ్జి వద్ద నుంచి బయలుదేరే ముందు అనిల్ తన బర్త్ డే కేక్‌ను చేతిలో పట్టుకొని బైక్‌పై కూర్చోగా ఈ ప్రమాదంలో అనిల్ కిందపడ్డ తర్వాత కేక్ రోడ్డంతా చిందరవందరగా పడిపోయింది. బర్త్ డే రోజు ఈ ఘటన చోటుచేసుకోవడంతో కుటుంబ సభ్యులతో పాటు స్నేహితుల రోదనలకు అంతులేకుండాపోయింది. జూబ్లీహిల్స్ పోలీసులు ప్రమాదానికి కారకుడైన జాన్‌పాల్‌ను అరెస్టు చేసి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మాజీ ఎంపీ కారు సైరన్ తొలగింపు.. పోలీసులతో వాగ్వాదం



సైరన్ తొలగిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

బంజారాహిల్స్: 'నేను తాజా మాజీ ఎంపీని. నా కారు ఆపి సైరన్ తొలగిస్తారా.. నేను ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వాడిని.. నీ ప్రాంతం కాకున్నా సైరన్ తొలగిస్తారా.. ఇక్కడ ఏ మంత్రికి ఫోన్ చేయమంటారు..?' అంటూ ఏపీకి చెందిన ఓ మాజీ ఎంపీ బంజారాహిల్స్ ట్రాఫిక్ పోలీసులపై రుసరుసలాడారు. మంగళవారం ఉదయం బంజారాహిల్స్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సాయిప్రకాష్‌గౌడ్ ఆధ్వర్యంలో ఎస్ఐ గోవర్ధన్‌రెడ్డి తదితరులు సైరన్లు, సైలెన్సర్లపై స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. అదే సమయంలో ఓ కారును ఆపగా, అందులో కూర్చొన్న వ్యక్తి తాను మాజీ ఎంపీనని, తాము సైరన్లు పెట్టుకోవచ్చని, ఏపీలో కాకుండా ఇక్కడ తొలగించడానికి మీకు ఏమి హక్కు ఉందంటూ నిలదీశాడు. ఎంపీలైనా సరే సైరన్లు పెట్టుకోవద్దు సార్ అంటూ పోలీసులు చెబుతున్నా వినిపించుకోకుండా ఇక్కడ మంత్రులంతా తనకు తెలుసునని, ఎవరికి ఫోన్ చేయమంటావంటూ ఆగ్రహించారు. అయితే స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా మోటారు వాహన చట్టానికి విరుద్ధంగా అక్రమంగా ఏర్పాటుచేసిన సైరన్లను తొలగిస్తున్నామని, ఇది కూడా తొలగించాల్సిందేనని సూచిస్తూ ఆయన కారులో ఏర్పాటుచేసిన సైరన్‌ను పోలీసులు తొలగించారు.

నగరంలో భారీ వర్షం

సాక్షి, సిటీబ్యూరో: మహానగరంలో మంగళవారం రాత్రి భారీ వర్షం కురిసింది. ప్రధాన రహదారులు జలమయమయ్యాయి. వరద నీరు రోడ్లపై చేరడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అక్కడక్కడ ట్రాఫిక్ స్థంభించింది. వాతావరణ శాఖ ముందస్తుగా హెచ్చరించినట్లుగానే సాయంత్రం ఆకాశంలో కారు మబ్బులు కమ్ముకోగా రాత్రి ఎనిమిది తర్వాత వర్షం కురిసింది. రాత్రి తొమ్మిది గంటల వరకు అత్యధికంగా లింగంపల్లి వద్ద 5.1 సెంటీమీటర వర్ష పాతం నమోదైంది. చందానగర్‌లో 4.4, యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ వద్ద 4.0, రాంచంద్రాపురంలో 3.7, హఫీజ్‌పేటలో 3, ఎంసీఆర్‌హెచ్ఆర్‌డీ వద్ద 2.6, గచ్చిబౌలిలో 2.4, బోరబండలో 2.3, మియాపూర్‌లో 2 సెం.మీ వర్షపాతం నమోదైంది. మరో నాలుగు రోజులు తేలికపాటి నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది.

పారిశుద్ధ్య కార్మికులు వెంట వెంటనే చెత్త తరలించాలి

రహమత్‌నగర్: రహమత్‌నగర్, బోరబండ డివిజన్‌లలో జీహెచ్‌ఎంసీ అధికారులు మంగళవారం పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. అడిషనల్ కమిషనర్ శానిటేషన్ అండ్ హెల్త్ రఘు ప్రసాద్, సర్కిల్ 19 డీఎంసీ రజినీకాంత్ రెడ్డి అధికారులతో కలిసి డివిజన్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులు ఎప్పటికప్పుడు చెత్త తరలించాలని సూచించారు. ఆయా ప్రాంతాల్లోని డంపింగ్ పాయింట్ల వద్ద ప్రజలతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం జీహెచ్‌ఎంసీ సిబ్బందికి పలు సూచనలు చేశారు.

టీటీడీలో శాస్త్రోక్తంగా పవిత్రోత్సవాలు ప్రారంభం



స్వామి వారికి వైదిక కార్యక్రమాలు చేస్తున్న పూజారులు

హిమాయత్‌నగర్: హిమాయత్‌నగర్‌లోని శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో పవిత్రోత్సవాలు మంగళవారం శాస్త్రోక్తంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు పవిత్ర ప్రతిష్ఠ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వర స్వామి వారిని పవిత్ర మండపంలోని యాగశాలకు తీసుకొచ్చారు. అక్కడ హోమాలు తదితర వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం సంపంగి ప్రాకారంలో వేడుకగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. ఇందులో పాలు, పెరుగు, తేనె, చందనం, పసుపు తదితర సుగంధ ద్రవ్యాలతో విశేషంగా అభిషేకం చేశారు. ఈ సందర్భంగా వేద పండితులు పంచసూక్తాలను పఠించారు. ఆ తర్వాత పవిత్ర ప్రతిష్ఠ జరిగింది. మధ్యాహ్నం స్వామి, అమ్మవార్లకు విశేష సమర్పణ చేశారు.

పగలూ.. వెలుగులు



పట్టపగలే వెలుగుతున్న లైట్లు

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్‌లోని బాబూనాయుడునగర్ బస్తీలో ఆదివారం నిర్వహించిన బోనాల పండగ సందర్భంగా మెర్క్యూరీ లైట్లు ఏర్పాటు చేశారు. అయితే పండగ ముగిసిన తర్వాత వాటిని తొలగించాల్సి ఉండగా సంబంధిత సిబ్బంది పట్టించుకోకపోవడంతో అవి రెండు రోజుల నుంచి పగలూ, రాత్రీ తేడా లేకుండా వెలుగుతూనే ఉన్నాయి. అంతేకాకుండా వినాయక నగర్ బస్తీలో పట్టపగలే వీధి దీపాలు వెలుగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు.

కుల దురహంకార హత్యకు కారకుడిని అరెస్ట్ చేయాలి

హిమాయత్‌నగర్: సల్లూరి మల్లేష్ కుల దురహంకార హత్యకు ప్రధాన కారకుడు దమ్మన్నపేట మొల్కూరి చంద్రయ్యను వెంటనే అరెస్ట్ చేయాలని హెచ్‌సీయూ ప్రొ.కె.లక్ష్మీనారాయణ, కుల అసమానతల నిర్మూలన పోరాట సమితి ఆలిండియా ఇండియా కన్వీనర్ బండారి లక్ష్మయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోవిందు, ప్రొ.వెంకటదాసు మారేడు, ప్రొ. అన్వర్‌ఖాన్, రచయిత ఇంద్రవెల్లి రమేష్ డిమాండ్ చేశారు. బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో కుల అసమానతల నిర్మూలన పోరాట సమితి ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. సల్లూరి మల్లేష్ కుల దురహంకార హత్యలో ప్రత్యక్షంగా పరోక్షంగా పాల్గొన్న నిందితుల కాల్ డేటాను బయట పెట్టాలన్నారు. నిందితులను రక్షించడానికి ప్రయత్నిస్తున్న జగిత్యాల డీఎస్పీని నేర విచారణ అధికారి బాధ్యత నుంచి తప్పించి, నిజాయతీ గల అధికారిని నియమించాలని డిమాండ్ చేశారు.

ఇదేం దుస్థితి?

- రూ.కోట్లు వెచ్చించి సంపుల నిర్మాణం
- మోటార్లు పనిచేయకపోవడంతో తిప్పలు
- వరదనీటి సంపుల మీద నడుం లోతు వరద
- కేసీపీ గెస్ట్‌హౌస్ చౌరస్తాలో ట్రాఫిక్ ఇక్కట్లు



సోమాజిగూడ కేసీపీ గెస్ట్‌హౌస్ చౌరస్తాలో వరద నీటి సంపులపై భారీగా నిలిచిన వరద

బంజారాహిల్స్: సోమాజిగూడ కేసీపీ గెస్ట్‌హౌస్ చౌరస్తాలో ప్రతి సంవత్సరం వర్షాకాలంలో నడుంలోతు వరద నిలిచిపోయి వాహనాల రాకపోకలు స్తంభించడమే కాకుండా పాదచారులు ప్రమాదాల బారిన పడుతుండేవారు. ఈ సమస్యకు చెక్ పెట్టేందుకు జీహెచ్‌ఎంసీ కోట్లాది రూపాయలు వెచ్చించి వరద నిలిచిపోయేవిధంగా భారీ సంపుల నిర్మాణాలు చేపట్టింది. ఇక్కడ పది లక్షల లీటర్ల వరద నీరు నిల్వ ఉండే విధంగా సంపు నిర్మాణం చేపట్టారు. వరద ఈ సంపులోకి వెళ్లగానే ఇక్కడ ఉన్న మోటార్లు ఆన్ చేస్తే పైపుల ద్వారా నాలాల్లోకి నీరు వెళ్లే విధంగా నిర్మించారు. అయితే సోమవారం సాయంత్రం కురిసిన కుండపోత వర్షానికి ఈ సంపులు ఏమాత్రం ఉపయోగపడలేదు. వచ్చిన వరద నీరంతా రోడ్లపైనే నడుంలోతు నిలిచిపోయింది. ఫలితంగా ట్రాఫిక్ స్తంభించిపోయింది. పాదచారులు ముందుకు వెళ్లలేని పరిస్థితులు తలెత్తాయి. సంపు నిండిపోయి వరదంతా రోడ్లను ముంచెత్తడంతో 8 గంటల పాటు వరదతో వాహనదారులు కుస్తీ పట్టారు. సంపు నిండిన తర్వాత కరెంటు మోటార్లు ఆన్‌చేసి వరద నీటిని నాలాల్లోకి తరలించాల్సి ఉండగా ఈ మోటార్లు పనిచేయలేదు. ఇక్కడ జీహెచ్‌ఎంసీ మాన్సూన్ యాక్షన్ టీమ్‌లు కనిపించలేదు. హైడ్రా సిబ్బంది అడ్రస్ లేదు. జీహెచ్‌ఎంసీ-హైడ్రా సిబ్బంది సమన్వయంగా మాన్సూన్ యాక్షన్ టీమ్‌లు పనిచేస్తాయని గొప్పగా ప్రకటించినా సోమవారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి వరదనీరు రోడ్లపై నిలిచిపోగా ఎక్కడా ఈ బృందాలు కనిపించలేదు. ఫలితంగా గంటల తరబడి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వరదనీరు వెళ్లే మార్గాల కోసం స్థానికులు గాలించినా అవి కూడా ఎక్కడా కనిపించలేదు. దీంతో పంజగుట్ట, అమీర్‌పేట, ఎర్రమంజిల్‌కాలనీ, ఖైరతాబాద్, సోమాజిగూడ, రాజ్‌భవన్ రోడ్ల వైపు గంటల తరబడి ట్రాఫిక్ స్తంభించిపోయి వాహనదారులు ప్రత్యక్ష నరకాన్ని చూశారు. వరదనీటి సంపుల నిర్మాణం ఉద్దేశ్యం నెరవేరకపోగా సంపుల మీదనే వరదనీరు నిలిచిపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి. జీహెచ్‌ఎంసీ నిర్వాకం ఇక్కడ స్పష్టంగా కనిపించింది. అధికారులు కూడా ఇటువైపు తొంగిచూసిన పాపానపోవడం లేదు.

నాలా ఓవర్ ఫ్లో కాకుండా చర్యలు



నాలాలో పనులు చేస్తున్న సిబ్బంది

బంజారాహిల్స్: వర్షాలు వచ్చిన ప్రతిసారి రాజ్‌భవన్ రోడ్డులో నాలా పొంగి రోడ్డుపైకి మురుగు వస్తున్నట్లు గుర్తించిన అధికారుల ఎక్కడైతే నాలా ఓపెన్‌గా ఉందో దానిపై శ్లాబ్ నిర్మించడంతో పాటు నాలాలో బెడ్ నిర్మాణ పనులు చేస్తున్నారు. ఈ నిర్మాణ పనులు పూర్తయితే ఎగువ ప్రాంతాల నుంచి హుస్సేన్‌సాగర్‌కు అనుసంధానంగా ఉండే నాలాలో వరద నీరు సులువుగా వెళ్తుందని రోడ్డుపైకి వచ్చే అవకాశం ఉండదని జీహెచ్‌ఎంసీ అధికారులు చెబుతున్నారు. మంగళవారం ఈ పనులను ప్రారంభించినట్లు డీఈ చైతన్య తెలిపారు. వారం రోజుల్లో ఈ పనులు పూర్తయ్యే అవకాశం ఉందని వారు తెలిపారు.

మతోన్మాదానికి వ్యతిరేకంగా జోగిపేటలో సభ 17న



చలో జోగిపేట పోస్టర్ ఆవిష్కరణలో..

పంజగుట్ట: మతోన్మాదాన్ని అంతం చేసేందుకు గాంధీ, అంబేడ్కర్ ఆశయాలను సాధించేందుకు జైభారత్ సామాజిక విప్లవ రణభేరి ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా 100 సభలు నిర్వహించనున్నట్లు రణభేరి కన్వీనర్ ముప్పారం ప్రకాశం తెలిపారు. మొదటి సభ ఈ నెల 17వ తేదీన ఆందోల్‌లోని జోగిపేట వాసవీ కల్యాణమండపంలో నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సభ పోస్టర్‌ను కో కన్వీనర్ జీవన్ జోయల్‌తో కలిసి మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆనాడు అంబేడ్కర్ కుల నిర్మూలన జరిగితేనే దేశం బాగుపడుతుందని అన్నారని, ఆయన భావజాలాన్ని అంబేడ్కర్ వాదులు ప్రజల్లోకి తీసుకెళ్లలేక పోతున్నారన్నారు. గాంధీని అగ్రకులం వారిగా చూపుతూ దళితులకు వ్యతిరేకంగా చూపించే కుట్రలు జరిగాయని, కానీ గాంధీ కూడా కుల నిర్మూలన కోరుకున్నారని గుర్తుచేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలను ఐక్యం చేసి కుల నిర్మూలనకు కృషి చేస్తామని వారు పేర్కొన్నారు. కార్యదర్శి లోక్‌నాథ్, జ్వాల, వంశీ, కోల సత్యనారాయణ, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

కష్టపడి చదివితే ఏదైనా సాధ్యం



ఖైరతాబాద్ మండల డిప్యూటీ ఎడ్యుకేషనల్ అధికారి సామ్యూల్‌రాజ్ తదితరులు

బంజారాహిల్స్: కష్టపడి చదివిన వారికే గుర్తింపు ఉంటుందని, వారే ఏదైనా సాధించగలరని ఖైరతాబాద్ మండల డిప్యూటీ ఎడ్యుకేషనల్ అధికారి సామ్యూల్ రాజ్ అన్నారు. రాజ్‌భవన్ పాఠశాలలో మంగళవారం జరిగిన ప్రతిభా పురస్కారాల కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని విద్యార్థులకు పురస్కారాలు అందజేశారు. 550 మార్కులకు పైగా వచ్చిన విద్యార్థుల తల్లిదండ్రులను పాఠశాల తరఫున సన్మానించారు. దాదాపు రూ.83 వేలను 22 మంది ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు నగదు పురస్కారాలుగా అందజేశారు. ఇటీవలే ఓ విద్యార్థి తండ్రి మరణించడంతో ఆ విద్యార్థి కుటుంబానికి రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచి మార్కులు సాధించిన వారికి తోడ్పాటు అందించేందుకు దాతలు ముందుకు వస్తున్నారని చెప్పారు. రాజ్‌భవన్ పాఠశాలలో చదివే విద్యార్థులు పాఠశాలకే కాకుండా వారి తల్లిదండ్రులకు కూడా మంచి పేరు తెస్తున్నారని తెలిపారు. పాఠశాల విద్యార్థులకు ట్రిపుల్ ఐటీ బాసరలో సీటు రావడం అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వికారుద్దీన్, దాతలు ధర్మారావు, రిటైర్డ్ హెచ్‌ఎం కరుణశ్రీ, పాఠశాల 1989 పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

తెల్లవారుజాము వరకు లైన్ క్లియర్



బంజారాహిల్స్ రోడ్డు నంబర్-1లో విరిగిపడ్డ చెట్టును కొట్టేస్తున్న హైడ్రా సిబ్బంది

బంజారాహిల్స్: సోమవారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి బంజారాహిల్స్ రోడ్డు నంబర్-1లోని నిమ్స్ వెనుక ఓ భారీ చెట్టు కుప్పకూలి ట్రాఫిక్‌కు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి. సమాచారం అందుకున్న వెస్ట్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ కట్టా హరిప్రసాద్ సంబంధిత సిబ్బందితో అక్కడికి చేరుకుని హైడ్రాకు సమాచారం ఇచ్చారు. హైడ్రా సిబ్బంది చెట్టును తొలగించే పనులు పెద్ద ఎత్తున చేపట్టారు. మంగళవారం తెల్లవారుజామున 5 గంటల వరకు చెట్టు కొమ్మలు నరికేసి పక్కకు తొలగించారు. రాత్రి నుంచి తెల్లవారుజాము వరకు ట్రాఫిక్ ఏసీపీ అక్కడే ఉండి పరిస్థితిని సమీక్షించారు.

పట్టపగలు పైప్‌లైన్ పనులు



జర్నలిస్ట్‌కాలనీ చౌరస్తాలో పైప్‌లైన్ తవ్వకాలు

బంజారాహిల్స్: జీహెచ్‌ఎంసీ, జలమండలి ఇంజినీర్ల మధ్య సమన్వయం లేకపోవడం, ఇంజినీరింగ్ వ్యవస్థ లోపాలు, ప్రణాళికాబద్ధంగా రోడ్లు, పైప్‌లైన్ తవ్వకాలు లేకపోవడంతో వాహనదారులు, స్థానికులు ప్రత్యక్ష నరకాన్ని చూస్తున్నారు. ట్రాఫిక్ పోలీసులు దగ్గరుండి తవ్వకాల పనుల వద్ద బందోబస్తు ఏర్పాటు చేస్తూ పట్టపగలే పనులు చేసుకునేందుకు ప్రత్యక్షంగా అవకాశాలు కల్పిస్తుండటంతో వాహనదారులు ట్రాఫిక్‌జాంలో ఇరుక్కుని గంటల తరబడి నరకాన్ని చవిచూస్తున్నారు. జూబ్లీహిల్స్ డివిజన్ పరిధిలోని జర్నలిస్ట్‌కాలనీ చౌరస్తా నుంచి సొసైటీ కార్యాలయం మీదుగా కాలనీ వైపు రోడ్డు వేసేందుకు ఇటీవల జీహెచ్‌ఎంసీ పనులు చేపట్టింది. రోడ్డంతా తవ్వేసిన తర్వాత జలమండలి ఇంజినీర్లు ముందుకువచ్చి మేం పైప్‌లైన్లు వేయాల్సి ఉంది.. ఆ తర్వాత రోడ్డు వేయండంటూ చెప్పారు. అయితే పైప్‌లైన్ పనులకు అనుమతి లేకుండానే ఘనత వహించిన ఇంజినీర్లు ఓకే చెప్పారు. దీంతో తవ్విన రోడ్లపై జలమండలి డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణం చేపట్టింది. ట్రాఫిక్ పోలీసులు ట్రాఫిక్ మళ్లింపుతో పాటు ఇక్కడ బందోబస్తు ఏర్పాటు చేశారు. దీంతో సంబంధిత కాంట్రాక్టర్ పట్టపగలే జేసీబీలతో పనులు మొదలు పెట్టాడు. దీంతో సీవీఆర్ న్యూస్, భారతీ విద్యాభవన్, ఫిలింనగర్ వైపు, జర్నలిస్ట్‌కాలనీ, ఏబీఎన్ ఆంధ్రజ్యోతి వైపు, నందగిరిహిల్స్‌లో లేచింది మొదలు అర్ధరాత్రి వరకు ట్రాఫిక్ ఇబ్బందులు వర్ణనాతీతంగా ఉంటున్నాయి. దీనికి తోడు భారీ వర్షంతో ఇక్కడ నడుంలోతు నీరు నిలిచిపోయి గంటల తరబడి ట్రాఫిక్ స్తంభించిపోయింది. అసలు ట్రాఫిక్ పోలీసులు పట్టపగలు పైప్‌లైన్ పనులకు ఎలా అనుమతించారన్నది ప్రశ్నార్థకంగా మారింది. చలికాలంలో, వేసవి కాలంలో, రాత్రిపూట చేయాల్సిన పైప్‌లైన్లు, రోడ్డు పనులు వర్షాకాలంలో పగటి పూట దర్జాగా చేయడం ఎవరిచ్చిన అలుసు అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. స్థానిక జీహెచ్‌ఎంసీ ఇంజినీర్ల నిర్వాకానికి వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. ఏళ్ల తరబడి తిష్టవేసిన ఇంజినీర్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లతో ఇక్కడ పనులన్నీ ఇష్టారాజ్యంగా సాగుతున్నాయని, వీరికి అధికారులు కూడా భయపడుతున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి.

షేక్‌పేట మండల ప్రైవేట్ స్కూల్స్ నూతన కమిటీ ఎన్నిక

బంజారాహిల్స్: షేక్‌పేట మండల ప్రైవేట్ రికగ్నైజ్డ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్(ఎస్‌ఎంపీఆర్‌ఎస్‌ఎంఏ) నూతన కార్యవర్గం ఎన్నికైంది. అసోసియేషన్ అధ్యక్షుడిగా హిదాయత్ అలీ ఖాన్ ఎంపిక కాగా ప్రధాన కార్యదర్శిగా కట్టా సునీల్, కోశాధికారిగా రామచంద్రయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రాజ్ దేవి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా పీవీ.రామకృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు హిదాయత్ అలీ మాట్లాడుతూ మండల పరిధిలోని ప్రైవేట్ స్కూల్స్ యాజమాన్యాలు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై ప్రజాప్రతినిధులతో, అధికారులతో చర్చలు జరిపి పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు.



షేక్‌పేట మండల ప్రైవేట్ స్కూల్స్ యాజమాన్యం నూతన కమిటీ సభ్యులు

ఏడుగురు పేకాట రాయుళ్ల అరెస్టు

వెంగళరావునగర్: గుట్టుచప్పుడు కాకుండా పేకాట ఆడుతున్న ఏడుగురిని మధురానగర్ పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల కథనం ప్రకారం రహమత్‌నగర్‌లోని ఓ గృహంలో పేకాట ఆడుతున్నట్లు మధురానగర్ పోలీసులకు సమాచారం అందింది. దాంతో ఎస్ఐ శివశంకర్ తన సిబ్బందితో రహమత్‌నగర్‌లోని పేకాట ఆడుతున్న ఇంటిని చుట్టుముట్టి చెక్ చేశారు. ఇంట్లో పలువురు 3 కార్డుల పేకాట ఆడుతున్నారు. పోలీసులు పేకాట ఆడుతున్న కాకుమాను శ్రీనివాసరావు, కలగట్ట శ్రీనివాస్, ఏ.రవికాంత్, ఏ.చిన్నపెద్దయ్య, బోయ వెంకట్, పాలగుడి శ్రీనివాసులు నాయుడును అదుపులోనికి తీసుకున్నారు. అనంతరం వారి వద్ద నుంచి పేకాట సెట్, ఏడు సెల్‌ఫోన్లు, దాదాపు రూ.18 వేలు నగదు స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అకారణంగా మహిళపై దాడి

వెంగళరావునగర్: మహిళపై అకారణంగా దాడి చేసిన ఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం మధురానగర్‌కాలనీలో నివసించే జి.గీతిక ప్రైవేట్ జాబ్ చేస్తోంది. ఈ నెల 4వ తేదీన తన ఇంట్లో భోజనం చేస్తుండగా పక్క గృహంలో ఉంటున్న వసంతి చెత్త బుట్టను తీసుకువచ్చి గీతిక ఇంటి ముందు పెట్టింది. దానిని తొలగించాలని గీతిక అడగ్గా అకారణంగా వసంతి, ఆమె భర్త ఫణీంద్ర ఆమెపై దుర్భాషలాడుతూ తీవ్రంగా కొట్టారు. తన రెండేళ్ల కుమారుడి ముందు కొట్టడంతో బాబు భయపడ్డాడు. బాధితురాలు ఆస్పత్రిలో చికిత్స అనంతరం మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బీఆర్‌ఎస్‌లో సీనియర్లకు ద్రోహం



వినతిపత్రం అందిస్తున్న బూత్ ఇన్‌చార్జిలు

వెంగళరావునగర్: బీఆర్‌ఎస్‌లో సీనియర్లను పక్కన పెట్టి తీరని ద్రోహం చేస్తున్నారని యూసుఫ్‌గూడకు చెందిన 25 బూత్‌ల ఇన్‌చార్జిలు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు బీఆర్‌ఎస్ భవన్ ఇన్‌చార్జి రావుల చంద్రశేఖర్‌రెడ్డిని ఆయా బూత్‌ల ఇన్‌చార్జిలు మంగళవారం కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ మూడు అసెంబ్లీ ఎన్నికల్లో జూబ్లీహిల్స్‌లో బీఆర్‌ఎస్ గెలుపుకోసం తాము ఎన్నో కష్టనష్టాలకు ఓర్చుకుని పనులు చేశామన్నారు. ఎమ్మెల్యే మృతి చెందగానే తమను పక్కన పెట్టి కొత్తవారికి ప్రాధాన్యం ఇస్తూ అన్యాయం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇన్నాళ్లుగా పార్టీకి తోడుగా ఉంటూ వస్తున్నామన్న గౌరవం కూడా తమ పట్ల చూపడం లేదని పేర్కొన్నారు. ఇదే విషయాన్ని పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకెళ్లి తమకు న్యాయం చేయాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో యూసుఫ్‌గూడ డివిజన్‌కు చెందిన 25 బూత్‌ల సీనియర్లు ఉన్నారు.

మచ్చలేని నాయకుడు ఈటల రాజేందర్

హిమాయత్‌నగర్: తెలంగాణ ఉద్యమంలో తన ఆస్తులను సైతం అమ్మేసి ఉద్యమాన్ని నడిపిన ఈటల రాజేందర్‌పై బురద చల్లడం తగదని తెలంగాణ మన ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చొప్పరి శంకర్ ముదిరాజ్ అన్నారు. హైదర్‌గూడ మహాసభ రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శైలేంద్ర శివయ్య ముదిరాజ్‌తో కలిసి మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. పేద వర్గాల అభ్యున్నతికి రాష్ట్రంలో ఎన్నో ఉద్యమాలు నడిపిన గొప్ప నాయకుడు ఈటల రాజేందర్ అని కొనియాడారు. ఆయనపై తప్పుడు ప్రచారం చేస్తే కాంగ్రెస్ పార్టీకి రాష్ట్రంలో పుట్టగతులు లేకుండా పోతాయన్నారు. కేసీఆర్ ప్రభుత్వం అవినీతికి పాల్పడితే శిక్షించడానికి దమ్ము లేక ఈటలపై నిందలు వేయడం మానుకోవాలని హెచ్చరించారు. ఆనాడు కాళేశ్వరం ప్రాజెక్టుకు నిధులు ఇవ్వలేమని ఆర్థిక మంత్రిగా ఉన్న ఈటల రాజేందర్ రాష్ట్ర ప్రభుత్వానికి తెలియజేశారని గుర్తుచేశారు. మచ్చలేని నాయకుడిపై కాంగ్రెస్ అవినీతి ఆరోపణలు చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోళ్ల కరుణాకర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు రాస వెంకట్, గంగాధర్, సోషల్ మీడియా రాష్ట్ర కన్వీనర్ గోపిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ముగ్గురికి జైలు

బంజారాహిల్స్: మద్యం తాగి వాహనం నడిపిన ఘటనలో నాంపల్లి మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ ముగ్గురికి జైలు శిక్ష విధించింది. సైఫాబాద్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సైదిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మద్యం తాగి వాహనం నడిపిన 43 మందిని కోర్టులో హాజరుపర్చగా వీరిలో 40 మందికి రూ.3,100 చొప్పున జరిమానా విధించగా, 300లకు పైగా బీఏసీ వచ్చిన టి.గోవర్ధన్‌కు 3 రోజులు, రెండో సారి మద్యం దాగి దొరికిన ఖయ్యుం ఖాన్‌కు 10 రోజుల జైలు, నాల్గవ సారి మద్యం తాగి దొరికిన ముబారక్ హుస్సేన్‌కు 18 రోజుల జైలు శిక్షతో పాటు రూ.7 వేల జరిమానా విధించినట్లు తెలిపారు.

హైకోర్టు ఉత్తర్వులను అమలు చేయాలి

హిమాయత్‌నగర్: హైకోర్టు ఉత్తర్వులను వెంటనే అమలు చేయాలని అంతర్జాతీయ మానవ హక్కుల కమిషన్ సలహాదారు మహ్మద్ జమీల్ అహ్మద్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కొంపల్లి శివారు గ్రామం, పేట్‌బషీర్‌బాగ్ సర్వే నెం .25/1,25/2,93లో గల 254 ఎకరాల భూమిపై రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ అధికారులతో విచారణ జరిపించి న్యాయం చేయాలన్నారు. బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మీర్ కౌసర్ అలీ వంశస్తులతో కలిసి ఆయన మాట్లాడారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా కొంపల్లిల్లో సర్వే నెం.104, 104లలో 254 ఎకరాల భూమి తమ పూర్వికుల నుంచి సంక్రమించిన స్థిరాస్తి అని తెలిపారు. అయితే కొన్ని కారణాల వల్ల కొంపల్లి శివారు గ్రామం, పేట్‌బషీర్‌బాగ్ సర్వే నెం.25/1,25/2,93కు మార్చారని తెలిపారు. భూమి పత్రాలు తమ వద్ద ఉన్నాయని తెలిపారు. హైకోర్టును ఆశ్రయించగా తమకు అనుకూలంగా ఉత్తర్వులు ఇచ్చిందని చెప్పారు. హెచ్‌ఎండీఏ అధికారులు పోలీసుల అండతో తమ భూమిని స్వాధీనం చేసుకొని కంచె వేసేందుకు జేసీబీలతో పనులు ప్రారంభించారని వెల్లడించారు. ఈ భూమి ప్రభుత్వానిదంటూ అధికారులు బెదిరింపులకు పాల్పడుతున్నారని అన్నారు. మీర్ కౌసల్ అలీ, అఫ్రోజ్ అలీ, అమ్‌జద్ ఖాన్, యాసీన్ పాషా, మీర్ అక్బర్, మీర్ జావీద్, ఆకుల నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ఐర్లాండ్‌లో లీగల్‌గా పార్ట్ టైం ఉద్యోగాలు

ఎడ్యుకేషన్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ వెండి డిసౌజా

బంజారాహిల్స్: ఐర్లాండ్ దేశంలో విద్య కోసం వెళ్తున్న విద్యార్థులు ఆ దేశ నియమ నిబంధనల ప్రకారం లీగల్‌గానే పార్ట్‌టైం ఉద్యోగాలు చేసుకోవడానికి అవకాశం ఉంటుందని ఐర్లాండ్ దేశ ఎడ్యుకేషన్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ వెండి డిసౌజ అన్నారు. ఐ 20 ఫివర్ ఎడ్యుకేషన్ సంస్థ ద్వారా ఐర్లాండ్‌లోని వివిధ యూనివర్సిటీలలో విద్యనభ్యసించేందుకు వెళ్తున్న విద్యార్థుల అవగాహన సదస్సు మంగళవారం ఇక్కడ జరిగింది. ఆమె ముఖ్య అతిథిగా హాజరై అక్కడి పరిస్థితులపై అవగాహన కల్పించారు. విద్యార్థులు వివిధ కోర్సుల్లో విద్యను పూర్తిచేసిన తర్వాత ఉద్యోగం వెతుక్కోవడానికి రెండేళ్ల వరకు అక్కడే ఉండేందుకు చట్టం అనుమతిస్తుందని తెలిపారు. ప్రతీయేటా తెలుగు రాష్ట్రాల నుంచి ఐర్లాండ్‌లో బిజినెస్ స్టడీస్, ఇంజనీరింగ్, ఫార్మాస్యుటికల్, హెల్త్‌కేర్ రంగాల్లో చదువుకోవడానికి పెద్ద సంఖ్యలో విద్యార్థులు వస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో డబ్లిన్ సిటీ యూనివర్సిటీ, మేనూత్ టీయూఎస్ ఎన్‌సీఐ గ్రిఫిట్ యూనివర్సిటీ, యూనివర్సిటీ ఆఫ్ గాల్వే ప్రతినిధులు, ఐ20 ఫివర్ సంస్థ ప్రతినిధులు నవీన్ యాతవు, శ్రీనివాస్ రాజు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థుల అవగాహన సదస్సులో పాల్గొన్న వెండి డిసౌజా

ఇంటర్ మొదటి సంవత్సరం దరఖాస్తుల ఆహ్వానం

రహమత్‌నగర్: బోరబండ తెలంగాణ రాష్ట్ర బాలుర గురుకుల పాఠశాల, కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం ఇంగ్లిష్ బీపీసీలో ఖాళీగా ఉన్న వాటికి అడ్మిషన్లు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ రమణమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతిలో 450పైబడి మార్కులు వచ్చిన విద్యార్థులు గురువారం ఉదయం కళాశాలకు వచ్చి దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు. మరింత సమాచారం కోసం ఫోన్: 73309 08473.

తల్లిదండ్రులు పిల్లలను ఒత్తిడికి గురిచేయొద్దు



ఫ్రెషర్స్ పార్టీలో విద్యార్థులు

హిమాయత్‌నగర్: తల్లిదండ్రులు పిల్లలపై ఒత్తిడి పెట్టకుండా అన్ని రంగాల్లో వారిని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని తపస్య జూనియర్ కాలేజ్ ఆఫ్ కామర్స్ డైరెక్టర్ శ్రీధర్ పేర్కొన్నారు. నారాయణగూడ కాలేజీలో మంగళవారం ఫ్రెషర్స్ పార్టీని ఘనంగా నిర్వహించారు. కొత్త బ్యాచ్ విద్యార్థులను సాదరంగా ఆహ్వానించి, విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి ఓరియెంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఇంటర్మీడియెట్ దశ భవిష్యత్తుకు పునాది అని, మంచి లక్ష్యాలు పెట్టుకోవాలని అన్నారు. తల్లిదండ్రులు వారిపట్ల నమ్మకాన్ని కలిగి ఉండాలన్నారు. తల్లిదండ్రులు సహకరిస్తే పిల్లలు ప్రపంచాన్ని ఏలుతారని అన్నారు. అకాడమిక్ డీజీఎం డా.కృష్ణమూర్తి పాదిల, ప్రిన్సిపాల్స్ మహేందర్, వంశీధర్‌రెడ్డి, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి

– మంత్రి కొండా సురేఖకు వినతి



మంత్రి సురేఖను కలిసి వినతిపత్రాన్ని అందజేస్తున్న పెన్షనర్ల సంఘం నేతలు

నాంపల్లి: యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నర్సింహస్వామి దేవాలయం, వేములవాడ శ్రీ రాజరాజేశ్వర దేవాలయం, భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి దేవాలయాల్లో పనిచేసిన పెన్షనర్లకు ఆరోగ్య కార్డులు జారీ చేయాలని తెలంగాణ పెన్షనర్స్ సెంట్రల్ అసోసియేషన్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు మంగళవారం అసోసియేషన్ అధ్యక్షుడు గాజుల నర్సయ్య నేతృత్వంలోని ప్రతినిధి బృందం రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను కలిసి వినతిపత్రాన్ని అందజేసింది. పెన్షనర్లకు హెల్త్‌కార్డుల విషయమై మంత్రి సానుకూలంగా స్పందించినట్లు నర్సయ్య పేర్కొన్నారు. వేదపండితులు హన్మత్ శాస్త్రి, రామచంద్రాచార్యులచే వేద ఆశీర్వచనాలు మంత్రికి అందజేసినట్లు వివరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఇనుగంటి నవనీత రావు, కార్యనిర్వాహక అధ్యక్షుడు టి.ప్రేమ్‌కుమార్, కోశాధికారి ఇ.శ్రవణ్‌కుమార్, ఉపాధ్యక్షుడు రఫీయుద్దీన్, గ్రేటర్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు హెచ్.రాములు పాల్గొన్నారు.

అంతరాయాలులేని కరెంటు సరఫరాయే లక్ష్యం

– ముషారఫ్ ఫరూఖీ

సాక్షి, సిటీబ్యూరో: విద్యుత్ సరఫరాలో జీరో శాతం అంతరాయాలే దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ లక్ష్యమని ఆ సంస్థ సీఎండీ ముషారఫ్ ఫరూఖీ చెప్పారు. ఈ మేరకు మంగళవారం సికింద్రాబాద్ సర్కిల్ జింఖానా సెక్షన్ పరిధిలోని పలు బస్తీల్లో ఐదు కిలోమీటర్ల మేర కాలినడకన ప్రయాణించారు. ఆయా లైన్లలో విద్యుత్ సరఫరా, తలెత్తుతున్న సాంకేతిక సమస్యల గురించి స్థానిక వినియోగదారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిమాండ్‌కు తగ్గట్టుగా ఎల్టీ నెట్‌వర్క్‌ను వృద్ధి చేసుకోవడంతోపాటు డీటీఆర్‌లను తనిఖీ చేసి, లోపాలను సరిదిద్దుతున్నట్లు తెలిపారు. విద్యుత్ ఇంజనీర్ల కృషి వల్ల ఇప్పటికే 33 కేవీ, 11 కేవీ లైన్లలో చాలా వరకు సాంకేతిక సమస్యలు తగ్గాయని తెలిపారు. సీఎండీ తోపాటు ఆపరేషన్స్ డైరెక్టర్ నరసింహులు, చీఫ్ ఇంజనీర్ ప్రభాకర్, ఎస్ఈ గోపయ్య, డీఈ సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఓయూ పీహెచ్‌డీ అభ్యర్థుల జాబితా సిద్ధం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో పీహెచ్‌డీ సీట్లు సాధించిన అభ్యర్థుల జాబితా విడుదలకు సిద్ధంగా ఉంది. కానీ, స్టాండింగ్ కమిటీ సమావేశం అనంతరం జాబితాను ప్రకటించాలి. సమావేశం కోసం ఆయా ఫ్యాకల్టీల డీన్లు ఎదురు చూస్తున్నారు. వైస్ చాన్స్‌లర్ అధ్యక్షత స్టాండింగ్ కమిటీ సమావేశం జరగాలి. కానీ, ఈ నెల 19 జరగనున్న ఓయూ స్నాతకోత్సవం కారణంగా సమయం లేక వీసీ ప్రొ.కుమార్ సమావేశం నిర్వహించలేకపోతున్నారు. గత నెల 19న జాబితా ప్రకటిస్తామని ప్రకటించినా అది వాయిదా పడింది. పీహెచ్‌డీ ప్రవేశాల్లో ఎస్సీ, బీసీ, ఈడబ్ల్యూఎస్, వికలాంగుల రిజర్వేషన్ల అమలులో తలెత్తిన వివాదంపై ఓయూ అధికారులు కమిటీని నియమించారు. ఈ మేరకు కమిటీ సభ్యులు విచారించి వీసీకి నివేదికను సమర్పించారు. జరగబోవు స్టాండింగ్ కమిటీ సమావేశంలో రిజర్వేషన్ల అమలుపై నిర్ణయం తీసుకొని పీహెచ్‌డీ సీట్లు సాధించిన అభ్యర్థుల జాబితాను విడుదల చేయనున్నట్లు డీన్లు తెలిపారు.

నగరంలో నేడు

- బంజారాహిల్స్ రోడ్ నెం.12లోని కళింగ కల్చరల్ సెంటర్‌లో గణేష్ చతుర్థి స్పెషల్ పేరిట ఉదయం 10 నుంచి రాత్రి 8 గంటల వరకు నేషనల్ సిల్క్ ఎక్స్‌పో అందుబాటులో ఉంటుంది.
- సిరి ఆర్టిస్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ల్యాండ్ స్కేప్స్ పెయింటింగ్ ఎగ్జిబిషన్ మాసబ్ ట్యాంక్‌లోని జేఎన్ఏఎఫ్ఏయూ కాలేజీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్‌లో ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- శ్రీనగర్ కాలనీలోని శ్రీ సత్యసాయి నిగమాగమంలో గణేష్ చతుర్థి స్పెషల్ పేరిట నేషనల్ సిల్క్ ఎక్స్‌పో ఉదయం 10.30 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్‌లోని శిల్పారామంలో ఏర్పాటు చేసిన హస్తకళా మ్యూజియం ఉదయం 10.30 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్ శిల్పారామం సమీపంలోని ఇందిరా మహిళాశక్తి బజార్‌లో చేనేత ఉత్పత్తుల ప్రదర్శన ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.comకు మెయిల్ చేయగలరు.

కదలని కారిడార్లు..
తేలని పరిహారం

ఏడాదిన్నర క్రితం శంకుస్థాపన.. నిర్మాణంలో జాప్యం.. ఎటూ తేలని భూసేకరణ, పరిహారం.. వేలాది మంది భవిష్యత్ అగమ్యగోచరం... ఇదీ కంటోన్మెంట్ పరిధిలో చేపట్టనున్న రెండు ఎలివేటెడ్ కారిడార్‌ల పరిస్థితి. విస్తరించనున్నరెండు ప్రధాన రహదారుల్లో వందల సంఖ్యలో వ్యాపార సముదాయాలు ఖాళీ అవుతున్నాయి. దీంతో అటు పరిహారం తేలక, ఇటు అద్దెలు రాక యజమానులు ఆందోళన చెందుతున్నారు.

-కంటోన్మెంట్

ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణానికి ఏడాదిన్నర క్రితం శంకుస్థాపన

ఆస్తులు కోల్పోయేవారికి కొలిక్కిరాని పరిహారం

రాజీవ్ రహదారిలో ఖాళీ అవుతున్న దుకాణాలు

ఇదీ కంటోన్మెంట్‌లోని రెండు రోడ్ల విస్తరణ పరిస్థితి..



రాజీవ్ రహదారి మార్గంలో ఖాళీ అయిన దుకాణాలు

ఆర్మీకి భూములు, కంటోన్మెంట్‌కు పరిహారం..

రాజీవ్ రహదారి మార్గంలో ప్యాట్నీ నుంచి హకీంపేట వరకు, జాతీయ రహదారి-44 మార్గంలో ప్యారడైజ్ నుంచి బోయిన్‌పల్లి చెక్‌పోస్టు వరకు ఆయా రోడ్లను 200 అడుగుల మేర ఎలివేటెడ్ కారిడార్లుగా విస్తరించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు 129 ఎకరాల రక్షణ భూములు, 24 ఎకరాల కంటోన్మెంట్, 110 ఎకరాల ప్రైవేటు భూములు సేకరించాల్సి ఉంటుందని గుర్తించింది. రక్షణ శాఖ భూములకు బదులుగా జవహర్‌నగర్ సమీపంలోని సుమారు 400 ఎకరాల రాష్ట్ర ప్రభుత్వ భూములను రక్షణ శాఖకు అప్పగించేందుకు ఒప్పందం కుదిరింది. 24 ఎకరాల కంటోన్మెంట్ భూములకు బదులుగా రూ.303 కోట్లను కేంద్ర ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంది. అయితే కంటోన్మెంట్ పరిధిలోని నాలాలు, భూగర్భ డ్రైనేజీల ఆధునీకరణకు వినియోగించుకునేలా అవకాశం ఇవ్వాలంటూ బోర్డు అధికారులు కేంద్రాన్ని కోరారు. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం కూడా సమ్మతించింది. తాజాగా కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది.

తేలని ప్రైవేటు పరిహారం..


రాష్ట్ర రహదారి-1 (రాజీవ్ రహదారి) పరిధిలో 86 ఎకరాలు, జాతీయ రహదారి-44 మార్గంలో 24 ఎకరాల ప్రైవేటు భూములను సేకరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అయితే కోల్పోయే ఆయా ఆస్తులకుగాను ప్రభుత్వ విలువకు కనీసం మూడు రెట్ల పరిహారం ఇవ్వాలని బాధితులు డిమాండ్ చేస్తున్నారు. జీహెచ్ఎంసీ పరిధిలోని ప్రైవేటు భూములకు పరిహారంతోపాటు టీడీఆర్ (ట్రాన్స్‌ఫరబుల్ డెవలప్‌మెంట్ రైట్స్) కింద అదనపు నిర్మాణ అనుమతులు లభిస్తాయి. కానీ, కంటోన్మెంట్‌లో ఈ వెసులుబాటు లేదు.

అద్దెలు కోల్పోతున్నాం

విస్తరించనున్న రోడ్డుకు ఆనుకుని ఉన్న భవనానికి వచ్చే అద్దెతోనే మా కుటుంబం జీవనం సాగిస్తోంది. అయితే మా భవనంలోని దుకాణాలు ఒక్కొక్కటిగా ఖాళీ అవుతున్నాయి. దీంతో నెలవారీ ఖర్చులకు కూడా ఇబ్బందిగా ఉంది. పరిహారంపై ఎటూ తేల్చకుండా సందిగ్ధంలో ఉంచడం వల్ల తీవ్రంగా నష్టపోతున్నాం.

-సుబ్రహ్మణ్యం, వాసవి కాలనీ

విస్తరణను కుదించాలి



రోడ్డును 200 అడుగుల వెడల్పునకు విస్తరించడం వల్ల చుట్టుపక్కల ఉన్న భవనాల యజమానులకు నష్టం వాటిల్లుతోంది. కమర్షియల్ భవనాలు పూర్తిగా కనుమరుగు కానున్నాయి. ఇంతకాలం వాటి అద్దెలతో జీవనం సాగించిన వారు రోడ్డున పడనున్నారు. వంద అడుగులకు రోడ్డు విస్తరణను కుదిస్తే చాలామందికి ప్రయోజనం చేకూరుతుంది. ఉప్పల్ భగాయత్ మాదిరిగా మాకు కూడా సమాన విలువ కలిగిన భూమిని పరిహారంగా ఇవ్వాలని కోరుతున్నాం.

-తెలుకుంట సతీష్ గుప్త, రాజీవ్ రహదారి ప్రాపర్టీ ఓనర్స్ జేఏసీ చైర్మన్

అర్హులందరికీ రేషన్ కార్డులు

– మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు



రేషన్‌కార్డులు అందజేస్తున్న శ్రీధర్‌బాబు, ప్రకాష్‌గౌడ్

మైలార్‌దేవ్‌పల్లి: బీఆర్ఎస్ హయాంలో పేదలకు రేషన్‌కార్డులు ఇవ్వలేదని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. అర్హులందరికీ రేషన్‌కార్డులు ఇచ్చి, వారి ముఖాల్లో సంతోషాన్ని నింపుతున్న ఘనత సీఎం రేవంత్‌రెడ్డికే దక్కుతుందని అన్నారు. మంగళవారం రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని ఆరాంఘర్‌లోని మెట్రో క్లాసిక్ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌తో కలిసి పాల్గొన్నారు. సభను ఉద్దేశించి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ బీఆర్ఎస్ హయాంలో రేషన్ కార్డుల కోసం అనేక ధర్నాలు నిర్వహించినా స్పందించలేదని విమర్శించారు. మా ప్రభుత్వం ఆరు లక్షల కొత్త కార్డులు ఇవ్వడానికి ముందుకు వచ్చిందన్నారు. 24వేల 634 రేషన్ కార్డుల్లో కొత్త వారి పేర్లు చేర్పించిందని పేర్కొన్నారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారని అన్నారు. రాజేంద్రనగర్ నియోజకవర్గంలో 3,500 ఇళ్లను పేదలకు ఇచ్చి సొంతింటి కల నెరవేర్చామని మంత్రి పేర్కొన్నారు. ఆరు గ్యారంటీల్లో భాగంగా సంహభాగం హామీలను నిలబెట్టుకున్నామని అన్నారు. కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి, ఆర్డీవో, ఏఎస్‌వో తదితరులు పాల్గొన్నారు.

పంద్రాగస్టు వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు

అధికారుల సమావేశంలో కలెక్టర్ మను చౌదరి



సాక్షి, మేడ్చల్ జిల్లా: కలెక్టరేట్ ఆవరణలో ఈ నెల 15వ తేదీన స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించటానికి ఘనంగా ఏర్పాట్లు చేయాలని, వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి ఆదేశించారు. మంగళవారం తూముకుంట మున్సిపాలిటీ పరిధిలోని మేడ్చల్ కలెక్టరేట్‌లో పంద్రాగస్టు వేడుకల ఏర్పాట్లపై అదనపు కలెక్టర్లు రాధిక గుప్త, విజయేందర్‌రెడ్డిలతో కలిసి జిల్లా అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టరేట్ గ్రౌండ్‌లో ఘనంగా నిర్వహించనున్న స్వాతంత్ర్య దినోత్సవాలకు అన్ని ఏర్పాట్లు సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. వేడుకలను తిలకించేందుకు వచ్చేవారితోపాటు ముఖ్య అతిథులు, అధికారులు, సిబ్బందికి ఇబ్బందులు లేకుండా సదుపాయాలు కల్పించాలని అన్నారు. పోలీస్ గౌరవ వందనంతో పాటు బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షించాలని పోలీస్ అధికారులకు సూచించారు. కలెక్టరేట్ మైదానంలో షామియానాలు, కుర్చీలు, బారికేడింగ్ ఏర్పాట్లను సంబంధిత అధికారులు పర్యవేక్షించాలన్నారు. వేదికను రంగురంగుల పూలతో అలంకరించాలని ఉద్యానవన శాఖ అధికారులను కోరారు. విద్యుత్తు సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలన్నారు. దేశభక్తిని పెంపొందించే సాంస్కృతిక కార్యక్రమాలను ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాల విద్యార్థులతో కలిసి నిర్వహించాలని విద్యాశాఖ అధికారులకు కలెక్టర్ సూచించారు. వేడుకల అనంతరం విధి నిర్వహణలో ప్రతిభ కనబరచిన ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు అందజేసేందుకు అన్ని శాఖల అధికారుల వివరాలు సిద్ధంగా ఉంచాలన్నారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ, కలెక్టరేట్ పరిపాలన అధికారి రాంమోహన్, పోలీసు శాఖతోపాటు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

'గాంధీ'.. ఇదేంటి!

- ఆస్పత్రి ఎమర్జెన్సీ వార్డుల్లో కరెంటుకు అంతరాయం



సెల్‌ఫోన్ టార్చి వెలుగులో వైద్యసేవలు అందిస్తున్న దృశ్యం

గాంధీఆస్పత్రి: పేరు గొప్ప తీరు మారదు అన్నట్లుగా ఉంది సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రి పరిస్థితి. ప్రాణాపాయస్థితిలో ఉన్న రోగులకు అత్యవసర సేవలు అందించే ఎమర్జెన్సీ వార్డుల్లో అంధకారం నెలకొంది. విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో రోగులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. వివరాలు... గాంధీ ఎమర్జెన్సీ మెడికల్ డిపార్ట్‌మెంట్(ఈఎండీ) విభాగంలో సోమవారం రాత్రి 10.45 గంటలకు హఠాత్తుగా విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో చిమ్మచీకట్లు అలముకున్నాయి. ఐసీయూ, టీఎంటీ, పీఐసీయూ, ఎస్ఏసీయూ తదితర అత్యవసర విభాగాల్లో వెంటిలేటర్లు, ఆక్సిజన్ పైప్‌లైన్లు, ఇతర వైద్య యంత్రాలు అందించే సేవలు నిలిచిపోవడంతో రోగులు, సహాయకులు భయాందోళన చెందారు. వైద్యులు సెల్‌ఫోన్ టార్చి వెలుగులో వైద్యసేవలు అందించారు. సుమారు 15 నిమిషాల అనంతరం 11 గంటలకు విద్యుత్ సరఫరా పునరుద్ధరించడంతో రోగులంతా బతుకుజీవుడా అంటూ ఊపిరి పీల్చుకున్నారు. ఆస్పత్రి ప్రాంగణంలోని మిగతా విభాగాలకు విద్యుత్ సరఫరా కొనసాగుతుండగా, అత్యవసర విభాగానికి మాత్రమే నిలిచిపోయింది. విద్యుత్ సరఫరా నిలిచిపోయిన వెంటనే ఆస్పత్రికి చెందిన డీజిల్ జనరేటర్లు ప్రారంభం కాలేదని తెలిసింది. గాంధీ ఆస్పత్రిలో గతంలోనూ పలుమార్లు విద్యుత్ సరఫరాకు ఆటంకం ఏర్పడింది. ఆస్పత్రిలో కోట్లాది రూపాయల వ్యయంతో విద్యుత్ వ్యవస్థ ప్రక్షాళన చేపట్టినప్పటికీ ఇలాంటి ఘటనలు తరచూ ఏర్పడటం గమనార్హం. ఈ విషయమై 'సాక్షి'వివరణ కోరేందుకు ప్రయత్నించగా సంబంధిత అధికారులు అందుబాటులో లేరు.

9న 'సివిల్ రైట్స్' జాతీయ సదస్సు

రాంగోపాల్‌పేట్: దేశ వ్యాప్తంగా క్రైస్తవులపై జరుగుతున్న హింసాత్మక దాడులు, మత స్వేచ్ఛకు కలుగుతున్న ఆటంకాలపై ఈ నెల 9వ తేదీన జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు సివిల్ రైట్స్ ఇన్సియేటివ్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు, మాజీ అదనపు డీజీపీ కె.బాబురావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఇక్కడ పోస్టర్ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ గత 15 ఏళ్లలో మత స్వేచ్ఛ హరించుకుపోయి మైనార్టీలపై దాడులు పెరిగిపోయాయని, దీన్ని దృష్టిలో పెట్టుకునిసికింద్రాబాద్‌లోని సెంటినరీ బాప్టిస్ట్ చర్చిలో ఉదయం 10 గంటల నుంచి సదస్సు జరుగుతుందని చెప్పారు. సదస్సులో ఏడీఎఫ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ ఆఫ్ అడ్వకసీ న్యాయవాది ఏసియా తహ్మీనా అరోరా, సుప్రీంకోర్టు న్యాయవాది ఫ్రాంక్లిన్ సీజర్ థామస్, సుధాకర్ మొండితోక తదితరులు ప్రసంగిస్తారని తెలిపారు. కొంత మంది మత ఛాందసవాదులు ప్రజల మధ్య మత విద్వేషాలను రెచ్చగొడుతూ రాజకీయ పబ్బం గడుపుతున్నారని విచారం వ్యక్తం చేశారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో దళితులు, ఆదివాసీలు, క్రైస్తవులు, మైనార్టీలే లక్ష్యంగా రాజ్యాంగ విరుద్ధంగా చట్టాలు రూపొందించారని తెలిపారు. కార్యక్రమంలో విద్యావేత్త విద్యా స్రవంతి, సంస్థ ప్రతినిధులు పులిగుజ్జు సురేష్, ఫిరోజ్ షా, అరుణజ్యోతి, లియో తదితరులు పాల్గొన్నారు.



సదస్సుకు సంబంధించిన పోస్టర్ విడుదల చేస్తున్న బాబురావు

అనుమతుల్లేని ఆస్పత్రులపై కొరడా

హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరిచందన



మాట్లాడుతున్న కలెక్టర్ హరిచందన దాసరి

సాక్షి, సిటీబ్యూరో: ప్రైవేటు ఆస్పత్రులపై జాయింట్ ఆపరేషన్ నిర్వహించాలని, అనుమతి లేనివాటిపై చర్యలు తీసుకోవాలని హైదరాబాద్ కలెక్టర్ హరిచందన దాసరి వైద్యాధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఏర్పా టు చేసిన జిల్లా స్థాయి రిజిస్టరింగ్ అథారిటీ కమి టీ సమావేశంలో ఆమె మాట్లాడారు. జాయింట్ ఆపరేషన్‌లో భాగంగా పోలీస్ అధికారులతో కలిసి సీనియర్ పబ్లిక్ హెల్త్ ఆఫీసర్‌లు అనుమతి లేని ఆస్పత్రులపై కేసులు నమోదు చేయాలన్నారు. ఆస్పత్రులలో ఏమైనా మార్పులు అవసరముంటే, వాటికి సంబంధించిన అన్ని డాక్యుమెంట్లను పరిశీలించాలని సూచించారు. పర్మనెంట్ రిజిస్ట్రేషన్, రెన్యువల్ కోసం 374 ప్రైవేట్ ఆస్పత్రులు దరఖాస్తు చేసుకోగా, వాటిల్లో 322 దరఖాస్తులను ఎస్‌పీహెచ్ఓలు ఆమోదం కోసం సమర్పించినట్లు తెలిపారు. వాటిని జాయింట్ టీం మరోసారి పరిశీలించి వారంలోగా నివేదిక సమర్పించాలని ఆదేశించారు. తనిఖీ సమయంలో వైద్యుల ఆధారాలు, వారిపైగానీ, లేదా ఆయా క్లినిక్‌లపైగానీ ఇదివరకు నమోదైన కేసులపై దృష్టి పెట్టాలని పోలీస్ అధికారుకు సూచించారు. రాత్రి పూట నడుపుతున్న రిజిస్టర్ కాని క్లినిక్‌ల తనిఖీల కోసం ఉమ్మడి బందాలు ఏర్పాటు చేసినట్లు వైద్యాధికారులు తెలిపారు. రిజిస్టర్ కానీ ఆస్పత్రులపై జరిమానా విధించాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ కదిరవన్ పలనీ, డీసీపీ డాక్టర్ లావణ్య, డీఎంహెచ్ఓ డాక్టర్ వెంకటి, అడిషనల్ డీఎంహెచ్ఓ డాక్టర్ జయమాలిని, డీఎంఓ రాములు, డిప్యూటీ డీఎంఓ అంజయ్య గౌడ్, డీఐఓ డాక్టర్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద టీచర్ల ధర్నా



హైదరాబాద్ కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న టీచర్లు

సాక్షి,సిటీబ్యూరో: ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్‌పీసీ) పిలుపు మేరకు మంగళవారం హైదరాబాద్ కలెక్టరేట్ ముందు ఉపాధ్యాయులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా సంఘాల బాధ్యులు మాట్లాడుతూ బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్‌ను వెంటనే విడుదల చేయాలని, జీఓ నంబర్ 25ను సవరించి ఉపాధ్యాయ, విద్యార్థి నిష్పత్తిని తగ్గించాలని, పెండింగ్ బిల్లులను వెంటనే క్లియర్ చేయాలన్నారు. పీఎస్‌హెచ్ఎం పోస్టులను మంజూరు చేసి బీఈడీ, డీఈడీ ఉమ్మడి సీనియారిటీతో భర్తీ చేయాలని, సీపీఎస్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఎయిడెడ్, మైనారిటీ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని, పెండింగ్ డీఈలను, స్కావెంజర్ బకాయిలు విడుదల చేయాలని, జీఓ 11,12 లను అమలు చేయాలని కోరారు. ధర్నా అనంతరం డీఆర్‌ఓకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట్, డీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సోమయ్య, టీపీటీఎఫ్ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి రవీందర్, టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సింహాచలం, రాష్ట్ర మహిళా కమిటీ కన్వీనర్ శారద తదితరులు పాల్గొన్నారు.

8న ఎన్ఆర్ఐ కోటా కౌన్సెలింగ్

ఏజీవర్సిటీ: ప్రొఫెసర్ జయశంకర్ విశ్వవిద్యాలయం యూజీ కోర్సులకు సంబంధించి ఎన్ఆర్ఐ కోటాలో మిగిలిన సీట్ల భర్తీ కోసం ఈ నెల 8 వ తేదీన వాక్ ఇన్ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు రిజిస్ట్రార్ సీహెచ్ విద్యాసాగర్ ఒక ప్రకటనలో తెలిపారు. పీజేటీఏయూ పరీక్షల నియంత్రణ విభాగంలో ఉదయం 11 గంటలకు కౌన్సెలింగ్ ఉంటుందని, విద్యార్థినీ, విద్యార్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లు, ప్రవేశ రుసుములతో హాజరుకావచ్చని పేర్కొన్నారు. పూరి వివరాలకు వ్యవసాయ విశ్వవిద్యాలయం వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చని తెలిపారు.

రామమ్మకుంట పరిసరాలను అభివృద్ధి చేయాలి



–హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్

రాయదుర్గం: రామమ్మకుంట పరిసరాలను అభివృద్ధి చేయడం అవసరమని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ అన్నారు. గచ్చిబౌలిలోని 'నిథమ్' క్యాంపస్‌లో దశాబ్దాల తరబడి కొనసాగుతున్న రామమ్మకుంటను ఆయన మంగళవారం సాయంత్రం నిథమ్ డైరెక్టర్ ప్రొఫెసర్ వి. వెంకటరమణతో కలిసి పరిశీలించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో సమాజ ప్రమేయం ఎంతో అవసరమని అభిప్రాయపడ్డారు. రామమ్మకుంట పరిసరాలను మరింత మెరుగుపర్చడం, స్థిరమైన అభివృద్ధిని ప్రోత్సహించడానికి నడక మార్గం, ఇతర పర్యావరణ అనుకూల మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేయాలని అన్నారు. నిథమ్ డైరెక్టర్ ప్రొఫెసర్ వెంకటరమణ మాట్లాడుతూ గత కొన్నేళ్ళుగా రామమ్మకుంట పూడికతీత, కుంట విస్తీర్ణం పెంపు, ఇతర పలు ప్రతిపాదనల గురించి వివరించారు. రామమ్మకుంట సుందరీకరణకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో నిథమ్ ఫ్యాకల్టీ ప్రతినిధులు, అధికారులు, ఉద్యోగులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్కీని విశ్వవిద్యాలయంగా ప్రకటించాలి

గవర్నింగ్ కౌన్సిల్ సమావేశం తీర్మానం



గచ్చిబౌలిలోని 'ఎస్కీ'లో గవర్నింగ్ కౌన్సిల్ సమావేశంలో సభ్యులను సత్కరిస్తున్న డైరెక్టర్ డాక్టర్ జి రామేశ్వరరావు

రాయదుర్గం: ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా(ఎస్కీ)ను స్వయం ప్రతిపత్తి గల విశ్వవిద్యాలయంగా ప్రకటించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతూ మంగళవారం జరిగిన 'ఎస్కీ'గవర్నింగ్ సమావేశం తీర్మానించారు. గచ్చిబౌలిలోని 'ఎస్కీ'క్యాంపస్‌లో అయిదుగురు సభ్యులతో కూడిన కమిటీ ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి మరోసారి విజ్ఞప్తి చేయాలని నిర్ణయించింది. సీనియర్ ఇంజనీర్ ఎం.శ్యామ్ ప్రసాద్‌రెడ్డి అధ్యక్షతన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలకత్తా హెడ్‌క్వార్టర్స్‌గా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీర్స్ ఇండియా ఆధ్వర్యంలో గత నాలుగు దశాబ్దాలుగా హైదరాబాద్‌లో పనిచేస్తున్న 'ఎస్కీ'ఆసియాలోనే ప్రతిష్టాత్మక ఉన్నత విద్యాసంస్థగా పేరుగాంచిందని పేర్కొన్నారు. దేశ విదేశాల్లోని వేలాది మంది ఇంజనీరింగ్, నాన్ ఇంజనీరింగ్ అభ్యర్థులకు ఎన్విరాన్మెంట్ మేనేజ్‌మెంట్, క్లయిమెట్ చేంజ్, పవర్ అండ్ ఎనర్జీ, ఐటీ తదితర రంగాల్లో శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. విశ్వవిద్యాలయంగా మారితే ఎమర్జింగ్ టెక్నాలజీస్‌కు సంబంధించిన కొత్త కోర్సులు ప్రవేశ పెట్టే అవకాశం ఉంటుందన్నారు. భారీగా ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయని చెప్పారు. ఈ విషయమై ముఖ్యమంత్రిని కలిసి అనుమతులు సాధించేందుకు కృషి చేయాలని తీర్మానించారు. సమావేశంలో ఎస్కీ డైరెక్టర్ డాక్టర్ జి.రామేశ్వరరావు, వైస్‌చైర్మన్ ఎం.నాగరాజు, చెన్నయ్‌వెల్లూర్ టెక్నాలజీ విశ్వవిద్యాలయం వైస్‌చాన్స్‌లర్ డాక్టర్ రజత్ గుప్త, ఉస్మానియా యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ కుమార్ మొలుగరం, జేఎన్‌టీయూ వైస్ చాన్స్‌లర్ టి.కిషన్‌కుమార్‌రెడ్డి, డీఆర్‌డీఓ డైరెక్టర్ జనరల్ వి.రాజబాబు, రాయపూర్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ డైరెక్టర్ డాక్టర్ రమణా రావు తదితరులు పాల్గొన్నారు.

జర్మనీ ఏరోస్పేస్ చదువులపై అవగాహన



మణికొండ: గండిపేటలోని మహాత్మాగాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఎంజీఐటీ) కళాశాలలో మంగళవారం 'ఫర్దర్ టెక్నాలజీ ఇన్ జర్మనీ ఏరోస్పేస్ ఇంజనీరింగ్'అనే అంశంపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. సీజీసీ, ఎంజీఐటీ మెక్ట్రానిక్స్, మెటీరియల్ ఇంజనీరింగ్ విభాగాలు సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో జర్మనీలోని యూనివర్సిటీ ఆఫ్ బ్రేమన్ మెకానికల్ విభాగపు ప్రొఫెసర్ డాక్టర్ రిచర్డ్ దిగానల్ అధునాతన తేలిక మిశ్రమ పదార్థాలతో నిర్మించిన ఏరోస్పేస్ వ్యవస్థల గురించి వివరించారు. ఎయిర్‌క్రాఫ్టల పనితీరు పర్యవేక్షణ, సమస్యలను అంచనా వేయటంతోపాటు భద్రతను మెరుగుపర్చేందుకు ఉపయోగించే ఏఐ అల్గారిథమ్, రియల్ టైం డేటా గురించి వివరించారు. విమాన వ్యవస్థల డిజిటల్ ప్రతిరూపా లు, డిజిటల్ ట్విన్స్ వ్యవస్థల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. బీటెక్ అనంతరం ఇలాంటి విద్యను పూర్తి చేస్తే మంచి ఉద్యోగావకాశాలు ఉంటాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ జి.చంద్రమోహన్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సుధాకర్‌రెడ్డి, ఆర్‌డీసీ డైరెక్టర్ డాక్టర్ ఎన్.ఈశ్వరప్రసాద్, సీజీసీ విభాగాధిపతి డాక్టర్ సీఎస్ శ్రీనివాస్‌లతోపాటు విద్యార్థులు పాల్గొన్నారు.

సాక్షి సిటీ ప్లస్
13
హైదరాబాద్, బుధవారం, 6, ఆగస్టు, 2025







సిస్టర్స్.. స్పోర్ట్స్..

టీనేజీ అమ్మాయిలు చదువులు, ర్యాంకుల్లో మునిగి తేలుతుంటారు.. పెళ్లయిన, పిల్లల తల్లులు, మరికొందరు మహిళలు ఇంటి పనుల్లో తలమునకలై ఉంటారు.. కార్పొరేట్ ఉద్యోగం చేస్తున్న ఇంకొందరు మహిళలు ఇంటినీ, జాబ్‌ని బ్యాలెన్స్ చేసుకోలేక కొట్టుమిట్టాడుతుంటారు.. బిజినెస్ ఉమెన్స్ పోటీ ప్రపంచంలో బిజీ బిజీగా గడుపుతుంటారు.. ఇక ఆటలకు చోటెక్కడ? అయితే ఆనందం, ఆరోగ్యం.. ఆత్మవిశ్వాసం ఇచ్చేవి ఆటలే కాబట్టి వాటికీ చోటు ఉండాల్సిందే అంటున్న సిస్టర్స్ ఇన్ స్వెట్ సంస్థ ఆటాడుకుందాం రా అని ఆహ్వానిస్తోంది. నగరానికి చెందిన పలువురు మహిళలు ఈ సంస్థలో సభ్యులుగా ఉన్నారు.

- సాక్షి, సిటీబ్యూరో

- జాగింగ్ నుంచి జిమ్నాస్టిక్స్ వరకూ..
- ఆటాడుకుందాం రా అంటూ 'ఆమె'కు ఆహ్వానం
- నగర మహిళల కోసం సరికొత్త వేదిక
- మెట్రోల్లో ఫేమస్, వేల సంఖ్యలో సభ్యులు
- నగరంలోనూ కొలువుదీరిన సిస్టర్స్ ఇన్ స్వెట్
- ఆనందం, ఆరోగ్యం.. ఆత్మవిశ్వాసం వైపు అడుగులు



చదువు, వృత్తి, ఉద్యోగాలు, వ్యాపారాల్లో రాణిస్తున్నా క్రీడలు, ఫిట్‌నెస్ కార్యకలాపాలకు దూరమవుతున్న మహిళల్ని ప్రోత్సహించడానికి 2017లో సిస్టర్స్ ఇన్ స్వెట్ (సీఐఎస్) సంస్థ బెంగళూరులో ఏర్పాటైంది. నైక్–సర్టిఫైడ్ ఫిట్‌నెస్ ఇన్‌స్ట్రక్టర్ అయిన శ్వేతా సుబ్బయ్య, ఇంగ్లిష్ ప్రీమియర్ లీగ్‌లో ఫుట్‌బాల్ క్రీడాకారిణి అయిన తన్వీ హాసన్ నెలకొల్పిన ఈ సంస్థలో బెంగళూరు, ముంబయి, న్యూ ఢిల్లీ, హైదరాబాద్‌తో కలిపి 10,000 మందికి పైగా సభ్యులు ఉన్నారు. రానున్న 2026 నాటికి ఈ కమ్యూనిటీ పది నగరాలకు విస్తరించాలని భావిస్తున్నట్లు శ్వేత అంటున్నారు. 'మేమిద్దరం క్రీడలు, ఫిట్‌నెస్ కార్యకలాపాల్లో పాల్గొనేవాళ్లం. ఈ క్రమంలో కొందరు మహిళల అనుభవాలను తెలుసుకున్న తర్వాత.. మహిళలకు మాత్రమే ప్రత్యేక సెషన్స్ నిర్వహించేందుకు స్థలాలు ఉండాల్సిన అవసరం ఉందని గ్రహించాం' అని శ్వేత చెబుతున్నారు. కేవలం 17 మంది సభ్యులతో ఒక వాట్సాప్ గ్రూప్‌గా ఇది ఏర్పాటైంది. ఆ సమయంలో శ్వేత, తన్వీలు ఏర్పాటు చేసిన సంస్థ దేశంలోనే అదిపెద్ద మహిళల స్పోర్ట్స్ కమ్యూనిటీగా, ఓ ప్రత్యేకమైన గుర్తింపు పొందుతుందని వారు భావించలేదు.

ఆడిందే ఆట..

వీలున్నన్ని రకాల ఆటలు ఆడేలా, ఫిట్‌నెస్ వర్కవుట్స్ చేసేలా మహిళల్ని ప్రోత్సహించే లక్ష్యంతో ఏర్పడిన ఈ సంస్థ ప్రస్తుతం వారాంతపు రోజుల్లో తమ కార్యకలాపాలను నిర్వహిస్తూ ముందుకెళ్తోంది. నగరంలోని పలు జిమ్స్, ఫిట్‌నెస్ స్టూడియోస్, క్రీడా కేంద్రాలతో తాత్కాలిక, దీర్ఘకాలిక ఒప్పందాలతో తమ సభ్యులకు వేదికలను సమకూరుస్తోంది. మారథాన్ రన్నింగ్, పికిల్ బాల్, బాస్కెట్‌బాల్, ఫుట్‌బాల్, కిక్ బాక్సింగ్, రన్నింగ్, టచ్ రగ్బీ, యోగా, డ్యాన్స్ ఎరోబిక్స్.. ఇలా ఒక టేమిటి.. అనేక రకాల ఆటలు, ఫిట్‌నెస్ కార్యకలాపాల్లో భాగస్వాములయ్యేలా చేస్తోంది. ప్రతి స్పోర్ట్స్ ఫిట్‌నెస్ సెషన్‌లకు పురుష మహిళా సర్టిఫైడ్ కోచ్‌లను నియమించడం ప్రారంభించింది.



నగరంలోకి ప్రవేశమిలా..

నగరానికి చెందిన మాజీ ప్రొఫెషనల్ టెన్నిస్ క్రీడాకారిణి అనుషా రావు ఈ సంస్థ కార్యకలాపాల పట్ల ఆసక్తి చూపడంతో నగరానికి వచ్చేసింది. తన పాఠశాల, కళాశాల స్నేహితులతో పాటు కార్పొరేట్ రంగంలోని మరి కొందరు ఫ్రెండ్స్‌ను కూడా ఆమె కలుపుకోవడంతో సోషల్ మీడియా ప్రచారం తోడై నగరంలో 250 మందితో బలమైన మహిళల క్రీడా వేదికగా రూపుదిద్దుకుంది. 'ఇప్పుడు మా సంస్థకు 400 మందికి పైగా సభ్యులున్నారు. దాదాపు ప్రతి రోజూ సభ్యత్వాలు నమోదవుతూనే ఉన్నాయి' అంటూ చెప్పారు అనూష.

వారమంతా.. నగరమంతా..

'సికింద్రాబాద్ నుంచి తెల్లాపూర్ వరకూ నగరంలోని ప్రతి మూలలో సెషన్స్ నిర్వహించాలి' అనేదే తమ లక్ష్యమని, ఆ దిశగా అడుగులు వేస్తున్నామని అనూష చెబుతున్నారు. అదే విధంగా ప్రస్తుతం శని, ఆదివారాలకు మాత్రమే పరిమితమైనా, భవిష్యత్తులో వారం పొడవునా సెషన్స్‌ నిర్వహించాలని సంస్థ లక్ష్యంగా పనిచేస్తోంది. ముంబయి, బెంగళూర్ మహిళలు ఫ్రిస్బీ పట్ల మొగ్గు చూపుతుండగా, మన నగర మహిళలు ఫుట్‌బాల్, కిక్‌బాక్సింగ్, రన్నింగ్, పికిల్‌బాల్, కాలిస్థెనిక్స్ వైపు ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారని అనూష వెల్లడించారు. ప్రతి వారం, మీట్–అప్ వివరాలు వీరి వెబ్‌సైట్, వాట్సాప్ గ్రూప్‌లో పోస్ట్ చేస్తారు. ఆసక్తి గల సభ్యులు పేర్లు నమోదు చేసుకోవచ్చు.

యాభై ఏళ్లు పైబడినా..

నగరంలో క్రీడల్లో పాల్గొనేవారిలో ఎక్కువ మంది 25 నుంచి 40 సంవత్సరాల వయసు లోపు వారే ఎక్కువగా ఉన్నారని అనూష చెప్పారు. అయితే 'యాభై ఏళ్లు పైబడిన వారికి కూడా తగిన వ్యాయామాలు, ఆటలు ఉన్నాయి. అయితే ఇతర నగరాల్లో మాదిరిగా ఇక్కడ ఇంకా ఆ వయసు వారిలో ఆటల పట్ల అంత ఆసక్తి కనిపించడం లేదు' అని చెప్పారామె.



ఫిట్‌నెస్ ఫ్రీక్స్.. బీ కేర్‌ఫుల్..

కల్తీ సప్లిమెంట్స్ ఆందోళన కలిగిస్తున్నాయి

'ఆల్ఫాలీట్' ఆవిష్కరణలో నటుడు సోనూ సూద్

సాక్షి, సిటీబ్యూరో: ఈ తరం యువత ఫిట్‌నెస్‌పై ఎంతో శ్రద్ధ చూపిస్తోంది.. ఇదే తరుణంలో మార్కెట్లో కల్తీ సప్లిమెంట్ల బెడద కూడా అదే స్థాయిలో పెరిగిపోవడం తీవ్ర ఆందోళన కలిగిస్తోందని ప్రముఖ సినీ నటుడు, మానవతావాది సోనూసూద్ తెలిపారు. సరైన సప్లిమెంట్స్ తీసుకోకపోతే ఆరోగ్యానికి మేలు జరగకపోగా, తీవ్రమైన హాని కలిగే ప్రమాదం ఉందన్నారు. అమెరికా ప్రమాణాలతో నాణ్యమైన హెల్త్ సప్లిమెంట్లను అందించే లక్ష్యంతో 'ఆల్ఫాలీట్' బ్రాండ్ ఆవిష్కరించారన్నారు. నగరంలోని ట్రైడెంట్ హోటల్‌లో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఫిట్‌నెస్ విషయంలో సప్లిమెంట్లు కీలక పాత్ర పోషిస్తాయి, కానీ సరైనవి ఎంచుకోవడం అంతకంటే ముఖ్యం. భారత సప్లిమెంట్ మార్కెట్‌లో విశ్వసనీయత, పారదర్శకత కొరవడిందని ఆల్ఫాలీట్ వ్యవస్థాపకులు సురేష్ శుక్లా అన్నారు. అమెరికాలో ఎంబీఏ పూర్తి చేసి, ఫిట్‌నెస్, బాడీబిల్డింగ్‌పై మక్కువతో వందశాతం నాణ్యమైన, క్యూఆర్–కోడ్ వెరిఫైడ్ సప్లిమెంట్లను అందించనున్నామన్నారు. మిస్ ఇండియా మానస, కో–ఫౌండర్ శ్రవణ్ ఘంట తదితరులు పాల్గొన్నారు.




రోడ్ సేఫ్టీ.. అదే ప్రయారిటీ..

సాక్షి, సిటీబ్యూరో: బాధ్యతాయుతమైన డ్రైవింగ్ ప్రోత్సహించే లక్ష్యంతో, హోండా మోటార్ సైకిల్ అండ్ స్కూటర్ ఇండియా నగరంలో రోడ్డు భద్రతా కార్యక్రమాలను పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయ (గోల్కొండ)లో నిర్వహించింది. ఈ కార్యక్రమం ద్వారా, విద్యార్థులు, ఉపాధ్యాయులు భాగస్వాములకు రోడ్డు భద్రత గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రోడ్డు భద్రత సిద్ధాంతం, రక్షిత డ్రైవింగ్ అలవాట్ల ప్రాధాన్యత వంటి అంశాలను వివరించారు. హెల్మెట్ ఉపయోగం, పరిసరాలపై అప్రమత్తత, రోడ్డుపై తక్షణ నిర్ణయాలు తీసుకోవడంపై హెచ్ఎంఎస్ఐ శిక్షణ పొందిన ఇన్‌స్ట్రక్టర్లు విద్యార్థులతో సంభాషించి వ్యక్తిగతంగా వారికి సూచనలు అందించారు.

15న నో ఫోన్ అవర్..

› సరికొత్త కార్యక్రమానికి తెరతీసిన కెన్‌స్టార్

› హ్యాష్‌ట్యాగ్‌తో అనుభవాలు పంచుకోవాలని సూచన



సాక్షి, సిటీబ్యూరో: 79వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని 'నో ఫోన్ అవర్' అనే సరికొత్త ప్రచారం చక్కర్లు కొడుతోంది. నో ఫోన్ అవర్ ఒక సాధారణ ప్రచారం మాత్రమే కాదు.. నేటి అధునాతన జీవనశైలిలో స్వేచ్ఛను అన్వేషించుకునే ఆత్మీయ పిలుపు అని నిర్వాహకులు వెల్లడిస్తున్నారు. ప్రముఖ హోం అప్లయన్స్ బ్రాండ్ కెన్‌స్టార్ ఆధ్వర్యంలో ఈ 'నో ఫోన్ అవర్'లో భాగంగా ఆగస్టు 15న సాయంత్రం 6 గంటల నుంచి 7 గంటల వరకూ మొబైల్ ఫోన్లు ఆఫ్ చేసి, కుటుంబ సభ్యులు, స్నేహితులు, సన్నిహితులతో ఆ సమయాన్ని గడపాలని పిలుపునిస్తోంది. ఇందులో భాగంగా డిజిటల్ ప్రపంచపు గందరగోళం నుంచి బయటపడి, నిజమైన ఆనందాన్ని, అనుబంధాన్ని మళ్లీ ఆస్వాదించేలా కెన్‌స్టార్ ఆహ్వానిస్తోంది. కెన్‌స్టార్ సీఈఓ సునిల్ జైన్ మాట్లాడుతూ.. బాధ్యతగల పౌరులుగా మన మూలాలను గుర్తుచేసుకుంటూ, ముఖ్యమైన వారితో కలిసి స్వాతంత్ర్య దినోత్సవాన్ని జరుపుకోవాలని కోరారు. ఈ డిజిటల్ యుగంలో మనకు వేలాది ఆన్‌లైన్ ఫాలోవర్స్ ఉన్నా, మనుషులతో కలిసుండాలన్న కోరిక ఇంకా బతికే ఉంది. 'నో ఫోన్ అవర్' ఆ కోరికను తీర్చగలిగే సరికొత్త ప్రయత్నమని తెలిపారు. ఈ అనుభవాలను సోషల్ మీడియాలో # NoPhoneHour హ్యాష్‌ట్యాగ్‌తో కథలు, వీడియోలు, ఆడియో సందేశాల రూపంలో పంచుకోవాలని పేర్కొన్నారు.

హైటెక్స్‌లో.. హైలైఫ్..

13 నుంచి నోవోటెల్‌లో ఎగ్జిబిషన్



బంజారాహిల్స్: హైటెక్స్‌లోని హెచ్ఐసీసీ నోవోటెల్ హోటల్‌లో ఈ నెల 13వ తేదీ నుంచి హైలైఫ్ లైఫ్‌స్టైల్ ఎగ్జిబిషన్ ప్రారంభిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. బంజారాహిల్స్ రోడ్ నెం.10లో మంగళవారం జరిగిన సన్నాహక కార్యక్రమంలో నటి స్రవంతి చొక్కారపుతో పాటు పలువురు మోడల్స్ హాజరై ఎగ్జిబిషన్ కరపత్రాన్ని ఆవిష్కరించారు. దీంతోపాటు ఎగ్జిబిషన్‌లో ప్రదర్శించబోయే దుస్తులు, వజ్రాభరణాలను ప్రదర్శించారు. హైలైఫ్ ఎగ్జిబిషన్‌లో ది గ్లామర్ ఎడిషన్ పేరుతో దీన్ని మూడు రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు, దేశవ్యాప్తంగా ప్రసిద్ధిగాంచిన డిజైనర్లు ఈ ఎగ్జిబిషన్‌లో దుస్తులు, యాక్సెసరీస్, వజ్రాభరణాలు ప్రదర్శిస్తారని వెల్లడించారు.





విజయం నుంచి చీకట్లోకి..

'నేను అత్యంత క్రమశిక్షణ కలిగిన మోడల్‌ను. కానీ దీని కోసం భారీ మూల్యం చెల్లించాల్సి వచ్చింది. 37 ఏళ్ల వయసులో ఒక అసాధారణమైన రీతిలో బ్లడ్ క్యాన్సర్ నిర్ధారణ అయ్యింది. నేను ఐదు సంవత్సరాలు మించి బతకబోనని వైద్యులు చెప్పారు.. కానీ నా అంతరాత్మ మాత్రం నన్ను బలంగా నిలిపింది. ఇప్పుడు నేను 53 ఏళ్ల వయసులో సంతృప్తికరమైన జీవితాన్ని గడుపుతున్నాను' అని చెప్పుకొచ్చారు ప్రముఖ నటి, రచయిత లిసారే.

- బంజారాహిల్స్

ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించండి

రోగం దాచుకోవాల్సిన, సిగ్గుపడాల్సిన అంశం కాదు

ఇంటరాక్టివ్ సెషన్‌లో నటి లిసా రే

ఫిక్కీ లేడీస్ ఆర్గనైజేషన్ (ఎఫ్ఎల్ఓ) హైదరాబాద్ చాప్టర్ ఆధ్వర్యంలో 'ది మేనీ లైవ్స్ ఆఫ్ లిసా రే' పేరిట బంజారాహిల్స్‌లోని రాడిసన్ బ్లూ హోటల్‌లో ఇంటరాక్టివ్ సెషన్ మంగళవారం జరిగింది. ఇందులో లిసా రే తన జీవిత అనుభవాలను పంచుకున్నారు. ఆ వివరాలు ఆమె మాటల్లోనే..


'నా అత్యున్నత విజయ ఘడియ, నాకు అత్యంత చీకటి సమయంగా మారింది' అంటూ ఆమె వాఖ్యానించారు. మన ఆరోగ్యానికి మనమే సీఈఓ అన్నారు. 'బాధ్యత తీసుకోండి, ఆరోగ్యానికి ప్రాధాన్యతనివ్వండి' అన్నారు. విజయం సమస్యలు పరిష్కరించదని, మన భావోద్వేగం ఆత్మవేదనను తొలగించబోదని అభిప్రాయపడ్డారు. సమాజం నిర్వచించిన విజయాన్ని తానే ప్రశ్నించాల్సి వచ్చిందన్నారు. లోపల నా భావాలు వేరుగా ఉండడంతో, నేను లోతుగా వెతకాల్సి వచ్చిందని చెప్పారు. రోగం అనేది దాచుకోవాల్సిన, సిగ్గుపడాల్సిన విషయం కాదు.. నా శరీరం, నా జీవితం, నా వ్యాధి.. అన్నీ అంగీకరించడం వల్ల నాకు నిజమైన విముక్తి లభించిందన్నారు.

ధ్యానం నాకు ఆత్మస్థైర్యాన్ని ఇచ్చిందన్నారు. కార్లను శుభ్రం చేస్తాం.. ఇంటి చుట్టూ పరిసరాలను శుభ్రంగా ఉంచుతాం.. కానీ మన మనసులోని నెగెటివ్ ఆలోచనలను ఎందుకు శుభ్రం చేయలేకపోతున్నామని ప్రశ్నించారు. దేశం పరిపూర్ణం కాకపోయినా, జీవించడానికి ఇది ఉత్తమ స్థలమని పేర్కొన్నారు. హైదరాబాద్ నాకు ఎంతో ప్రత్యేకం. ఇక్కడి ప్రజల ఆత్మీయత, ప్రేమతోపాటు ఆహారాన్ని, ఇతర రంగాలన్నింటినీ నేను ప్రేమిస్తాను. మళ్లీ మళ్లీ ఇక్కడికే వస్తుంటానని చెప్పారు.

ఈ కార్యక్రమంలో ఎఫ్ఎల్ఓ హైదరాబాద్ చైర్‌పర్సన్ ప్రతిభా కుందా తదితరులు పాల్గొన్నారు.



రూ.2 లక్షలిస్తే గుడిలో కొలువు



ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలు అమ్ముకొంటున్న దళారులు

పెద్ద దేవాలయాల్లో భారీ దందా

శానిటేషన్‌కు వారే.. ప్రసాదాల తయారీకి వారే

వీలునుబట్టి సిబ్బందిని అటూ ఇటూ మారుస్తున్న ఏజెన్సీల ప్రతినిధులు

ప్రసాదాల తయారీలో పరిశుభ్రత లోపిస్తోందన్న ఆరోపణలు

సాక్షి, హైదరాబాద్: దేవాదాయ శాఖ పరిధిలోని పలు పెద్ద దేవాలయాల్లో ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలు అంగడి సరుకుగా మారాయి. రేటు గట్టి మరీ అమ్మేసుకుంటున్నారు. ఆయా దేవాలయాలకు ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని సరఫరా చేసే ఏజెన్సీల ప్రతినిధులు ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారు. శానిటేషన్, ప్రసాదాల తయారీ, ప్రసాద విక్రయ కౌంటర్లు, గోశాలల నిర్వహణ, క్యూలైన్ల పర్యవేక్షణ.. ఇలా పలు రకాల పనుల కోసం దేవాదాయశాఖ ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో సిబ్బందిని తీసుకుంటోంది. నేరుగా ఆ బాధ్యతను తనే నిర్వహించకుండా జిల్లా కలెక్టర్ల ద్వారా టెండర్ పద్ధతిలో మ్యాన్‌పవర్ సప్లయింగ్ సంస్థలకు కట్టబెట్టి చేతులు దులుపుకొంటోంది. ఆ ఏజెన్సీలు సిబ్బందిని నియమించే విషయంపై అధికారులు దృష్టి సారించకపోవటంతో అంతా అస్తవ్యస్తంగా తయారైంది. దేవాలయాలవారీగా ఈ వ్యవహారాన్ని పర్యవేక్షించేందుకు ఆయా ఏజెన్సీలు కొందరు ప్రతినిధులను నియమిస్తున్నాయి. ఆ ప్రతినిధులు కూడా ఔట్‌సోర్సింగ్ ఖాతాలోనే నియమితులవుతూ నెలవారీ జీతాన్ని పొందుతున్నారు. కానీ, వారిలో చాలామంది అసలు దందా మాత్రం..పోస్టులను బేరానికి పెట్టి డబ్బులు వసూలు చేయటమే. ప్రసాద తయారీ కౌంటర్ పోస్టు కావాలంటే 2.25 లక్షలు, ప్రసాద తయారీ పోస్టు అయితే రూ.2 లక్షలు, శానిటేషన్ విభాగంలో అయితే రూ.1.80 లక్షలు.. ఇలా ధరల పట్టిక తయారు చేసి వసూళ్లకు దిగుతున్నారు. ఆ మొత్తం చెల్లించేందుకు సిద్ధమైన వారిని పిలిచి మాట్లాడి ఉద్యోగాలు కేటాయిస్తున్నారు. అదంతా ఏజెన్సీలకు సంబంధించిన వ్యవహారం కావటంతో దేవాదాయశాఖ అధికారులు పట్టించుకోవటం లేదు. ఇటీవల కొన్ని దేవాలయాలకు సంబంధించి ఏజెన్సీ ప్రతినిధులు, నిరుద్యోగుల మధ్య సాగిన బేరసారాలకు సంబంధించిన ఫోన్‌కాల్ రికార్డులు వెలుగులోకి రావటంతో మరోసారి ఈ అంశం పెద్ద చర్చకు దారితీసింది. పెద్ద దేవాలయాలకు వచ్చే భక్తుల సంఖ్య భారీగా పెరుగుతుండటంతో.. అక్కడ సేవలను విస్తరిస్తున్నారు. ఈ క్రమంలో సిబ్బంది అవసరం పెరుగుతోంది. ప్రస్తుతం దేవాదాయశాఖలో నియామకాలు లేనందున, అవసరమైన సిబ్బందిని ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో తీసుకుంటున్నారు. ఫలితంగా అన్ని పెద్ద దేవాలయాల్లో వీరి సంఖ్య గణనీయంగా పెరుగుతోంది.

ప్రసాదాల తయారీపై ఏదీ శ్రద్ధ..

దేవాలయాల్లో ప్రసాదాల విక్రయానికి ఎంతో ప్రాధాన్యం ఉంటుంది. దర్శన అనంతరం ప్రసాదం స్వీకరించడం భక్తులు తప్పనిసరి అని భావిస్తారు. తినే పదార్థాలు అయినందున ప్రసాదాల తయారీలో పరిశుభ్రత చర్యలు అత్యవసరం. కానీ, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది నియామకంలో నిర్వాహకులు దీనిని పట్టించుకోవటం లేదు. శానిటేషన్ విధుల్లో ఉండే సిబ్బందిని ఇటు ప్రసాదాల తయారీకి పురమాయిస్తున్నారు. ప్రసాదాల తయారీ సమయంలో తలపై క్యాప్ (జుట్టు రాలిపడకుండా), చేతులకు గ్లౌవ్స్ ధరించటంతోపాటు చేతి గోళ్లు పెరిగి ఉండకూడదని, రోజూ పరిశుభ్రమైన వస్త్రాలు ధరించాలనే నిబంధనలుంటాయి. కానీ, సిబ్బందిని సర్దుబాటు చేసే క్రమంలో గోశాలల్లో పేడ ఎత్తే విధుల్లో ఉండేవారిని ప్రసాదాల తయారీకి మారుస్తున్నారు. వారి చేతి గోళ్లలో పేడ ఇరుక్కొని ఉంటే ప్రసాదం కలుషితమయ్యే ప్రమాదం ఉంటుందని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శానిటేషన్ విధుల్లో ఉండే వారిని ప్రసాదాల తయారీ, ప్రసాదాల కౌంటర్లకు ఎలా మారుస్తారని ప్రశ్నిస్తున్నారు. విధుల్లోకి ఎంపిక చేసే వారికి సంబంధించి ఆయా ప్రాంతాల్లో కచ్చితంగా విచారణ జరపాలన్న నిబంధన అపహాస్యమవుతోంది. ఆ వ్యక్తి ఎలాంటి వాడో వాకబు చేయకుండానే దేవాలయాల్లో కీలక బాధ్యత అప్పగిస్తున్నారు. ఈ క్రమంలో అన్యమతస్తులు కూడా దేవాలయ విధుల్లోకి వస్తున్నారని, ఇది భక్తుల మనోభావాలు దెబ్బతినే పరిస్థితికి వెళుతున్నాయన్న ఆరోపణలున్నాయి.

క్లుప్తంగా...

ఫోన్ ట్యాపింగ్ కేసులో వాంగ్మూలం ఇస్తా

- కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ఎస్ఐబీ కేంద్రంగా జరిగిన అక్రమ ఫోన్ ట్యాపింగ్ కేసులో తనతో పాటు తన సహాయకుల వాంగ్మూలాలను శుక్రవారం నమోదు చేయాల్సిందిగా కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ సిట్ ఏసీపీకి మంగళవారం లేఖరాశారు. ఈ కేసులో సంజయ్‌తో పాటు ఆయన పీఆర్వో, పీఏలను సాక్షులుగా పరిగణిస్తూ వాంగ్మూలం ఇవ్వాలని సిట్ అధికారులు గతంలో నోటీసులిచ్చారు. సిట్ నోటీసులపై సానుకూలంగా స్పందించిన సంజయ్ వాంగ్మూలం ఇవ్వడానికి అంగీకరించారు. ఆయన కేంద్రమంత్రి కావడంతో తామే వెళ్లి స్టేట్‌మెంట్ రికార్డు చేసుకోవాలని సిట్ అధికారులు నిర్ణయించారు. అయితే వివిధ కారణాల నేపథ్యంలో ఈ ప్రక్రియ రెండుసార్లు వాయిదా పడింది. తాజాగా శుక్రవారం మధ్యాహ్నం 12 గంటలకు వాంగ్మూలం నమోదు చేయాలంటూ సంజయ్ లేఖ రాశారు. అదే రోజు తనతో పాటు తన పీఆర్వో పసునూరు మధు, పీఏ బోయినపల్లి ప్రవీణ్‌రావు, మాజీ పీఏ పోగుల తిరుపతి స్టేట్‌మెంట్లను కూడా రికార్డు చేయాలని ఆయన కోరారు. ఈ మేరకు సిట్ అవసరమైన ఏర్పాట్లు చేసుకుంటోంది.

నేటి నుంచి బీజేపీ 'హర్ ఘర్ తిరంగా అభియాన్'

సాక్షి, హైదరాబాద్: ఈ నెల 15న స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని.. 6 నుంచి 15 'హర్ ఘర్ తిరంగా అభియాన్'లో త్రివర్ణ పతాకం వైభవాన్ని ఇనుమడింపచేసేలా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు బీజేపీ తెలిపింది. బుధవారం నుంచి శుక్రవారం వరకు జిల్లాస్థాయి, గురు, శుక్రవారాల్లో మండల స్థాయి వర్క్‌షాపులు, 9 నుంచి 12 వరకు రాష్ట్ర వ్యాప్తంగా తిరంగా యాత్రలు, దేశభక్తి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు బీజేపీ ఉపాధ్యక్షుడు, తిరంగా యాత్ర ప్రముఖ్ డాక్టర్ జి.మనోహర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 12 – 14 తేదీల్లో స్వాతంత్ర్య పోరాట స్మారక చిహ్నాలు, స్వాతంత్ర్యోద్యమంలో ప్రాధాన్యమున్న ప్రదేశాలు, యుద్ధ స్మారక చిహ్నాల చుట్టూ స్వచ్ఛత కార్యక్రమాలు నిర్వహించనున్నారు. 13–15 తేదీల్లో హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా.. ప్రతి ఇంటిపై జాతీయ పతాకం ఎగురవేసే కార్యక్రమం ఉంటుందని మనోహర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో జరిగిన వర్క్‌షాపులో.. మధ్యప్రదేశ్ బీజేపీ మాజీ అధ్యక్షుడు వీడీ శర్మ, ఇతర నాయకులు పాల్గొన్నారని పేర్కొన్నారు.

బీసీ రిజర్వేషన్ల ఆందోళనకు మద్దతిస్తాం

- ఉద్యోగ జేఏసీ

సాక్షి, హైదరాబాద్: బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ఆందోళనకు మద్దతు తెలుపుతున్నామని తెలంగాణ ఉద్యోగ ఐక్య కార్యాచరణ సమితి చైర్మన్ మారం జగదీశ్, ప్రధాన కార్యదర్శి ఏలూరి శ్రీనివాసరావు తెలిపారు. ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ఉద్యోగ జాక్ నేతలు మంత్రి వాకిటి శ్రీహరి, విప్ ఆది శ్రీనివాస్‌లతో కలిసి మీడియా సమావేశంలో పాల్గొన్నారు. రిజర్వేషన్ల బిల్‌కు రాష్ట్రపతి ఆమోదం కోసం తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న కృషి దేశానికి ఆదర్శమని పేర్కొన్నారు. బుధవారం ఢిల్లీలో తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న ఆందోళనలో భాగస్వామ్యం అవుతామని తెలిపారు. సామాజిక న్యాయమైన ఈ బిల్లును రాష్ట్రపతి ఆమోదించేలా కేంద్ర ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు. కార్యక్రమంలో ఉద్యోగ సంఘ నేతలు సత్యనారాయణ, నర్సింహారెడ్డి, నజీర్, యాదగిరి, శ్రీకాంత్, రాజీవ్‌రెడ్డి, ఖాజా పాల్గొన్నారు.

అంతిమ దశకు బీసీల పోరు: దాసు సురేశ్




సాక్షి, హైదరాబాద్: బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను కల్పించాలని ఢిల్లీ వేదికగా చేస్తున్న పోరాటం తెలంగాణ ఉద్యమాన్ని తలపిస్తోందని బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు దాసు సురేశ్ పేర్కొన్నారు. ఢిల్లీ ఆందోళనతో బీసీ రిజర్వేషన్ల ఉద్యమం అంతిమ దశకు చేరిందని మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 33 జిల్లాలలో బీసీ నాయకులతో క్షేత్ర స్థాయి రౌండ్ టేబుల్ సమావేశాలు, బీసీ నాయకత్వ శిక్షణ శిబిరాలు నిర్వహిస్తూ బీసీలకు రాజ్యాధికార కాంక్షను రగిల్చామని ఆయన గుర్తు చేశారు.

బీసీ రిజర్వేషన్ల బిల్లును ఆమోదించండి

పార్లమెంట్‌లో తెలంగాణ కాంగ్రెస్ ఎంపీల వాయిదా తీర్మానం

- చర్చకు పట్టు..ప్లకార్డులతో నిరసన..సభను అడ్డుకునే యత్నం
- ఉభయ సభలు పలుమార్లు వాయిదా



సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ ప్రభుత్వం ఆమోదించి కేంద్రానికి పంపిన 42 శాతం బీసీ రిజర్వేషన్ల బిల్లును ఆమోదించాలంటూ తెలంగాణ కాంగ్రెస్ ఎంపీలు పార్లమెంట్‌లో ఆందోళనకు దిగారు. ప్లకార్డులు ప్రదర్శిస్తూ..నినాదాలు చేస్తూ చేపట్టిన నిరసనలతో పార్లమెంట్ ఉభయసభల్లో వాయిదాల పర్వం కొనసాగింది. మంగళవారం ఉదయం లోక్‌సభ ప్రారంభానికి ముందే కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్ కుమార్‌రెడ్డి 42 శాతం రిజర్వేషన్ల అమలు అంశంపై చర్చించాలని కోరుతూ 267 నిబంధన కింద వాయిదా తీర్మానం ఇచ్చారు. లోక్‌సభ ప్రారంభమైన వెంటనే జార్ఖండ్ మాజీ సీఎం శిబూసోరెన్‌కు నివాళులు అర్పించింది. అనంతరం స్పీకర్ ఓంబిర్లా ప్రశ్నోత్తరాలు చేపట్టారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ఎంపీలు మల్లురవి, సురేశ్ షెట్కార్, రఘురామిరెడ్డి, బలరాంనాయక్, చామలతోపాటు ఇతర రాష్ట్రాల కాంగ్రెస్ ఎంపీలు రిజర్వేషన్ల అంశంపై ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసనకు దిగారు. తామిచ్చిన వాయిదా తీర్మానాలపై చర్చకు పట్టుబట్టారు. స్పీకర్ అనుమతించకపోవడంతో తమ స్థానాల్లోంచి వెల్‌లోకి వచ్చి నిరసన కొనసాగించారు. రిజర్వేషన్లపై సానుకూల నిర్ణయం చేయాలంటూ బిగ్గరగా నినాదాలు చేశారు. ఇదే సమయంలో బిహార్‌లో ఎన్నికల కమిషన్ చేపట్టిన ప్రత్యేక ఓటరు సవరణపై ఇతర పార్టీల ఎంపీలు కూడా తమ ఆందోళన కొనసాగించారు. ఈ ఆందోళనల మధ్యే స్పీకర్ ప్రశ్నోత్తరాలు కొనసాగించారు.

రఘునందన్‌రావు ప్రశ్న..

కేంద్ర మంత్రి జవాబు...విపక్షాలపై ఆగ్రహం

తెలంగాణ కాంగ్రెస్ ఎంపీలు సహా ఇతర విపక్ష ఎంపీల నిరసనల మధ్యే తెలంగాణ బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు వ్యవసాయం, రైతుల ఆదాయ పెంపునకు సంబంధించిన ప్రశ్నకు స్పీకర్ అనుమతించారు. దీనిపై కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ సమాధానమిస్తూ విపక్షాలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 'రైతులకు సంబంధించిన కీలక అంశంపై సమాధానమిస్తున్న తరుణంలో సభను అడ్డుకోవడం సరికాదు. రైతుల ప్రయోజనాల దృష్ట్యా విపక్షాలు సహకరించాలి' అని కోరారు. అయినా, విపక్ష ఎంపీలు ఏమాత్రం వెనక్కి తగ్గకుండా మరింత గట్టిగా నినాదాలు కొనసాగించారు. దీంతో విపక్షాలు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నాయంటూ కేంద్రమంత్రి చౌహాన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతుల సంక్షేమానికి తీసుకున్న చర్యలను వివరించారు. అనంతరం మరో 5 నిమిషాలు సభ కొనసాగింది. ఆందోళనల దృష్ట్యా మధ్యాహ్నం 2 గంటలకు సభ వాయిదా పడింది. తిరిగి సభ ఆరంభమైన అనంతరం కూడా తెలంగాణ కాంగ్రెస్ ఎంపీలు ఆందోళన కొనసాగించడంతో సభ బుధవారానికి వాయిదా పడింది.

- రాజ్యసభలో కాంగ్రెస్ ఎంపీలు అనిల్‌యాదవ్, రేణుకాచౌదరిలు బీసీ రిజర్వేషన్లకు మద్దతుగా ఆందోళన చేశారు. విపక్షాల ఆందోళనతో రాజ్యసభ సైతం మధ్యాహ్నం 2 గంటలకు ఒకసారి, తిరిగి బుధవారానికి వాయిదా పడింది. కాగా అంతకుముందు తెలంగాణ కాంగ్రెస్ ఎంపీలు పార్లమెంట్ ప్రాంగణంలోనూ తమ నిరసన కొనసాగించారు. ప్లకార్డులు ప్రదర్శిస్తూ, నినాదాలు చేస్తూ 42 శాతం బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు.

నేడు ఢిల్లీలో కాంగ్రెస్ 'రిజర్వేషన్' ధర్నా

▶ మొదటి పేజీ తరువాయి

వాకిటి శ్రీహరి, విప్ ఆది శ్రీనివాస్ తదితరులు పరిశీలించారు. 200 మంది కూర్చునేలా వేదికను సిద్ధం చేశారు. 1,500 మందికి పైగా కూర్చునేలా కుర్చీలు వేశారు. ఉదయం 10 గంటలకు మొదలయ్యే ధర్నా సాయంత్రం 4 గంటల వరకు కొనసాగనుంది. ఢిల్లీలోని తెలంగాణ భవన్, జంతర్‌మంతర్‌కు వెళ్లే దారిలో ధర్నాకు సంబంధించిన ఫ్లెక్సీలను భారీగా ఏర్పాటుచేశారు. మహాధర్నాలో పాల్గొనే దాదాపు వెయ్యి మంది కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలతో సోమవారం హైదరాబాద్‌లోని చర్లపల్లి రైల్వేస్టేషన్ నుంచి బయలుదేరిన ప్రత్యేక రైలు మంగళవారం మధ్యాహ్నానికి ఢిల్లీ చేరుకుంది. వీరికి స్థానిక వైఎంసీఏతో పాటు పలు హోటళ్లలో వసతి కల్పించారు. వీరితో పాటు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, వివిధ కార్పొరేషన్ల చైర్‌పర్సన్లు సుమారు 500 మంది వరకు విమానాల్లో ఢిల్లీకి వచ్చారు. వీరందరికీ ఎంపీల అధికారిక నివాస గృహాలు, వెస్ట్రన్ కోర్ట్‌లో వసతిని ఏర్పాటు చేశారు.

బీసీలకు రిజర్వేషన్లు ఇవ్వలేకనే ఢిల్లీలో నాటకాలు

కాంగ్రెస్‌పై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు ధ్వజం



ఎడ్లబండిపై వస్తున్న రాంచందర్‌రావు

సాక్షి, పెద్దపల్లి/లక్సెట్టిపేట: బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వటం ఇష్టం లేకనే కాంగ్రెస్ ఢిల్లీలో నాటకాలు ఆడుతోందని, మతపరమైన రిజర్వేషన్లకు బీజేపీ వ్యతిరేకమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు అన్నారు. పెద్దపల్లి జిల్లా బీజేపీ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం జిల్లా కేంద్రంలో మంగళవారం జరిగింది. అలాగే, మంచిర్యాల జిల్లా లక్సెట్టిపేట మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో రైతు సమ్మేళనం నిర్వహించారు. ఈ రెండు కార్యక్రమాల్లో పాల్గొన్న రాంచందర్‌రావు మాట్లాడుతూ.. గతంలో బీఆర్ఎస్ సీబీఐ రాష్ట్రంలోకి రాకుండా జీవో తీసుకొచ్చిందని, ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం కోరితే కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతిపై సీబీఐ విచారణ జరిపిస్తామన్నారు. 'కాళేశ్వరం అవినీతి ప్రాజెక్టు. జస్టిస్ పీసీ ఘోష్ కమిటీ నివేదికను అసెంబ్లీలో అధికారికంగా ప్రవేశపెడితే స్పందిస్తాం' అని పేర్కొన్నారు. కామారెడ్డి డిక్లరేషన్‌లో కాంగ్రెస్ బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు వర్తింపజేస్తామని హామీ ఇచ్చిందని, బీసీలకు చెందాల్సిన రిజర్వేషన్లను ఇతరులకు కేటాయించాలని చూస్తే అంగీకరించేదిలేదని రాంచందర్‌రావు తేల్చిచెప్పారు. రైతులకు యూరియా కొరత లేదని, కాంగ్రెస్ ప్రభుత్వం కొరత ఉన్నట్లు సృష్టిస్తోందని రాంచందర్‌రావు అన్నారు. కేంద్రం 12లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను అందిస్తోందని తెలిపారు. కొందరు దళారులు బ్లాక్‌మార్కెట్‌ను ప్రోత్సహించి కొరత ఉన్నట్లు చెబుతున్నారని అన్నారు. ఆయా కార్యక్రమాల్లో ఎమ్మెల్సీలు మల్క కొమురయ్య, అంజిరెడ్డి, మాజీ ఎంపీ వెంకటేశ్ నేత, మాజీ ఎమ్మెల్యేలు గుజ్జుల రామకృష్ణారెడ్డి, కాసిపేట లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

పత్రికలు సమాజానికి దర్పణాలు

- మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు
- ఐ.వెంకట్‌రావు రచించిన పుస్తకం ఆవిష్కరణ



'విలీనం-విభజన, గతం-స్వగతం, మన ముఖ్యమంత్రులు' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వెంకయ్యనాయుడు. చిత్రంలో కట్టా శేఖర్‌రెడ్డి, బండారు శ్రీనివాస్ కె.శ్రీనివాస్‌రెడ్డి, వెంకట్‌రావు

హిమాయత్‌నగర్ (హైదరాబాద్): పత్రికలు సమాజానికి దర్పణాలని, సమాజంలో ఏం జరుగుతుందో ప్రజలకు అద్దంలా చూపించాలని మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు అన్నారు. సీనియర్ సంపాదకుడు ఇనగంటి వెంకట్‌రావు రచించిన 'విలీనం-విభజన, గతం-స్వగతం, మన ముఖ్యమంత్రులు' అనే పుస్తకావిష్కరణ బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో మంగళవారం జరిగింది. ముఖ్య అతిథి వెంకయ్య నాయుడు.. మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి, పుస్తక రచయిత ఇనగంటి వెంకట్‌రావు, సీనియర్ జర్నలిస్టులు కట్టా శేఖర్ రెడ్డి, బండారు శ్రీనివాస్‌లతో కలసి పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఈ పుస్తకంలో సమకాలీన చరిత్రను, తెలుగు రాష్ట్రాల రాజకీయాలు, వాటిని ప్రభావితం చేసిన నాయకులు, ముఖ్యమంత్రుల గురించి వెంకట్‌రావు చాలా నిష్పక్షపాతంగా రాశారని కొనియాడారు. భాష విషయంలో రాజకీయ నాయకుల తీరు మారాలని, చాలా హుందాగా ప్రవర్తించాలని హితవు పలికారు. జీవితంలో రెండు సార్లు కంటతడి పెట్టానని.. తన తల్లిని ఎద్దు పొడిచి చంపినప్పుడు ఒకసారి, బీజేపీ పార్లమెంటరీ పార్టీ సమావేశానికి పిలిచి ఉప రాష్ట్రపతిని చేసినపుడు రెండోసారని గుర్తు చేసుకున్నారు. తనకు రాజకీయాల్లో నుంచి రావడం ఇష్టం లేదని తెలిపారు. ఉప రాష్ట్రపతి పదవి నుంచి తప్పుకున్నాక.. ఇప్పటి వరకు బీజేపీ కార్యాలయం గుమ్మం తొక్కలేదని వెంకయ్యనాయుడు స్పష్టం చేశారు.

మంత్రి పదవి ఇస్తరా.. ఇవ్వరా మీ ఇష్టం

▶ మొదటి పేజీ తరువాయి

ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యంతో కలిసి మంగళవారం విద్యుత్ సబ్‌స్టేషన్‌లను ప్రారంభించారు. అనంతరం రాజగోపాల్‌రెడ్డి మాట్లాడారు. పూర్తి వివరాలు ఆయన మాటల్లోనే.. 'నేను మాట్లాడితే మంత్రిపదవి రాలేదు కాబట్టి మాట్లాడుతున్నానని కొందరు ఆరోపిస్తున్నారు. మంత్రిపదవి కావాలనుకుంటే నేను ఎల్బీనగర్ నుంచి పోటీ చేసేవాడిని. మునుగోడు నియోజకవర్గ ప్రజల అభివృద్ధి కోసమే నేను ఇక్కడి నుంచి పోటీచేశాను. పదవుల వెనకాల పాకులాడాల్సిన అవసరం నాకు లేదు. అదృష్టం ఉండి నాకు పెద్ద పదవి వస్తే ..అది మునుగోడు నియోజకవర్గ ప్రజలకు మేలు జరుగుతుంది. పైరవీలకు పోయి, దోచుకొనేటోడిని కాను. రాజకీయాలు అడ్డం పెట్టుకొని వచ్చి రూ.వేల కోట్లు దోచుకునే వారికి పదవులు కావాలి. రాజగోపాల్‌రెడ్డికి ప్రజలు కావాలి..వారి అభివృద్ధి, సంక్షేమం కావాలి. ప్రజల కోసం పార్టీ మారి కాంగ్రెస్‌లోకి వచ్చిన. మీరు మంత్రిపదవి ఇస్తామని హామీ ఇచ్చారు. ఇస్తారా.. ఇవ్వరా మీ ఇష్టం, నేను సీనియర్‌ను కాబట్టి..తెలంగాణ ఉద్యమంలో ఉన్నాను. ఇతర పార్టీల నుంచి నిన్న మొన్న వచ్చిన జూనియర్లకు పదవులు ఇచ్చారు. మీరు ఎంపీని గెలిపించమంటే గెలిపించాను. పార్టీలోకి రమ్మంటే, పార్టీని నమ్ముకొని వచ్చినా. మీకు ఇవ్వాలనిపిస్తే ఇవ్వండి, ఇస్తారా ఇవ్వరా మీ ఇష్టం. నేను మాత్రం పదవుల కోసం ఇంటికి వెళ్లి కాళ్లు మొక్కి బతిమిలాడే మనసు చంపుకొని దిగజారే రకం కాదు. అది బతికుండగా కాదు. నా వెనకాల ప్రజలు ఉన్నారు. నాకు కావాల్సింది ప్రజలు.. వాళ్ల బాగోగులు, నియోజకవర్గ అభివృద్ధి. ఒకవేళ ఏదైనా మంచి జరిగితే ప్రజలకు మంచి జరుగుతుంది. లేకపోతే ప్రజల మధ్యనే ఉంటా ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకుంటా' అని రాజగోపాల్‌రెడ్డి అన్నారు.

ఏదైనా ప్రజల కోసమే..

'పోయినసారి ప్రభుత్వాన్ని మీ కాళ్ల దగ్గరకు తీసుకొచ్చిన. నేను రాజీనామా చేసి.. 100 మంది టీఆర్ఎస్ ఎమ్మెల్యేలు మునుగోడు ప్రజల వద్దకు తీసుకొచ్చినాను. అవసరమైతే అంత దూరమైనా పోతా. నేను భయపడను. ఏదైనా మంచి పనిచేస్తే మీ కోసం చేస్తాను. త్యాగమైనా, పోరాటమైనా మీరు తలదించుకొనే పని ప్రాణం పోయినా చేయను. సీఎం రేవంత్‌రెడ్డి కొడంగల్ నియోజకవర్గానికి రూ.5 వేల కోట్ల నిధులు అభివృద్ధికి తీసుకొని పోతే నాకు నిద్ర పట్టలేదు. పదవి లేకున్నా పైసలు మునుగోడు నియోజకవర్గ అభివృద్ధికి రావాలి. ఈ విషయంలో రాజీపడేది లేదు' అని రాజగోపాల్‌రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు కరంటోతు శ్రీనివాస్‌నాయక్, గుత్త ఉమాదేవి, ప్రేంచందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాది ప్రజాస్వామ్య ఉద్యమం

- రిజర్వేషన్ల పోరాటం బీసీల కోసం మాత్రమే కాదు
- రాష్ట్ర వెనుకబడిన వర్గాల సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



సాక్షి, హైదరాబాద్: ఢిల్లీ వేదికగా తాము చేస్తున్నది ఒక్క బీసీల పోరాటం మాత్రమే కాదని, ప్రజాస్వామ్యానికి ఆత్మవిశ్వాసాన్ని కల్పించే ఉద్యమమని రాష్ట్ర వెనుకబడిన వర్గాల సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. బీసీలకు స్థానిక సంస్థలతోపాటు విద్య, ఉద్యోగాల్లో 42 శాతం రిజర్వేషన్ల కల్పన కోసం చిత్తశుద్ధితో పనిచేస్తున్నామని మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు కల్పించిన రోజే రిజర్వేషన్ల పరిమితి 50 శాతం దాటిందని, ఆ రిజర్వేషన్లు సాధ్యమైనప్పుడు తెలంగాణలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఎందుకు సాధ్యం కావని పొన్నం ప్రశ్నించారు. బీసీ రిజర్వేషన్ల బిల్లు ఆమోదం కోసం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు నిర్వహిస్తున్న మహాధర్నాలో పాల్గొనేందుకు వేలాది మంది బీసీ నేతలు ఢిల్లీ చేరుకున్నారని వెల్లడించారు. ఏడో తేదీన రాష్ట్రపతిని కలిసి వినతిపత్రం ఇస్తామని చెప్పారు. ముస్లింల సాకు చూపి బీసీ రిజర్వేషన్లను అడ్డుకునే ప్రయత్నాల్లో బీజేపీ నేతలున్నారని ఆరోపించారు.

బీసీ రిజర్వేషన్ల పోరాటంలో విజయం సాధిస్తాం

మంత్రి వాకిటి శ్రీహరి



సాక్షి, న్యూఢిల్లీ: బీసీలకు రిజర్వేషన్ల సాధన పోరాటంలో ఢిల్లీలో విజయం సాధిస్తామని మంత్రి వాకిటి శ్రీహరి ధీమా వ్యక్తంచేశారు. బీసీ రిజర్వేషన్ల ఉద్యమం తెలంగాణ ఉద్యమ రూపం దాల్చబోతోందన్నారు. బుధవారం జరగనున్న బీసీ ధర్నాలో పాల్గొనేందుకు ఢిల్లీకి వచ్చిన ఆయన.. మంగళవారం తెలంగాణ భవన్‌లో ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు బీసీ రిజర్వేషన్లను అడ్డుకోవద్దని, బీసీల నోటిదాకా వచ్చిన ముద్దను దూరం చేయొద్దని కోరారు. బీజేపీకి క్రెడిట్ కావాలంటే 42 శాతానికి మించి 52 శాతం బీసీలకు రిజర్వేషన్లు ఇవ్వాలని సూచించారు. అనంతరం ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ.. అసెంబ్లీలో రిజర్వేషన్లకు సై అన్న బీజేపీ ఎమ్మెల్యేలు ఢిల్లీలో నై అంటున్నారని విమర్శించారు. కాంగ్రెస్‌కు బీసీలపై చిత్తశుద్ధి ఉంది కాబట్టే కులగణన చేసిందని చెప్పారు. బీసీలపై ప్రేమ ఉంటే కేసీఆర్, కవిత హైదరాబాద్‌లో కాకుండా ఢిల్లీలో ధర్నా చేయాలని హితవు పలికారు. బీసీ రిజర్వేషన్ల సాధన కోసం ఢిల్లీలో ధర్నా ద్వారా కేంద్రంపై ఒత్తిడి తీసుకొస్తామన్నారు. గురువారం రాష్ట్రపతిని కలుస్తామని ఆది శ్రీనివాస్ చెప్పారు.

నో కామెంట్

- నేను మంత్రి పదవులు ఇచ్చే స్థాయిలో ఉన్నానా?
- హైకమాండ్‌కు చెప్పే పరిస్థితి లేదు
- రాజగోపాల్‌రెడ్డికి అమాత్య పదవిపై మంత్రి కోమటిరెడ్డి వ్యాఖ్యలు

సాక్షి, న్యూఢిల్లీ: 'నేను మంత్రి పదవులు ఇచ్చే స్థాయిలో ఉన్నానా? హైకమాండ్‌కు చెప్పే పరిస్థితి లేదు' అని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డికి మంత్రి పదవి విషయంలో నో కామెంట్ అంటూ వ్యాఖ్యానించారు. తన పరిధిలో లేని విషయాలను అడిగితే ఎలా అంటూ ప్రశ్నించారు. మంగళవారం కేంద్రమంత్రి నితిన్ గడ్కరీని కలిసిన అనంతరం తెలంగాణభవన్‌లో వెంకట్‌రెడ్డి విలేకరులతో మాట్లాడారు. 'నేను మంత్రి పదవులు ఇచ్చే స్టేజ్‌లో ఉన్నానా? మాది జాతీయపార్టీ.. సీఎం అభిప్రాయాలు తీసుకుంటారు. ఆయన పర్మిషన్‌తో అగ్ర నాయకత్వం మంత్రి పదవులపై నిర్ణయం తీసుకుంటుంది. అందులో నాతోపాటు ఎవరి ప్రమేయమూ ఉండదు. ఆయన్ను పార్టీలోకి తీసుకునేముందు మాట ఇచ్చారనే విషయం నాకు తెలియదు. వారు ఇస్తే సంతోషమే. సీఎం, అధిష్టానం తీసుకునే నిర్ణయాన్ని నన్ను అడగం సరికాదు. నా చేతుల్లో లేని విషయాన్ని అడిగితే నేను ఏమీ చెప్పలేను. మంత్రి పదవులపై చర్చ నాకు ఇష్టముండదు. హైకమాండ్ ఏ నిర్ణయం తీసుకున్నా దాన్ని సమర్థిస్తా. నేను సీఎం రేసులో లేను..మంత్రి రేసులోనూ లేను. మంత్రి పదవి ఇచ్చారు తీసుకున్నా. జిల్లా నుంచి ఏడుగురు గెలిస్తే.. కాంగ్రెస్ అధిష్టానం, అప్పటి సీఎం డాక్టర్ వైఎస్.రాజశేఖరరెడ్డి నాకు మంత్రి పదవి ఇచ్చారు' అని కోమటిరెడ్డి స్పష్టం చేశారు.

వైఎస్.జగన్‌తో మాట్లాడితే వెంటనే స్పందించారు

'ఢిల్లీలో తెలంగాణభవన్ నిర్మాణానికి కేసీఆర్ భూమి ఇవ్వలేదు. నేను అప్పటి ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డితో మాట్లాడాను. వెంటనే ఆయన స్పందించారు. 40–60 రేషియోలో అడిగిన ప్రాంతాన్ని ఇచ్చారు. డీపీఆర్ సిద్ధంగా ఉంది. కేంద్రం అనుమతులు తీసుకుంటాం. రెండు నెలల్లోనే నిర్ణయం తీసుకొని, టెండర్లు పిలిచి ఢిల్లీలోని పటౌడీ హౌస్‌లో తెలంగాణ భవన్ నిర్మాణం చేపడతాం' అని కోమటిరెడ్డి చెప్పారు.

ఎన్‌హెచ్-65 విస్తరణకు గడ్కరీ హామీ ఇచ్చారు



గడ్కరీకి పుష్పగుచ్ఛం అందిస్తున్న కోమటిరెడ్డి

ఎన్‌హెచ్-65 విస్తరణపై రాష్ట్ర ప్రభుత్వం అంచనాలు పంపితే ఈ నెల 15న జరిగే సమావేశంలో పనులకు ఆమోదం తెలిపి, టెండర్లు కూడా ఆహ్వానిస్తామని కేంద్ర ఉపరితల రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ హామీ ఇచ్చినట్టు రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. హైదరాబాద్ మల్కాపూర్ నుంచి ఏపీలోని అమరావతి వరకు రహదారిని 4 వరుసల నుంచి 6 వరుసలుగా విస్తరించడంపై కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించినట్టు చెప్పారు. మంగళవారం రాష్ట్రానికి చెందిన ఎంపీల బృందంతోపాటు గడ్కరీని కలిసిన మంత్రి.. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న పలు రోడ్ల పనులపై చర్చించారు.

- చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న రోడ్ల మౌలిక సదుపాయాల సమస్యలను పరిష్కరించాలని నితిన్ గడ్కరీకి రాష్ట్ర మంత్రి వివేక్ వెంకటస్వామి విజ్ఞప్తి చేశారు. మంగళవారం పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణతో కలిసి గడ్కరీని కలిశారు. ఆ తర్వాత రాష్ట్రంలో నైపుణ్యాభివృద్ధి కేంద్రాలు, వెనుకబడిన ప్రాంతాల్లో ఐటీఐ హబ్‌లు ఏర్పాటు చేయాలని కేంద్ర నైపుణ్యాభివృద్ధి శాఖ సహాయ మంత్రి జయంత్ చౌదరిని కలిసి విజ్ఞప్తి చేశారు.
- రాష్ట్రంలో ఉపాధి హామీ పని దినాలు పెంచాలని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌ను రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్కలు కోరారు.
- ఖరీఫ్ సీజన్ కోసం రాష్ట్రానికి కేటాయించిన 6.60 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాలో కోత విధించిన 2.24 లక్షల మెట్రిక్ టన్నులను వెంటనే సరఫరా చేయాలని కోరుతూ కేంద్ర మంత్రి జేపీ నడ్డాకు ఎంపీ చామల కిరణ్ కుమార్‌రెడ్డి లేఖ అందజేశారు.

బీసీల రిజర్వేషన్ల బిల్లుపై బీజేపీది ద్వంద్వ వైఖరి : తమ్మినేని


సీపీఎం ఆధ్వర్యంలో ఇందిరాపార్కు వద్ద మహాధర్నా



ధర్నాలో అభివాదం చేస్తున్న సీపీఎం నాయకులు రంగారెడ్డి, తమ్మినేని వీరభద్రం, జాన్‌వెస్లీ, జ్యోతి, వీరయ్య

కవాడిగూడ: బీసీల రిజర్వేషన్ల బిల్లుపై బీజేపీ ద్వంద్వ వైఖరి అవలంబిస్తుందని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం అన్నారు. బీసీల పట్ల చిత్తశుద్ధి ఉంటే కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించి బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. బీసీల రిజర్వేషన్ల బిల్లుపై పార్లమెంట్‌లో చట్టం చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం కేంద్ర కమిటీ సభ్యురాలు టి.జ్యోతి ఆధ్వర్యంలో మంగళవారం ఇందిరా పార్కు ధర్నా చౌక్‌లో మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా తమ్మినేని వీరభద్రం మాట్లాడుతూ బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేంత వరకు సీపీఎం పోరాటం చేస్తూనే ఉంటుందన్నారు. తెలంగాణ ప్రభుత్వం తీసుకొచ్చిన బీసీ బిల్లును ఆమోదిస్తే ఆ క్రెడిట్ కాంగ్రెస్ పార్టీకి దక్కుతుందేమోనని, ఒకవేళ బిల్లును ఆమోదించకపోతే రాబోయే బిహార్ ఎన్నికల్లో బీసీల ఓట్లు దూరం అవుతాయని భావించి మీనమేషాలు లెక్కిస్తుందన్నారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ మాట్లాడుతూ బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఒక న్యాయం, తెలంగాణకు ఒక న్యాయమా అని ప్రశ్నించారు. ఈ మహాధర్నాలో సీపీఎం నేతలు జూలకంటి రంగారెడ్డి, వీరయ్య, సత్యం, యాదయ్య, వెంకటేశ్, సాగర్, మల్లు లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బీసీ బిల్లు ఢిల్లీలో మూలుగుతోంది: జాజుల



సాక్షి, న్యూఢిల్లీ: బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు పెంచుతూ రాష్ట్రప్రభుత్వం అసెంబ్లీలో బిల్లు పెట్టి ఏకగ్రీవంగా తీర్మానించిందని, ఆ బిల్లు ఢిల్లీలో మూలుగుతోందని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ విమర్శించారు. ఆ బిల్లును కేంద్రానికి పంపి మూడున్నర నెలలు కావొస్తున్నా దానిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. మంగళవారం ఢిల్లీలోని తెలంగాణభవన్‌లో జాజుల మీడియాతో మాట్లాడారు. బుధవారం జరిగే కాంగ్రెస్ ధర్నాకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. బీసీల జనాభా 60 శాతం ఉన్నప్పటికీ 42 శాతానికే పరిమితం చేసి బీసీ రిజర్వేషన్లు పెంచాలని ఒక మెట్టు దిగి బీసీలు పోరాడుతున్నప్పటికీ కేంద్రం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. బీజేపీ గల్లీలో ఒక విధానం, ఢిల్లీలో ఇంకొక విధానం అవలంబిస్తూ బీసీలను మోసం చేయాలని ప్రయత్నిస్తుండటం బాధాకరమన్నారు.

న్యూస్ మేకర్స్

ఈ రెండు ఫొటోలు చూడండి.
ఇక్కడ ఉన్నది 40 ఏళ్ల తల్లి..
17 సంవత్సరాల కుమారుడు.
ఇద్దరూ ఒకేసారి సేమ్ కాలేజీలో డిగ్రీ కోర్సు చేరారు.
వేరే వేరే గ్రూపులే.
కాని లాంగ్వేజ్ క్లాసుల్లో కలిసి కూచుంటారు.
తల్లీ కొడుకు ఒకే కాలేజీలో ఒకే క్లాసులో
కలిసి చదువుకుంటూ ఉంటే
చదువుకునే వారికి అడ్డు లేదనిపిస్తుంది.
అక్షరాస్యత మెండుగా ఉన్న కేరళలోది ఈ దృశ్యం.


కొడుకు వైష్ణవ్‌తో మాధురి

అమ్మే... క్లాస్‌మేట్


క్లాస్‌లో కొడుకు వైష్ణవ్‌తో మాధురి

ఎర్నాకుళం నుంచి గంటన్నర దూరంలో ఉండే చిన్న ఊరు సత్యమంగళం. అక్కడే ఉంది ఎం.ఎ. డిగ్రీ కాలేజీ. రోజూ ఉదయాన్నే ఆ కాలేజీకి ఈ సంవత్సరం ఒక స్కూటీ వస్తోంది. ముందు తల్లి కూచుని నడుపుతూ ఉంటుంది. వెనుక కొడుకు కూచుని ఆమెతో పాటు వస్తారు. చూసేవారు కొడుకును కాలేజీలో దించి ఆమె వెళ్లిపోతుందని అనుకుంటారు. తప్పు. ఆమె స్కూటీని పార్క్ చేసి చక్కా ఒక క్లాస్‌లోకి వెళుతుంది. కొడుకు మరో క్లాస్‌లోకి వెళతారు. అందాక వాళ్లు తల్లీకొడుకులు. కాలేజీలో అడుగు పెట్టాక డిగ్రీ విద్యార్థులు. చాలా అరుదుగా కనిపించే ఈ దృశ్యం ఎందరికో ముచ్చట గొలుపుతోంది. చదువు మధ్యలో ఆపిన తల్లులు తమ పిల్లలతో పాటు కాలేజీ చదువు కొనసాగిస్తే ఎంతో బాగుంటుంది కదా.

తల్లి బి.ఏ.. కొడుకు బి.కామ్

40 ఏళ్ల మాధురి ఈ సంవత్సరం ఎం.ఎ కాలేజీలో బి.ఏలో చేరింది. ఆమె కొడుకు వైష్ణవ్ బీకాంలో చేరాడు. ఇద్దరివీ వేరే వేరే గ్రూప్‌లైనా లాంగ్వేజ్ క్లాసులు కామన్‌గా వినాలి. అప్పుడు పక్కపక్కన కూచుని హాయిగా క్లాసులు వింటారు. మధ్యాహ్నం ఇద్దరూ కలిసి భోజనం చేసి మళ్లీ క్లాసులకు చలో. కాలేజీ పూర్తయ్యాక స్కూటీ మీద ఆమె కొడుకును వెంటబెట్టుకుని ఇల్లు చేరుకుంటుంది. మలయాళ సాహిత్యం అంటే ఆసక్తి ఉన్న మాధురి బి.ఏ ఇంగ్లిష్‌లో చేరడం ఇష్టమే అంటోంది. మంచి ఫుట్‌బాల్ ప్లేయర్ అయిన వైష్ణవ్ స్పోర్ట్స్ కోటాలో బి.కామ్. సీటు సాధించాడు. ఇప్పుడు తల్లి తనతో పాటు కాలేజీకి రావడంతో సంతోషంగా ఉన్నాడు. 'మీ ఫ్రెండ్స్ ఏమైనా ఎగతాళి చేస్తున్నారా మీ అమ్మను చూసి' అంటే 'ఎగతాళి ఎందుకు... ఇందులో వాళ్లు ఎగతాళి చేయడానికి ఏమీ లేదు... నేను ఇబ్బంది పడే విషయం అంతకన్నా లేదు. ఆమె చదువుకోవడానికి కాలేజీకి వచ్చింది' అంటాడు వైష్ణవ్.

ఎన్నో ఏళ్ల కల

మాధురికి డిగ్రీ చదవాలని ఎప్పటి నుంచో ఉంది. కాని ఇంటర్ కావడంతోటే పెళ్లి... వెంట వెంటనే ఇద్దరు పిల్లలు.. సంసారంలో పడి కుదరలేదు. కాని బస్ కండక్టర్‌గా పని చేసే ఆమె భర్త బిను భార్య కోరికను గౌరవించాడు. చదువుకోమని చాలాసార్లు కోరాడు. ఇన్నాళ్లకు మాధురికి కుదిరి బి.ఏ.లో చేరింది. 'క్లాసులో ఉన్న విద్యార్థులు నా వయసు కాకపోయినా వెంటనే స్నేహం చేశారు. వారితో కలగలిసి పోవడం నాకు ఇబ్బంది కాలేదు' అంది మాధురి. ఇలా తల్లీకొడుకు చదువుకోవడం పట్ల కాలేజీ అధ్యాపకులు, ప్రిన్సిపాల్ కూడా సంతోషంగా ఉన్నారు. 'ప్రతి ఒక్కరికీ చదువుకునే హక్కు ఉంది. మనం అవకాశం కల్పించాలి' అన్నాడా కాలేజీ ప్రిన్సిపాల్.

మాధురిలా చదువుకోవాలని ఉన్న గృహిణులు ప్రయత్నిస్తే సాధ్యం అవుతుంది. ప్రయత్నించాలి అంతే.

● తల్లిపాల వారోత్సవాలు

చాలా మంది మహిళల్లో పాలిసిస్టిక్ ఓవరీ సిండ్రోమ్ వల్ల హార్మోన్ల స్థాయిలలో హెచ్చు తగ్గులు ఏర్పడుతుంటాయి. ప్రసవం అయ్యాక బిడ్డకు తల్లిపాలు ఇవ్వడం ద్వారా అమ్మకు హార్మోన్లలో సమతుల్యత ఏర్పడుతుందంటున్నారు నిపుణులు. అంతేకాదు, పీసీఓఎస్ సమస్య ఉన్నవాళ్లు ఎలాంటి ఆందోళన పడకుండా తల్లి పాలు ఇవ్వడం ఆమె ఆరోగ్యానికీ మేలు చేస్తుంది అంటున్నారు.



అమ్మకూ అమృతమే!

పీసీఓఎస్ అనేది సంతానోత్పత్తికి, ఆరోగ్యాన్ని ప్రభావితం చేసే సాధారణమైన హార్మోన్ల రుగ్మత. ఈ సమస్య ఉన్న స్త్రీలలో ప్రొజెస్టెరాన్ తక్కువ స్థాయిలో ఉంటుంది. ఈ హార్మోన్ రొమ్ము కణజాల అభివృద్ధికి అవసరం. ఈ కణజాలం తగినంతగా లేకపోవడం అలాగే ఈస్ట్రోజెన్ లేదా టెస్టోస్టెరాన్ స్థాయులు ఎక్కువగా ఉండటం వల్ల పాల ఉత్పత్తి తగ్గే అవకాశాలు ఉన్నాయి. ఇన్సులిన్ నిరోధకత, థైరాయిడ్ సమస్యలు వంటి కారణాల వల్ల తక్కువ పాల ఉత్పత్తి ఉండవచ్చు. ఇలాంటప్పుడు తల్లి ఆందోళన పడాల్సిన అవసరం లేదు. తల్లికి మంచి గైడెన్స్, కుటుంబ మద్దతు, ఆరోగ్యకరమైన అలవాట్లతోపాటు బిడ్డకు చనుబాలు ఇవ్వడం వల్ల అమ్మలో పాలు ఊరటం పెరుగుతుంది. దీనివల్ల తిరిగి హార్మోన్లలో సమతుల్యత ఏర్పడుతుంది. ప్రసవం నుంచి త్వరగా కోలుకోవడమూ జరుగుతుంది.

హార్మోన్ల స్థాయిలను ఎలా ప్రభావితం చేస్తాయంటే...

బిడ్డకు పాలిచ్చేటప్పుడు తల్లిలో ఆక్సిటోసిన్, ప్రోలాక్టిన్ ఉత్పత్తి పెరుగుతాయి. ఈ హార్మోన్లు పాల ఉత్పత్తితో పాటు తల్లీ–బిడ్డ బంధం, మానసిక ఆరోగ్య శ్రేయస్సుకు సహాయపడతాయి. పీసీఓఎస్ ఉన్న మహిళ తల్లి అయ్యి, పాలు బిడ్డకు ఇస్తుంటే ఆ తల్లిల్లో టెస్టోస్టెరాన్ స్థాయులు తగ్గవచ్చు. ఆక్సిటోసిన్ గర్భాశయం సంకోచించడానికి, ప్రసవం తర్వాత దాని సాధారణ పరిమాణానికి తిరిగి రావడానికి తోడ్పడుతుంది. తల్లీ–బిడ్డ బంధాన్ని మెరుగుపరిచి, ఒత్తిడిని తగ్గిస్తుంది. రక్తంలో షుగర్ లెవల్స్ సమస్థాయిలో ఉండి, పెరిగిన బరువును ప్రసవం తర్వాత తగ్గడానికి సహాయపడుతుంది.

పీసీఓఎస్ ఉండి, తల్లిపాలు ఇవ్వడంలో రకరకాల సవాళ్లు ఉంటాయి. కానీ చాలా మంది మహిళలు బిడ్డకు పాలు ఇవ్వగలుగుతారు. ఆరోగ్యకరమైన జీవనశైలితో మంచి ప్రయోజనాలను పొందవచ్చు.

ఆందోళన పడవద్దు

తల్లిపాలు ఇవ్వడం ద్వారా పీసీఓఎస్ లక్షణాలు తిరిగి రావడంలో జాప్యం జరుగుతుంది. అయితే, తల్లిపాలు ఇవ్వడం ఆగిపోయిన తర్వాత, హార్మోన్ స్థాయులు మారినప్పుడు పీసీఓఎస్ లక్షణాలు తిరిగి వచ్చే అవకాశాలూ ఉన్నాయి. పీసీఓఎస్ ఉన్నవాళ్లలో తక్కువ పాలు వచ్చే అవకాశాలు ఉన్నాయి. కానీ, తల్లి ఆందోళన పడకుండా వైద్యులను సంప్రదిస్తే పాలు రావడానికి రొమ్ముకు మందులు సూచిస్తారు. తల్లిపాలు తగ్గడానికి పీసీఓస్ మాత్రమే కారణం అని చెప్పలేం. మానసిక ఒత్తిడి, ఆందోళన వల్ల కూడా పాలు తక్కువ వస్తాయి. ఓపిక పట్టాలి. అలాగని, కొన్ని రోజుల తర్వాత పాలు సరిపడా వస్తాయిలే అని జాప్యం చేయకూడదు. పోషకాహారం, వాడుతున్న మందుల విషయంలో ఉన్న సవాళ్లు, మానసిక సమస్యలను కూడా పరిష్కరించుకోవాలి. ఇప్పుడు వర్షాకాలం కాబట్టి తల్లులకు జ్వరాలు, ఇన్ఫెక్షన్ సమస్యలు కూడా ఉంటాయి. ఇలాంటప్పుడు నిర్లక్ష్యం చేయకుండా లాక్టేషన్ నిపుణులు లేదా వైద్యుల సలహా పాటించాలి.



– డాక్టర్ మనోరమ,
గైనకాలజిస్ట్, ఖమ్మం

అడూర్.. ఇదేం విడ్డూరం!


అడూర్ గోపాలకృష్ణన్.. సినీఫైల్స్ ముఖ్యంగా న్యూవేవ్ మూవీ లవర్స్‌కి అభిమాన దర్శకుడు. స్క్రిప్ట్ రైటర్, ప్రొడ్యూసర్ కూడా అయిన అడూర్ గోపాలకృష్ణన్.. 'స్వయంవరం' సినిమాతో మలయాళ చిత్రపరిశ్రమలో న్యూవేవ్ మూవీకి రీళ్లు పరిచాడు. అంతేకాదు 'చిత్రలేఖ ఫిల్మ్ సొసైటీ అండ్ చలచిత్ర సహకరన సంఘం'ను స్థాపించి చిత్రనిర్మాణంలో కో ఆపరేటివ్ సెక్టార్‌కు ఆద్యుడిగా నిలిచాడు. అంతటి దూరదృష్టి కల అడూర్ అనవసరంగా నోరు పారేసుకుని అతని అభిమానుల ఆగ్రహానికీ పాత్రుడయ్యాడు.

ఏమన్నాడంటే..

కేరళ రాష్ట్ర ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్.. షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ తెగలు, మహిళా ఫిల్మ్ మేకర్స్‌ను ప్రోత్సహించేందుకు కోటిన్నర రూపాయల ఫండ్‌ను అందిస్తోంది. ఈ ఫండ్ అనుకున్న అవుట్‌కమ్‌ను అందించట్లేదు కాబట్టి దీన్ని పునరుద్ధరించడమే కాక, ఆ ఫండ్‌ను ఇచ్చేముందు వాళ్లకు నిపుణుల చేత మూడు నెలల పాటు శిక్షణనిప్పించాలని అంటాడు అడూర్ గోపాలకృష్ణన్. వాళ్లకిస్తున్న ఫండ్ ప్రజల సొమ్మని.. క్వాలిటీ ఫిల్మ్స్ తీయడానికి ఉపయోగించాలనే స్పృహ వాళ్లకు కల్పించాలనీ కామెంట్ చేశాడు. అలాగే సినిమారంగంలోకి అడుగుపెట్టే మహిళల విషయంలో కూడా ఓ మాట విసిరాడు. మహిళలు అయినంత మాత్రాన ఫండ్ ఇవ్వకూడదని.. వాళ్లకూ సునిశిత శిక్షణనిచ్చాకే ఫండ్‌ను గ్రాంట్ చేయాలన్నాడు. అంతేకాదు ఒక్కొక్కరికీ కోటిన్నర రూపాయలు ఇచ్చేబదులు రూ. యాభై లక్షల చొప్పున ముగ్గురికి పంచాలనే సలహా కూడా ఇచ్చాడు.

ఏ సందర్భంలో అన్నాడంటే..

మలయాళ చిత్రపరిశ్రమలో వివక్షను రూపుమాపేందుకు తీసుకురావాల్సిన పాలసీ మీద కేరళ రాష్ట్ర ప్రభుత్వం తిరువనంతపురంలో ఇటీవల రెండు రోజుల సమావేశమొకటి నిర్వహించింది. దానికి హాజరైన అడూర్ గోపాలకృష్ణన్ అలా మాట్లాడి సంచలనానికి కేంద్రమయ్యాడు. అతని ఈ వ్యాఖ్యల పట్ల దళిత రచయితలు, యాక్టివిస్ట్‌లు, స్త్రీవాదులు తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్నారు.


అడూర్ గోపాలకృష్ణన్

ఏదైనా మాట్లాడొచ్చు అనుకోవడం కరెక్ట్ కాదు

ఏ రాష్ట్ర ప్రభుత్వమైనా ఎన్నో పథకాలను ప్రవేశపెడుతుంది. వాటి అమలులో ఎంతోకొంత ప్రజాధనం వృథా అవుతుంది. అలాగే ఆర్ట్, కల్చర్, ఫిల్మ్‌మేకింగ్‌లో ఎస్సీ, ఎస్టీ, మహిళలను ప్రోత్సహించడానికి కేరళ ప్రభుత్వం అందిస్తున్న ఫండ్‌ను ఎవరూ వ్యతిరేకించాల్సిన పనిలేదు. ఆ ఫండ్‌ను ఇచ్చే ముందు మూడునెలలు వాళ్లకు సినిమాతీయడమెలాగో నేర్పించాలి అనేది ఇంపాజిబుల్ థింగ్. సినిమా క్రాఫ్ట్‌ను నేర్పించగలరమో కానీ.. ఏం తీయాలన్నది ఎవరూ ఎవరికీ నేర్పించలేరు. ఏం తీయాలన్నది వ్యక్తిగత చాయిస్. తరతరాలుగా వాళ్లు పడ్డ బాధ, అనుభవించిన వేదనను ఎలా పిక్చరైజ్ చేయాలో మనమెలా చెబుతాం? వాళ్ల ఆలోచనలకు తెరరూపం కల్పించే అవకాశమివ్వడంలో తప్పేముంది! పైగా ఓ కమిటీని పెట్టి, స్క్రూటినీ చేసి, అర్హులైన వాళ్లకే ఇస్తామంటున్నారు. ఇంక ప్రాబ్లమేంటీ? నేను ఎస్సీ, ఎస్టీ.. అమ్మాయిని అని చెప్పుకోగానే ఫండ్ గ్రాంట్ చేయట్లేదు కదా! వందల ఏళ్లుగా మహిళలు, షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల వాళ్లు అనుభవిస్తున్న పీడన, చేస్తున్న స్ట్రగుల్‌కి ఎంతిచ్చినా తక్కువే. అలాంటి వాళ్లను ప్రోత్సహించడానికి ప్రభుత్వం చొరవ తీసుకున్నప్పుడు బాధ్యతగల ఫిల్మ్‌మేకర్‌గా అడూర్ గోపాలకృష్ణన్ అలా మాట్లాడకూడదు. ఆయన ఇనీషియల్ డేస్‌లో ఆయనేం తీస్తారో తెలియకుండానే కదా ఆయనకు ఫస్ట్ చాన్స్ వచ్చుంటది! అలాగే ఇప్పుడు వీళ్లలోంచీ అద్భుతమైన ఫిల్మ్‌మేకర్స్ రావచ్చు.. కళాకారులు రావచ్చు. గవర్నమెంట్ ఒక మంచి ప్రయత్నం చేస్తుంటే ప్రశంసించాలి కానీ నీరుగార్చకూడదు. పెద్దవాళ్లం కాబట్టి, చేతిలో నాలుగు అవార్డులున్నాయి కాబట్టి ఏదైనా మాట్లాడొచ్చు అనుకోవడం కరెక్ట్ కాదు నా ఉద్దేశంలో.



– కరుణ కుమార్, సినీ దర్శకుడు, నటుడు

లీగల్

ఆ ఆస్తిపై మీ తల్లికి మాత్రమే హక్కులు

మా తల్లిదండ్రుల నలుగురు సంతానంలో నేను మూడవ వాడిని. వారు కొనుగోలు చేసిన ఆస్తులను మా నలుగురి పేరిట పెడుతూ వచ్చారు. మా అన్నయ్య ఒకరు దాదాపు 15 ఏళ్ల క్రితం, అతనికి 19 ఏళ్ళ వయసులో కనపడకుండా పోయారు. ఆయనకి మతిస్థిమితం లేదు. అప్పట్లో పోలీసులకు కూడా ఫిర్యాదు చేశాము. మా అన్నయ్య పేరు మీద ఉన్న ఆస్తులు పలు జిల్లాలలో ఉన్నాయి. అందులో నుంచి వచ్చే ఆదాయాన్ని మా అమ్మగారు తీసుకుంటున్నారు. ఇప్పుడు సమస్య ఏమిటి అంటే మా తల్లిదండ్రుల పేరిట ఉన్న ఆస్తులన్నింటినీ మిగిలిన ముగ్గురికి ఇవ్వాలని మా అమ్మగారు అనుకుంటున్నారు. కానీ కనపడకుండా పోయిన మా అన్నయ్య ఆస్తులను మాత్రం తన జీవితకాలం మొత్తం ఇవ్వను అంటున్నారు. ఒకవేళ తన పెద్ద కొడుకు తిరిగి వస్తే అతనికే చెందేలా చేస్తాను అంటున్నారు. ఆ ఆస్తుల్లో మాకు భాగం వుండదా?

– గౌతం, హైదరాబాద్

మీ అమ్మానాన్నల పేరుతో ఉండే ఆస్తులు వారు ఎవరికి కావాలంటే వారికి... ఏ ప్రాతిపదికన.. ఎంత ఇవ్వాలనేది వారి నిర్ణయం మాత్రమే! కనబడకుండా పోయిన మీ అన్నయ్య ఆస్తి కూడా మీ అమ్మానాన్నలు కలిసి సంపాదించారు అని చెప్తున్నారు కాబట్టి అందులో మీకు ఎటువంటి వాటా ఉండదు. ఏది ఏమైనా, కనపడకుండా పోయిన ఒక వ్యక్తి ఆస్తి తన ఫస్ట్ క్లాస్ లీగల్ హేర్ (అంటే, తన భార్య, సంతానం, తల్లి గారు)కు మాత్రమే ఉంటుంది. మీ కేసులో, కనపడకుండా పోయిన తన కొడుకు ఆస్తిపై కేవలం మీ తల్లి గారికి మాత్రమే హక్కు ఉంది. ఒక వ్యక్తి ఏడు సంవత్సరాల కన్నా ఎక్కువ కాలం కనపడకపోతే, భారతీయ సాక్ష్య అధినయం సెక్షన్ 111 (పూర్వం సెక్షన్ 108, ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్) ప్రకారం చట్టం ఆ వ్యక్తిని ''చట్టపరంగా మరణించిన వ్యక్తి''గా పరిగణిస్తుంది. ఒక వ్యక్తి మరణించిన తర్వాత ఆస్తులు ఎలాగైతే పంచుతారో అలాగే ఈ ఆస్తులను కూడా పంచవలసి ఉంటుంది. మీ తల్లిగారు బతికే ఉన్నారు కాబట్టి, తప్పిపోయిన అన్నయ్యకు పెళ్లి కాలేదు కాబట్టి, అలాగే ఆ ఆస్తి పూర్వీకుల నుంచి సంక్రమించినది కాదు కాబట్టి, ఆ ఆస్తి మీద పూర్తి హక్కు మీ అమ్మగారికి మాత్రమే ఉంటుంది. ముందుగా ఏదో ఒక ఆస్తి ఉన్న పరిధిలోని సివిల్ కోర్టును ఆశ్రయించి, కనబడకుండా పోయిన తన కొడుకును చట్టపరంగా మరణించిన (సివిల్ డెత్) వ్యక్తిగా పరిగణించాలి అని కోరుతూ, తన ఆస్తులు అన్నిటికీ కూడా తల్లిగారు మాత్రమే వారసురాలు అని కేసు నమోదు చేయాలి. సివిల్ కోర్టు నుంచి డిక్రీ పొందిన తర్వాత ఆ ఆస్తులను తన పేరుకు మార్చుకొని, తనకు కావలసిన సమయంలో లేదా ఒక వీలునామా ద్వారా ఆ ఆస్తులను ఎవరికి ఎలా పంచాలి అనే అంశంపై తన ఇష్టపూర్వక నిర్ణయం తీసుకోవచ్చు.



– శ్రీకాంత్ చింతల,
హైకోర్టు న్యాయవాది

మీకున్న న్యాయపరమైన సమస్యలు, సందేహాలకోసం sakshifamily3@gmail.comకు మెయిల్ చేయవచ్చు.

మహిళా శక్తి

సై అంటూ సత్తా చాటుతూ...


లింగన్నపేటలో స్వశక్తి మహిళల పెట్రోల్ బంకు నిర్వహిస్తున్న మహిళలు

డబ్బులు పొదుపు చేయడం, రుణాలు పొందడానికి మాత్రమే పరిమితం కావాలనుకోవడం లేదు గ్రామీణ మహిళా సంఘాలు. పెట్రోల్ బంక్‌ల నిర్వాహణ నుంచి ఆర్టీసీ బస్సులను అద్దె తీసుకొని నడపడం వరకు తమ సత్తా చాటుతున్నారు. సోలార్ ప్లాంట్‌ల నిర్వహణకు సిద్ధం అవుతున్నారు.

'పెట్రోల్ బంక్' అనగానే 'పురుషులు మాత్రమే' అన్నట్లుగా ఒక చిత్రం మదిలో ముద్రితమై ఉంటుంది. ఇప్పుడు ఆ చిత్రాన్ని మార్చేస్తున్నారు గ్రామీణ మహిళలు. 'మేము సైతం' అంటూ పెట్రోల్‌బంక్‌ల నిర్వాహణలో సత్తా చాటుతున్నారు. ప్రభుత్వం చేపట్టిన మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా తెలంగాణ రాష్ట్రంలోని రాజన్న సిరిసిల్ల జిల్లా గంభిరావుపేట మండలం లింగన్నపేటకు చెందిన 'శ్రీ షిర్డీ సాయిబాబా' గ్రామైక్య సంఘం మహిళలు పెట్రోల్ బంక్ నిర్వహణకు ముందుకు వచ్చారు.

రాష్ట్రంలోనే మూడోది...

మహిళా సంఘాల ద్వారా నడిపే పెట్రోల బంక్ ఇటీవల నారాయణపేట జిల్లాలో మొదటిసారి ప్రారంభమైంది. తర్వాత సంగారెడ్డి జిల్లాలో ఒక పెట్రోల్ బంక్ ఏర్పాటైంది. రాష్ట్రంలో మూడో పెట్రోల్ బంక్ లింగన్నపేటలో మహిళా సంఘం ఆధ్వర్యంలో ప్రారంభమైంది. పెట్రోల్ బంక్ ఏర్పాటుతో గ్రామైక్య సంఘానికి నెలవారీ స్థిర ఆదాయం లభించనుంది.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు

సిరిసిల్ల జిల్లాలో పెద్ద సంఖ్యలో ఉన్న మహిళా సంఘాలు పొదుపు చేయడం, రుణాలు పొందడానికే పరిమితం కాకూడదని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా భావించారు.

'ఇందిరా క్రాంతి' పథం ద్వారా మహిళా సంఘాలకు ఆరు నెలల క్రితం ధాన్యం కొనుగోలు కేంద్రాలను అప్పగించారు.

192 ఐకేపీ కొనుగోలు కేంద్రాలను మహిళా సంఘాలకు అప్పగించగా 20లక్షల 25వేల 252 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించి శభాష్ అనిపించుకున్నారు. రూ.6.80 కోట్ల ధాన్యం కమీషన్‌ను సాధించారు.

ఎంతో గర్వంగా ఉంది

పెట్రోల్ బ్యాంక్‌ల నిర్వహణ అనేది మా సంఘానికి సంబంధించి పెద్ద మలుపు. మాకు ఎంతో గర్వంగా ఉంది. ఇప్పటివరకు మేము గృహిణులుగా ఇంటికే పరిమితమయ్యాం. పెట్రోల్ బంక్ నిర్వహణను సవాల్‌గా తీసుకొని విజయవంతంగా కొనసాగిస్తామనే ధీమాతో ఉన్నాం.



– సుభద్ర, అధ్యక్షురాలు,
శ్రీ షిర్డీ సాయిబాబా గ్రామైక్య సంఘం, లింగన్నపేట

ఉపాధి పొందుతున్నాం

మేము నాలుగు నెలల క్రితం వరకు ధాన్యం కొనుగోళ్లు చేశాం. మా వీవోకు రూ.4.29 లక్షల కమిషన్ వచ్చింది. పదిమందికి పని లభించింది. 'కుట్టు'తో స్వశక్తి మహిళలు ఉపాధి పొందుతున్నారు. గత ఏడాదిగా స్వశక్తి మహిళలు జిల్లాలో స్కూల్ యూనిఫామ్స్ కుడుతున్నారు. మా ఊళ్లో కూడా యూనిఫామ్స్ కుడుతున్నాం. ఇప్పుడు ఎరువుల దుకాణం నిర్వహిస్తున్నాం.



– పందిర్ల సునీత,
ఆవునూర్

రైతుల ముంగిట్లోకి ఎరువులు

వానకాలం సాగులో రైతుల ముంగింట్లోకే ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉండేలా మహిళలకు ఎరువుల దుకాణాలను అప్పగించారు. ఇలా 23 కేంద్రాలను ఇప్పటికే జిల్లాలో ప్రారంభించారు. ప్రతి మండలానికి రెండేసి చొప్పున ఎరువుల దుకాణాలను మహిళా సంఘాలకు అప్పగించారు.

అద్దెకు ఆర్టీసీ బస్సులు

మహిళల భాగస్వామ్యంతో ఆర్టీసీకి సిరిసిల్ల జిల్లా నుంచి తొమ్మిది బస్సులను అందించారు. 9 మండలాల సమాఖ్యల ద్వారా రూ.6 లక్షల వాటా ధనంతో రూ.30 లక్షలతో ఒక్కో ఆర్టీసీ బస్సును మహిళలు అద్దెకు తీసుకున్నారు. మూడు నెలల క్రితం మొదలైన అద్దె బస్సులతో ప్రతి నెల రూ. 50వేల అద్దెను తొమ్మిది సమాఖ్యలు పొందుతున్నాయి.

ఇక సోలార్ పవర్

పెట్రోల్ బంక్‌లే కాదు సోలార్ విద్యుత్ ఉత్పత్తి బాధ్యతను మహిళా సంఘాలకు అప్పగించనున్నారు. ముష్టిపల్లి, ధర్మారంలో భూసేకరణ పూర్తిచేయగా, జిల్లా సమాఖ్య ద్వారా రూ.3కోట్ల పెట్టుబడితో సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేసే పనులు సాగుతున్నాయి.

– అవధూత బాలశేఖర్, సాక్షి,
ముస్తాబాద్, గంభీరావుపేట, సిరిసిల్ల


వేములవాడలో ఐకేపీ ఆర్టీసీ బస్సు


బోయినపల్లిలో రిటైల్ మొబైల్ చేపల విక్రయ కేంద్రం నిర్వహిస్తున్న మహిళ


ఆవునూర్‌లో మహిళల ఫెర్టిలైజర్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్

మహిళా శక్తిని చాటారు

ఇందిరా మహిళా శక్తి ద్వారా జిల్లాలో అనేక కార్యక్రమాలను చేపట్టాం. క్యాంటీన్లు, పెట్రోల్ బంకులు, ఎరువుల దుకాణాలు, ఆర్టీసీ బస్సులు ప్రారంభించాం. త్వరలో రైస్ మిల్లులు, సోలార్ ప్లాంట్లను మహిళలకు అందజేస్తాం.



– సందీప్‌కుమార్ ఝా, జిల్లా కలెక్టర్

బులియన్
(బంగారం 10 గ్రా.: వెండి కిలో; ఆగస్టు 5న ముగింపు రూ.లలో)

	హైదరాబాద్	విజయవాడ	విశాఖపట్నం	రాజమండ్రి	ప్రొద్దుటూరు	చెన్నై
బంగారం (24 క్యారెట్లు)	1,00,810	1,03,700	1,02,220	1,02,220	1,00,300	1,02,210
బంగారం (22 క్యారెట్లు)	93,320	93,700	93,700	93,700	92,280	93,700
వెండి	1,16,000	1,15,800	1,25,000	1,25,000	1,15,700	1,25,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.



అర్జున్ సత్తాకు సవాల్... నేటి నుంచి చెన్నై గ్రాండ్‌మాస్టర్స్ చెస్ టోర్నీ

స్వదేశంలో సత్తా చాటుకునేందుకు భారత గ్రాండ్‌మాస్టర్, తెలంగాణ ప్లేయర్ అర్జున్ ఇరిగేశి సిద్ధమయ్యాడు. చెన్నై వేదికగా నేటి నుంచి చెన్నై గ్రాండ్‌మాస్టర్స్ చెస్ టోర్నీ జరగనుంది. 10 మంది మేటి గ్రాండ్‌మాస్టర్ల మధ్య తొమ్మిది రౌండ్లపాటు ఈ టోర్నీ జరగనుంది. మాస్టర్స్ విభాగంలో అర్జున్‌తోపాటు భారత్ నుంచి విదిత్ గుజరాతి, కార్తికేయన్ మురళీ, నిహాల్ సరీన్, ప్రణవ్ వెంకటేశ్ బరిలో ఉన్నారు. ఇతర గ్రాండ్‌మాస్టర్లు అనీశ్ గిరి (నెదర్లాండ్స్), విన్సెంట్ కీమర్ (జర్మనీ), అవండర్ లియాంగ్ (అమెరికా), రే రాబ్సన్ (అమెరికా), జోర్డాన్ వాన్ ఫారీస్ట్ (నెదర్లాండ్స్) కూడా తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటారు. కోటి రూపాయల ప్రైజ్‌మనీతో నిర్వహిస్తున్న ఈ టోర్నీలో మొత్తం 10 మంది గ్రాండ్‌మాస్టర్లకు ప్రైజ్‌మనీ లభించనుంది. టాప్-3లో నిలిచిన వారికి వరుసగా రూ. 25 లక్షలు, 15 లక్షలు, 10 లక్షలు అందజేస్తారు. మాస్టర్స్ టోర్నీతోపాటు కేవలం భారత క్రీడాకారులు మాత్రమే పాల్గొనే 'చాలెంజర్స్' ఈవెంట్ కూడా జరగనుంది. గ్రాండ్‌మాస్టర్లు ద్రోణవల్లి హారిక, వైశాలి, ప్రాణేశ్, ఇనియన్, లియోన్ ల్యూక్ మెండోంకా, దీప్తాయన్ ఘోష్, ఆధిబన్, ఆర్యన్ చోప్రా, అభిమన్యు పురాణిక్, అంతర్జాతీయ మాస్టర్ హర్షవర్ధన్ పోటీపడుతున్నారు.



'పని భారం'ను పక్కన పెట్టాల్సిందే!

ఆటగాళ్లకు ఇకపై విరామాలు ఉండవు ● బీసీసీఐలో కొత్త చర్చ

న్యూఢిల్లీ: ఇంగ్లండ్‌తో టెస్టు సిరీస్ ముగిసిన తర్వాత ఒక కీలక అంశం భారత క్రికెట్‌లో చర్చకు వచ్చింది. గత కొంత కాలంగా బీసీసీఐ ప్రధాన ఆటగాళ్లకు 'పనిభారం' ఎక్కువగా ఉంటుందని, వారికి మ్యాచ్‌లు, సిరీస్‌ల మధ్యలో తగినంత 'విశ్రాంతి' ఇస్తూ వచ్చింది. ఈ క్రమంలో టాప్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా ఇంగ్లండ్‌తో సిరీస్‌తో మూడు టెస్టులే ఆడతాడని టీమ్ మేనేజ్‌మెంట్ ముందే ప్రకటించింది. చివరకు అదే జరిగింది. అయితే తొలి టెస్టు తర్వాత వారం రోజుల విరామం వచ్చినా బుమ్రా రెండో టెస్టు ఆడకపోవడం, కీలకమైన, సిరీస్‌ను సమం చేయాల్సిన చివరి టెస్టుకు కూడా అతను దూరం కావడం తీవ్ర చర్చకు దారి తీసింది. మరోవైపు ఎలాంటి విరామం లేకుండా పూర్తి ఫిట్‌నెస్‌తో మొహమ్మద్ సిరాజ్ ఐదు టెస్టులూ ఆడి వేయికి పైగా బంతులు వేయడం ఈ అంశాన్ని మరింతగా చర్చించేందుకు అవకాశం కల్పించింది. ఈ నేపథ్యంలో ఇకపై 'పని భారం' పేరుతో ఆటగాళ్లు మ్యాచ్‌లకు దూరం కాకుండా నిబంధనలు విధించాలని బోర్డు యోచిస్తోంది. దీంతో పాటు కొందరు క్రికెటర్లు ప్రత్యేక హోదాను ప్రదర్శిస్తూ తమకు నచ్చిన మ్యాచ్‌లు ఎంచుకుంటూ మిగతా కొన్ని మ్యాచ్‌ల నుంచి వేర్వేరు కారణాలతో తప్పుకుంటున్నారు. దీనికి కూడా ఫుల్ స్టాప్ పెట్టే ప్రతిపాదన ఉందని బోర్డు ఉన్నతాధికారి ఒకరు వెల్లడించారు. 'సెంట్రల్ కాంట్రాక్ట్ ఉన్న ఆటగాళ్లందరికీ ఈ సమాచారం అందిస్తాం. ముఖ్యంగా మూడు ఫార్మాట్‌లలో రెగ్యులర్‌గా ఆడే ప్లేయర్లు ఇకపై తమ ఇష్టానుసారం మ్యాచ్‌లను ఎంపిక చేసుకునే వీలుండదు' అని ఆయన అన్నారు. 'పని భారం' అంటూ ఆటగాళ్లను మ్యాచ్‌లకు దూరం పెట్టే విషయంపై కూడా సరైన రీతిలో చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. 'పేస్ బౌలర్లను జాగ్రత్తగా చూసుకోవాల్సిన అవసరం ఉందనేది వాస్తవం. ఈ విషయంలో వైద్యబృందం సలహాలతోనే ముందుకు వెళతాం. అయితే పనిభారం పేరుతో కీలక మ్యాచ్‌లకు దూరం కావడం మాత్రం జరగదు. ఆటకంటే ఆటగాళ్లు ఎక్కువ కాదని సందేశం అందరికీ వెళ్లాలి' అని ఆయన పేర్కొన్నారు.

దేశం కోసం ఆడుతున్నప్పుడు...



మాజీ కెప్టెన్ సునీల్ గావస్కర్ కూడా 'పనిభారం' విషయంలో ఘాటుగా స్పందించారు. 'దేశం కోసం ఆడుతున్నప్పుడు గాయం, నొప్పి లాంటివాటిని మర్చిపోవాలి. సరిహద్దుల్లో చలి ఎక్కువగా ఉందని సైనికులు ఫిర్యాదు చేస్తున్నారా. పంత్ ఫ్రాక్చర్‌తో ఆడేందుకు సిద్ధమయ్యాడు. అలాంటి తత్వం ఆటగాళ్లలో ఉండాలి. కోట్లాది మంది భారతీయులకు మీరు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. సిరాజ్ ఐదు టెస్టుల్లోనూ కెప్టెన్ అడిగిన ప్రతీసారి 7–8 ఓవర్ల స్పెల్‌లు బౌలింగ్ చేశాడు. అసలు 'పనిభారం' అనే చర్చనే అతను తీసిపడేశాడు. నేను చాలా కాలంగా చెబుతున్నా. ఈ పదాన్ని భారత క్రికెట్ డిక్షనరీ నుంచి పూర్తిగా తొలగించాలి' అని గావస్కర్ అభిప్రాయపడ్డారు.

స్వదేశానికి టీమిండియా ఆటగాళ్లు

న్యూఢిల్లీ: ఇంగ్లండ్‌తో ఓవల్‌లో చివరి టెస్టు ముగిసిన తర్వాత భారత క్రికెటర్లు ప్రత్యేకంగా ఎలాంటి సంబరాలు చేసుకోలేదు. సుదీర్ఘ సిరీస్ ముగిసిన వెంటనే జట్టును వీడేందుకు సిద్ధమయ్యారు. కొందరు విశ్రాంతి కోసం ఇంగ్లండ్‌లోనే ఆగిపోయేందుకు సిద్ధపడగా...మరికొందరు సాధ్యమైనంత తొందరగా అందుబాటులో ఉన్న ఫ్లయిట్ ద్వారా స్వస్థలాలకు తిరిగి వచ్చారు. మ్యాచ్ ముగిశాక లండన్ వీధుల్లో సహచరుడు కుల్దీప్‌తో కలిసి సరదాగా తిరిగిన అనంతరం అర్ష్‌దీప్ స్వదేశానికి బయల్దేరాడు. అతనితో పాటు సిరాజ్, శార్దుల్ కూడా భారత్‌కు చేరుకున్నారు.

ఇంకా మెరుగు కావాలి: గంభీర్



భారత జట్టులో కొత్త ఆటగాళ్ల రావడం, కొందరు జట్టుకు దూరం కావడం సాధారణంగా జరిగే ప్రక్రియే అని, ఎవరు ఉన్నా జట్టు ప్రతీసారి ఆట మరింత మెరుగు పడటం ముఖ్యమని హెడ్ కోచ్ గౌతం గంభీర్ అభిప్రాయపడ్డాడు. ఇది జట్టు సంస్కృతిలో భాగం కావాలని అతను సూచించాడు. ఓవల్‌లో విజయం తర్వాత డ్రెస్సింగ్ రూమ్‌లో గంభీర్ ఆటగాళ్లతో ప్రత్యేకంగా మాట్లాడాడు. 'సిరీస్ 2–2తో ముగియడం చాలా గొప్ప ఫలితం. అందరికీ నా అభినందనలు. అయితే మనం మెరుగుపడేందుకు ఇంకా అవకాశం ఉంటుంది. దాని కోసం మరింత కష్టపడుతూనే ఉండాలి. అలా చేస్తే సుదీర్ఘ కాలం టీమిండియా ప్రపంచ క్రికెట్‌ను శాసించగలదు. ఆటగాళ్లు వస్తుంటారు, పోతుంటారు. డ్రెస్సింగ్‌రూమ్‌లో సంస్కృతి ఎలా ఉండాలంటే అందరూ ఇందులో భాగం కావాలని కోరుకోవాలి. ఇదే మనం చేయాల్సిన పని' అని గంభీర్ మార్గనిర్దేశనం చేశాడు. ఈ సందర్భంగా 'ఇంపాక్ట్ ప్లేయర్ ఆఫ్ ద సిరీస్' అనే ప్రత్యేక అవార్డును జడేజా చేతుల మీదుగా వాషింగ్టన్ సుందర్ అందుకున్నాడు. 'ఇంగ్లండ్‌లో వరుసగా నాలుగు టెస్టులు ఆడే అవకాశం రావడం నా అదృష్టం. ఇక్కడ బాగా ఆడాలని ఎంతో కోరుకున్నాను. ప్రతీ రోజు మన జట్టు ఆడిన తీరు చాలా గొప్పగా అనిపించింది' అని సుందర్ వ్యాఖ్యానించాడు.

భారత బాక్సర్లకు ఏడు పతకాలు ఖాయం

బ్యాంకాక్: ఆసియా జూనియర్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో భారత బాక్సర్ల జోరు సాగుతోంది. అండర్-19 విభాగంలో ఏడుగురు భారత మహిళా బాక్సర్లు పతకాలు ఖాయం చేసుకున్నారు. యక్షిక (51 కేజీలు), నిషా (54 కేజీలు), ముస్కాన్ (57 కేజీలు), వినీ (60 కేజీలు), నిషా (65 కేజీలు) ఆకాంక్ష (70 కేజీలు), ఆర్తి కుమారి (75 కేజీలు) సెమీఫైనల్స్‌కు చేరుకోవడం ద్వారా కనీసం కాంస్య పతకాలు ఖరారు చేసుకున్నారు. క్వార్టర్ ఫైనల్లో యక్షిక 3–2తో అలీవా (ఉజ్బెకిస్తాన్)పై... మిలానా (కిర్గిస్తాన్)పై నిషా... రూబియా (ఉజ్బెకిస్తాన్)పై ముస్కాన్ గెలుపొందారు. అడెలియా (కిర్గిస్తాన్)పై వినీ... యు ఎన్ లీ (చైనీస్ తైపీ)పై నిషా విజయం సాధించారు. 48 కేజీల విభాగం క్వార్టర్ ఫైనల్లో సుమన్ కుమారి 2–3 తేడాతో మపున ముసుర్ మొనోవా (ఉజ్బెకిస్తాన్) చేతిలో ఓడిపోయి పతకానికి దూరమైంది.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

ఆసియా కప్‌లో గిల్, జైస్వాల్!



న్యూఢిల్లీ: ఇంగ్లండ్‌తో 'డ్రా'గా ముగిసిన టెస్టు సిరీస్ తర్వాత భారత జట్టు వచ్చే నెలలో ఆసియా కప్ టి20 టోర్నీలో బరిలోకి దిగనుంది. సెప్టెంబర్ 9 నుంచి 28 వరకు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) వేదికగా ఈ టోర్నీ జరుగుతుంది. ఇది ముగిసిన తర్వాత అక్టోబర్ 2 నుంచి వెస్టిండీస్‌తో తొలి టెస్టులో టీమిండియా తలపడుతుంది. అయితే వారం రోజుల్లోపే టెస్టు సిరీస్ ఉన్నా సరే... టెస్టు కెప్టెన్ శుబ్‌మన్ గిల్‌తో పాటు ఓపెనర్ యశస్వి జైస్వాల్‌లను ఆసియా కప్‌కు ఎంపిక చేయాలని సెలక్టర్లు భావిస్తున్నారు. బిజీ షెడ్యూల్ కారణంగా గత కొన్ని టి20లనుంచి గిల్, జైస్వాల్‌లకు విశ్రాంతినిచ్చారు. ఆ సమయంలో సంజు సామ్సన్, అభిషేక్ శర్మ ఓపెనర్లుగా చెలరేగిపోయారు. అయితే తాజా ఫామ్, ఐపీఎల్‌లో ప్రదర్శనను బట్టి చూస్తే గిల్, జైస్వాల్‌లను టి20 టీమ్‌లోకి తీసుకొచ్చే ఆలోచన ఉంది. ఐపీఎల్‌లో అద్భుతంగా రాణించిన మరో బ్యాటర్ సాయి సుదర్శన్ పేరు కూడా టీమ్ పరిశీలనలో ఉంది. సుదర్శన్ భారత్ తరఫున 3 వన్డేలు, ఏకైక టి20 మ్యాచ్ ఆడాడు. ఈ ముగ్గురినీ తీసుకుంటే టాప్-3 కోసం ప్రత్యామ్నాయం అందుబాటులో ఉంటుందనేది సెలక్టర్ల భావన. ఆసియా కప్‌కు 17 మందితో టీమ్‌ను ఎంపిక చేసే అవకాశం ఉంది కాబట్టి అదనపు ఆటగాళ్లను ఎంపిక చేయడంలో సమస్య రాకపోవచ్చు. ఆ తర్వాత ఆరు నెలల్లో టి20 వరల్డ్ కప్ కూడా జరగనున్న నేపథ్యంలో 'కోర్ గ్రూప్'లో సభ్యులుగా అందరి ఆటను సెలక్టర్లు పరిశీలించే అవకాశం ఉంది. మరోవైపు బుమ్రా, సిరాజ్‌ల విషయంలో టోర్నీకి ముందు ఫిట్‌నెస్‌ను పరిశీలించే తుది నిర్ణయం తీసుకుంటారు.

సాక్షి సినిమా



● రవితేజ, శ్రీలీల

ఎగరెయ్ నీ రెక్కలే...



● దర్శన, అనుపమా పరమేశ్వరన్, సంగీత

అనుపమా పరమేశ్వరన్ ప్రధాన పాత్రలో 'సినిమా బండి' మూవీ ఫేమ్ ప్రవీణ్ కండ్రేగుల దర్శకత్వం వహించిన చిత్రం 'పరదా'. దర్శన రాజేంద్రన్, సంగీత, రాగ్ మయూర్ కీలక పాత్రలు పోషించారు. భాగ్యలక్ష్మి పోస సమర్పణలో ఆనంద మీడియా బ్యానర్‌పై శ్రీనివాసులు పీవీ, శ్రీధర్ మక్కువతో కలిసి విజయ్ డొంకాడ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 22న విడుదలకానుంది. గోపీ సుందర్ సంగీతం అందించిన ఈ మూవీ నుంచి 'ఎగరెయ్ నీ రెక్కలే...' అంటూ సాగే మూడో పాటని మంగళవారం విడుదల చేశారు మేకర్స్. 'ఎగరెయ్ నీ రెక్కలే... కలిపేయి ఆ దిక్కులే...' అంటూ ఈ పాట సాగుతుంది. వనమాలి సాహిత్యం అందించిన ఈ పాటని రితేష్ జి.రావ్ పాడారు. ఈ మూవీకి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: రోహిత్ కొప్పు, కెమెరా:మృదుల్ సుజిత్ సేన్.

వీరోచిత పోరాటం



● ఫర్హాన్ అక్తర్

బాలీవుడ్ డైరెక్టర్, నటుడు ఫర్హాన్ అక్తర్ హీరోగా నటిస్తున్న పీరియాడికల్ వార్ డ్రామా '120 బహదూర్'. ఈ చిత్రంలో రాశీ ఖన్నా హీరోయిన్‌గా నటిస్తున్నారు. రజనీశ్ దర్శకత్వంలో రితేష్ సిధ్వానీ, ఫర్హాన్ అక్తర్, అమిత్ చంద్ర నిర్మిస్తున్నారు. 1962లో ఇండియా– చైనా దేశాల మధ్య జరిగిన యుద్ధం నేపథ్యంలో ఈ సినిమా కథనం సాగుతుంది. అప్పటి వాస్తవ ఘటనల ఆధారంగా తెరకెక్కిన ఈ సినిమాలో మేజర్ షైతాన్ సింగ్ పాత్రలో ఫర్హాన్ అక్తర్ నటిస్తున్నారు. మూడు వేలమంది చైనీస్ సైనికులపై 120 మంది భారతీయ సైనికులు జరిపిన వీరోచిత పోరాటం నేపథ్యంలో '120 బహదూర్' సినిమా ఉంటుంది. నవంబరు 21న ఈ చిత్రం విడుదల కానుంది.

రాతలన్నీ మారిపోయెనే...

''శ్రీకాకుళం జిల్లా మొత్తం వెతికి తిరిగి పట్టుకున్న.. యాడ నుంచి వచ్చావే సిలకా.. గిలకా.. మొలకా.. పలకా.. రాయలేక రాసుకున్న రాతలన్నీ మారిపోయెనే..' అంటూ మొదలవుతుంది 'మాస్ జాతర' సినిమాలోని 'ఓలే ఓలే..' పాట. రవితేజ హీరోగా నటించిన తాజా చిత్రం 'మాస్ జాతర'. శ్రీలీల హీరోయిన్‌గా నటించారు. భాను భోగవరపు దర్శకత్వం వహించారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్న ఈ చిత్రం ఈ నెల 27న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సినిమా నుంచి 'ఓలే ఓలే....' పాట లిరికల్ వీడియోను మంగళవారం రిలీజ్ చేశారు మేకర్స్. భాస్కర్ యాదవ్ దాసరి లిరిక్స్ అందించిన ఈ పాటను చిత్ర మ్యూజిక్ డైరెక్టర్ భీమ్స్ సిసిరోలియో, రోహిణి సోరాట్ కలిసి పాడారు. జానీ మాస్టర్ కొరియోగ్రఫీ చేశారు.

ఇకపై అలాంటి పాత్రలు చేయను - సత్యరాజ్

''నా వయసు డెబ్బై ఏళ్లు దాటింది. నా కెరీర్‌లో ఎన్నో ఫాదర్ రోల్స్, విలన్ రోల్స్ చేశాను. ఇకపై ఆ తరహా రెగ్యులర్ పాత్రలు కాకుండా 'త్రిబాణధారి బార్బరిక్' చిత్రంలో నేను చేసిన వైవిధ్యమైన, కొత్త తరహా పాత్రలు చేస్తాను. నా ఫ్రెండ్ చిరంజీవి బర్త్ డే సందర్భంగా మా చిత్రం ఈ నెల 22న రిలీజ్ కానుండటం చాలా సంతోషంగా ఉంది'' అని నటుడు సత్యరాజ్ అన్నారు. ఆయన ప్రధాన పాత్రధారిగా, వశిష్ఠ ఎన్.సింహా, 'సత్యం' రాజేష్, ఉదయభాను, క్రాంతి కిరణ్, సాంచీ రాయ్ కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'త్రిబాణధారి బార్బరిక్'. మోహన్ శ్రీవత్స దర్శకత్వంలో మారుతి సమర్పణలో వానర సెల్యులాయిడ్‌పై విజయ్ పాల్ రెడ్డి అడిదెల నిర్మించారు. ఈ సినిమాని ఈ నెల 22న విడుదల చేయనున్నట్లు మంగళవారం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో ప్రకటించారు మేకర్స్. ఉదయభాను మాట్లాడుతూ–''ఈ సినిమాలో ఒక సవాల్‌తో కూడిన పాత్ర చేశాను'' అని చెప్పారు. ''నా పాత్ర కొత్తగా ఉంటుంది'' అని పేర్కొన్నారు వశిష్ఠ సింహా. ''క్లారిటీ, కమిట్‌మెంట్, కంటెంట్‌తో మేం చేసిన సినిమా ఇది'' అని తెలిపారు మోహన్ శ్రీవత్స. ''మా సినిమాను ప్రేక్షకులు సపోర్ట్ చేయాలి'' అన్నారు విజయ్‌పాల్ రెడ్డి అడిదెల.



● విజయ్‌పాల్ రెడ్డి, మోహన్, వశిష్ఠ, సత్యరాజ్

కొత్త వాళ్లు ఇండస్ట్రీకి రావాలి - బ్రహ్మానందం



● నరేష్, యోగిబాబు, బ్రహ్మానందం, ఫరియా అబ్దుల్లా

''కొత్త వాళ్లు ఇండస్ట్రీకి రావాలి.. అప్పుడే ఒక ఫ్రెష్ నెస్ వస్తుంది. అలాగే మన సినిమా మరింత అభివృద్ధి చెందుతుంది. మంచి కామెడీతో సాగే థ్రిల్లర్ చిత్రం 'గుర్రం పాపిరెడ్డి'. ఈ సినిమా నాకు ప్రత్యేకం అని చెప్పగలను. ఎందుకంటే.. యువతరమంతా కలిసి తీసిన ఈ చిత్రంలో నేను జడ్జి పాత్రలో నటించాను'' అని ప్రముఖ నటుడు బ్రహ్మానందం తెలిపారు. నరేష్ అగస్త్య, ఫరియా అబ్దుల్లా జంటగా మురళీ మనోహర్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'గుర్రం పాపిరెడ్డి'. బ్రహ్మానందం, యోగి బాబు, ప్రభాస్ శ్రీను ఇతర పాత్రలు పోషించారు. డా.సంధ్య గోలీ సమర్పణలో వేణు సడ్డి, అమర్ బురా, జయకాంత్ (బాబీ) నిర్మించిన ఈ మూవీ త్వరలో రిలీజ్ కానుంది. హైదరాబాద్‌లో నిర్వహించిన 'గుర్రం పాపిరెడ్డి' టీజర్ లాంచ్ ఈవెంట్‌లో డైరెక్టర్ మురళీ మనోహర్ మాట్లాడుతూ–''డార్క్ కామెడీగా రూపొందిన చిత్రమిది. తప్పకుండా ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది'' అన్నారు. ''గుర్రం పాపిరెడ్డి' సినిమాని సూపర్ హిట్ చేస్తారని కోరుకుంటున్నాం'' అని జయకాంత్, అమర్ బురా, డా.సంధ్య గోలీ కోరారు. యోగిబాబు మాట్లాడుతూ– ''గుర్రం పాపిరెడ్డి' ద్వారా నేరుగా తెలుగు ప్రేక్షకుల ముందుకు రావడం సంతోషంగా ఉంది. ఈ చిత్రం సక్సెస్ మీట్‌లో తప్పకుండా తెలుగులో మాట్లాడతాను'' అని చెప్పారు. ''ఈ చిత్రంలో సౌధామిని పాత్రలో నటించాను. మా అమ్మ ఈ చిత్రంలో అతిథి పాత్ర చేశారు'' అని ఫరియా అబ్దుల్లా పేర్కొన్నారు. ''బ్రహ్మానందంగారు, యోగి బాబుగారు వంటి స్టార్స్‌తో పనిచేయడం సంతోషంగా ఉంది'' అని నరేష్ అగస్త్య చెప్పారు.

ఐదుగురు బ్యాచిలర్స్ కథ

''కథపై నమ్మకంతో 'బకాసుర రెస్టారెంట్' సినిమా చేశాం. పెద్ద హీరోలతో సినిమాలు చేసినా లాభాలు వస్తాయన్న గ్యారంటీ లేని రోజులు ఇవి. అందుకే మేం మేకింగ్ పరంగా ఖర్చుపెట్టాం. కంటెంట్ బాగుంటే సినిమాలు సూపర్‌హిట్ అవుతాయని ఎన్నో సినిమాలు నిరూపించాయి. అలా మా చిత్రం కూడా విజయం సాధిస్తుంది'' అని దర్శకుడు ఎస్‌జే శివ తెలిపారు. ప్రవీణ్ ప్రధాన పాత్రలో, 'వైవా' హర్ష టైటిల్ రోల్‌లో నటించిన చిత్రం 'బకాసుర రెస్టారెంట్'. ఎస్‌జే మూవీస్‌పై లక్ష్మయ్య ఆచారి, జనార్దన్ ఆచారి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 8న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఎస్‌జే శివ మాట్లాడుతూ–''లండన్‌లో బిజినెస్ మేనేజ్‌మెంట్ పూర్తి చేశాను. 'విరూపాక్ష' సినిమాకు అసిస్టెంట్ డైరెక్టర్‌గా వర్క్ చేశాను. గతంలో మా నాన్నగారు కొన్ని సినిమాలు నిర్మించారు. ఆయన ఆకాంక్ష మేరకే నేను దర్శకుడిగా, అన్నయ్య నిర్మాతగా మారాం. కొత్త తరహా జోనర్‌లో హంగర్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా 'బకాసుర రెస్టారెంట్' తీశాం. గతంలో ప్రేక్షకులను అలరించిన 'యమలీల, ఘటోత్కచుడు' సినిమాల్లా ఆడియన్స్‌ని థ్రిల్లింగ్‌కు గురిచేసే సినిమా ఇది. ఐదుగురు బ్యాచిలర్స్ మధ్య జరిగే వినోదాత్మక కథ. మన జీవితంలోకి ఓ తిండిపోతు దెయ్యం వస్తే ఆ తిప్పలు ఎలా ఉంటాయి? అనేది పాయింట్. నా కొత్త సినిమా నా బ్యానర్‌లో ఉండదు. కొత్త దర్శకులను పరిచయం కోసమే ఎస్‌జే మూవీస్‌ని ప్రారంభించాం'' అన్నారు.



● ఎస్‌జే శివ

చిరంజీవితో నిర్మాతల భేటీ

తెలుగు చిత్ర పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికుల వేతనాలు 30శాతం పెంచాలంటూ 'తెలుగు ఫిల్మ్ ఇండస్ట్రీ ఎంప్లాయీస్ ఫెడరేషన్' నాయకులు సోమవారం నుంచి బంద్ చేస్తున్న సంగతి తెలిసిందే. ప్రస్తుత పరిస్థితుల్లో వేతనాల పెంపును నిర్మాతలందరూ ఏకగ్రీవంగా వ్యతిరేకించారంటూ తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఓ ప్రకటన విడుదల చేసిన విషయం కూడా విదితమే. వేతనాల పెంపు విషయంలో నిర్మాతలకు, సినీ కార్మికులకు మధ్య వివాదం కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో 'యాక్టివ్ తెలుగు ఫిల్మ్ ప్రొడ్యూసర్స్ గిల్డ్' ఆధ్వర్యంలో నిర్మాతలు మంగళవారం హీరో చిరంజీవిని కలిశారు. సమావేశం ముగిసిన అనంతరం నిర్మాత సి. కల్యాణ్ మీడియాతో మాట్లాడుతూ– ''మేము చిరంజీవిగారిని కలిసి మా సమస్యలను వివరించాం. మా సమస్యలు విన్న ఆయన.. కార్మికుల సమస్యలు కూడా తెలుసుకుంటాను. పరిస్థితులు చక్కబడకపోతే జోక్యం చేసుకుంటానని హామీ ఇచ్చారు'' అన్నారు. చిరంజీవిని కలిసిన వారిలో నిర్మాతలు డి.సురేష్ బాబు, అల్లు అరవింద్, రవిశంకర్ యలమంచిలి, సుప్రియ యార్లగడ్డ, కేఎల్ నారాయణ, సి. కల్యాణ్, ఫిల్మ్ ఛాంబర్ సెక్రటరీ దామోదర్ ప్రసాద్ వంటి వారు ఉన్నారు. అదేవిధంగా ఫిల్మ్‌ఛాంబర్ ప్రతినిధులతో 'మా' అధ్యక్షుడు మంచు విష్ణు చర్చలు జరిపారు. ఇదిలా ఉంటే... ఢిల్లీలో ఉన్న తెలంగాణ రాష్ట్ర సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి.. కార్మికుల బంద్‌పై స్పందిస్తూ.. ఢిల్లీ పర్యటన ముగిసిన తర్వాత హైదరాబాద్ వెళ్లాక కార్మికులతో చర్చిస్తాను'' అన్నారు.

సరికొత్త కథతో...



● రమేష్ ప్రసాద్, వేణు, గుణి మంచికంటి

టీను ఆనంద్, ఉపేంద్ర, జార్జ్ మరియన్, అక్షయ్, విష్ణు, కార్తికేయ, ఆస్త్రా, మాళవి ప్రధాన పాత్రల్లో కొత్త సినిమా ప్రారంభమైంది. గుణి మంచికంటి దర్శకత్వంలో చిత్రాలయం స్టూడియోస్ బ్యానర్‌పై వేణు దోనెపూడి నిర్మిస్తున్న ఈ చిత్రం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి నిర్మాత కేఎస్ రామారావు కెమెరా స్విచ్చాన్ చేయగా, ప్రొడ్యూసర్ ఆది శేషగిరి రావు క్లాప్ కొట్టారు. నిర్మాత రమేష్ ప్రసాద్ అక్కినేని స్క్రిప్ట్‌ను అందించగా, డైరెక్టర్ మహేష్ బాబు.పి గౌరవ దర్శకత్వం వహించారు. ''సరికొత్త కథతో రూపొందుతోన్న చిత్రమిది'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సహ నిర్మాత: కొండల్ జిన్నా, సంగీతం: స్టీఫెన్, ఆనంద్, కెమెరా: అజయ్ అబ్రహం జార్జ్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: వైశాఖ్ నాయర్.

సాక్షి బిజినెస్
బుధవారం
6-8-2025

స్టాక్ మార్కెట్లు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
308	73
80,710	24,650

విదేశీ సూచీలు

నాస్‌డాక్	21,002	▽	52
డోజోన్స్	44,226	△	53
ఎఫ్‌టీఎస్‌ఈ 100	9,139	△	11
డాక్స్	23,865	△	107
హాంగ్‌సెంగ్	3,618	△	34
నికాయ్	40,545	△	289

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	86.80	86.82
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	114.50	117.45
€	యూరో	ఎస్‌బీఐ	99.73	102.48
¥	జపాన్ యెన్ (100)	ఎస్‌బీఐ	58.38	58.88
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	55.45	57.69
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	65.81	69.45
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	22.50	23.99
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	22.97	24.22
¥	చైనా యువాన్	థామస్‌కుక్	11.34	13.16

వెంటాడిన టారిఫ్ భయాలు

- ఆర్‌బీఐ పాలసీ ముందు అప్రమత్తత
- సెన్సెక్స్ నష్టం 308 పాయింట్లు



ముంబై: రిజర్వ్ బ్యాంకు ద్రవ్య పాలసీ ప్రకటన(నేడు)కు ముందు ఇన్వెస్టర్లు అప్రమత్తత వహిస్తూ బ్యాంకులు, చమురు షేర్లలో అమ్మకాలకు పాల్పడ్డారు. భారత్‌పై మరిన్ని సుంకాలు విధిస్తామన్న ట్రంప్ వ్యాఖ్యలతో అమెరికా-భారత్‌ల మధ్య వాణిజ్య ఒప్పందంపై నీలినీడలు కమ్ముకున్నాయి. క్యూ1 ఆర్థిక ఫలితాలు మార్కెట్ వర్గాలను మెప్పించకలేపోతున్నాయి. ఈ పరిణామాలు ఇన్వెస్టర్ల విశ్వాసాన్ని దెబ్బతీశాయి. ఫలితంగా మంగళవారం సెన్సెక్స్ 308 పాయింట్లు నష్టపోయి 80,710 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 73 పాయింట్లు పతనమై 24,650 వద్ద నిలిచింది.

■ తొలి త్రైమాసిక నికర లాభం 56% వృద్ధి నమోదుతో గాడ్‌ఫ్రై ఫిలిప్స్ షేరుకు డిమాండ్ లభించింది. బీఎస్‌ఈలో 10% పెరిగి రూ.9887 వద్ద లోయర్ సర్క్యూట్ తాకి అక్కడే ముగిసింది.

ఆదిత్య ఇన్ఫోటెక్ అరంగేట్రం అదుర్స్



సీపీ ప్లస్ బ్రాండ్ కింద నిఘా పరికరాలను విక్రయించే ఆదిత్య ఇన్ఫోటెక్ షేరు ఎక్స్ఛేంజీల్లోకి అదిరిపోయే అరంగేట్రం చేసింది. ఇష్యూ ధర(రూ.675)తో పోలిస్తే బీఎస్‌ఈలో 51% ప్రీమియంతో రూ.1,018 వద్ద లిస్టయ్యింది. ఇంట్రాడేలో 64% ఎగసి రూ.1,104 వద్ద గరిష్టాన్ని తాకింది. చివరికి 61% లాభంతో రూ.1,084 వద్ద ముగిసింది.

జీవితకాల కనిష్టాన్ని తాకిన రూపాయి



డాలర్ మారకంలో రూపాయి విలువ 22 పైసలు నష్టపోయి 87.88 వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో 2025 ఫిబ్రవరి 10 నాటి జీవితకాల కనిష్టం 87.95 స్థాయిని తాకింది. రష్యన్ చమురు కొనుగోలు కారణంగా భారత్‌పై సుంకాలను మరింత పెంచుతామంటూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేసిన వ్యాఖ్యలు మన కరెన్సీ కోతకు ప్రధాన కారణంగా నిలిచాయి. దేశీ స్టాక్ మార్కెట్ పతనం కూడా రూపాయిపై ఒత్తిడి పెంచింది.

లక్ష్మి ఇండియా ఫైనాన్స్ నిరాశ

ఎన్‌బీఎఫ్‌సీ లక్ష్మి ఇండియా ఫైనాన్స్ లిస్టింగ్‌లో నిరాశపరిచింది. ఇష్యూ ధర (రూ.158)తో పోలిస్తే బీఎస్‌ఈలో 14 శాతం డిస్కౌంటుతో రూ.136 వద్ద లిస్టయ్యింది. ఇంట్రాడేలో 16 శాతం క్షీణించి రూ.133 వద్ద కనిష్టాన్ని తాకింది. చివరికి 15% నష్టంతో రూ.134 వద్ద నిలిచింది.

ఎయిర్‌టెల్ లాభాల రింగ్

క్యూ1లో రూ. 5,948 కోట్లు

న్యూఢిల్లీ: మొబైల్ టెలికం రంగ దిగ్గజం భారతీ ఎయిర్‌టెల్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025-26) తొలి త్రైమాసికంలో ఆకర్షణీయ ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన ఏప్రిల్-జూన్(క్యూ1)లో నికర లాభం 43 శాతం జంప్‌చేసి రూ. 5,948 కోట్లను తాకింది. భారత్‌సహా.. ఆఫ్రికా బిజినెస్‌లో వృద్ధి ఇందుకు సహకరించింది. గతేడాది (2024-25) ఇదే కాలంలో కేవలం రూ. 4,160 కోట్లు ఆర్జించింది. ఆఫ్రికా కార్యకలాపాల నికర లాభం ఐదు రెట్లు ఎగసి 15.6 కోట్ల డాలర్లకు చేరింది. గత క్యూ1లో ఇది 3.1 కోట్ల డాలర్లు మా త్రమే. కాగా.. మొత్తం ఆ దాయం 28 శాతం పైగా పుంజుకుని రూ. 49,463 కోట్లయ్యింది. గత క్యూ1లో రూ. 38,506 కోట్ల టర్నోవర్ అందుకుంది.

దేశీ విభాగం జోరు

మొత్తం ఆదాయంలో దేశీ బిజినెస్ 29 శాతం జంప్ చేసి రూ. 37,585 కోట్లకు చేరింది. ఒక్కో వినియోగదారునిపై సగటు ఆదాయం(ఏఆర్‌పీయూ) రూ. 211 నుంచి రూ. 250కు బలపడింది. ఈ కాలంలో 40 లక్షలమంది స్మార్ట్‌ఫోన్ డేటా యూజర్లను జత చేసుకుంది. 2025 జూన్‌కల్లా మొత్తం కస్టమర్ల సంఖ్య 7% వృద్ధితో 60.5 కోట్లను తాకింది. దీనిలో దేశీ వినియోగదారుల వాటా 6.6 శాతం పుంజుకుని 43.6 కోట్లకు చేరింది. పోస్ట్‌పెయిడ్ విభాగంలో 0.7 మిలియన్ల మంది జత కలవడంతో వీరి సంఖ్య 2.66 కోట్లకు చేరింది. స్మార్ట్‌ఫోన్ డేటా యూజర్ల సంఖ్యలో 8.2 శాతం వార్షిక వృద్ధి నమోదైంది. దీంతో క్యూ1లో 2.13 కోట్లమంది వినియోగదారులు జత కలిశారు. మొబైల్ డేటా వినియోగం సగటున 13 శాతం ఎగసి నెలకు 26.9 జీబీకి చేరింది. ఫిక్స్‌డ్ బ్రాడ్‌బ్యాండ్‌సహా హోమ్ సర్వీసుల విభాగం కస్టమర్ల సంఖ్య 38 శాతం జంప్‌చేసి 1.09 కోట్లను తాకింది. ఈ కాలంలో పెట్టుబడి వ్యయాలు 14 శాతం తగ్గి రూ. 7,273 కోట్లకు పరిమితమయ్యాయి. కంపెనీ రుణ భారం 2 శాతం పెరిగి రూ. 1.91 లక్షల కోట్లకు చేరింది. భారతీ ఎయిర్‌టెల్‌లో భాగమైన ఎక్స్‌టెలిఫై కొత్తగా ఎయిర్‌టెల్ క్లౌడ్ పేరిట క్లౌడ్ ప్లాట్‌ఫాంను ఆవిష్కరించింది. ఇన్‌ఫ్రా, ప్లాట్‌ఫాం సర్వీసులను (ఐఏఏఎస్, పీఏఏఎస్) ఇది అందిస్తుంది.



ఎయిర్‌టెల్ షేరు 0.8% బలపడి రూ. 1,930 వద్ద క్లోజైంది.

సేవల రంగం పనితీరు పటిష్టం

- 11 నెలల గరిష్టానికి కార్యకలాపాలు
- జూలైలో 60.5కు చేరిన సర్వీసెస్ పీఎంఐ సూచీ



న్యూఢిల్లీ: సేవల రంగంలో కార్యకలాపాలు బలంగా కొనసాగుతున్నాయి. ఇందుకు నిదర్శనంగా హెచ్‌ఎస్‌బీసీ ఇండియా సర్వీసెస్ పీఎంఐ బిజినెస్ యాక్టివిటీ సూచీ జూలైలో 60.5 పాయింట్లకు చేరింది. ఇది 11 నెలల గరిష్ట స్థాయి. మొత్తం మీద విక్రయాలు పెరగడం, కొత్త ఎగుమతి ఆర్డర్లు రావడం బలమైన పనితీరుకు సాయపడ్డాయి. సేవల రంగం పీఎంఐ జూన్ నెలలో 60.4గా ఉండడం గమనార్హం. 50 పాయింట్లకు పైన నమోదైతే విస్తరణగా, అంతకంటే దిగువన ఉంటే బలహీనపడినట్టుగా భావిస్తారు.

సేవల రంగం బలమైన వృద్ధిని నమోదు చేసినట్టు హెచ్‌ఎస్‌బీసీ భారత ముఖ్య ఆర్థికవేత్త ప్రంజుల్ భండారీ తెలిపారు. కొత్త ఆర్డర్లు ఇందులో ప్రధాన పాత్ర పోషించినట్టు చెప్పారు. సేవలకు అంతర్జాతీయంగా బలమైన డిమాండ్ ఉన్నట్టు సర్వీస్ ప్రొవైడర్లు హెచ్‌ఎస్‌బీసీ నిర్వహించిన నెలవారీ సర్వేలో చెప్పడం గమనార్హం. ఆసియా, కెనడా, యూరప్, యూఏఈ, యూఎస్ ప్రాంతాల నుంచి కొత్త ఆర్డర్లు వచ్చినట్టు వెల్లడించారు. ఈ ఏడాదికి మిగిలి ఉన్న కాలంలోనూ మెరుగైన పనితీరు నమోదు చేసే విషయమై సర్వీస్ ప్రొవైడర్లు ఆశావహంగా ఉన్నారు. సామర్థ్యాల పెంపు, మార్కెటింగ్, టెక్నాలజీ ఆవిష్కరణలు, ఆన్‌లైన్‌లో సేవల విస్తరణ బలమైన కార్యకలాపాలకు మద్దతుగా నిలుస్తున్నట్టు హెచ్‌ఎస్‌బీసీ సర్వే పేర్కొంది. జూన్‌తో పోల్చి చూస్తే జూలైలో సర్వీస్ ప్రొవైడర్లకు వ్యయాలు పెరిగినట్టు తెలిపింది. ''ఉపాధి కల్పన పరిమితంగానే ఉంది. కాకపోతే దీర్ఘకాల సగటుకు అనుగుణంగానే ఉంది. రెండు శాతం కంటే కొంచెం ఎక్కువ కంపెనీలు అదనపు సిబ్బందిని తీసుకున్నాయి. మిగిలిన కంపెనీల్లో జూన్ నుంచి ఎలాంటి మార్పు లేదు''అని సర్వే వివరించింది. ఇక హెచ్‌ఎస్‌బీసీ ఇండియా కాంపోజిట్ పీఎంఐ సూచీ (తయారీ, సేవలతో కూడిన) జూన్‌లో 61గా ఉంటే జూలైలో 61.1కి చేరింది.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో..

భారత ఆర్థిక మూలాలు పటిష్టం	ఐపీవోకు టాటా క్యాపిటల్ రెడీ

అదానీ పోర్ట్స్ లాభం ప్లస్

క్యూ1లో రూ. 3,311 కోట్లు



న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025-26) తొలి త్రైమాసికంలో ప్రయివేట్ రంగ దిగ్గజం అదానీ పోర్ట్స్ అండ్ సెజ్ పటిష్ట ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన ఏప్రిల్-జూన్(క్యూ1)లో నికర లాభం 7 శాతం వృద్ధితో రూ. 3,311 కోట్లకు చేరింది. ఆదాయం పుంజుకోవడం ఇందుకు దోహదపడింది. గతేడాది(2024-25) ఇదే కాలంలో రూ. 3,307 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం రూ. 8,054 కోట్ల నుంచి రూ. 9,422 కోట్లకు జంప్ చేసింది. అయితే మొత్తం వ్యయాలు సైతం రూ. 4,239 కోట్ల నుంచి రూ. 5,732 కోట్లకు పెరిగాయి. ఈ కాలంలో 11 శాతం అధికంగా 121 మిలియన్ మెట్రిక్ టన్నుల(ఎంఎంటీ) కార్గో పరిమాణాన్ని హ్యాండిల్ చేసినట్లు కంపెనీ వెల్లడించింది. దేశీయంగా పోర్టుల ఆదాయం 14% ఎగసి రూ. 6,137 కోట్లను తాకగా. అంతర్జాతీయ పోర్టుల బిజినెస్ 22% వృద్ధితో రూ. 973 కోట్లకు చేరినట్లు తెలియజేసింది.

అదానీ పోర్ట్స్ షేరు 2.4 శాతం క్షీణించి రూ. 1,358 వద్ద ముగిసింది.

జీఎంఆర్ ఏరో అకాడమీలో ఆన్‌లైన్ సీఏఏసీవో ప్రోగ్రాం

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఏవియేషన్ శిక్షణా సంస్థ జీఎంఆర్ ఏరో అకాడమీ తాజాగా ఎయిర్‌పోర్ట్, ఎయిర్‌లైన్, కార్గో ఆపరేషన్స్ (సీఏఏసీవో) సర్టిఫికేషన్ ప్రోగ్రాంను తొలిసారి ఆన్‌లైన్ మాధ్యమంలో ప్రారంభించింది. విమానయాన రంగంపై సమగ్ర శిక్షణ అందించేందుకు ఈ మూడు నెలల ఆన్‌లైన్ ప్రోగ్రాం ఉపయోగపడుతుందని సంస్థ వివరించింది. ఇది రెండు దశలుగా ఉంటుందని పేర్కొంది. మొదటి దశలో సివిల్ ఏవియేషన్ పునాది, రెగ్యులేటరీ సంస్థలు మొదలైన వాటి గురించి, రెండో దశలో ఎయిర్‌సైడ్ ఆపరేషన్స్, ఏవియేషన్ సెక్యూరిటీ తదితర అంశాల గురించి బోధిస్తారు. 27 సంవత్సరాల లోపు ఉన్న వారు ఈ ప్రోగ్రాంలో చేరొచ్చు.

జియో బ్లాక్‌రాక్.. ఐదు కొత్త ఎన్‌ఎఫ్‌వోలు

12వ తేదీ వరకు పెట్టుబడులు



న్యూఢిల్లీ: జియో బ్లాక్‌రాక్ ఏఎంసీ ఐదు ఇండెక్స్ ఫండ్స్‌కు సంబంధించి న్యూ ఫండ్ ఆఫర్ (ఎన్‌ఎఫ్‌వో)ను ప్రారంభించినట్టు ప్రకటించింది. జియో ఫైనాన్షియల్ సర్వీసెస్, యూఎస్‌కు చెందిన బ్లాక్‌రాక్ 50:50 జాయింట్ వెంచర్ కంపెనీ ఇది. జియో బ్లాక్‌రాక్ నిఫ్టీ 50 ఇండెక్స్ ఫండ్, నిఫ్టీ నెక్ట్స్ 50 ఇండెక్స్ ఫండ్, నిఫ్టీ మిడ్‌క్యాప్ 150 ఇండెక్స్ ఫండ్, నిఫ్టీ స్మాల్‌క్యాప్ 250 ఇండెక్స్ ఫండ్, నిఫ్టీ 8-13 ఇయర్ జీ-సెక్ ఇండెక్స్ ఫండ్ ఆఫర్లు 5వ తేదీన ప్రారంభం కాగా, 12వ తేదీన ముగియనున్నాయి. సమతుల్యమైన పోర్ట్‌ఫోలియోని ఏర్పాటు చేసుకోవాలని చూసే మొదటిసారి ఇన్వెస్టర్లతోపాటు తమ పెట్టుబడులను వృద్ధి చేసుకోవాలని చూసే అనుభవజ్ఞులైన ఇన్వెస్టర్లకు అందుబాటు ధరలకే పెట్టుబడి పరిష్కారాలను ఈ పథకాలు అందిస్తున్నట్టు జియో బ్లాక్‌రాక్ ఏఎంసీ ప్రకటించింది.

భవిత

స్పర్ధయా వర్ధతే విద్య

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

నేటి భవిత ఈ పేపర్‌లో..
» సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం-ఇండియన్ పాలిటీ » టెట్/డీఎస్సీ ప్రత్యేకం-జాగ్రఫీ
» గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం-తెలంగాణ ఎకానమీ » బ్యాంక్ ఎగ్జామ్స్ ప్రత్యేకం-బ్యాంకింగ్ అవేర్‌నెస్



ఆర్మీలో ఇంజనీరింగ్ కొలువు

» 381 పోస్టుల భర్తీకి ఎస్‌ఎస్‌సీ టెక్ నోటిఫికేషన్ విడుదల
» ఇంజనీరింగ్ డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తుకు అర్హులు
» షార్ట్‌లిస్టింగ్, ఎస్‌ఎస్‌బీ ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక

ఇండియన్ ఆర్మీలో ఇంజనీరింగ్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది. అవివాహిత మహిళలు, పురుష ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్లు దరఖాస్తుకు అర్హులు. ఎంపికైన అభ్యర్థులకు ప్రి కమిషనింగ్ ట్రైనింగ్ అకాడెమీ(పీసీటీఏ)లో 2026 ఏప్రిల్‌లో కోర్సు ప్రారంభమవుతుంది. ఎంపిక ప్రక్రియలో విజయం సాధిస్తే.. పదేళ్లపాటు సైన్యంలో పనిచేసే అవకాశం లభిస్తుంది. ఈ నేపథ్యంలో.. ఇండియన్ ఆర్మీ 66వ షార్ట్ సర్వీస్ కమిషన్(టెక్)మెన్, ఉమెన్ నోటిఫికేషన్‌తో భర్తీ చేసే పోస్టులు, దరఖాస్తుకు అర్హతలు, ఎంపిక విధానం, వేతనాలు తదితర వివరాలు..

నోటిఫికేషన్లు

- 66వ షార్ట్ సర్వీస్ కమిషన్ టెక్(మెన్) కోర్సు (ఏప్రిల్ 2026).
- 66వ షార్ట్ సర్వీస్ కమిషన్ టెక్(ఉమెన్) కోర్సు (ఏప్రిల్ 2026).
- మొత్తం పోస్టుల సంఖ్య: 381

పోస్టుల వివరాలు

- షార్ట్ సర్వీస్ కమీషన్(టెక్)-66 పురుషులు-350 పోస్టులు
- షార్ట్ సర్వీస్ కమీషన్(టెక్)-66 మహిళలు-29 పోస్టులు
- ఎస్‌ఎస్‌సీ (డబ్ల్యూ) టెక్-1 పోస్టు
- ఎస్‌ఎస్‌సీ (డబ్ల్యూ) నాన్ టెక్-1 పోస్టు

ఇంజనీరింగ్ విభాగాలు

సివిల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్, ఇండస్ట్రియల్ ఇంజనీరింగ్, ఆటోమొబైల్ ఇంజనీరింగ్, ఏరోస్పేస్ ఇంజనీరింగ్, కెమికల్ ఇంజనీరింగ్, బయోమెడికల్, మెటలర్జికల్ ఇంజనీరింగ్, మైనింగ్ ఇంజనీరింగ్ తదితరాలు.

అర్హతలు

సంబంధిత విభాగంలో ఇంజనీరింగ్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. కోర్సు ఫైనల్ ఇయర్ విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. అయితే 01.04.2026 నాటికి ఇంజనీరింగ్ డిగ్రీ పూర్తయిన సర్టిఫికెట్‌ను సమర్పించాల్సి ఉంటుంది. ఎస్‌ఎస్‌సీ (డబ్ల్యూ) నాన్ టెక్ కోసం ఏదైనా విభాగంలో డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి.

వయసు

01.04.2026 నాటికి 20 నుంచి 27 ఏళ్ల మధ్యలో ఉండాలి.

ఫిజికల్ స్టాండర్డ్స్

పురుషులు-2.4కి.మీ.పరుగు 10.30నిమిషాల్లో, పుష్-అప్స్ 40, పుల్-అప్స్ 6, మహిళలు 2.4 కి.మీ. పరుగు 13 నిమిషాల్లో, పుష్-అప్స్ 15, పుల్-అప్స్ 2, ఈతలో ప్రాథమిక పరిజ్ఞానం ఉండాలి.

వేతనాలు

విజయవంతంగా శిక్షణ పూర్తి చేసుకొన్న వారికి లెఫ్టినెంట్ ర్యాంకుతో లెవెల్ 10తో నెలకు రూ.56,100 -రూ.1,77,500 వేతన శ్రేణి లభిస్తుంది. దీంతోపాటు ఇతర అలవెన్సులు అందుతాయి.

ఎంపిక ప్రక్రియ

- దరఖాస్తుల షార్ట్‌లిస్టింగ్, గ్రాడ్యుయేషన్ మార్కులు, ఎస్‌ఎస్‌బీ(సర్వీస్ సెలక్షన్ బోర్డ్) ఇంటర్వ్యూ, వైద్య పరీక్షల ఆధారంగా ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు.
- షార్ట్ లిస్టింగ్ జాబితాలో నిలిచిన అభ్యర్థులకు మాత్రమే ఎస్‌ఎస్‌బీ ఇంటర్వ్యూ ఉంటుంది.అలహాబాద్(యూపీ),భోపాల్(ఎంపీ), బెంగళూరు (కర్ణాటక), జలంధర్(పంజాబ్)ల్లోని కేంద్రాల్లో ఎస్‌ఎస్‌బీ ఇంటర్వ్యూలను నిర్వహిస్తారు. సైకాలజిస్టులు, గ్రూప్ టెస్టింగ్ ఆఫీసర్లు, ఇంటర్వ్యూ ఆఫీసర్లు ఈ ప్రక్రియలో పాల్గొంటారు.
- ఎస్‌ఎస్‌బీ ఇంటర్వ్యూల్లో స్టేజ్1, స్టేజ్ 2 ఉంటాయి. స్టేజ్ 1లో అర్హత సాధించని వారిని అదే రోజు వెనక్కు పంపిస్తారు. ఎస్‌ఎస్‌బీ ఇంటర్వ్యూ ఐదు రోజులపాటు జరుగుతుంది. స్టేజ్ 2లో అర్హత సాధించిన అభ్యర్థులకు మెడికల్ ఎగ్జామినేషన్ ఉంటుంది. ఎస్‌ఎస్‌బీ సిఫార్సుతో పాటు వైద్య పరీక్షల్లో ఫిట్‌గా ప్రకటించిన వారికి జాయినింగ్ లెటర్ జారీ చేస్తారు.

శిక్షణ-స్టైపెండ్

ఎంపికైన అభ్యర్థులకు షార్ట్ సర్వీస్ కమిషన్‌గా పేర్కొని.. లెఫ్టినెంట్ ర్యాంకుతో ప్రొబేషన్ ఉంటుంది. ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడెమీలో 49 వారాల పాటు శిక్షణ ఇస్తారు. శిక్షణ సమయంలో నెలకు రూ.56,100 స్టైపెండ్ లభిస్తుంది. శిక్షణను సైతం విజయవంతంగా పూర్తి చేసుకున్న వారికి షార్ట్ సర్వీస్ కమిషన్‌ను ప్రకటించడం తోపాటు పోస్ట్‌గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ డిఫెన్స్ మేనేజ్‌మెంట్ అండ్ స్ట్రాటజిక్ స్టడీస్‌ను అందజేస్తారు. శిక్షణ సమయంలో వివాహం చేసుకోవడానికి అనుమతించరు.

సర్వీస్ వ్యవధి

షార్ట్ సర్వీస్ కమిషన్‌కు ఎంపికైన వారు పదేళ్లు ఆర్మీలో పనిచేయాల్సి ఉంటుంది. ఆ తర్వాత కూడా మరో నాలుగేళ్లు పొడిగించుకునే అవకాశం ఉంటుంది. అలాగే అభ్యర్థులు కోరుకుంటే ఆర్మీ కేంద్ర కార్యాలయం అనుమతితో ఐదేళ్ల సర్వీస్ తర్వాత వైదొలిగే వీలు కూడా ఉంది.పర్మనెంట్ కమిషన్ కోరుకునే అభ్యర్థుల సర్వీసులో పదో ఏట వారి విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకునే అవకాశం ఉంటుంది.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- ఆన్‌లైన్ దరఖాస్తులు ప్రారంభం: 24.07.2025
- ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ: 22.08.2025
- వెబ్‌సైట్: www.joinindianarmy.nic.in

జాబ్ పాయింట్

బ్యాంక్ ఆఫ్ బరోడాలో 330 పోస్టులు

బ్యాంక్ ఆఫ్ బరోడా దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో ఒప్పంద ప్రాతిపదికన డిప్యూటీ మేనేజర్, అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్, అసిస్టెంట్ మేనేజర్ దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 330
» **పోస్టుల వివరాలు:** డిప్యూటీ మేనేజర్-22, అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్1-08, అసిస్టెంట్ మేనేజర్-300.
» **విభాగాలు:** ప్రొడక్ట్-మాస్ ట్రాన్సిట్ సిస్టమ్, ప్రొడక్ట్-అకౌంట్ అగ్రిగేటర్, ఓఎన్‌డీసీ(ఓపెన్ నెట్‌వర్క్ ఫర్ డిజిటల్ కామర్స్), డిజిటల్ ప్రొడక్ట్-పీఎఫ్‌ఎం, సీబీడీసీ, మొబైల్ బిజినెస్ అప్లికేషన్, సేల్స్-డిజిటల్ లెండింగ్, ఎంఎస్ఎంఈ-సేల్స్, వెండర్ రిస్క్ మేనేజ్‌మెంట్ స్పెషలిస్ట్, గ్రూప్ రిస్క్ మేనేజ్‌మెంట్, సైబర్ సెక్యూరిటీ రిస్క్.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ/బీఎస్సీ, బీఈ/బీటెక్, ఎంఈ/ఎంటెక్(కంప్యూటర్ సైన్స్/ఇన్ఫర్మేషన్ సిస్టమ్/సైబర్ సెక్యూరిటీ రిస్క్/ఫైనాన్స్/రిస్క్ మేనేజ్‌మెంట్/బిజినెస్ అడ్మినిస్ట్రేషన్/కంప్యూటర్ సైన్స్/ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ/సైబర్ సెక్యూరిటీ/ఎలక్ట్రానిక్స్/ఎలక్ట్రానిక్స్ -కమ్యూనికేషన్/సాఫ్ట్‌వేర్ ఇంజనీరింగ్) ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి. **వయసు:** 01.07.2025 నాటికి 23 ఏళ్ల నుంచి 40 ఏళ్లు మించకూడదు.
» **ఎంపిక విధానం:** సర్టిఫికేట్‌ల పరిశీలన, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 30.07.2025.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 19.08.2025
» **వెబ్‌సైట్:** www.bankofbaroda.in

బ్యాంక్ ఆఫ్ బరోడాలో 125 మేనేజర్ పోస్టులు

బ్యాంక్ ఆఫ్ బరోడా దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో ఒప్పంద ప్రాతిపదికన మేనేజర్, సీనియర్ మేనేజర్, చీఫ్ మేనేజర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 125.
» **పోస్టుల వివరాలు:** మేనేజర్-23, సీనియర్ మేనేజర్-85, చీఫ్ మేనేజర్-17.
» **విభాగాలు:** ఫారెక్స్ అక్విజేషన్-రిలేషన్‌షిప్, క్రెడిట్ అనలిస్ట్, సీనియర్ మేనేజర్-క్రెడిట్ అనలిస్ట్, ఎంఎస్ఎంఈ క్రెడిట్, ఇంటర్నల్ కంట్రోల్స్, బిజినెస్ ఫైనాన్స్, ఇన్ఫ్రాస్ట్రక్చర్ అండ్ ఈఎస్‌జీ, రిస్క్ మేనేజ్‌మెంట్ తదితరాలు.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ, ఎంబీఏ, సీఏ/సీఎంఏ/సీఎస్/సీఎఫ్ఏ(అనలిటిక్స్, డేటా సైన్స్, ఫైనాన్స్ లేదా అకౌంటింగ్) ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి. **వయసు:** 01.07.2025 నాటికి 24 నుంచి 42 ఏళ్ల మధ్య ఉండాలి.
» **ఎంపిక విధానం:** షార్ట్‌లిస్టింగ్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 30.07.2025.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 19.08.2025
» **వెబ్‌సైట్:** www.bankofbaroda.in

హుగ్లీ కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్‌లో అప్రెంటిస్‌లు

హౌరా(కొలకత్తా)లోని హుగ్లీ కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్‌లో గ్రాడ్యుయేట్, టెక్నీషియన్(డిప్లొమా) అప్రెంటిస్‌ల ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం ఖాళీల సంఖ్య:** 05.

ఖాళీల వివరాలు

» **గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌లు:** మెకానికల్-01, ఎలక్ట్రికల్-01.
» **టెక్నీషియన్(డిప్లొమా) అప్రెంటిస్‌లు:** మెకానికల్-02, ఎలక్ట్రికల్-01.
» **అర్హత:** సంబంధిత విభాగంలో డిప్లొమా, డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి. **వయసు:** 26.08.2025 నాటికి 18 ఏళ్లు నిండి ఉండాలి.
» **స్టైపెండ్:** నెలకు గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌లకు రూ.12,000, టెక్నీషియన్ అప్రెంటిస్‌లకు రూ.10,200.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 28.07.2025.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 26.08.2025
» **వెబ్‌సైట్:** https://cochinshipyard.in

ఈస్టర్న్ రైల్వే-ఆర్ఆర్‌సీ, కోల్‌కతాలో 3,115 అప్రెంటిస్‌లు

ఆర్ఆర్‌సీ(రైల్వే రిక్రూట్‌మెంట్ సెల్)-ఈస్టర్న్ రైల్వే కోల్‌కతా వివిధ విభాగాల్లో అప్రెంటిస్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం ఖాళీల సంఖ్య:** 3,115.
» **డివిజన్‌ల వారీగా ఖాళీలు:** హౌరా డివిజన్-659, లిలువా వర్క్‌షాప్-612, సీల్దా డివిజన్-440, కాంచ్రపార వర్క్‌షాప్-187, మాల్దా డివిజన్-138, అసన్‌సోల్ డివిజన్-412, జమలాపూర్ వర్క్‌షాప్-667.
» **విభాగాలు:** ఫిట్టర్, వెల్డర్, మెకానికల్, మెషినిస్ట్, కార్పెంటర్, పెయింటర్, లైన్‌మెన్, వైర్‌మెన్,ఆర్ఈఎఫ్-ఏసీ మెకానిక్, ఎలక్ట్రీషియన్.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో పదో తరగతి, ఇంటర్, ఐటీఐలో ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** 15 నుంచి 24 ఏళ్ల మధ్య ఉండాలి.
» **ఎంపిక విధానం:** విద్యార్హతల్లో సాధించిన మెరిట్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 14.08.2025.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 13.09.2025
» **వెబ్‌సైట్:** https://rrcer.org

ఎన్ఐవోటీ, చెన్నైలో 25 పోస్ట్ డాక్టోరల్ ఫెలోషిప్ పోస్టులు

చెన్నైలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓషన్ టెక్నాలజీ(ఎన్ఐవోటీ) పోస్ట్ డాక్టోరల్ ఫెలోషిప్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 25.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో పీహెచ్‌డీ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** 35 ఏళ్లు ఉండాలి.
» **ఫెలోషిప్:** నెలకు రూ.80,000.
» **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 11.09.2025.
» **వెబ్‌సైట్:** https://www.niot.res.in

ఐకార్-ఐఏఆర్ఐ, న్యూఢిల్లీలో వివిధ ఉద్యోగాలు

న్యూఢిల్లీలోని ఐకార్-ఇండియన్ అగ్రికల్చరల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్(ఐఏఆర్ఐ) ఒప్పంద ప్రాతిపదికన సీనియర్/జూనియర్ రీసెర్చ్ ఫెలో, యంగ్ ప్రొఫెషనల్-2, ప్రాజెక్ట్ అసిస్టెంట్-1 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 06.
» **పోస్టుల వివరాలు:** సీనియర్/జూనియర్‌రీసెర్చ్ ఫెలో-04, యంగ్ ప్రొఫెషనల్ 2-01, ప్రాజెక్ట్ అసిస్టెంట్1-01.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ, పీజీ నెట్ /గేట్/ఐసీఏఆర్-ఎస్ఆర్ఎఫ్ ఉత్తీర్ణతతో పాటు సంబంధిత పని అనుభవం ఉండాలి.
» **వయసు:** సీనియర్/జూనియర్ రీసెర్చ్ ఫెలోకు, ప్రాజెక్ట్ అసిస్టెంట్‌కు మహిళలకు 35 ఏళ్లు, పురుషులకు 40 ఏళ్లు, యంగ్ ప్రొఫెషనల్‌కు 21 నుంచి 45 ఏళ్లు మించకూడదు.
» **వేతనం:** నెలకు ప్రాజెక్ట్ అసిస్టెంట్‌కు రూ. 20,000, యంగ్ ప్రొఫెషనల్స్‌కు రూ.42,000, సీనియర్ రీసెర్చ్ ఫెలోకు రూ.37,000.
» **ఎంపిక విధానం:**షార్ట్‌లిస్టింగ్,ఇంటర్వ్యూ ద్వారా
» **దరఖాస్తు విధానం:** ఈమెయిల్ ద్వారా.
» **ఈమెయిల్:** dpp.mpp2022@gmail.com
» **దరఖాస్తులకు చివరితేది:** 17.08.2025.
» **వెబ్‌సైట్:** https://www.iari.res.in

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.



ప్రైవసీ కోసం.. ఆన్‌లైన్ షాపింగ్..!

దుకాణాలకు బదులు ఆన్‌లైన్‌లో కొనుగోళ్లు

ఆఫ్‌లైన్‌తో పోలిస్తే సౌకర్యాలున్నాయన్న భావన

తమ గురించి నలుగురికీ తెలియకూడదనే ఆలోచన

ఇది మరీ ఎక్కువైతే మానసిక రుగ్మతలు, ఒంటరితనం

ఆన్‌లైన్ షాపింగ్ మన జీవితాల్లో భాగమైపోయింది. కొంతమందికి ఇది గేమ్-ఛేంజర్. కిరాణా సామాగ్రి, దుస్తులు, ఆహారం, బహుమతులు, ఫర్నిచర్, ఫోన్లు, ఏసీలు, ఫ్రిజ్‌లు.. ఇలా అన్నీ ఆన్‌లైన్‌లో లభిస్తున్నాయి. వీటిని కొనేవారి సంఖ్య నేడు కోట్లలో ఉంది. ఆన్‌లైన్ షాపింగ్ అంటే సౌకర్యం, ఎంచుకోవడానికి లక్షలాది ఉత్పత్తులే కాదు.. కొందరికి వ్యక్తిగత గోప్యత కూడా. ఆన్‌లైన్ అయితే మనం ఉన్నచోటు నుంచే 24 గంటల్లో ఎప్పుడైనా షాపింగ్ చేయవచ్చు. మరొకరి అభిప్రాయాలతో కాకుండా సొంత నిర్ణయంతో తమకు నచ్చినవి చేజిక్కించుకోవచ్చు. జనం మధ్యలో కొనాల్సి వస్తోందన్న ఒత్తిడి లేదు. ట్రాఫిక్, ప్రయాణం వంటి అడ్డంకులూ లేవు.

- సాక్షి, స్పెషల్ డెస్క్

కొంత మంది జనంలో కలవడానికి ఇష్టపడరు. మరి కొందరు అధికంగా అవసరానికి మించి కొనుగోలు చేస్తారు. ఖర్చు ఎక్కువగా పెడితే షాపులోని వాళ్లు, చుట్టూ ఉన్నవాళ్లు ఏమనుకుంటున్నారో అని పదేపదే ఆలోచించి ఒత్తిడికి గురి అవుతారు. ఇలాంటి వారికి ఆన్‌లైన్ షాపింగ్ గొప్ప ఉపశమనం. వీరు తమ గురించి ఇతరులు అంచనా వేయకూడదని అనుకోవడం, సామాజిక ఒత్తిడిని తట్టుకోలేకపోవడం వంటి లోతైన మానసిక భావాలను కలిగి ఉంటారని వైద్య నిపుణులు అంటున్నారు. కొంతమందికి బహిరంగ ప్రదేశాల్లో షాపింగ్ అసౌకర్యంగా అనిపించవచ్చు. ఆన్‌లైన్ షాపింగ్‌ను ఇష్టపడే వ్యక్తులు సౌలభ్యం, సమయం, ఆచితూచి ఖర్చు చేసేందుకు ప్రాధాన్యత ఇస్తారు. కొంతమంది అంతర్ముఖులు ఉంటారు. వీరు ఏకాంతంగా ఆన్‌లైన్‌లో షాపింగ్ ఇష్టపడతారు.

ఇలాంటివి నచ్చక..

ఆన్‌లైన్ షాపింగ్‌లో ఏం కొనాలనేది మన నియంత్రణలో ఉంటుంది. ఏం కొన్నామో మరొకరికి తెలియదు. సురక్షితం అన్న భావన ఉంటుంది. నెమ్మదిగా, కావాల్సినంత సమయం షాపింగ్ చేయవచ్చు. 24 బై 7.. రాత్రీ పగలూ అనే తేడా లేకుండా కొనుక్కోవచ్చు. ఎవరో ఏదో అనుకుంటారన్న ఆలోచనే రాదు. మనకు ఇష్టమైన వెరైటీలు చూడొచ్చు, ధరలను పోల్చవచ్చు, కావలసిన దాన్ని ఎంచుకోవచ్చు. కానీ ఈ సౌలభ్యాలేవీ ఆఫ్‌లైన్‌లో ఉండవు. మన రూపం, ఎంపికలు, బడ్జెట్ ఆధారంగా దుకాణదారులు కస్టమర్లను అంచనా వేస్తారు. ఏం కొనాలనేది కస్టమర్ల అభీష్టం. అలాంటిది 'మీకు ఈ డ్రెస్ బాగుంటుంది', 'తక్కువ రేటే' అంటూ షాప్‌వాళ్లు చేసే సూచనలు / సలహాలు చాలామందికి నచ్చవు. ఇవి కూడా ఆన్‌లైన్‌లో ఉండవు. దేనికి, ఎంతకు షాపింగ్ చేస్తున్నారో ఇతరులెవరూ కనుక్కోలేరు. అందువల్ల ఒకరి షాపింగ్ తీరుపై మరొకరు కామెంట్ చేసే అవకాశమూ ఉండదు.

అపరాధ భావన ఉండొద్దని..

ఆన్‌లైన్‌లో షాపింగ్ చేసినప్పుడు డబ్బు ఖర్చులోనూ ఇబ్బందులు ఉండవు. సంప్రదాయ నగదు మార్పిడి ఉండదు. చెక్‌అవుట్ వద్ద ఇబ్బందికరమైన స్వైప్ ఉండదు. ఖర్చు చేశామన్న అపరాధ భావన ఉండకూడదని ఆన్‌లైన్‌లో షాపింగ్ చేసేవారూ లేకపోలేదు. ఇతరులు వారి అభిప్రాయాలను రుద్దకుండా, జన సమూహం లేకుండానే ఆన్‌లైన్ షాపింగ్ పూర్తి చేయవచ్చు. అయితే అవసరం లేకపోయినా కొంత మంది.. ఏమీ తోచక లేదా వెబ్‌సైట్‌లో ఏదో డిస్కౌంట్ సేల్ అని ప్రకటించగానే కొనుగోళ్లు చేస్తున్నారట. కొనేసిన తరవాత.. అవసరానికి మించి కొన్నామన్న అపరాధ భావన వీరిలో ఉంటోందట. క్రెడిట్ కార్డ్‌తో షాపింగ్ చేసేవారిలో ఇది ఎక్కువగా ఉంటోందట. ఆన్‌లైన్ షాపింగ్ చేసే.. అంతర్ముఖ స్వభావం ఉండే వ్యక్తుల్లో మరో ప్రత్యేకత కూడా ఉంటుందట. ఒక ప్లాట్‌ఫామ్‌లో షాపింగ్ చేస్తున్నప్పుడు అది ఏదో సందర్భంలో నచ్చకపోతే.. దానిమీద కోపంతో మరో ప్లాట్‌ఫామ్‌కు వెళ్లిపోతారు. అంతేకాదు, ఆర్డర్ చేసిన వస్తువు కాకుండా వేరేది / క్వాలిటీ లేని వస్తువు వచ్చినా.. రిటర్న్ పెట్టేటప్పుడు ఇబ్బందులు ఎదురైనా కూడా వీరు వేరే వేదికను ఎంచుకుంటారట. తాము బహిష్కరించినట్టు భావించే మొదటి ప్లాట్‌ఫామ్‌ను కొన్నాళ్లు వదిలేస్తారు.

ఈ సమస్యలూ ఉన్నాయి

బయటకు వెళ్లి, ట్రాఫిక్‌లో విసుక్కుంటూ ప్రయాణించి, దుకాణాల్లో షాపింగ్ చేయడానికి కొన్ని గంటలు సమయం పడుతుంది. దీని వల్ల కొందరిలో అలసిపోయిన భావన ఉంటుంది. అదే పనిని కొన్ని క్లిక్‌లతో సాధ్యం చేసే మరింత అనుకూల అవకాశం ఉన్నప్పుడు అటువైపు మొగ్గు చూపేవారూ ఉంటారు. కానీ అధిక ఆన్‌లైన్ షాపింగ్ కొన్నిసార్లు సామాజిక ఆందోళన లేదా అనవసరపు ఖర్చులకు దారితీయవచ్చు. ఆన్‌లైన్ షాపింగ్‌కి పరిమితమవడం వల్ల శారీరక శ్రమ తగ్గుతుంది. జనానికి దూరం అవుతారు. నిశ్శబ్దంగా శారీరక, మానసిక ఆరోగ్య సమస్యలకు ఆన్‌లైన్ షాపింగ్ తలుపులు తెరిచే అవకాశమూ లేకపోలేదు. ఈ విషయంలో అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

ఆన్‌లైన్ షాపింగ్ శత్రువు కాదు. ఇది మారుతున్న జీవితాలు, అలవాట్లు, ప్రాధాన్యతలను ప్రతిబింబిస్తుంది. కొంతమందికి ఇది సహాయకారి. సమయం ఆదా చేయడం, నచ్చినన్ని వెరైటీలు చూసుకునే వెసులుబాటు.. ఇలాంటి సానుకూల అంశాలు ఉన్నాయి. అదే సమయంలో జీవితం మరింత డిజిటల్‌గా మారుతున్న కొద్దీ వాస్తవ ప్రపంచ అనుబంధాల విలువను, ఉనికిని మర్చిపోకూడదు. మనల్ని మనమే ఒంటరిని చేసుకోకూడదు అంటున్నారు మానసిక వైద్య నిపుణులు.

సమస్యల నుండి తప్పించుకోవడానికి..: తక్కువ ఆత్మస్థైర్యం లేదా ఆత్మన్యూనత లేదా అంతర్ముఖత్వం కారణంగా దుకాణాలకు వెళ్లకుండా ఆన్‌లైన్‌లో షాపింగ్ చేసేవాళ్లు కూడా ఉంటారు. ఆ భావనను కప్పిపుచ్చుకునేందుకు లేదా అధిగమించే ప్రయత్నంలో.. తెలిసి కొందరు, తెలియక కొందరు అనవసరపు ఖర్చులు చేస్తుంటారని మానసిక వైద్యులు అంటున్నారు.

రామాయపట్నం పోర్టు నిర్మాణ గడువు పెంపు

చర్చించిన మంత్రివర్గ ఉపసంఘం

సాక్షి, అమరావతి: రామాయపట్నం గ్రీన్ ఫీల్డ్ పోర్టు తొలి దశ నిర్మాణ పనుల గడువును పెంచే విషయంపై మంత్రివర్గ ఉపసంఘం చర్చించింది. రామాయపట్నం పోర్టు పనులకు సంబంధించి ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘం సభ్యులైన మంత్రులు పయ్యావుల కేశవ్, బీసీ జనార్దన్‌రెడ్డి, కందుల దుర్గేష్ మంగళవారం వెలగపూడి సచివాలయంలో సమావేశమయ్యారు. పోర్ట్ డ్రాఫ్టుని 16 మీటర్ల నుంచి 18.5 మీటర్లకు పెంపు ప్రతిపాదనల్ని పరిశీలించి సిఫారసు చేసే విషయంపై చర్చించారు.

కోస్తాంధ్ర తీర ప్రాంత రక్షణకు చర్యలు

ఆరిలోవ(విశాఖ జిల్లా): రాష్ట్రంలో కోస్తాంధ్ర తీర ప్రాంత రక్షణకు చర్యలు చేపడుతున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పి.మల్లికార్జున రావు తెలిపారు. 2రోజుల పాటు విశాఖ ఫారెస్ట్ సర్కిల్ సందర్శనలో భాగంగా మంగళవారం ఆయన ఇందిరాగాంధీ జూలాజికల్ పార్కు, కంబాలకొండ ఎకో టూరిజం పార్క్‌ను సందర్శించారు. అనంతరం అటవీశాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. విశాఖ రీజియన్‌లో అడవుల సంరక్షణ, వాటి అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. 'గ్రేట్ గ్రీన్ వాల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్'గా తీర ప్రాంతాన్ని తీర్చిదిద్దడానికి సన్నాహాలు జరుగుతున్నాయన్నారు. ఇందులో భాగంగా కోస్తాంధ్ర 12 జిల్లాల్లో ఉన్న 974 కి.మీ. తీర ప్రాంతంలో సుమారు 600 కి.మీ.లో పచ్చదనాన్ని పునరుద్ధరించనున్నట్లు పేర్కొన్నారు.

చేయి తిరుగుతోంది!

'పశ్చిమ'లో జోరుగా పేకాట దందా

టీడీపీ నేతలే పేకాట శిబిరాల నిర్వాహకులు

- అనుమతుల పేరిట క్లబ్బుల్లో భారీగా నిర్వహణ
- అనధికారికంగా ప్రధాన పట్టణాల్లో శిబిరాలు
- భీమవరంలో ఒక్క ఆటకు రూ.1.60 లక్షలు
- జిల్లాలో నిత్యం రూ.5 కోట్లకు పైగా టర్నోవర్
- ఉభయ గోదావరి జిల్లాల నుంచి పేకాట రాయుళ్లకు ప్రత్యేక ఆహ్వానాలు
- తణుకులో ప్రతిరోజూ మారుతున్న శిబిరాలు
- పాలకొల్లు, ఉండి, తాడేపల్లిగూడెంలోనూ ఇదే దందా
- ప్రజాప్రతినిధులకు, పోలీసులకు వారం మామూళ్లు ఖరారు



సాక్షి ప్రతినిధి, ఏలూరు: పశ్చిమ గోదావరి జిల్లాలో పేకాట దందా మూడు షోలు.. ఆరు పుల్లులుగా సాగుతోంది. డ్రాప్‌కు రూ.20 వేలు, మిడిల్ డ్రాప్‌కు రూ.40 వేలు, ఫుల్ కౌంట్‌కు రూ.1.60 లక్షలు.. ఇదీ జిల్లా ప్రధాన కేంద్రమైన భీమవరంలో సాగుతున్న ప్రత్యేక పేకాట శిబిరంలోని ప్రధాన గేమ్. టీడీపీ నేతలే నిర్వాహకులు. స్థానిక ప్రజాప్రతినిధులు, పోలీసులకు వారం మామూళ్లు ఫిక్స్‌చేసి ఉ.10 గంటలకు ప్రారంభమయ్యే పేకాట జాతర మరుసటి రోజు తెల్లవారుజామున మూడు గంటల వరకు నిర్విరామంగా సాగుతోంది. భీమవరం సహా పశ్చిమ గోదావరిలోని ప్రధాన పట్టణాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. కాకపోతే నిర్వాహకుల స్థాయిని బట్టి సభ్యులు, ఆట స్థాయి మారడం మినహా మిగతాదంతా సేమ్ టూ సేమ్.

టీడీపీ కూటమి సర్కారు రాగానే..

పశ్చిమ గోదావరి జిల్లాలోని భీమవరం, పాలకొల్లు, నర్సాపురం, తణుకు, తాడేపల్లిగూడెంలలో పదుల సంఖ్యలో అనధికారిక శిబిరాలు.. అనుమతుల పేరిట పాలకొల్లు, భీమవరంలో క్లబ్బుల్లో పేకాట నిర్వహిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో జిల్లాలో పేకాటపై ఉక్కుపాదం మోపి క్లబ్‌లను మూసివేశారు. దీంతోపాటు జూద క్రీడలను పూర్తిగా నిషేధించి వందల కేసులు నమోదు చేసిన పరిస్థితి ఉంది. అయితే, టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే టీడీపీ నేతలే పేకాట శిబిరాల నిర్వాహకులుగా అవతారమెత్తి మూడు ముక్కలాట మొదలుకుని కనిష్టా వరకు భారీగా నిర్వహిస్తున్నారు. అంతేకాక.. ఉమ్మడి పశ్చిమ గోదావరితో పాటు కృష్ణా, తూర్పు గోదావరి జిల్లాల నుంచి కూడా పేకాటరాయుళ్లను పెద్దఎత్తున ఆహ్వానించి నిత్యం రూ.5 కోట్లకు పైగా టర్నోవర్ చేస్తూ నిర్వాహకులే నిత్యం లక్షల్లో గడిస్తున్నారు.

ఒక్కొక్కచోట ఒక్కోలా..

తణుకు మండలంలో అధికార పార్టీకి చెందిన కొందరు వ్యక్తులు ఒకరోజు పైడిపర్రులో, మరోరోజు తేతలి, ఇంకోరోజు వేల్పూరులో.. ఇలా ప్రతిరోజూ ఒక్కో ప్రాంతంలో పెట్టి ఎప్పుడూ వచ్చే వంద మంది జూదరులకు మెసేజ్‌ల ద్వారా సమాచారం ఇస్తున్నారు. ఉండి, ఆకివీడు, పాలకొల్లులో అయితే ఎంపిక చేసిన రొయ్యల చెరువుల వద్ద నిత్యం పెద్దఎత్తున జూదక్రీడ కొనసాగుతోంది. అలాగే, తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో పెదతాడేపల్లి, పెంటపాడు, రూరల్‌లో వారానికి రెండు ప్రాంతాల్లో శిబిరాలు నిర్వహిస్తున్నారు. ప్రతిచోటా ప్రజాప్రతినిధుల అండదండలు ఉండటంతో పోలీసుల దాడులు, కేసుల ఊసు లేకపోవడం గమనార్హం.

భీమవరంలో భారీస్థాయిలో స్పెషల్ శిబిరం..

భీమవరంలోని మురుగు కాల్వగట్టు సమీపంలో ఓ శిబిరం భారీస్థాయిలో సాగుతోంది. పట్టణంలోని ఓ ప్రముఖ క్లబ్‌లో సభ్యుడిగా ఉన్న వ్యక్తి నిర్వాహకుడుగా మారి ప్రత్యేక ఏర్పాట్లుచేశాడు. ఎలా అంటే.. ఉ.10 గంటల నుంచి రాత్రి 2 గంటల వరకు క్రీడ నిర్వహణ. 11 మంది సభ్యులతో మూడు కట్టలతో కనిష్టా బోర్డు.. ఏడుగురితో మరో బోర్డును ఏర్పాటుచేసి గంటకు 7–10 ఆటలు ఆడిస్తున్నారు. ఒకుకు రూ.10 వేల నుంచి రూ.50 వేల వరకు జరిగే బోర్డు అందుబాటులో పెట్టారు. ప్రధానంగా ఒకుకు రూ.20 వేలు చొప్పున.. ఫుల్ కౌంట్ పడితే రూ.1.60 లక్షలు చెల్లించే గేమ్‌కు రూ.5 లక్షలు డిపాజిట్.. మరో రూ.4.80 లక్షలు అంటే మూడు ఫుల్‌గేమ్‌ల మొత్తం వెరసి రూ.9.80 లక్షలు డిపాజిట్ చేయాల్సి ఉంటుంది. ఇక డిపాజిట్ మొత్తం కిలోమీటరు దూరంలో ఉండే మరో వ్యక్తి ప్రత్యేకంగా లాకర్లు, ఇతర జాగ్రత్తలతో నగదును సేకరించి టోకెన్లు ఇచ్చి శిబిరానికి పంపుతారు. మరో ప్రత్యేక అంశమేమిటంటే.. సదరు నిర్వాహకుడు సభ్యుడుగా ఉన్న క్లబ్‌లో గెస్ట్‌ల పేరుతో కొందరిని అక్కడి ఆటకు పంపించడం, గెలుపోటములు పూర్తయ్యాక వెళ్లే సమయంలో స్లిప్ ద్వారా వసూళ్లు, చెల్లింపులు చేస్తున్నారు. భీమవరంలోని పేకాట నిర్వహణలో సుదీర్ఘ అనుభవం ఉన్న సదరు వ్యక్తి ఒక్కో ఆటకు రూ.4 వేలు చొప్పున నిర్వహణ ఖర్చులు వసూలుచేస్తున్నాడు. ఈ క్రమంలో రోజుకు సగటున రూ.5 లక్షల నుంచి రూ.7 లక్షలు శిబిరం నిర్వాహకులకే దక్కుతోంది. వీటిల్లో పోలీసులకు, స్థానిక ప్రజాప్రతినిధికి వారం, నెలవారీలు మామూళ్లను ఖరారుచేసి ఠంఛనుగా పంపుతూ జోరుగా శిబిరం నిర్వహిస్తున్నారు. మరో విషయమేమంటే.. ఇక్కడ పేకాట కోసం వచ్చేవారికి త్రీస్టార్ హోటల్ సౌకర్యాలన్నీ కల్పిస్తున్నారు. అధికార పార్టీ ప్రజాప్రతినిధుల సన్నిహితులే పైఎత్తున చూస్తుండటంతో ఉభయ గోదావరి జిల్లాలతో పాటు కృష్ణాజిల్లా నుంచి పెద్ద ఎత్తున ఇక్కడికి వస్తున్నారు. స్థానిక ఎస్ఐ మొదలుకుని ఉన్నతాధికారుల వరకు ఈ విషయం తెలిసినా పొలిటికల్ గేమ్ పేరుతో పట్టించుకోకపోవడం గమనార్హం.

చంద్రుడు, అంగారకుడి గురించి తెలిసినంతగా మనకు సముద్రాల గురించి అవగాహన లేదు. అత్యంత స్వచ్ఛమైన, మనిషి నీడ కూడా తాకని వాతావరణాలే కాదు.. మనకు తెలియకుండా దాగి ఉన్న విలువైన వనరులు సైతం విశాలమైన సముద్రాల్లో నిక్షిప్తమై ఉండొచ్చని పరిశోధనలు చెబుతున్నాయి. సముద్రం లోపల ఉన్న ఈ విస్తారమైన ప్రాంతాలను అన్వేషించే ప్రయత్నంలో మనదేశం సాహసోపేత 'డీప్ ఓషన్ మిషన్'కు శ్రీకారం చుట్టింది. ఇటీవలే అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలోకి శుభాన్షు శుక్లాను పంపినట్టే.. సముద్ర గర్భంలోకి మనుషులను పంపే దిశగా సముద్రయాన్ ప్రాజెక్టుతో అడుగు ముందుకేసింది.

- 'డీప్ ఓషన్ మిషన్' చేపట్టిన కేంద్ర ప్రభుత్వం
- విలువైన వనరులను వెలికితీయడమే లక్ష్యం
- ఇందుకోసం మత్స్య-6000 వాహనం రెడీ
- పరిశోధనకు ముగ్గురు వెళ్లేలా రూపకల్పన

సాగర గర్భంలో.. రహస్యాల అన్వేషణ



భారత సముద్ర జలాల పరిధిలో విలువైన ఖనిజాలు, ఇంధన వనరులు, ప్రత్యేక జీవవైవిధ్యం వెలికితీయడం లక్ష్యంగా సముద్రయాన్ ప్రాజెక్టు ప్రారంభం అయింది. లోతైన సముద్ర అన్వేషణకు సంబంధించి సముద్రయాన్ ప్రాజెక్టులో భాగంగా నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓషన్ టెక్నాలజీ (ఎన్ఐఓటీ), భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) శాస్త్రవేత్తలు మత్స్య-6000 వాహనం అభివృద్ధి చేశారు. ఇటీవలే ఈ వాహనానికి కీలక వెల్డింగ్ ప్రక్రియను కూడా పూర్తి చేశారు.

- సాక్షి, స్పెషల్ డెస్క్

లక్ష్యాన్ని సాధించడానికి..: 'ప్రస్తుతం మహాసముద్రాల గురించి మనం అర్థం చేసుకున్నది కేవలం 5 శాతమే. 95 శాతం ఇప్పటికీ రహస్యంగానే ఉంది. విశాలమైన సముద్రపు అడుగుభాగాన్ని అర్థం చేసుకోవడానికి మరిన్ని అన్వేషణలు అవసరం. ఈ లక్ష్యాన్ని సాధించడానికి భారత్‌కు సముద్రయాన్ మిషన్ తోడ్పడుతుంది' అని మిషన్‌ను చేపట్టిన భారత ప్రభుత్వ భూ విజ్ఞాన శాస్త్రాల మంత్రిత్వ శాఖ భావిస్తోంది. ఈ మిషన్‌లో భాగంగా మనుషులను సముద్రమట్టానికి 6,000 మీటర్ల లోతుకు పంపుతారు. గుండ్రని సబ్‌మెర్సిబుల్ నౌక అయిన మత్స్య-6000 ద్వారా సముద్రపు లోతుల్లోకి వెళ్లి పరిశోధనలు సాగిస్తారు. నౌక వ్యాసం 2,260 మిల్లీ మీటర్లు. 80 మిల్లీ మీటర్ల మందంతో నౌక గోడ తయారైంది. టైటానియం-మిశ్రమంతో రూపొందిన గోడలు తీవ్రమైన బాహ్య ఒత్తిళ్లను, -3 డిగ్రీల సెంటీగ్రేడ్ వరకు ఉష్ణోగ్రతలను తట్టుకోగలవు.

ఇప్పటికే పలు పరీక్షలు..: సముద్రంలో జీవ, నిర్జీవ వ్యవస్థలను అంచనా వేయడానికి, లోతైన సముద్ర పర్యాటకానికి గల అవకాశాలకు కొత్త దారులు తెరుస్తుందని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. ఈ ప్రయోగం దశలవారీగా చేపట్టేలా ప్రణాళిక రచించారు. సిబ్బందితో, అలాగే సిబ్బంది లేకుండా ఈ వాహనంతో 2025 జనవరి, ఫిబ్రవరిలో పలు పరీక్షలు పూర్తి చేశారు. 500 మీటర్ల లోతుకు వెళ్లే కీలక పరీక్ష 2025 చివరి నాటికి ప్రారంభమయ్యే అవకాశం ఉంది. ఈ పరిధిలో మత్స్య-6000 వాహనం వెళ్లి రావడానికి 8 గంటల సమయం పడుతుంది. ముఖ్యమైన ఇంధన, ఖనిజ వనరులు అయిన మీథేన్, కోబాల్ట్ అన్వేషణ సైతం సాగిస్తారు.



2026 చివరినాటికి..

మత్స్య-6000 వాహనం 6,000 మీటర్ల లోతులో 12 గంటల వరకు నిరంతర కార్యకలాపాలు సాగించేలా రూపొందుతోంది. అలాగే లోతైన నీటి పరిశీలన, అన్వేషణను నిర్వహించడానికి అత్యవసర సమయాల్లో 96 గంటల వరకు పనిచేయగలిగే సామర్థ్యమూ దీని ప్రత్యేకత. దేశీయంగా అభివృద్ధి చేసిన వెయ్యికి పైగా విడి భాగాలు, వందలాది సాంకేతికతలు వాహన తయారీలో వినియోగించారు. 25 టన్నుల బరువుండే ఈ అత్యాధునిక వాహనంలో ముగ్గురు ప్రయాణించొచ్చు. దశలవారీగా పరీక్షలు పూర్తి చేసుకుని 2026 చివరినాటికి మిషన్ కార్యరూపంలోకి రానుంది. డీఆర్‌డీఓ, ఐఐటీలు, భారత నావికా దళం, మిశ్ర ధాతు నిగమ్ తదితర సంస్థలు కూడా ఈ మిషన్‌లో పాలుపంచుకున్నాయి.

రూ. 4,077 కోట్ల నిధులు..

డీప్ సీ మైనింగ్ మెషీన్ డిజైన్ సైతం పూర్తి అయింది. గత ఏడాది అండమాన్ సమీపంలో 1,173 మీటర్ల లోతుకు వెళ్లి 100 కిలోలకుపైగా కోబాల్ట్ ఆధారిత పాలీమెటాలిక్ నోడ్యూల్స్‌ను (లోహపు రాళ్లు) ఈ మెషీన్ సేకరించింది. ఈ ప్రాంతంలో 47 లక్షల టన్నుల నికెల్, 42.9 లక్షల టన్నుల కాపర్, 5.5 లక్షల టన్నుల కోబాల్ట్, 9.25 కోట్ల టన్నుల మాంగనీస్ నిల్వలు ఉన్నట్టు అంచనా వేశారు. ఇక సర్వే, అన్వేషణ కోసం పరిశోధన నౌక నిర్మించేందుకు ప్రభుత్వం ఆర్డర్ చేసింది. కేవలం ఈ నౌక కోసం రూ.1,277 కోట్లు ఖర్చు చేస్తున్నారు. సముద్ర జీవ శాస్త్ర అధ్యయనం కోసం అధునాతన మెరైన్ సెంటర్ రూ.692 కోట్లతో తమిళనాడులో ఏర్పాటుచేస్తున్నారు. కేంద్రం డీప్ ఓషన్ మిషన్‌కు 2021-2026 మధ్య రూ.4,077 కోట్లు వెచ్చించనున్నట్టు ప్రకటించింది. ఈ ఏడాది మార్చి నాటికి సుమారు రూ.1,000 కోట్లు ఖర్చు చేశారు. హిందూ మహాసముద్రంలో 75,000 చదరపు కిలోమీటర్లు, పశ్చిమ హిందూ మహాసముద్రంలో 10,000 చ.కి.మీ. పరిధిలో సర్వే, అన్వేషణ కొనసాగిస్తారు.

- మత్స్య-6000 వాహనం 6,000 మీటర్ల లోతులో 12 గంటల వరకు నిరంతర కార్యకలాపాలు సాగించేలా రూపొందుతోంది.
- హిందూ మహాసముద్రంలో 75,000 చదరపు కిలోమీటర్లు, పశ్చిమ హిందూ మహాసముద్రంలో 10,000 చదరపు కిలోమీటర్ల పరిధిలో సర్వే, అన్వేషణ చేపడతారు.
- సిబ్బందితో, అలాగే సిబ్బంది లేకుండా ఈ వాహనంతో 2025 జనవరి 22 నుంచి ఫిబ్రవరి 14 వరకు పలు పరీక్షలు పూర్తి చేశారు.
- అండమాన్ సమీపంలో 47 లక్షల టన్నుల నికెల్, 42.9 లక్షల టన్నుల కాపర్, 5.5 లక్షల టన్నుల కోబాల్ట్, 9.25 కోట్ల టన్నుల మాంగనీస్ నిల్వలు ఉన్నట్టు ప్రాథమికంగా అంచనా వేశారు.
- దశలవారీగా పరీక్షలు పూర్తి చేసుకుని 2026 చివరినాటికి మిషన్ కార్యరూపంలోకి రానుంది.

ఆర్టీసీ స్థలం లీజు జీఓ రద్దు చేయకపోతే

ఉద్యమం ఉద్ధృతం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఆర్టీసీ స్థలాన్ని లులూ షాపింగ్ మాల్‌కు కేటాయిస్తూ ప్రభుత్వం ఇచ్చిన జీఓ 137ను రద్దు చేయకపోతే ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు స్పష్టం చేశారు. మంగళవారం ఎంప్లాయీస్ యూనియన్ ఏలూరు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కపర్ది భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రీజనల్ కార్యదర్శి బీ. రాంబాబు మాట్లాడుతూ విజయవాడ నగరం నడిబొడ్డున ఉన్న ఆర్టీసీ గవర్నర్ పేట 1 - 2 డిపోలు, పాత బస్సుస్టాండ్‌కు సంబంధించిన 4-15 ఎకరాల స్థలం సుమారు రూ. 400 కోట్లు విలువ చేస్తుందన్నారు. ఈ స్థలాన్ని లులూ షాపింగ్ మాల్‌కు ప్రభుత్వం కట్టబెట్టి దశబ్దాలుగా ప్రజలకు రవాణా సౌకర్యాలు అందిస్తూ, అందుబాటులో ఉన్న రెండు డిపోలలోని 200 బస్సులను 1100 మంది ఉద్యోగులను ప్రజలకు దూరం చేస్తోందన్నారు. ఆర్టీసీ స్థలాన్ని బడా పారిశ్రామికవేత్తకు కట్ట బెట్టిన జీవోను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ గవర్నర్ పేట డిపోలకు 1- 2, పాత బస్టాండ్ స్థలాన్ని 1959లో అప్పటి ప్రభుత్వం నిర్దేశించిన ధర గజం రూ.16లతో సుమారు నాలుగు లక్షల ఆరు వేల రూపాయలకు ఆర్టీసీ యాజమాన్యం కొనుగోలు చేసిందని, ఈ స్థలాన్ని ఇప్పటి ప్రభుత్వ పెద్దలు ప్రైవేటు వ్యాపారవేత్తలకు ధారాదత్తం చేసేందుకు తీసుకున్న నిర్ణయాలు వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లులూ షాపింగ్ మాల్‌ను నగర శివారు ప్రాంతాలలో ఏర్పాటు చేస్తే ఆ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని, అలా కాకుండా నగర నడిబొడ్డున ప్రజలకు అందుబాటులోని అభివృద్ధి చెందిన పాత బస్టాండ్ స్థలం ఇవ్వడం తగదన్నారు. లక్షల మంది ప్రయాణీకులకు సేవలందిస్తున్న ఆర్టీసీ స్థలాలను ప్రైవేట్ వ్యక్తులకు ధారాదత్తం చేయడమంటే సంస్థను ప్రైవేట్ పరం చేయడమేనని ఉద్యోగులు భావిస్తున్నందున ఉద్యోగులంతా ఒక్కటై ప్రజా సంఘాలతో కలసి ఉద్యమాల బాట పట్టక ముందే ప్రభుత్వం 137 జీఓ రద్దు చేయాలని కోరారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావాలని ఉద్యోగులందరితో పాటు ఆర్టీసి ఉద్యోగులమంతా కృషి చేశామని అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా సరే ఉద్యగులకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయడం లేయకపోగా దశాబ్దాల చరిత్ర కలిగిన ఆర్టీసీని నిర్వీర్యం చేయాలని చూడడం చాలా బాధాకరమన్నారు. ప్రజా రవాణా సంస్థ ఆర్టీసీని కాపాడు కొనేందుకు రాష్ట్ర నాయకత్వం నుంచి ఏ పోరాటాలకు పిలుపు వచ్చినా సిద్ధంగా ఉంటామన్నారు. ఆర్టీసీలోని అన్ని సంఘాలు ఉద్యమంలో భాగస్వామ్యం కావాలని, ప్రజా రవాణా సంస ఆస్తులు ప్రైవేటు వ్యాపార వేత్తలకు ధారాదత్తం చేస్తున్న చర్యలను ప్రజలంతా ఖండించాలని కోరారు.



శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల: తిరుమలలో మంగళవారం రద్దీ మోస్తరుగా ఉంది. శ్రీవారి సర్వదర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. వైకుంఠ క్యూ కాంప్లెక్స్‌లో 20 కంపార్ట్‌మెంట్లలో భక్తులు వేచి ఉన్నారు. సోమవారం అర్ధరాత్రి వరకు 69,928 మంది భక్తులు స్వామివారిని దర్శించుకోగా 29,297 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.21 కోట్లు సమర్పించారు.

కార్వేటినగరంలో తొలిసారిగా వరలక్ష్మీ వ్రతం

తిరుపతి అన్నమయ్యసర్కిల్: చిత్తూరు జిల్లా కార్వేటినగరంలోని రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో కొలువుతీరిన శ్రీమహాలక్ష్మి అమ్మవారి సన్నిధిలో తొలిసారిగా వరలక్ష్మీ వ్రతం ఈ నెల 8 తేదీన ఉదయం 10 నుంచి 12 గంటల వరకు నిర్వహించనున్నారు. ఈ మేరకు మంగళవారం టీటీడీ ముఖ్య ప్రజా సంబంధాల అధికారి పత్రికా ప్రకటన విడుదల చేశారు. వరలక్ష్మీ వ్రతంలో పాల్గొనదలచిన భక్తులు (ఇద్దరికి) రూ.500 చెల్లించి ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్‌లో ఆలయం వద్ద టికెట్లు పొందవచ్చు. వ్రతంలో పాల్గొన్న గృహస్తులకు ఉత్తరీయం, రవిక, లడ్డూ, అప్పం, బ్యాగ్, కుంకుమ, ప్రసాదం బహుమానంగా అందజేయనున్నారు.

6 నుంచి తెప్పోత్సవాలు

కార్వేటినగరంలోని రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో ఈ నెల 6 నుంచి 8వ తేదీ వరకు తెప్పోత్సవాలు జరుగనున్నాయి. ఇందులో భాగంగా మొదటి రోజు 6వ తేదీన శ్రీ సీతాలక్ష్మణ సమేత శ్రీ కోదండరామస్వామి, 7, 8వ తేదీల్లో రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలస్వామివారు సాయంత్రం 6.30 నుంచి రాత్రి 8 గంటల వరకు తెప్పలపై విహరించి భక్తులకు దర్శనమిస్తారు. ఈ మూడు రోజులు ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకు స్నపన తిరుమంజనం, సాయంత్రం 5 నుంచి 6.30 గంటల వరకు తిరువీధి ఉత్సవం నిర్వహిస్తారు.

సాగుబడి

ఆశ్లేష కార్తె
ఆగస్ట్ 16 వరకు

అద్భుత పంట అవిసె పంట.

అవిసె గింజలను ఆంగ్లంలో 'ఫ్లాక్స్ సీడ్స్' అంటారు.
వంట నూనె వాణిజ్య వర్గాల్లో అవిసె నూనెకు 'లిన్ సీడ్ ఆయిల్' అని పేరు.
ఈ నూనె చాలా ఆరోగ్యదాయకం.
అవిసె మొక్క కాండం నుంచి తీసే నార/పీచు (లినెన్)తో
తయారైన మెత్తని వస్త్రాలకు మధ్యతరగతి, ఉన్నత వర్గాల మార్కెట్లలో
దేశ విదేశాల్లో మంచి గిరాకీ ఉంది. వీటన్నిటికీ మించి..
అవిసె గింజలు పోషకాల పుట్టలు.
ఈ గింజల పిండితో చేసిన రొట్టెలు, ఇతర వంటకాలు
అద్భుత పోషక విలువలతో కూడి ఉండి ఆరోగ్యాన్ని అందిస్తాయి.
ముఖ్యంగా, పిండి పదార్థాలు అతి తక్కువగా తీసుకునే
'లో కార్బ్ హై/హెల్దీ ఫ్యాట్' ఆహార పద్ధతిని పాటించే వారికి
గోధుమలు, చిరుధాన్యాలకు అవిసె గింజల రొట్టె అద్భుత ప్రత్యామ్నాయం!..
అవిసె పంట కొత్తదేమీ కాదు. ప్రపంచవ్యాప్తంగా అనాదిగా ఉన్నదే.
అంతేకాక, ఎంతో ఆరోగ్యదాయకమైన వర్షాధార పంటే అయినా,
మన ప్రజల్లో చాలా మందికి దీని గురించి అంతగా తెలియకపోవటం ఆశ్చర్యకరం!

అవిసె... అద్భుతః

అవిసె.. ఈ పేరుతో రెండు పంటలు ఉన్నాయి.

మొదటిది: సన్నగా, పొడవుగా, గోగు మొక్క మాదిరిగా పది అడుగులు పెరిగే రకం ఒకటి. దీని శాస్త్రీయ నామం 'సెస్బానియా గ్రాండిఫ్లోరా'. ఇది తమలపాకు తోటల్లో కనిపిస్తుంది. తమలపాకు తీగలను ఈ మొక్కలకే పాకిస్తారు. ఈ చెట్టు ఎర్ర /తెల్ల పూలు, కాయలు ఔషధ గుణాలున్న తినదగినవి.

రెండోది: ఇప్పుడు మనం తెలుసుకోబోతున్న రకం. దీని శాస్త్రీయ నామం 'లినమ్ యుసిటాటిస్సిమం'. ఇది చిన్న పొద వంటి మొక్క. దీని కాయలు ధనియాల మాదిరిగా చిన్నగా ఉంటాయి. దాన్ని చిదిపితే లోపల కాఫీ రంగులో సన్నని, చిన్న గింజలు ఉంటాయి. అవే అవిసె గింజలు. మంచి పోషక విలువలున్నవి. ఇది నూనె గింజ పంటగా ప్రసిద్ధి.

అవిసెను మానవ సంక్షేమం కోసం సహజ ఉత్పత్తులనిచ్చే విలువైన ఆర్థిక పంటగా శాస్త్రవేత్తలు అభివర్ణిస్తున్నారు. వాణిజ్యపరంగా ముఖ్యమైన నార/ఫైబర్, నూనెను ఉత్పత్తి చేసే మొక్కల జాతికి చెందినది. అవిసె సాగుకు సుదీర్ఘ చరిత్ర ఉంది. వివిధ పురాతన నాగరికతల పత్రాలను పరిశీలిస్తే ఇది అర్థమవుతోంది. అవిసె సాగు కాలక్రమేణా ప్రపంచవ్యాప్తంగా వ్యాపించింది. ఆరోగ్యాన్ని మెరుగుపరిచే లినోలెనిక్ ఆమ్లం, లిగ్నాన్లు సహా బహుళ అసంతృప్త కొవ్వు ఆమ్లాలు అధికంగా కలిగి ఉన్నందున అవిసె గింజలు, అవిసె నూనె గుర్తింపు పొందాయి. అవిసె నార వస్త్ర పరిశ్రమలో ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. అంతర్జాతీయ వాణిజ్యంలో గుర్తింపు ఉన్న అవిసె పంటపై పరిశోధనలు ఇటీవల ఊపందుకున్నాయి. మాలిక్యులర్ జెనెటిక్స్, బ్రీడింగ్, జెనోమిక్స్, జీనోమ్ ఎడిటింగ్ సహా అత్యాధునిక జన్యు ఇంజనీరింగ్ పద్ధతులలో పరిశోధనలు విస్తృతం అవుతున్నాయి. పరిశోధనలో పురోగతి, అవిసె సహజ ఉత్పత్తుల ఆరోగ్య ప్రయోజనాలపై ప్రజల్లో పెరుగుతున్న అవగాహన రైతుల ఆర్థికాభివృద్ధికి, దేశ ఆర్థికాభివృద్ధికి కూడా దోహదపడవచ్చని నిపుణుల అంచనా.

పుట్టిల్లు ఆగ్నేయాసియా...

పది వేల ఏళ్ల క్రితం మానవులు స్థిర నివాసం ఏర్పరచుకొని వ్యవసాయం మొదలు పెట్టిన అవిసెను వేలాది ఏళ్ల క్రితమే ఆహార (నూనె గింజ) పంటగా, పశుగ్రాస పంటగా, నార పంటగా సాగు చేయటం ప్రారంభించినట్లు చారిత్రక ఆధారాలున్నాయి. నార కోసం పొడుగు పంట, నూనెగింజల కోసం పొట్టి రకం అవిసె పంటలు అప్పటి నుంచే ఉన్నాయి. అధిక నాణ్యతతో కూడిన వస్త్రాల నేతకు పనికొచ్చే అవెసె నార 5,700 ఏళ్ల క్రితం నుంచే వాడుకలో ఉంది. సింథటిక్ వస్త్రాల ఉత్పత్తి పెరిగినప్పటి నుంచి లినిన్ వాడకం మందగించింది. అయితే, పర్యావరణహితమైన సుస్థిర సహజ ఉత్పత్తిగా లినెన్ వస్త్రాలకు ఆదరణ ఇటీవల కాలంలో పెరుగుతోంది. వస్త్రోత్పత్తితో పాటు ఫ్లాక్స్ ఫైబర్‌ను ఇన్సులేషన్, కంపోజిట్స్, కరెన్సీ వంటి స్పెషాలిటీ పేపరు, జియోటెక్స్టైల్స్‌లోనూ వాడుతున్నారు. దీంతో ఈ పంటను తిరిగి విస్తృతంగా చేపట్టడానికి అవకాశాలు మెండుగా ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు.

ఫ్లాక్స్ సీడ్స్ ఆయిల్ ఇటు వంట నూనెగా అటు పారిశ్రామిక ప్రయోజనాలున్న నూనెగా ప్రసిద్ధి పొందింది. లిన్‌సీడ్ ఆయిల్, ఫ్లాక్స్‌సీడ్స్‌లో ఆరోగ్యాన్ని పెంపొందించే లినోలెనిక్ ఆసిడ్ (ఎఎల్ఎ), ప్రొటీన్, డైటరీ ఫైబర్ తోపాటు పాలీఅన్‌శాచ్యురేటెడ్ ఫ్యాటీ ఆసిడ్స్ (పీయూఎఫ్ఏలు) పుష్కలంగా ఉన్నాయి. లిన్‌సీడ్ ఆయిల్‌కు త్వరగా తడారిపోయే స్వభావం ఉండటంతో రంగులు, ప్రింటర్స్ ఇంక్, వార్నీషులు, లైనోలియం, సబ్బులు వంటి పారిశ్రామిక ఉత్పత్తుల్లోనూ వాడుతున్నారు. ఫ్లాక్స్‌సీడ్స్‌కు పోషకవంతమైన పెంపుడు పక్షుల ఆహారంగా పేరుంది. ఒక్క మాటలో చెప్పుకోవాలంటే.. అవిసె ఉత్పత్తులకు ఆరోగ్యదాయకమైన, పర్యావరణహితమైన వైవిధ్యభరితమైన ప్రయోజనాలు ఉన్నాయి.



(ఎ) పూత దశలో ఉన్న అవిసె మొక్క
(బి) అవిసె వంగడాల్లో వివిధ పూల రంగుల వైవిధ్యం
(సి-డి) పరిపక్వ దశలో అవిసె కాయలు, విత్తనాలు
(ఇ) కాండం నుంచి సేకరించిన అవిసె ఫైబర్ (లినెన్ నార)

అడవి జాతి అవిసె పుట్టింది ఎక్కడో స్పష్టంగా తెలియదు. అయితే, మెడిటెర్రేనియన్, ఆగ్నేయాసియాల మధ్య ప్రాంతంలో పుట్టింది. తొలుత ఈజిప్టు, పాలస్తీనా, ఇజ్రాయెల్, సిరియా, తుర్కియే, జోర్డాన్ ప్రాంతంలో సాగైంది. తదనంతరం క్రమంగా ప్రపంచవ్యాప్తమైంది. తుర్కియేలో క్రీస్తు పూర్వం 6 వేల ఏళ్ల నాటి పురావస్తు అవశేషాల్లో అవిసె నార కనిపించింది. లినిన్/లైనిన్ వస్త్రంగా ఇప్పుడు ప్రాచుర్యంలోకి వస్తున్న ఫైబరే పత్తి కన్నా అతి ప్రాచీన పంటని పరిశోధకులు చెబుతున్నారు. క్రీస్తు పూర్వం 5 వేల ఏళ్ల క్రితం ఈజిప్టులో వస్త్రాలు, వస్తువులు, మమ్మీలకు చుట్టిన బ్యాండేజీలలో అవెసె నార వాడారు. తదనంతర కాలంలో స్కాటాండ్, పర్షియా, భారత్, చైనా తదితర దేశాల్లో వర్తకులు అవెసె వస్త్రాలు, ఇతర ఉత్పత్తుల్ని విక్రయించారు. జర్మనీ, రష్యాల నుంచి ముడి అవిసె నారను తెప్పించి ఇంగ్లండ్, ఐర్లాండ్, స్కాట్లండ్‌లలో లైనెన్ వస్త్ర పరిశ్రమలు వస్త్రాలు తయారు చేశాయి. 'స్వచ్ఛత'కు ప్రతీకగా ఈజిప్షియన్, క్రిస్టియన్ తదితర నాగరికతల్లో దేవుళ్లు, దేవతలు అవిసె వస్త్రాలను వేసుకున్నారట. అలెగ్జాండర్ ద గ్రేట్ కూడా లైనెన్ వస్త్రాలను వేసుకున్నారట. మధ్యయుగంలో ఫ్రాన్స్, నెదర్లాండ్స్, బెల్జియంలలో ఇంటింటికీ అవిసె వస్త్రాలు, దుప్పట్లు ఎవరికి వారు నేసుకునేవారట. ఫ్లాక్స్ స్పిన్నింగ్ యంత్రం కనుగొనటంతో దీని సాగు తామరతంపరగా విస్తరించింది. అయితే తదనంతర కాలంలో పత్తి పంట అందుబాటులోకి వచ్చాక దీని ప్రాభవం తగ్గిపోయింది. ఏతావాతా చెప్పేదేమంటే.. అవిసె పంటకు అనదిగా ఘన కీర్తి ఉంది.



సాగు విస్తీర్ణం ఆసియాలోనే ఎక్కువ

ఐక్యరాజ్యసమితికి చెందిన ఆహార వ్యవసాయ సంస్థ (ఎఫ్ఏవో) 2021 నాటి గణాంకాల ప్రకారం.. ప్రపంచవ్యాప్తంగా 41.4 లక్షల హెక్టారలో 33.4 లక్షల టన్నుల అవిసె గింజలు పండుతున్నాయి. 2017-21 మధ్యకాలంలో సాగు విస్తీర్ణం ఆసియాలో 45.7%, యూరప్‌లో 30.4%, అమెరికాలో 20.2% విస్తరించి ఉంది. కజికిస్తాన్, రష్యా, కెనడా, చైనా, భారత్, అమెరికా, ఇథియోపియా, ఫ్రాన్స్, యూకేలలో లిన్‌సీడ్స్ సాగు విస్తారంగా జరుగుతోంది. అదేవిధంగా, ప్రపంచవ్యాప్తంగా 2 లక్షల హెక్టార్లలో 8 మెట్రిక్ టన్నుల ఫ్లాక్స్ ఫైబర్ దిగుబడి వస్తోంది. అవిసె నారను 96.6% మేరకు యూరోపియన్ దేశాల్లోనే ఉంది. ఫ్రాన్స్, బెల్జియం, బెలారస్, రష్యా, యూకేలలో ఎక్కువ. ఆసియాలో అవిసె నార సాగు కేవలం 2% మాత్రమే. ఇందులో చైనాదే సింహభాగం. భారత్‌లో అవిసె నార సాగు బాగా తక్కువ. అవిసె గింజల ఉత్పత్తి గత ఐదేళ్లలో సగటున ఏటా 2.4 లక్షల హెక్టార్లలో 1.4 లక్షల మెట్రిక్ టన్నుల మేరకు జరిగింది. అయితే, 1961-65 నాటితో (19.4 లక్షల హెక్టార్లలో 4.3 లక్షల టన్నుల ఉత్పత్తితో) పోల్చితే ఇది బాగా తక్కువ.

అవిసె పంట 10-25 డిగ్రీల సెల్షియస్ ఉష్ణోగ్రతల మధ్య, 155-200 ఎం.ఎం. వార్షిక వర్షపాతం, 60-65% గాలిలో తేమ ఉన్న చోట్ల బాగా పెరుగుతుంది. మన దేశంలో అక్టోబర్ చివరి నుంచి నవంబర్ మధ్య వరకు సీతాకాలపు పంటగా ముఖ్యంగా కొండ ప్రాంతాల్లో సాగు చేస్తారు. నీరు నిలవని ఒండ్రు నేలల్లో, 5.5-6 పిహెచ్ ఉండే నేలల్లో పెరుగుతుంది.

అవిసె గింజల ఉత్పత్తికి భారత్ అనుకూలం

అవిసె నార ఉత్పత్తి కన్నా అవిసె గింజల ఉత్పత్తికి మన దేశ వాతావరణం అనుకూలమైనదని ఐసీఏఆర్-సీఆర్ఐజేఏఎఫ్ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. యూరప్ దేశాల నుంచి అవిసె గింజలను దిగుమతి చేసుకోవటం వల్ల విదేశీ మారకద్రవ్యాన్ని మన దేశం నష్టపోతోంది. ఓఈసీ గణాంకాల ప్రకారం భారత్ ఫ్లాక్స్ ఫైబర్ దిగుమతులు 2016లో 3.15 కోట్ల డాలర్ల నుంచి 2021 నాటికి 9.45 కోట్ల డాలర్లకు పెరిగాయి. ఫ్లాక్స్ ఫైబర్‌ను మనం పండిస్తున్న దానికీ, మన అవసరాలకు పెద్ద అగాధం ఉంది. అంటే, ఫ్లాక్స్ ఫైబర్ సాగును దేశీయంగా పెంచుకోవటానికి గల అవకాశాలను ఇది సూచిస్తోంది. అయితే, గింజల కోసం ఒక పంట, నార కోసం మరో పంట కాకుండా.. రెండిటి కోసమూ ఒకే పంటను పండించుకుంటే ఈ కొరతను తీర్చుకోవటం వీలవుతుంది. భారతీయ పరిస్థితులకు తగిన మేలైన నార అవిసె రకాలను అభివృద్ధి చేసుకోవటం ద్వారా ఫ్లాక్స్ ఫైబర్ ఉత్పత్తిలో మనం స్వయంసమృద్ధి సాధించవచ్చు. ఈ సవాలును అధిగమించేందుకు అనువైన వంగడాలను 2015లోనే జెఆర్ఎఫ్-2 (త్రైర)ను ఐసీఏఆర్-సీఆర్ఐజేఏఎఫ్ శాస్త్రవేత్తలు విడుదల చేశారు. సాగు పెంచాలంటే చెయ్యాల్సిన మరో పని ఏమిటంటే.. మన దేశంలో వేడిగా, తేమగా ఉండే వాతావరణాల్లో చక్కగా పెరిగే అవిసె నార పంట సాగుకు అనువైన వంగడాలను రూపొందించుకోవటం ముఖ్యం.

రైతులు తొలిగా సాగు చేసిన పంటల్లో ఒకటైన అవిసెకు ఆరోగ్య ప్రయోజనాలు చాలా మెండుగా ఉన్నాయి. ఈ గింజలతో వంట నూనె తయారు చేసుకోవచ్చు. ఔషధ గుణాలతో కూడిన ఆహారోత్పత్తులు చేసుకోవచ్చు. గానుగ పిండి పశు దాణాగా పనికొస్తుంది. కాండం పీచుతో వస్త్రాలను తయారు చేసుకోవచ్చు. ప్రపంచ అవిసె ఉత్పత్తి గతంలో కన్నా క్షీణించినప్పటికీ.. దీని సహజ ఆరోగ్యకర ఉత్పత్తుల ప్రాముఖ్యత, ఆరోగ్య ప్రయోజనాలపై పెరిగిన అవగాహన వంటి కారణాల రీత్యా అవిసె పంట తిరిగి పుంజుకోవడానికి అవకాశాలున్నాయి. ఉన్నతమైన అవిసె వంగడాలను అభివృద్ధి చేయడానికి అధునాతన బయోటెక్నాలజీ పద్ధతులను శాస్త్రవేత్తలు ఉపయోగిస్తున్నారు. రాబోయే సంవత్సరాల్లో అవిసె 'అద్భుత పంట'గా తన ఖ్యాతిని మరింత మిన్నగా కొనసాగిస్తుందని ఆశిద్దాం.

అవిసె గింజల్లో... 35% నూనె, 20% ప్రొటీన్..!

అవిసె గింజలను సూపర్ ఫుడ్‌గా, ఫంక్షనల్ ఫుడ్‌గా చెబుతారు. అంటే.. ఈ గింజలు పోషకాహారంగా మాత్రమే కాకుండా ఔషధ గుణాలు కలిగి ఉండి ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయన్న మాట. సాధారణ ధాన్యాలు కేవలం ఆకలిని తీర్చటానికే పరిమితమవుతాయి. భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి (ఐసీఏఆర్) అనుబంధ సంస్థ పశ్చిమబెంగాల్ బారక్‌పూర్‌లోని కేంద్రీయ జనపనార, ఇతర నార ఉత్పత్తుల పరిశోధనా సంస్థ (ఐసీఏఆర్-సీఆర్ఐజేఏఎఫ్) శాస్త్రవేత్తల సమాచారం ప్రకారం అవిసె గింజల్లో పోషక, ఔషధ విలువలు ఇలా ఉన్నాయి: అవిసె గింజల్లో 35-43% కొవ్వు ఆమ్లాలు, 18-21% మాంసకృత్తులు, 25-28% డయటరీ ఫైబర్, 1-2% పిండిపదార్థాలు ఉంటాయి. ఒమెగా 3 కొవ్వు ఆమ్లం, ఎఎల్ఎ, లినోలీక్ ఆమ్లం(ఎల్ఎ), ఎసెన్షియల్ విటమిన్లు, అమినో ఆమ్లాలు, స్థూల-సూక్ష్మ మూలకాలు, లిగ్నాన్లు, ఫ్లావనాయిడ్లు, యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. అత్యధిక మొత్తంలో పాలీఅన్‌శాచ్యురేటెడ్ ఫ్యాటీ ఆమ్లాలు (పీయూఎఫ్ఏలు), ముఖ్యంగా ఎఎల్ఎలు, ఉంటాయి కాబట్టి అవిసె గింజలు ఆరోగ్యదాయకమైన అనుబంధాహారంగా ప్రాచుర్యం పొందాయి.. ఎఎల్ఎ, లిగ్నాన్లు పుష్కలంగా ఉండటం మూలంగా అవిసె గింజలు గుండెకు మేలు చేస్తాయి. రక్తపోటును తగ్గిస్తాయి. టైప్ 2 డయాబెటిస్ రోగుల్లో ఫాస్టింగ్ గ్లూకోజ్ స్థాయిలను, ఇన్సులిన్ నిరోధకతను తగ్గిస్తాయి. అవిసె గింజల్లోని యాంటీఆక్సిడెంట్లు కేన్సర్‌ను నిరోధిస్తాయి. మెనోపాజ్ ఇబ్బందుల నుంచి ఉపశమనం కలిగిస్తాయి. మలబద్ధకం, మానసిక అలసటను తగ్గిస్తాయి. చర్మ ఆరోగ్యాన్ని పెంపొందిస్తాయి. గాయాలను త్వరగా మానేలా చేస్తాయి. అవిసె గింజల పిండిని అనేక అనారోగ్యాలను తగ్గించడానికి అనాదిగా వాడుతున్నారు. అయితే, శ్యానోజెనిక్ గ్లైకోసైడ్స్, ట్రిప్సిన్ ఇన్‌హిబిటర్స్, ఫైటిక్ ఆసిడ్ వంటి యాంటీ న్యూట్రియంట్లు ఉన్నప్పటికీ.. మొత్తంగా చూస్తే అవిసె గింజలను ఆహారంలో భాగం చేసుకుంటే ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు నెరవేరతాయి. అందువల్లనే అవిసె గింజలు ఔషధగుణాలున్న పోషక గింజలుగా ప్రసిద్ధి పొందుతున్నాయి.

35% నూనె
35-43% కొవ్వు ఆమ్లాలు
18-21% మాంస కృత్తులు
25-28% డయటరీ ఫైబర్
1-2% పిండి పదార్థాలు
20% ప్రొటీన్

134 కోట్ల డాలర్ల మార్కెట్

అబ్జర్వేటరీ ఆఫ్ ఎకనామిక్ కాంప్లెక్సిటీ 2021 గణాంకాల ప్రకారం ప్రపంచవ్యాప్తంగా 134 కోట్ల డాలర్ల లిన్‌సీడ్ వాణిజ్యం జరిగింది. రష్యా, కెనడా, కజకిస్తాన్ ఎగుమతిలో ముందంజలో ఉన్నాయి. బెల్జియం, చైనా, అమెరికా ఎక్కువగా దిగుమతి చేసుకున్నాయి. 2021లో మన దేశం 1.35 కోట్ల డాలర్ల అవిసె గింజలను ఎగుమతి చేసింది. ప్రపంచ మార్కెట్‌లో ఇది 1%. అదే సంవత్సరం 1.53 లక్షల డాలర్ల విలువైన అవిసె గింజలను విదేశాల నుంచి మనం దిగుమతి చేసుకున్నాం. 2021లో 98.5 కోట్ల డాలర్ల ముడి అవిసె నార వాణిజ్యం జరిగింది. ఫ్రాన్స్, బెల్జియం, అమెరికా, బెలారస్ ఎక్కువగా ఎగుమతి చేశాయి. చైనా, బెల్జియం, భారత్ ఎక్కువగా దిగుమతి చేసుకున్నాయి.

నిర్వహణ:
పంతంగి రాంబాబు
సాక్షి సాగుబడి డెస్క్

సాక్షి ప్లస్
బుధవారం । 6-8-2025

ఒబెన్ ఎలక్ట్రిక్ నుంచి కొత్త మోడల్



- 'రోర్ ఈజెడ్ సిగ్మా' పేరుతో విడుదల
- సింగిల్ చార్జింగ్‌తో 175 కిలో మీటర్ల ప్రయాణం

బెంగళూరు: ఒబెన్ ఎలక్ట్రిక్ సంస్థ మోటార్ సైకిల్ విభాగంలో 'రోర్ ఈజెడ్ సిగ్మా' పేరుతో కొత్త మోడల్‌ను మార్కెట్లోకి విడుదల చేసింది. ఈ ఎలక్ట్రిక్ మోటార్ బైక్ రెండు వేరియంట్లలో లభిస్తుంది. 3.4 కేడబ్ల్యూహెచ్ బ్యాటరీ సామర్థ్యం ఉన్న వేరియంట్ ధర రూ.1.27 లక్షలు, 4.4 కేడబ్ల్యూహెచ్ సామర్థ్యం ఉన్న వేరియంట్ ధర రూ.1.37 లక్షలుగా ఉంది. రూ.2,999 టోకెన్ అమౌంట్‌ను చెల్లించి, బుక్ చేసుకోవచ్చు. డెలివరీలు ఆగస్టు 15 నుంచి మొదలవుతాయి. బ్రాండ్ అభివృద్ధి చేసిన ఎల్ఎఫ్‌పీ బ్యాటరీ టెక్నాలజీను ఇందులో ఉపయోగించారు. ఒకసారి పూర్తి చార్జింగ్‌తో 175 కిమీ వరకు ప్రయాణించవచ్చు. 3.3 సెకన్లలో 0 నుంచి 40 కి.మీ.ల వేగాన్ని అందుకుంటుంది. రెండు వేరియంట్‌ల గరిష్ఠ వేగం 95 కిలోమీటర్లు. గంటన్నరలో 80% వరకు చార్జ్ అవుతుంది.

భారత ఆర్థిక మూలాలు పటిష్ఠం

- వృద్ధి రేటు గరిష్ఠంగా 6.7 శాతం
- దేశీయంగా డిమాండ్ స్థిరం
- అంతర్జాతీయంగా పెరుగుతున్న అవకాశాలు
- డెలాయిట్ ఇండియా అంచనా



న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో భారత ఆర్థిక వ్యవస్థ బలమైన పనితీరు నమోదు చేస్తుందని డెలాయిట్ ఇండియా అంచనా వేసింది. దేశీ ఆర్థిక మూలాలు పటిష్ఠంగా ఉన్నాయని, అంతర్జాతీయంగానూ అవకాశాలు విస్తరిస్తున్నాయని చెబుతూ.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో (2025–26) జీడీపీ వృద్ధి 6.4–6.7 శాతం వరకు నమోదు కావొచ్చని తెలిపింది. దేశీ డిమాండ్ బలంగా కొనసాగుతుండడం, ద్రవ్యోల్బణం దిగిరావడాన్ని సానుకూలతలుగా పేర్కొంది. అంతర్జాతీయంగా వాణిజ్య అవకాశాలను పర్యవేక్షిస్తూ.. భౌగోళికపరమైన అనిశ్చితులకు సన్నద్ధంగా ఉండాలని సూచించింది. యూకేతో వాణిజ్య ఒప్పందానికితోడు అమెరికాతో వాణిజ్య ఒప్పందం కోసం చర్చలు కొనసాగుతుండడం, ఐరోపా సమాఖ్యతో వాణిజ్య ఒప్పందం ఈ ఏడాది చివరికి సాకారమయ్యే అవకాశాలు.. ఇవన్నీ భారత వాణిజ్య అవకాశాలను విస్తృతం చేస్తాయని, అధిక ఆదాయం, ఉద్యోగాలు, మార్కెట్ అవకాశాలను, దేశీ డిమాండ్‌ను పెంచుతాయని వివరించింది. గత ఆర్థిక సంవత్సరంలో (2024–25) దేశ జీడీపీ వృద్ధి 6.5 శాతంగా ఉండడం గమనార్హం. అంతర్జాతీయంగా ఆర్థిక కల్లోలిత వాతావరణంలోనూ భారత ఆర్థిక వ్యవస్థ నిలకడగా ఉండడాన్ని ప్రత్యేకమైనదిగా ప్రస్తావించింది. పెద్ద సంఖ్యలో వినియోగదారులు, చౌక మానవ వనరులు ఉండడాన్ని సానుకూలతలుగా డెలాయిట్ ఇండియా ఆర్థికవేత్త రుమ్కి మజుందార్ పేర్కొన్నారు. అంతర్జాతీయంగా వాణిజ్య అవకాశాలను పెంచుకునేందుకు భారత్ వ్యూహాత్మక అడుగులు వేస్తున్నట్టు డెలాయిట్ ఇండియా తెలిపింది. ఇటీవలి వాణిజ్య ఒప్పందాలను వ్యూహాత్మకమైనవిగా అభివర్ణించింది. ఏఐ, డిజిటల్ పరివర్తన, ఆవిష్కరణల ఆధారిత స్టార్టప్ విభాగాల్లో సహకారాన్ని ఈ ఒప్పందాలు మరింత బలోపేతం చేస్తాయని విశ్లేషించింది. కాకపోతే ఇటీవలి చోటు చేసుకున్న ప్రాంతీయ భౌగోళిక ఉద్రిక్తతలు, కీలక ఖనిజాలు, ఫర్టిలైజర్స్‌పై ఆంక్షలు వంటివి వృద్ధి అవకాలను ప్రభావితం చేస్తాయని తెలిపింది.

ఐపీవోకు టాటా క్యాపిటల్ రెడీ

సెబీకి అప్‌డేటెడ్ ప్రాస్పెక్టస్ దాఖలు



న్యూఢిల్లీ: టాటా గ్రూప్ ఎన్‌బీఎఫ్‌సీ దిగ్గజం టాటా క్యాపిటల్ పబ్లిక్ ఇష్యూ బాటలో మరో ముందడుగు వేసింది. ఇందుకు అనుగుణంగా క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీకి తాజాగా అప్‌డేటెడ్ ప్రాస్పెక్టస్ దాఖలు చేసింది. తద్వారా 200 కోట్ల డాలర్లు(రూ. 17,200 కోట్లు) సమీకరించే యోచనలో ఉన్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. వెరసి కంపెనీ విలువ 11 బిలియన్ డాలర్లు(రూ. 94,600 కోట్లు)గా మదింపు చేశాయి. ప్రాస్పెక్టస్ ప్రకారం కంపెనీ మొత్తం 47.58 కోట్ల షేర్లను విక్రయానికి ఉంచనుంది. వీటిలో 21 కోట్ల షేర్లను కొత్తగా జారీ చేయనుండగా.. 26.58 కోట్ల షేర్లను కంపెనీ ప్రధాన ప్రమోటర్ టాటా సన్స్, ఇంటర్నేషనల్ ఫైనాన్స్ కార్పొరేషన్(ఐఎఫ్‌సీ) ఆఫర్ చేయనున్నాయి. టాటా సన్స్ 23 కోట్ల షేర్లు, ఐఎఫ్‌సీ 3.58 కోట్ల షేర్లు విక్రయించనున్నాయి. ప్రస్తుతం కంపెనీలో టాటా సన్స్ వాటా 88.6 శాతంకాగా.. ఐఎఫ్‌సీకి 1.8 శాతం వాటా ఉంది. ఇష్యూ నిధులను భవిష్యత్ అవసరాలరీత్యా టైర్–1 క్యాపిటల్ పటిష్టతకు వినియోగించనుంది. కంపెనీ ఇప్పటికే ఏప్రిల్‌లో గోప్యతా విధానంలో సెబీకి ప్రాస్పెక్టస్‌ను దాఖలు చేసిన సంగతి తెలిసిందే. జులైలో దీనికి అనుమతి లభించడంతో తుది ప్రాస్పెక్టస్ దాఖలు చేసేలోగా అప్‌డేటెడ్ ప్రాస్పెక్టస్ దాఖలు చేయవలసి ఉంది. దీంతో తాజాగా సెబీకి అప్‌డేటెడ్ పత్రాలను దాఖలు చేసింది. వెరసి 2023 నవంబర్‌లో టాటా గ్రూప్ ఐటీ దిగ్గజం టాటా టెక్నాలజీస్ లిస్ట్ అయ్యాక తిరిగి మరో దిగ్గజం పబ్లిక్ ఇష్యూకి రానుంది.

జేహ్ ఏరోస్పేస్ 11 మిలియన్ డాలర్ల సమీకరణ



ముంబై: హైదరాబాద్‌కి చెందిన ఏరోస్పేస్ స్టార్టప్ జేహ్ ఏరోస్పేస్ తాజాగా 11 మిలియన్ డాలర్లు సమీకరించినట్లు వెల్లడించింది. ఎలివేషన్ క్యాపిటల్, ప్రస్తుత ఇన్వెస్టర్ జనరల్ కేటలిస్ట్ ఇన్వెస్ట్ చేసినట్లు సంస్థ తెలిపింది. తయారీ, నిర్వహణ సామర్థ్యాలను పెంచుకునేందుకు ఈ నిధులను వినియోగించుకోనున్నట్లు జేహ్ ఏరోస్పేస్ వివరించింది. పరిశ్రమలో అనుభవజ్ఞులైన విశాల్ సంఘవి, వెంకటేష్ ముద్రగళ్ల నెలకొల్పిన ఈ సంస్థ తొలి ఏడాదిలోనే 100 ఉద్యోగుల స్థాయికి విస్తరించింది. ఏఎస్9100 ప్రమాణాలకు అనుగుణంగా ఉండే ఏరో ఇంజిన్ విడిభాగాలు, టూల్స్‌ను అందించడంతో పాటు 100 మిలియన్ డాలర్ల విలువ చేసే దీర్ఘకాలిక కాంట్రాక్టులను దక్కించుకుంది.

టెక్ మహీంద్రాకు కొత్త నాయకత్వం దన్ను

సీఈవో మోహిత్ జోషి



న్యూఢిల్లీ: కొత్త నాయకత్వంతో పాటు అంతర్గతంగా ప్రతిభావంతులను ప్రోత్సహించేందుకు తీసుకుంటున్న చర్యలు, తమ కంపెనీ పురోగతికి గణనీయంగా దోహదపడగలవని టెక్ మహీంద్రా సీఈవో మోహిత్ జోషి ధీమా వ్యక్తం చేశారు. తమ అంతర్జాతీయ కార్యకలాపాలను వ్యూహాత్మకంగా ఆరు వ్యాపార విభాగాల కింద పునర్వ్యవస్థీకరించినట్లు ఆయన చెప్పారు. అనుభవం, నైపుణ్యాలు ఉండి, భవిష్యత్తు మీద ఫోకస్ పెట్టే నాయకులకు సారథ్య బాధ్యతలు అప్పగించినట్లు జోషి చెప్పారు. వీటన్నింటి సానుకూల ప్రభావం జూన్ త్రైమాసిక ఆర్థిక ఫలితాల్లో కూడా కనిపించిందని వివరించారు. టెక్ మహీంద్రా ఏప్రిల్–జూన్ త్రైమాసికంలో కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన రూ. 1,141 కోట్ల లాభాన్ని (34 శాతం వృద్ధి) ప్రకటించింది. పలువురు ఉద్యోగుల నిష్క్రమణ అనంతరం టెక్ మహీంద్రా అంతర్జాతీయ కార్యకలాపాలను పునర్వ్యవస్థీకరించిన నేపథ్యంలో సారథ్య మార్పులపై జోషి వివరణ ప్రాధాన్యం సంతరించుకుంది. 2023 ఆగస్టు నుంచి 2025 జూన్ వరకు కంపెనీ పలు విభాగాలకు కొత్త సారథులను నియమించింది. ఆసియా పసిఫిక్, జపాన్ విభాగం ప్రెసిడెంట్‌గా 2024 జనవరిలో హర్షవేంద్ర సోయిన్‌కు పదోన్నతి కల్పించింది. అలాగే గత రెండేళ్లలో తొమ్మిది మంది కొత్త లీడర్లను నియమించుకోవడంతో పాటు ఏడుగురికి గ్లోబల్ కార్యకలాపాల బాధ్యతలు అప్పగించింది. ఇటీవలే, జూన్‌లో అమోల్ ఫడ్కేని చీఫ్ ట్రాన్స్‌ఫర్మేషన్ ఆఫీసర్‌గా నియమించింది.

దాల్మియా భారత్- జైప్రకాశ్ అసోసియేట్స్ డీల్‌కు సీసీఐ ఓకే

న్యూఢిల్లీ: రుణ సంక్షోభంతో దివాలా పరిష్కార ప్రక్రియను ఎదుర్కొంటున్న జైప్రకాశ్ అసోసియేట్స్ (జేఏఎల్)ను కొనుగోలు చేసేందుకు దాల్మియా సిమెంట్ భారత్ సమర్పించిన ప్రతిపాదనకు కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) ఆమోదముద్ర వేసింది. దివాలా చట్టం (ఐబీసీ) ప్రకారం, బిడ్డింగ్ ప్రక్రియలో పాల్గొనే క్రమంలో పరిష్కార ప్రణాళికను దాఖలు చేయడానికి ముందుగా సీసీఐ గ్రీన్ సిగ్నల్ పొందాల్సి ఉంటుంది. దానికి అనుగుణంగా దాల్మియా సిమెంట్ సీసీఐ ఆమోదం కోసం దరఖాస్తు చేసుకుంది. రియల్ ఎస్టేట్, సిమెంట్ తదితర రంగాల్లో కార్యకలాపాలు నిర్వహించే జేఏఎల్.. రుణదాతలకు దాదాపు రూ. 57,185 కోట్లు బాకీ పడింది. 2024 జూన్ 3న కంపెనీపై కార్పొరేట్ దివాలా పరిష్కార ప్రక్రియ కింద నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) విచారణ చేపట్టింది. జేఏఎల్ కొనుగోలు కోసం దాల్మియా భారత్‌తో పాటు అదానీ ఎంటర్‌ప్రైజెస్, వేదాంత గ్రూప్, జిందాల్ పవర్ మొదలైన సంస్థలు కూడా పోటీపడుతున్నాయి.

పేటీఎమ్ నుంచి యాంట్ ఔట్

5.84 శాతం వాటా విక్రయం



న్యూఢిల్లీ: ఫిన్‌టెక్ దిగ్గజం వన్97 కమ్యూనికేషన్స్ నుంచి చైనా దిగ్గజం యాంట్ ఫైనాన్షియల్ పూర్తిగా వైదొలగింది. పేటీఎమ్ బ్రాండ్ సర్వీసుల కంపెనీలో ఆలీబాబా గ్రూప్ సంస్థ తాజాగా 5.84 శాతం వాటా విక్రయించింది. నెదర్లాండ్స్ అనుబంధ సంస్థ యాంట్‌ఫిన్ ద్వారా పేటీఎమ్‌లో మిగిలిన 3.73 కోట్ల షేర్లను అమ్మివేసింది. షేరుకి రూ. 1,020 ఫ్లోర్ ధరలో వీటిని విక్రయించడం ద్వారా రూ. 3,803 కోట్లు అందుకుంది. అయితే పేటీఎమ్ షేరు ముందురోజు ధర రూ. 1,078తో చూస్తే 5.4 శాతం డిస్కౌంట్‌లో షేర్లను విక్రయించడం గమనార్హం! ఈ ఏడాది మే నెలలోనూ పేటీఎమ్‌లో 4 శాతం వాటాకు సమానమైన 2.55 కోట్ల షేర్లను యాంట్ గ్రూప్ అమ్మివేసిన సంగతి తెలిసిందే.

ఈ నేపథ్యంలో పేటీఎమ్ షేరు ఎన్ఎస్ఈలో 1.5 శాతం నీరసించి రూ. 1,063 వద్ద, బీఎస్ఈలో 1.2 శాతం నష్టంతో రూ. 1,065 వద్ద ముగిసింది.

84,000 గేమింగ్ యూజర్ల వివరాలు లీక్!

కాస్పర్‌స్కీ వెల్లడి



డా నాంగ్ (వియత్నాం): గతేడాది దేశీయంగా 84,000 పైచిలుకు ఆన్‌లైన్ గేమింగ్ ఖాతాదారుల వివరాలు లీక్ అయినట్లు గ్లోబల్ సైబర్‌సెక్యూరిటీ, డిజిటల్ ప్రైవసీ కంపెనీ కాస్పర్‌స్కీ వెల్లడించింది. ఆసియా పసిఫిక్ ప్రాంతంలో (ఏపీఏసీ) ఇలాంటి ఉదంతాలు అత్యధికంగా థాయ్‌ల్యాండ్‌లో, అత్యల్పంగా సింగపూర్‌లో నమోదయ్యాయి. కాస్పర్‌స్కీ ప్రకారం థాయ్‌ల్యాండ్‌లో 1,62,892 కేసులు, ఫిలిప్పీన్స్‌లో 99,273, వియత్నాంలో 87,969, సింగపూర్‌లో 4,262 కేసులు నమోదయ్యాయి. గతేడాది మొత్తం మీద 1.1 కోట్ల గేమింగ్ ఖాతాల వివరాలు బహిర్గతమైనట్లు కాస్పర్‌స్కీ తెలిపింది. అంతర్జాతీయంగా గేమర్లలో దాదాపు సగం మంది ఏపీఏసీ రీజియన్‌లోనే ఉన్నారు. ఆగ్నేయాసియాలో చైనా, భారత్, జపాన్, దక్షిణ కొరియా మార్కెట్లు కీలకంగా ఉంటున్నాయి. ఈ మార్కెట్లలో డిజిటల్.. మొబైల్స్ వినియోగం పెరగడం, పెద్ద సంఖ్యలో యువ జనాభా తదితర అంశాలు గేమింగ్‌కి దన్నుగా ఉంటున్నాయి. 180 కోట్ల మంది పైగా ప్లే యర్లతో ఏపీఏసీ రీజియన్ అంతర్జాతీయంగా గేమింగ్ ధోరణులను కొత్తగా తీర్చిదిద్దుతోందని కాస్పర్‌స్కీ తెలిపింది. దీంతో ఈ ప్రాంతంలో సైబర్ ముప్పులు కూడా పెరుగుతున్నాయని వివరించింది.

ద్వితీయ శ్రేణి నగరాలపై కంపెనీ దృష్టి ..

భారత్‌లో విస్తరణలో భాగంగా ఇతర భాగస్వాములతో చేతులు కలపడం ద్వారా ద్వితీయ శ్రేణి పట్టణాల్లోకి కూడా ప్రవేశించే యోచనలో ఉన్నట్లు కాస్పర్‌స్కీ ఎండీ (ఆసియా పసిఫిక్) ఏడ్రియన్ హియా తెలిపారు. ప్రస్తుతం కంపెనీ దేశీయంగా ముంబై, ఢిల్లీ, బెంగళూరు నుంచి కార్యకలాపాలు సాగిస్తోంది. గత రెండేళ్లుగా భారత్‌లో సేల్స్, టెక్నికల్ సపోర్ట్ తదితర విభాగాల్లో స్థానిక సిబ్బంది సంఖ్యను మూడు రెట్లు పెంచుకున్నట్లు హియా చెప్పారు. అంతర్జాతీయంగా తమ కార్యకలాపాలకు కీలక ఇన్నోవేషన్ హబ్‌గా భారత్‌ను పరిగణిస్తున్నామని, ఇక్కడ పరిశోధన–అభివృద్ధి కార్యకలాపాలను పెంచుకుంటున్నామని వివరించారు.

బిజినెస్ రీల్

భీమ జువెల్స్ 'శుభ వరమహాలక్ష్మి' ఆఫర్లు

BHIMA

హైదరాబాద్: ప్రముఖ గోల్డ్ అండ్ డైమండ్ జువెలరీ సంస్థ భీమా జువెల్స్ పండుగ సందర్భంగా 'శుభ వరమహాలక్ష్మి' పేరుతో ఆఫర్లు ప్రకటించింది. బంగారం, వెండి ధరలపై 10% డిస్కౌంట్, వజ్రాభరణాలపై క్యారెట్‌కు ఫ్లాట్ రూ.7,000 తగ్గింపు అందిస్తుంది. మేకింగ్ ఛార్జీలపై 20% తగ్గింపు, వజ్రాల విలువపై అదనంగా 20% తగ్గింపు పొందవచ్చు. ప్రతి రూ.50,000 కొనుగోలుపై అదనంగా రూ.1,000 తగ్గింపు ఉంది. ఆగస్టు 17 వరకు అందుబాటులో ఉండే 'శుభ వరమహాలక్ష్మి' ఆఫర్లను కస్టమర్లమంతా వినియోగించుకోవాలని కంపెనీ కోరింది.

ఫిక్సిడ్ డిపాజిట్లకు యాక్సిస్ బ్యాంక్ 'లాక్' ఫీచరు



ముంబై: డిజిటల్ మోసాల నుంచి ఫిక్సిడ్ డిపాజిట్లకు భద్రత కల్పించేలా ప్రైవేట్ రంగ యాక్సిస్ బ్యాంక్ కొత్తగా 'లాక్ ఎఫ్‌డీ' ఫీచరును ప్రవేశపెట్టింది. ఎఫ్‌డీలను ఆన్‌లైన్‌లో వేరెవ్వరూ ముందస్తుగా క్లోజ్ చేయకుండా ఇది ఉపయోగపడుతుందని బ్యాంకు తెలిపింది. దీన్ని ఎంచుకుంటే, ఖాతాదారు స్వయంగా శాఖకు వెళ్లి సరైన ధృవీకరణ వివరాలన్నీ సమర్పిస్తేనే ఎఫ్‌డీని క్లోజ్ చేయడం వీలవుతుందని పేర్కొంది. డిజిటల్ మోసాల నుంచి టర్మ్ డిపాజిట్లకు భద్రత కల్పించేందుకు ఈ ఫీచరు సహాయకరంగా ఉంటుందని బ్యాంకు వివరించింది. డిజిటల్ ప్లాట్‌ఫాంల గురించి అంతగా అవగాహన ఉండని కస్టమర్లకు ఇది ఉపయోగపడుతుందని తెలిపింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

6-8-2025

విశాఖ	475–00
చిత్తూరు	513–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	475–00
విజయవాడ	475–00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	435–00
వరంగల్	437–00
రిటైల్ ధర	4.95

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
TITAN	3,424.00	2.02
INDUSINDBK	817.4	1.66
SBILIFE	1,860.00	1.56
MARUTI	12,543.00	1.44
COALINDIA	379.8	1.36

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
ADANIPORTS	1,361.90	-1.94
RELIANCE	1,390.00	-1.52
INFY	1,460.00	-1.38
ADANIENT	2,333.00	-1.29
CIPLA	1,496.30	-1.24

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	10,464
ఎన్ఎస్ఈ	88,655
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	1,18,898
ఎఫ్ఐఐ	- 22
డీఐఐ	+ 3,840

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	65.33	$ 66.29
బ్రెంట్	67.76	$ 68.76

క్యూ1 ఫలితాలు

రాణించిన ఎక్సైడ్ ఇండస్ట్రీస్

జూన్ క్వార్టర్‌లో రూ.275 కోట్ల లాభం



కోల్‌కతా: ఎక్సైడ్ ఇండస్ట్రీస్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికంలో బలమైన పనితీరు నమోదు చేసింది. కన్సాలిడేటెడ్ లాభం క్రితం ఏడాది ఇదే కాలంతో పోల్చి చూసినప్పుడు 24 శాతం పెరిగి రూ.275 కోట్లకు చేరింది. క్రితం ఏడాది ఇదే కాలంలో లాభం రూ.221 కోట్లుగా ఉంది. ఆదాయం సైతం 5.9 శాతం వృద్ధితో రూ.4,695 కోట్లకు చేరింది. స్టాండలోన్‌గా ఎబిట్డా మార్జిన్ 12.2 శాతానికి మెరుగుపడింది. వాహనాలు, సోలార్, ఇండస్ట్రియల్ యూపీఎస్ విభాగాల్లో బ్యాటరీల మార్పిడి పరంగా డబుల్ డిజిట్ వృద్ధి నమోదైనట్టు సంస్థ తెలిపింది. ఆటో ఓఈఎం, ఎగుమతి విభాగాల్లో మాత్రం డిమాండ్ స్తబ్దుగా ఉన్నట్టు ఎక్సైడ్ ఇండస్ట్రీస్ ఎండీ, సీఈవో అవిక్ కుమార్ రాయ్ ప్రకటించారు. లిథియం అయాన్ బ్యాటరీల సబ్సిడరీ కంపెనీ అయిన ఎక్సైడ్ ఎనర్జీ సొల్యూషన్స్ లిమిటెడ్ (ఈఈఎస్ఎల్) ప్రాజెక్టు మంచి పురోగతిలో ఉందని, క్యూ1లో రూ.300 కోట్లు ఇన్వెస్ట్ చేయగా, జూలైలో మరో రూ.100 కోట్లు వ్యయం చేసినట్టు తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం చివరికి ఈ ప్రాజెక్టులో తయారీ కార్యకలాపాలు మొదలవుతాయని ప్రకటించారు.

బీఎస్ఈలో కంపెనీ షేరు ధర ఒక శాతానికి పైగా నష్టంతో రూ.385 వద్ద స్థిరపడింది.

ట్యూబ్ ఇన్వెస్ట్‌మెంట్స్ లాభం డౌన్

రూ. 303 కోట్లు



న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025–26) తొలి త్రైమాసికంలో మురుగప్ప గ్రూప్ కంపెనీ ట్యూబ్ ఇన్వెస్ట్‌మెంట్స్ ఆసక్తికర ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన ఏప్రిల్–జూన్(క్యూ1)లో నికర లాభం 4 శాతం క్షీణతతో రూ. 303 కోట్లకు పరిమితమైంది. గతేడాది(2024–25) ఇదే కాలంలో రూ. 317 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం మాత్రం రూ. 4,643 కోట్ల నుంచి రూ. 5,381 కోట్లకు జంప్ చేసింది. దీనిలో ఇంజినీరింగ్ బిజినెస్ విభాగం ఆదాయం రూ. 1,298 కోట్లుకాగా.. మెటల్ ఫార్మ్‌డ్ ప్రొడక్టుల నుంచి రూ. 366 కోట్లు అందుకుంది. గ్రూప్ కంపెనీలలో సీజీ పవర్ ఆదాయం రూ. 2,878 కోట్లకు చేరగా.. రూ. 364 కోట్ల పన్నుకుముందు లాభం ఆర్జించింది. ఇక ట్యూబ్ ఇన్వెస్ట్‌మెంట్స్‌కు 70.46 శాతం వాటాగల శాంతి గేర్స్ ఆదాయం రూ. 135 కోట్లకు చేరగా.. రూ. 31 కోట్ల పన్నుకుముందు లాభం ఆర్జించింది.

ఫలితాల నేపథ్యంలో ట్యూబ్ ఇన్వెస్ట్‌మెంట్స్ షేరు 0.3 శాతం నీరసించి రూ. 2,897 వద్ద ముగిసింది.

ఎంటార్ టెక్నాలజీస్ ఆదాయం 22% అప్..



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఎంటార్ టెక్నాలజీస్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో రూ. 157 కోట్ల ఆదాయం ప్రకటించింది. క్రితం క్యూ1లో నమోదైన రూ. 128 కోట్లతో పోలిస్తే ఇది 22 శాతం అధికం. మరోవైపు, సమీక్షాకాలంలో రూ. 11 కోట్ల నికర లాభం నమోదైంది. క్రితం క్యూ1లో నమోదైన రూ. 4.4 కోట్లతో పోలిస్తే ఇది 144 శాతం అధికమని సంస్థ తెలిపింది. టారిఫ్‌లపరంగా అనిశ్చితులు నెలకొన్నప్పటికీ నిలకడగా ఎగుమతుల్లో వృద్ధి సాధించగలమని కంపెనీ ఎండీ పర్వత్ శ్రీనివాస్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

ఎన్‌సీసీ లాభం రూ. 192 కోట్లు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో ఎన్‌సీసీ రూ. 192 కోట్ల నికర లాభం (కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన) ప్రకటించింది. క్రితం క్యూ1లో ఇది రూ. 210 కోట్లు. మరోవైపు, సమీక్షాకాలంలో ఆదాయం రూ. 5,558 కోట్ల నుంచి రూ. 5,208 కోట్లకు తగ్గింది. తొలి త్రైమాసికంలో రూ. 3,658 కోట్ల విలువ చేసే ఆర్డర్లు దక్కించుకోవడంతో మొత్తం ఆర్డర్ బుక్ రూ. 70,087 కోట్లకు చేరినట్లు కంపెనీ ఎండీ ఏవీ రంగరాజు తెలిపారు.

కేపీఐ గ్రీన్ ఎనర్జీ లాభం హైజంప్

క్యూ1లో రూ. 111 కోట్లు




న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025–26) తొలి త్రైమాసికంలో కేపీఐ గ్రీన్ ఎనర్జీ ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. ఏప్రిల్–జూన్(క్యూ1)లో నికర లాభం 68 శాతం జంప్‌చేసి రూ. 111 కోట్లను అధిగమించింది. ఆదాయం పుంజుకోవడం ఇందుకు సహకరించింది. గతేడాది(2024–25) ఇదే కాలంలో కేవలం రూ. 66 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం 75 శాతం ఎగసి రూ. 614 కోట్లను దాటింది. గత క్యూ1లో రూ. 350 కోట్ల టర్నోవర్ నమోదైంది. సర్టిఫైడ్ గ్రీన్ బాండ్లు లేదా ఇతర ఎన్‌సీడీల జారీ ద్వారా రూ. 700 కోట్ల సమీకరణకు బోర్డు అనుమతించినట్లు కంపెనీ వెల్లడించింది.

ఫలితాల నేపథ్యంలో కేపీఐ గ్రీన్ షేరు బీఎస్ఈలో 1.3 శాతం క్షీణించి రూ. 533 వద్ద ముగిసింది.

టొరెంట్ పవర్ లాభం క్షీణత

క్యూ1లో రూ. 742 కోట్లు



న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025–26) తొలి త్రైమాసికంలో ప్రయివేట్ రంగ కంపెనీ టొరెంట్ పవర్ ఆసక్తికర ఫలితాలు ప్రకటించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన ఏప్రిల్–జూన్(క్యూ1)లో నికర లాభం 25 శాతం క్షీణించి రూ. 742 కోట్లకు పరిమితమైంది. డిమాండ్ తగ్గడంతో విద్యుదుత్పత్తి, ప్రసారం, పంపిణీ ఆదాయం నీరసించడం ప్రభావం చూపింది. గతేడాది(2024–25) ఇదే కాలంలో రూ. 996 కోట్లకు పైగా ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 9,110 కోట్ల నుంచి రూ. 8,011 కోట్లకు బలహీనపడింది.

ఫలితాల నేపథ్యంలో టొరెంట్ పవర్ షేరు బీఎస్ఈలో యథాతథంగా రూ. 1,313 వద్ద ముగిసింది.

బెర్జర్ పెయింట్స్ లాభం రూ.315 కోట్లు



న్యూఢిల్లీ: బెర్జర్ పెయింట్స్ జూన్ త్రైమాసికంలో (2025–26లో క్యూ1) రూ.315 కోట్ల లాభాన్ని నమోదు చేసింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో లాభం రూ.354 కోట్లతో పోల్చి చూస్తే 11 శాతం తగ్గింది. ఆదాయం ఇదే కాలంలో రూ.3,091 కోట్ల నుంచి రూ.3,201 కోట్లకు వృద్ధి చెందింది. వ్యయాలు ఇదే కాలంలో 4 శాతం పెరిగి రూ.2,781 కోట్లుగా ఉన్నాయి. ముందస్తు వర్షాలు ప్రభావం చూపించినట్టు కంపెనీ ఎండీ, సీఈవో అభిజిత్ రాయ్ చెప్పారు. అయినప్పటికీ లిస్టెడ్ కంపెనీల కంటే అధిక అమ్మకాల వృద్ధిని నమోదు చేసినట్టు తెలిపారు. కోల్‌తాలోని బరాసత్‌లో వేర్‌హౌస్, ప్రాంతీయ పంపిణీ కేంద్రంలో అగ్ని ప్రమాదం కారణంగా ఎదురైన నష్టం రూ.36.81 కోట్లు ఫలితాల్లో కలసి ఉన్నట్టు కంపెనీ తెలిపింది. దీనికి సంబంధించి బీమా క్లెయిమ్ దాఖలు ప్రక్రియ కొనసాగుతున్నట్టు పేర్కొంది.

బెర్జర్ పెయింట్స్ షేరు ధర అర శాతం పెరిగి రూ.572 వద్ద ముగిసింది.

జేకే లక్ష్మీ సిమెంట్ లాభం జూమ్

క్యూ1లో రూ. 150 కోట్లు




న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025–26) తొలి త్రైమాసికంలో ప్రయివేట్ రంగ కంపెనీ జేకే లక్ష్మీ సిమెంట్ ఆకర్షణీయ ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన ఏప్రిల్–జూన్(క్యూ1)లో నికర లాభం రెండు రెట్లుపైగా ఎగసి రూ. 150 కోట్లను తాకింది. గతేడాది(2024–25) ఇదే కాలంలో కేవలం రూ. 57 కోట్లు ఆర్జించింది. తాజాగా ఉదయ్‌పూర్ సిమెంట్‌ను విలీనం చేసుకున్న కంపెనీ మొత్తం ఆదాయం 12 శాతం వృద్ధితో రూ. 1,763 కోట్లను అధిగమించింది. గత క్యూ1లో రూ. 1,577 కోట్ల టర్నోవర్ అందుకుంది. మొత్తం వ్యయాలు సైతం 7 శాతం పెరిగి రూ. 1,559 కోట్లను దాటాయి. ఈ కాలంలో సిమెంట్ అమ్మకాలు 10 శాతం పుంజుకుని 3,326 లక్షల టన్నులకు చేరినట్టు కంపెనీ వెల్లడించింది.

‘ఇక స్వర్ణంపై గురి’

పారిస్ ఒలింపిక్స్ కాంస్య పతకం జీవితాన్ని మార్చింది


- ఆర్థిక వెసులుబాటుతో పాటు భవిష్యత్తుపై భరోసా ఇచ్చింది
- దాన్ని పక్కన పెట్టి మరింత మెరుగయ్యే దిశగా అడుగులు
- భారత స్టార్ రెజ్లర్ అమన్ సెహ్రావత్ మనోగతం



లక్నో: గత ఏడాది పారిస్ ఒలింపిక్స్‌లో సాధించిన కాంస్య పతకం తన జీవితాన్ని సమూలంగా మార్చి వేసిందని భారత యువ రెజ్లర్ అమన్ సెహ్రావత్ అన్నాడు. అదే సమయంలో నిలకడగా రాణించాలనే బాధ్యతను పెంచిందని వెల్లడించాడు. ఒకప్పుడు ఆర్థికంగా ఎన్నో కష్టాలు ఎదుర్కొన్న అమన్... ఒలింపిక్స్‌లో పతకం నెగ్గిన అనంతరం డబ్బుకు కొదవ లేకుండా పోయిందని అన్నాడు. పురుషుల 57 కేజీల విభాగంలో ప్రపంచ చాంపియన్‌షిప్ ట్రయల్స్‌లో విజయం సాధించిన అనంతరం అమన్ తన సాధన తీరును వివరించాడు. విశ్వక్రీడల్లో కాంస్య పతకం గెలిచిన విషయాన్ని మరిచి ప్రపంచ చాంపియన్‌షిప్, లాస్ ఏంజెలిస్ ఒలింపిక్స్‌లో పసిడి పతకమే లక్ష్యంగా సాధన చేస్తున్నట్లు పేర్కొన్నాడు. పారిస్ పతకంతో అమన్ జీవితంలో వచ్చిన మార్పుల వివరాలు అతడి మాటల్లోనే...

విదేశీ టోర్నీల్లో పాల్గొంటా...

ఒలింపిక్స్ తర్వాత విదేశాల్లో శిక్షణ పొందాలని అనుకున్నా... కానీ మనం కోరుకున్నవన్నీ జరగవు కదా. అదే సమయంలో గాయం కావడంతో ఇక ఆ ప్రయత్నాలు విరమించుకున్నా. పారిస్ ఒలింపిక్స్ పతకం నా భుజాలపై అదనపు భారాన్ని మోపింది. ఒకవేళ నేను పరాజయం పాలైతే... పారిస్ పతకంతో వచ్చిన కీర్తి నన్ను చెడగొట్టిందనే విమర్శలు వస్తాయనే ఆలోచనలు నన్ను చుట్టుముట్టాయి. ఇటీవల పాల్గొన్న రెండు టోర్నీలో ఒక దాంట్లో పతకం సాధించా మరో దాంట్లో స్థాయికి తగ్గ ప్రదర్శన చేయలేకపోయా. దాదాపు ఏడాది తర్వాత బరిలోకి దిగడం కూడా అందుకు ఒక కారణం. అయినా నా కోచ్‌లు నమ్మకాన్ని కోల్పోవద్దని సూచించారు. మరింత కఠోర సాధన చేస్తున్నా. విదేశీ రెజ్లర్లను పడగొట్టడం అంత తేలికైన పనేం కాదు. ఆ అంశంపై దృష్టి సారించా. వచ్చే నెలలో క్రొయేషియా రాజధాని జాగ్రెబ్‌లో జరగనున్న ప్రపంచ చాంపియన్‌షిప్స్‌కు సన్నద్ధమవుతున్నా. ప్రస్తుతం ఫిట్‌గా ఉన్నా. అయితే బలమైన ప్రత్యర్థులతో తలపడాలంటే... విదేశాలకు వెళ్లక తప్పదు. రష్యా, అమెరికాలో జరిగే టోర్నమెంట్‌లలో పాల్గొని మరింత రాటుదేలాలని భావిస్తున్నా.



శ్రమకు దక్కిన ఫలితమిది

విశ్వక్రీడల్లో పతకం సాధించిన తర్వాత నా జీవితం 90 శాతం మారిపోయింది. అంతకుముందు నన్ను ఎవరూ గుర్తించేవారు కాదు. కనీసం మా పక్క వీధిలో వారికి కూడా నేనెవరో తెలియదు. కానీ ఇప్పుడు పరిస్థితి అలా లేదు. పారిస్ ప్రదర్శనతో ప్రతి ఒక్కరూ నన్ను గుర్తిస్తున్నారు, గౌరవిస్తున్నారు. అవన్నీ చూస్తుంటే... నేను దేశం కోసం ఏదో సాధించాననే సంతృప్తి కలుగుతోంది. అయితే అది ఒక్క రోజులో సాధ్యమైంది కాదు. ఏళ్ల తరబడి పడ్డ కష్టానికి దక్కిన ఫలితమది. పారిస్ ఒలింపిక్స్‌కు ముందు పతకం సాధిస్తానని అసలు ఊహించలేదు. ఆ సమయంలో భారత మహిళా రెజ్లర్లపై ఎక్కువ అంచనాలు ఉన్నాయి. భగవంతుడి దయతో నేను పతకం సాధించగలిగా. అయితే ఇక్కడితో అయిపోలేదు. ఇప్పుడు నాపై అంచనాలు ఎక్కువయ్యాయి. ఎలాంటి ఒత్తిడి లేని సమయంలో కాంస్యం గెలిచిన నేను... ఇప్పుడు స్వర్ణం సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నాను. పారిస్‌లో సాధించిన కాంస్య పతకాన్ని నా మనసులో నుంచి తీసేసి తిరిగి కఠోర సాధనపై దృష్టి పెట్టాను.

కష్టనష్టాలకు ఓర్చి...

ఒకప్పుడు ఆర్థికంగా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నాను. ఎవరూ లేరు అనుకున్న సమయంలో బంధువుల అండతో సాధన కొనసాగించా. సోదరి గురించి ఎక్కువగా ఆలోచించేవాడిని... ఒక అన్నగా తన బాగోగులు ఎలా చూసుకోవాలని మదన పడుతుండే వాడిని. ఇప్పుడా చింత లేదు. ఆమె బంగారు భవిష్యత్తుకు కావాల్సినంత సాధించా. ఇప్పుడిక ప్రశాంతంగా ప్రాక్టీస్‌పై దృష్టి సారించొచ్చు. అయితే విజయాన్ని తలకెక్కించుకొని గతాన్ని మర్చిపోయే వ్యక్తిని కాదు నేను. అప్పటికి ఇప్పటికీ నాలో పెద్దగా మార్పు ఏమీ రాలేదు. కాకపోతే నిర్ణయాలు తీసుకునే విషయంలో ఇప్పుడు మరింత జాగ్రత్తగా వ్యవహరిస్తున్నా. ఎందుకంటే ఒలింపిక్ పతక విజేతగా ఇప్పుడు అందరి దృష్టి నాపై ఉంటుంది కాబట్టి జాగరుకత అవసరం. ఒలింపిక్స్ అనంతరం చాన్నాళ్ల వరకు ఆటకు దూరంగా ఉండాల్సి వచ్చింది. దానికి గాయంతో పాటు అనేక కారణాలు ఉన్నాయి. ఇప్పుడు పూర్తి ఫిట్‌నెస్‌తో తిరిగి బరిలోకి దిగేందుకు సిద్ధంగా ఉన్నా.

తొలి రౌండ్లోనే వైశాలి అవుట్



చెన్నై: మహిళల స్పీడ్ చెస్ చాంపియన్‌షిప్‌లో భారత గ్రాండ్‌మాస్టర్ వైశాలి అనూహ్యంగా తొలి రౌండ్లోనే నిష్క్రమించింది. కొన్నాళ్లుగా నిలకడగా విజయాలు నమోదు చేస్తున్న ఆమె ఈ నాకౌట్ టోర్నీలో మాత్రం అమెరికన్ అంతర్జాతీయ మాస్టర్ (ఐఎం) అలైస్ లీ చేతిలో కంగుతింది. ఈ ఆన్‌లైన్ ఈవెంట్‌లో తొలి రౌండ్లో వైశాలి 6–8తో అలైస్ చేతిలో ఓడింది. ఈ విజయంతో అలైస్ క్వార్టర్ ఫైనల్స్‌కు అర్హత సాధించింది. ఈ టోర్నీలో తాజా ఫిడే మహిళల వరల్డ్ కప్ చాంపియన్ దివ్య దేశ్‌ముఖ్ కూడా పాల్గొనేందుకు సిద్ధమైంది. 11న జరిగే తొలి రౌండ్లో ఆమె చైనాకు చెందిన గ్రాండ్‌మాస్టర్ లీ టింగ్జితో పోటీపడుతుంది. ఈ స్పీడ్ గేమ్‌లో కేవలం 16 మంది మాత్రమే పోటీ పడుతున్నారు. 8 మంది క్వాలిఫయింగ్ ద్వారా అర్హత సాధించగా... 8 మందికి నిర్వాహకులు నేరుగా (డైరెక్ట్ ఎంట్రీ) పోటీపడే అవకాశం ఇచ్చారు. టోర్నీ ప్రైజ్‌మనీ 75,000 డాలర్లు (రూ. 65.85 లక్షలు). విజేతకు 7000 డాలర్లు (రూ.6.14 లక్షలు) లభిస్తాయి.

శ్రీనిత్యకు కాంస్యం సుహాస్‌కు రజతం



అహ్మదాబాద్: జాతీయ జూనియర్ స్విమ్మింగ్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ ఖాతాలో మరో రెండు పతకాలు చేరాయి. మహిళల గ్రూప్–1 400 మీటర్ల మెడ్లీలో శ్రీనిత్య సాగి కాంస్య పతకం సాధించింది. శ్రీనిత్య 5 నిమిషాల 13.67 సెకన్లలో గమ్యానికి చేరి మూడో స్థానంలో నిలిచింది. పురుషుల గ్రూప్–1 200 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్‌లో మైలారి సుహాస్ ప్రీతమ్ రజత పతకం నెగ్గాడు. సుహాస్ 2 నిమిషాల 05.57 సెకన్లలో గమ్యానికి చేరి రెండో స్థానాన్ని దక్కించుకున్నాడు. ఇదే విభాగంలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన మొంగం సామతీర్థ (2ని:06.84 సెకన్లు) కాంస్య పతకాన్ని సాధించాడు. ఆదివారం జరిగిన పోటీల్లో సుహాస్ 100 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్ ఈవెంట్‌లో కాంస్య పతకం... 100 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్ ఈవెంట్‌లో శ్రీనిత్య సాగి రజత పతకం సొంతం చేసుకున్నారు. శ్రీనిత్య, సుహాస్ కోచ్ జాన్ సిద్దిఖి వద్ద శిక్షణ తీసుకుంటున్నారు.

అహ్మదాబాద్‌లో ఆసియా కప్ అండర్–17 క్వాలిఫయర్స్ టోర్నీ



న్యూఢిల్లీ: ఆసియా కప్ అండర్–17 ఫుట్‌బాల్ క్వాలిఫయర్స్ టోర్నీకి భారత్ కూడా ఓ వేదికైంది. ఆసియా కప్–2026 కోసం నిర్వహించే క్వాలిఫయర్స్‌కు ఏడు దేశాలు ఆతిథ్యమివ్వనున్నాయి. ఇందులో భారత్ కూడా ఉంది. భారత్‌కు సంబంధించిన పోటీలను ఈ నవంబర్ 22 నుంచి 30 వరకు అహ్మదాబాద్‌లో నిర్వహించనున్నట్లు తెలిసింది. పాల్గొనే మొత్తం 38 దేశాల జట్లను ఏడు గ్రూప్‌లుగా విభజిస్తారు. మూడు గ్రూప్‌ల్లో ఆరేసి జట్లు, నాలుగు గ్రూప్‌ల్లో ఏడేసి జట్లు ఉంటాయి. దీనికి సంబంధించిన ‘డ్రా’ను రేపు తీయనున్నారు. ఈ ఏడు గ్రూప్‌ల విజేత జట్లు సౌదీ అరేబియాలో వచ్చే ఏడాది జరిగే ఆసియా కప్‌కు నేరుగా అర్హత సాధిస్తాయి. ఇంతకుముందే 9 జట్లకు డైరెక్ట్ ఎంట్రీ లభించింది. ఈ ఏడాది ఖతర్‌లో జరిగిన అండర్–17 ప్రపంచకప్‌లో తలపడటం ద్వారా 9 జట్లకు ఈ అవకాశం లభించింది. ఆసియాకప్ క్వాలిఫయర్స్ టోర్నీలో భారత్ కూడా వేదికవడం పట్ల అఖిల భారత ఫుట్‌బాల్ సమాఖ్య (ఏఐఎఫ్‌ఎఫ్) అధ్యక్షుడు కళ్యాణ్ చౌబే హర్షం వ్యక్తం చేశారు. అండర్–17 ఫిఫా ప్రపంచకప్ నిర్వహించే సత్తా తమకు ఉందని ఏఎఫ్‌సీ క్వాలిఫయర్స్ ద్వారా నిరూపించుకుంటామని చెప్పారు. అహ్మదాబాద్‌లో అంతర్జాతీయ ప్రమాణాలకు తీసిపోని విధంగా తీర్చిదిద్దిన స్టేడియంలో పోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

పోరాడి ఓడిన భారత్



జిద్దా (సౌదీ అరేబియా): ఆసియా కప్ పురుషుల బాస్కెట్‌బాల్ టోర్నమెంట్ తొలి మ్యాచ్‌లో భారత జట్టు చక్కటి పోరాటం కనబర్చింది. ఫేవరెట్లలో ఒకటైన జోర్డాన్‌తో మ్యాచ్‌లో చివరి వరకు ఆధిక్యంలో నిలిచిన భారత్... ఆఖర్లో పరాజయం పాలైంది. మంగళవారం జరిగిన ఈ పోరులో భారత్ 84–91 పాయింట్ల తేడాతో జోర్డాన్ చేతిలో ఓడింది. మ్యాచ్ మరో నిమిషంలో ముగుస్తుందనే సమయానికి భారత్ 80–76 పాయింట్లతో ఆధిపత్యం కనబర్చినా... చివర్లో తేరుకున్న జోర్డాన్ ప్లేయర్లు తమ అనుభవాన్ని రంగరించి మ్యాచ్‌ను అదనపు సమయానికి తీసుకెళ్లారు. ఒత్తిడిని కొనసాగిస్తూ కీలక పాయింట్లు సాధించి మ్యాచ్‌లో నెగ్గారు. అదనపు సమయంలో భారత్ కేవలం 4 పాయింట్లతో సరిపెట్టుకుంటే.. జోర్డాన్ 11 పాయింట్లతో ముందంజ వేసింది. భారత్ తరఫున అరవింద్ కృష్ణన్ (12 పాయింట్లు), ప్రణవ్ ప్రిన్స్ (12 పాయింట్లు),హర్ష్ డాగర్ (12 పాయింట్లు) సత్తా చాటారు. జోర్డాన్ తరఫున హాషిమ్ అబ్బాస్ 24 పాయింట్లతో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. గురువారం తమ తదుపరి మ్యాచ్‌లో 16 సార్లు చాంపియన్ చైనాతో భారత్ తలపడుతుంది.

బెంగళూరు ఫుట్‌బాల్ క్లబ్ నిర్ణయం

- ఐఎస్‌ఎల్‌పై నెలకొన్న అనిశ్చితే కారణం



ఆటగాళ్లు, సిబ్బందికి వేతనాలు నిలిపివేత

బెంగళూరు: ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్‌ఎల్) ఫుట్‌బాల్ టోర్నీలో భాగమైన ఫ్రాంచైజీ బెంగళూరు ఫుట్‌బాల్ క్లబ్ (ఎఫ్‌సీ) తమ ఆటగాళ్లు, సహాయ సిబ్బందికి వేతనాలు నిలిపివేసింది. ఈ సీజన్ ఐఎస్‌ఎల్‌పై అనిశ్చితి నెలకొనడంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు బెంగళూరు యాజమాన్యం వెల్లడించింది. ‘భారత్‌లో ఒక ఫుట్‌బాల్ క్లబ్‌ను నడపడం, కొనసాగించడం కత్తిమీద సాములాంటిది. అయినా సరే మేము ఎన్నో కష్టనష్టాలను దాటి ప్రతీ సీజన్‌లో పాల్గొన్నాం. అయితే ప్రస్తుత సీజన్ విషయమైన తొలగని అనిశ్చితి, లీగ్ భవిష్యత్తుపై స్పష్టత లేకపోవడం వల్లే వేతనాలను నిలిపివేస్తున్నాం. ప్రస్తుతం ఇది తప్ప మాకు వేరే మార్గం లేదు. మా ఆటగాళ్ళు, సిబ్బంది... వారి కుటుంబాల శ్రేయస్సు మాకు చాలా ముఖ్యమైనది. కానీ ఏం చేస్తాం... ఏదైనా పరిష్కారం వచ్చాకే మా టీమ్ కార్యకలాపాలు యథావిధిగా ఎప్పట్లాగే మొదలుపెడతాం’ అని 2018–19 ఐఎస్‌ఎల్ సీజన్ విజేత బెంగళూరు క్లబ్ పేర్కొంది. అయితే తమ క్లబ్ చేపట్టిన క్రీడాభివృద్ధి కార్యకలాపాలకు ఎలాంటి ఢోకా ఉండదని ప్రకటించింది. యూత్, పురుషులు, మహిళల జట్ల శిబిరాలు ఎప్పట్లాగే కొనసాగుతాయని పేర్కొంది.

ఏం జరిగిందంటే...

ఐఎస్‌ఎల్ నిర్వాహక సంస్థ ఫుట్‌బాల్ స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ లిమిటెడ్ (ఎఫ్‌ఎస్‌డీఎల్) 2010లో అఖిల భారత ఫుట్‌బాల్ సమాఖ్య (ఏఐఎఫ్ఎఫ్)తో 15 ఏళ్ల ఒప్పందం కుదుర్చుకుంది. ఈ గడువు గతేడాది డిసెంబర్ 18వ తేదీతోనే ముగిసింది. దీనిపై తదుపరి ఒప్పందంగానీ, గడువు పొడిగింపుపై గానీ ఎలాంటి పురోగతి లేకపోవడంతో జూలైలోనే ఎఫ్‌ఎస్‌డీఎల్ 2025–26 సీజన్ నిర్వహణను నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. దీంతో ఈ సీజన్ ఐఎస్‌ఎల్‌పై అనిశ్చితి నెలకొంది. ఈ నేపథ్యంలో బెంగళూరు, జంషెడ్‌పూర్, గోవా, హైదరాబాద్, కేరళ బ్లాస్టర్స్, నార్త్ ఈస్ట్ యునైటెడ్, ఒడిశా, పంజాబ్ ఫుట్‌బాల్ క్లబ్ (ఎఫ్‌సీ)లు ఏఐఎఫ్‌ఎఫ్ తక్షణ జోక్యం కోరుతూ లేఖ రాశాయి. ముంబై, చెన్నైయిన్ సహా బెంగాల్‌కు చెందిన మోహన్ బగన్ సూపర్ జెయింట్, ఈస్ట్ బెంగాల్, మొహమ్మదన్ స్పోర్టింగ్ క్లబ్‌లు లేఖలో సంతకం చేయలేదు. ఇటీవల ఏఐఎఫ్‌ఎఫ్ చీఫ్ కళ్యాణ్ చౌబే మాట్లాడుతూ ఈ సీజన్ ఐఎస్‌ఎల్ జరిపేందుకు భరోసా ఇచ్చారు.

రేపు క్లబ్ సీఈఓలతో సమావేశం

ఐఎస్‌ఎల్ ఫ్రాంచైజీలతో ఏఐఎఫ్‌ఎఫ్ భేటీ కావాలని నిర్ణయించింది. 8 ఫ్రాంచైజీలకు చెందిన సీఈఓలతో భారత ఫుట్‌బాల్ సమాఖ్య ఉన్నతాధికారులు రేపు ఢిల్లీలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సీజన్ ఐఎస్‌ఎల్ నిలిపివేత తదితర పరిణామాలపై ఏఐఎఫ్‌ఎఫ్ చర్చించనున్నట్లు తెలిసింది. గతంలో సుప్రీమ్ కోర్టు మాస్టర్ రైట్స్ అగ్రిమెంట్ (ఎమ్ఆర్ఏ)పై తుది తీర్పు వచ్చే వరకు కొత్త షరతులపై సంప్రదింపులు జరపరాదని ఆదేశించింది.

తెలంగాణ స్కేటర్లకు పతకాల పంట




సాక్షి, హైదరాబాద్: ఆసియా రోలర్ స్కేటింగ్ చాంపియన్‌షిప్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించిన తెలంగాణ స్కేటర్లు పతకాల పంట పండించారు. దక్షిణ కొరియా వేదికగా ఇటీవల ముగిసిన ఈ టోర్నీలో... తెలంగాణ స్కేటర్లు గ్రూప్ స్వర్ణం సహా మొత్తంగా.... 16 పతకాలు సాధించారు. ఇందులో 9 స్వర్ణాలు, 6 రజతాలు, ఒక కాంస్యం ఉన్నాయి. గత రెండేళ్లుగా జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి టోర్నీల్లో రాణిస్తున్న యువ స్కేటర్లు... 20వ ఆసియా చాంపియన్‌షిప్‌లో పతకాలతో మెరిశారు. శ్రియ మురళి, తేజేశ్ మూడేసి పతకాలు కైవసం చేసుకోగా... అనుపోజు కాంతిశ్రీ, రెండు పతకాలు ఖాతాలో వేసుకుంది. ఆకాంక్ష, జూహిత్, జయేశ్ పటేల్, రక్షిత్ మురళి, సంచిత్ చౌదరీ, ప్రతీక్, సౌరవ్ సింగ్ సీనియర్ విభాగంలో వ్యక్తిగత పతకాలు సాధించారు. జూనియర్ విభాగంలో కావ్యశ్రీ రజత పతకం నెగ్గింది. అంతర్జాతీయ స్థాయిలో పతకాలు నెగ్గిన యువ స్కేటర్లను కోచ్ అనూప్ కుమార్ యామ ప్రత్యేకంగా అభినందించాడు. భారత్ తరఫున రోలర్ స్కేటింగ్ ప్రపంచ చాంపియన్‌షిప్ స్వర్ణ పతకం సాధించిన ఏకైక స్కేటర్ అయిన అనూప్ దిశానిర్దేశంలో రాష్ట్ర యువ స్కేటర్లు పతకాలతో సత్తాచాటారని తెలంగాణ రోలర్ స్కేటింగ్ సంఘం ఒక ప్రకటనలో తెలిపింది.

‘స్వర్ణ’ సితేందర్



ఏథెన్స్: ప్రపంచ అండర్–17 రెజ్లింగ్ చాంపియన్‌షిప్ పోటీలను భారత్ స్వర్ణ పతకంతో ముగించింది. పురుషుల ఫ్రీస్టయిల్ 60 కేజీల విభాగంలో సితేందర్ భారత్‌కు పసిడి పతకాన్ని అందించాడు. రిహిటో హియురా (జపాన్)తో జరిగిన ఫైనల్లో సితేందర్ 9–4 పాయింట్ల తేడాతో గెలిచి విశ్వవిజేతగా అవతరించాడు. అంతకుముందు సెమీఫైనల్లో సితేందర్ 5–1తో బెకాసిల్ అసమ్‌బెక్ (కజకిస్తాన్)పై, క్వార్టర్ ఫైనల్లో 5–5తో అరియాన్ (ఇరాన్)పై, ప్రిక్వార్టర్ ఫైనల్లో 10–0తో యాహోర్ దరోష్కా (రష్యా)పై, తొలి రౌండ్‌లో 10–0తో సూఫియా సినాని (మసడోనియా)పై గెలుపొందాడు. అరియాన్‌తో జరిగిన బౌట్‌లో ఇద్దరికీ ఐదు పాయింట్ల చొప్పున లభించినా ... నిబంధనల ప్రకారం చివరి పాయింట్ సాధించిన సితేందర్‌ను విజేతగా ప్రకటించారు. మరోవైపు 110 కేజీల విభాగంలో భారత రెజ్లర్ లక్కీ రజత పతకంతో సరిపెట్టుకున్నాడు. ఫైనల్లో లక్కీ 4–6తో ఒమరోవ్ (రష్యా) చేతిలో ఓడిపోయాడు. ఫ్రీస్టయిల్ విభాగంలో భారత్ 59 పాయింట్లతో ఏడో స్థానాన్ని దక్కించుకుంది. గౌరవ్ (65 కేజీలు) నాలుగో స్థానాన్ని పొందగా... జైవీర్ (55 కేజీలు) క్వార్టర్ ఫైనల్లో ఓడిపోయాడు. మహిళల ఫ్రీస్టయిల్ విభాగంలో భారత్ 151 పాయింట్లతో అగ్రస్థానాన్ని దక్కించుకోగా... గ్రీకో రోమన్ విభాగంలో భారత్ 49 పాయింట్లతో 11వ స్థానంలో నిలిచింది.

సాక్షి ప్లస్
బుధవారం। 6-8-2025





22 నెలల్లో సెంట్రల్ సెక్రటేరియట్ భవనాలు పూర్తి

'కర్తవ్య భవన్' నేడు ప్రారంభం

న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వ కామన్ సెంట్రల్ సెక్రటేరియట్(సీసీఎస్)లోని అన్ని భవనాల నిర్మాణం 22 నెలల్లో పూర్తవుతుందని పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ తెలిపారు. ఇవి పూర్తయితే ప్రస్తుతం వివిధ మంత్రిత్వ శాఖల నడుస్తున్న శాస్త్రి భవన్, కృషి భవన్, నిర్మాణ్ భవన్, ఉద్యోగ్ భవన్ వంటి వాటిని 10 కొత్త భవనాల్లోకి తరలిస్తామన్నారు. సీసీఎస్‌లో భాగమైన మొదటి భవనం 'కర్తవ్య భవన్'ను బుధవారం ప్రధాని మోదీ ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా కర్తవ్య పథ్‌లో జరిగే కార్యక్రమంలో ఆయన ప్రసంగిస్తారు. కర్తవ్య భవన్–03 కూడా కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సెంట్రల్ విస్టా పునరభివృద్ధి ప్రాజెక్టులోనిదే. ఇందులోని నిర్మాణంలో ఉన్న 1, 2 భవనాలు వచ్చే నెలలో పూర్తవుతాయి. సీసీఎస్–10 భవనం వచ్చే ఏడాది ఏప్రిల్‌లో నిర్మాణం పూర్తి చేసుకుంటుంది. సీసీఎస్–6, 7 భవనాల నిర్మాణం 2026 అక్టోబర్ నాటికి రూపుదిద్దుకుంటాయి. ప్రస్తుతం వివిధ మంత్రిత్వ శాఖల నడుస్తున్న శాస్త్రి భవన్, కృషి భవన్, నిర్మాణ్ భవన్, ఉద్యోగ్ భవన్‌లను కూల్చివేసేందుకు రెండు నెలల్లో టెండర్లను ఆహ్వానిస్తామని మంత్రి ఖట్టర్ తెలిపారు. ఈ భవనాల్లోని మంత్రిత్వ శాఖలను తాత్కాలికంగా కస్తూర్బా గాంధీ మార్గ్‌లోని నేతాజీ ప్యాలెస్‌కు తరలిస్తామన్నారు. ఇలా ఉండగా, యావత్ సెంట్రల్ విస్టా నుంచి నిర్మించే మెట్రో లైనును ఇంద్రప్రస్థ మెట్రో స్టేషన్‌తో అనుసంధానం చేస్తామని కేంద్ర గృహ, పట్టణ వ్యవహారాల శాఖ కార్యదర్శి కటికితల శ్రీనివాస్ చెప్పారు. కొత్త మెట్రో లైను సీసీఎస్ భవనాలు, నార్త్ బ్లాక్, సౌత్ బ్లాక్ మీదుగా వెళ్తుందన్నారు.


కర్తవ్య భవన్‌లో మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్

ఎస్ఐఆర్‌పై చర్చించాల్సిందే

అనుమానాలున్నాయ్.. ప్రభుత్వం నివృత్తి చేయాలి
- పార్లమెంట్‌లో తేల్చిచెప్పిన ప్రతిపక్షాలు
- నిరసనలు, నినాదాలతో పలుమార్లు వాయిదా పడిన ఉభయ సభలు

న్యూఢిల్లీ: బిహార్‌లో ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ(ఎస్ఐఆర్)పై ప్రతిపక్షాలు ఎంతకీ పట్టువీడడం లేదు. గత నెల 21న పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రారంభమైనప్పటి నుంచి ఇదే అంశంపై చర్చకు డిమాండ్ చేస్తున్నాయి. సరిగ్గా అసెంబ్లీ ఎన్నికల ముందు చేపట్టిన ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై వెంటనే చర్చించాలని, ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేస్తూ మంగళవారం సైతం పార్లమెంట్‌లో అలజడి సృష్టించాయి. ఈ ప్రక్రియపై ఎన్నో అనుమానాలు ఉన్నాయని, ప్రభుత్వం వాటిని నివృత్తి చేయాలని విపక్ష ఎంపీలు తేల్చిచెప్పారు. నిరసనలు, నినాదాలతో లోక్‌సభ, రాజ్యసభ హోరెత్తిపోయాయి. లోక్‌సభను పలుమార్లు వాయిదా వేయాల్సి వచ్చింది. రాజ్యసభలోనూ ఇదే పరిస్థితి కనిపించింది.

నినాదాల హోరు

లోక్‌సభలో ఉదయం 11 గంటలకు ప్రారంభమైన వెంటనే స్పీకర్ ఓం బిర్లా.. కేంద్ర మాజీ మంత్రి శిబూ సోరెన్ సహా ముగ్గురు దివంగత సభ్యులకు నివాళులర్పించారు. అనంతరం విపక్ష ఎంపీలు తమ స్థానాల్లో నిల్చొని నినాదాలు ప్రారంభించారు. ప్లకార్డులు ప్రదర్శించారు. ఎస్ఐఆర్‌పై చర్చకు ప్రభుత్వం ముందుకు రావాలని అన్నారు. ఇంతలో స్పీకర్ ప్రశ్నోత్తరాలు ప్రారంభించారు. అయినప్పటికీ నినాదాలు ఆగకపోవడంతో విపక్షాలపై ఆగ్రహం వ్యక్తంచేశారు. సభ గౌరవాన్ని దిగజార్చేలా ప్రవర్తించవద్దని హితవు పలికారు. సభకు సహకరించాలని కోరారు. విపక్ష ఎంపీలు వినిపించుకోకపోవడంతో సభను మ ధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా వేశారు. సభ పునః ప్రారంభమైన తర్వాత కూడా పరిస్థితిలో మార్పు రాలేదు. విపక్షాలు శాంతించకపోవడంతో సభను బుధవారానికి వాయి దా వేస్తున్నట్లు ఓం బిర్లా ప్రకటించారు. అంతకుముందు గోవా అసెంబ్లీలో ఎస్టీలకు రిజర్వేషన్లు కల్పించేందుకు ఉద్దేశించిన బిల్లు లోక్‌సభలో మూజువాణి ఓటుతో ఆమోదం పొందింది. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణపై రాజ్యసభలోనూ రగడ యథాతథంగా కొనసాగించింది. ఎస్ఐఆర్‌పై చర్చకు రూల్ 267 కింద విపక్షాలు 34 వాయిదా తీర్మానం నోటీసులు ఇవ్వగా డిప్యూటీ చైర్మన్ హరివంశ్ తిరస్కరించారు. వెంటనే చర్చ ప్రారంభించాలన్న విపక్షాల డిమాండ్ పట్ల సభాపతి సానుకూలంగా స్పందించలేదు. కాంగ్రెస్ సహా ఇతర పార్టీల ఎంపీలు వెల్‌లోకి దూసుకొచ్చి బిగ్గరగా నినాదాలు చేస్తుండడంతో సభ తొలుత రెండుసార్లు.. చివరకు బుధవారానికి వాయిదా పడింది.

మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన పొడిగింపు

ఈశాన్య రాష్ట్రం మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన మరో ఆరు నెలలపాటు పొడిగిస్తూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన తీర్మానం పార్లమెంట్ ఆమోదం పొందింది. ఈ తీర్మానం లోక్‌సభలో ఇప్పటికే ఆమోదం పొందగా, రాజ్యసభలో మంగళవారం ఆమోదించారు. అలాగే కస్టమ్స్ టారిఫ్ యాక్ట్–1975లోని రెండో షెడ్యూల్‌ను సవరిస్తూ మరో తీర్మానాన్ని రాజ్యసభలో ఆమోదించారు.

మేము ఉగ్రవాదులమా?: ఖర్గే

రాజ్యసభలో విపక్ష నేత మల్లికార్జున ఖర్గే తీరుపై డిప్యూటీ చైర్మన్ హరివంశ్ అసంతృప్తి వ్యక్తంచేశారు. గతవారం తనకు రాసిన లేఖను మీడియాకు విడుదల చేయడం సరైంది కాదని అన్నారు. గతవారం రాజ్యసభ వెల్‌లో విపక్ష సభ్యులు నినాదాలు చేస్తుండగా, సీఐఎస్ఎఫ్ జవాన్లు రంగంలోకి దిగి వారిని బయటకు తీసుకెళ్లారు. రాజ్యసభలోకి పారామిలటరీ సిబ్బంది రావడం పట్ల ఖర్గే మండిపడ్డారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించకుండా విపక్షాలు గొంతు నొక్కేస్తున్నారని, ప్రజాస్వామ్య హక్కును అణచివేస్తున్నారని ఆరోపించారు. సభలో పారామిలటరీ దళాన్ని అనుమతించకూడదని కోరుతూ హరివంశ్‌కు లేఖ రాశారు. అనంతరం ఈ లేఖను మీడియాకు విడుదల చేశారు. అయితే, డిప్యూటీ చైర్మన్‌కు రాసిన లేఖ సభాహక్కుల పరిధిలోకి వస్తుందని, దాన్ని బయటపెట్టడం ఏమిటని హరివంశ్ ప్రశ్నించారు. పార్లమెంట్‌లో పారామిలటరీ సిబ్బంది సేవలు ఉపయోగించుకోవడం కొత్తేమీ కాదన్నారు. ఖర్గే స్పందిస్తూ.. తాము ప్రజాస్వామ్య విధానంలో నిరసన తెలిపామని, ఇకపై కూడా నిరసన కొనసాగిస్తామని బదులిచ్చారు. సభలో సీఐఎస్ఎఫ్ జవాన్లు అడ్డుకున్నారని, మేము ఉగ్రవాదులమా? అని ప్రశ్నించారు. డిప్యూటీ చైర్మన్‌కు రాసిన లేఖపై ప్రెస్‌నోట్ మాత్రమే మీడియాకు విడుదల చేశానని పేర్కొన్నారు. సభ్యులందరి కోసమే ఈ పని చేశానన్నారు. పోలీసులను, సైన్యాన్ని తీసుకొచ్చి సభను నడిపిస్తారా? అని నిలదీశారు. ఖర్గే వ్యాఖ్యలపై పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు అభ్యంతరం వ్యక్తంచేశారు. తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. గతవారం మార్షల్స్ మాత్రమే లోపలికి వచ్చారని, పారామిలటరీ సిబ్బంది రాలేదని స్పష్టంచేశారు. సభలో తప్పుడు ఆరోపణలు చేసేవారిపై చర్యలు తీసుకోవాలన్నారు. కేంద్ర మంత్రి జె.పి.నడ్డా మాట్లాడుతూ.. తాను గతంలో 40 ఏళ్లు ప్రతిపక్షంలో ఉన్నానని, ప్రభావవంతమైన ప్రతిపక్షంగా ఎలా పని చేయాలో నేర్చుకోవాలంటే తన వద్దకు ట్యూషన్‌కు రావాలని కాంగ్రెస్ సభ్యులకు సూచించారు.



ఫిబ్రవరిలో పార్లమెంట్ ఎన్నికలు

బంగ్లాదేశ్ చీఫ్ అడ్వైజర్ యూనుస్ వెల్లడి

ఢాకా: బంగ్లాదేశ్ పార్లమెంట్‌కు వచ్చే ఏడాది ఫిబ్రవరిలో ఎన్నికలు జరుపుతామని ఆపద్ధర్మ ప్రభుత్వ సారథి, చీఫ్ అడ్వైజర్ యూనుస్ మహ్మద్ తెలిపారు. ఆపద్ధర్మ ప్రభుత్వం ఏర్పాటై ఏడాది నిండిన సందర్భంగా మంగళవారం దేశ ప్రజలనుద్దేశించి టీవీ ద్వారా ప్రసంగించారు. జాతీయ ఎన్నికలను 2026 ఫిబ్రవరిలో రంజాన్‌కు ముందుగానే నిర్వహించాలని కోరుతూ ప్రభుత్వం ఎన్నికల కమిటీకి లేఖ రాయనున్నట్లు తెలిపారు. గతేడాది ఉవ్వెత్తున లేచిన విద్యార్థి ఉద్యమాన్ని ఆయన జూలై ఉద్యమంగా అభివర్ణించారు. విద్యార్థులు, యువత ఆందోళనల ఫలితంగానే షేక్ హసీనా ప్రధాని పదవిని వదిలేయడం తెల్సిందే. కాగా, వచ్చే ఏడాదిలో రంజాన్ నెల ఫిబ్రవరి 17 లేదా 18వ తేదీల నుంచి మొదలుకానుంది. సాధారణ ఎన్నికలను వచ్చే ఏడాది ఏప్రిల్ జరుపుతామని ఇంతకుముందు ప్రభుత్వం ప్రకటించింది. విద్యార్థి ఉద్యమానికి ఏడాది పూర్తయిన సందర్భంగా మంగళవారం ఢాకాలో జరిగిన ర్యాలీలో ఆయన ప్రసంగించారు. రాబోయే ఎన్నికలు మన దేశ చరిత్రలో నిలిచిపోవాలని కోరుకుంటున్నా. శాంతియుత, పండగ వాతావరణంలో జనం పెద్ద సంఖ్యలో తరలి వచ్చి ఓటింగ్‌లో పాల్గొనాలి. ఈ ఎన్నికలు నిష్పాక్షికంగా జరిగేందుకు అన్ని విధాలుగా సహకరిస్తామని హామీ ఇస్తున్నా. ఇందుకు తమ యంత్రాంగం సర్వ సన్నద్ధంగా ఉంది' అని యూనుస్ తెలిపారు.

బెంగాల్‌లో బీజేపీ నేత

సువేందు కాన్వాయ్‌పై దాడి

పగిలిన బుల్లెట్‌ప్రూఫ్ కారు అద్దాలు

కూచ్ బెహార్ (పశ్చిమబెంగాల్): పశ్చిమబెంగాల్ అసెంబ్లీలో ప్రతిపక్ష నేత సువేందు అధికారి వాహన శ్రేణిపై అధికార టీఎంసీ కార్యకర్తలుగా భావిస్తున్న కొందరు దాడికి దిగారు. కూచ్ బెహార్ జిల్లా ఖగ్రాబారి ప్రాంతంలో మంగళవారం ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ దాడిలో సువేందు అధికారి, కేంద్ర మాజీ మంత్రి నిశిత్ ప్రామాణిక్ ఉన్న బుల్లెట్ ప్రూఫ్ వాహనం అద్దాలు పగిలిపోయాయి. పోలీసు ఎస్కార్టుకు చెందిన ఒక వాహనం అద్దాలు సైతం ధ్వంసమయ్యాయి. బీజేపీ కార్యకర్తలపై జరుగుతున్న దాడులకు నిరసనగా కూచ్ బెహార్ ఎస్పీ కార్యాలయం వద్ద బీజేపీ తలపెట్టిన నిరసన కార్యక్రమానికి ఆయన వెళ్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. బీజేపీ పాలనలో బెంగాలీలపై వేధింపులకు నిరసనగా ఆ మార్గంలో 19 చోట్ల టీఎంసీ కార్యకర్తలు ఆయన కాన్వాయ్‌ను అడ్డుకున్నారు. కూచ్ బెహార్ పట్టణ శివారులోని గోక్సదంగా ఏరియాలో నల్ల జెండాలు చేబూనిన టీఎంసీ శ్రేణులు 'గో బ్యాక్, దొంగ'అంటూ సువేందు అధికారికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. 'ఖగ్రాబారి వద్ద రాడ్లు, కర్రలతో నా కారుపై దాడికి యత్నించారు. వీలుకాకపోవడంతో బండరాళ్లతో బుల్లెట్ ప్రూఫ్ అద్దాలను పగులగొట్టారు'అని సువేందు ఆరోపించారు. ఈ ప్రాంతంలోకి దొంగచాటుగా వచ్చిన రోహింగ్యాలతో టీఎంసీయే ఈ దాడి చేయించిందన్నారు. ఇలాంటివి జరుగుతాయనే అనుమానంతోనే హైకోర్టు నుంచి అనుమతి తీసుకుని నిరసన కార్యక్రమాన్ని తలపెట్టామన్నారు. ముందుగా పోలీసులు, అధికార యంత్రాంగానికి సమాచారమిచ్చినా చర్యలు తీసుకోకపోవడంపై తగు రీతిలో స్పందిస్తామని సువేందు అన్నారు. రాష్ట్ర మంత్రి ఉదయన్ గుహ ఈ దాడి చేయించారని, ఇది తమపై హత్యాయత్నమేనని కేంద్ర మాజీ మంత్రి నిశిత్ ప్రామాణిక్ ఆరోపించారు. కాగా, ఈ ఘటనలో మరెవరైనా గాయపడిందీ లేనిదీ తెలియరాలేదు.

రూ.67,000 కోట్లతో కొనుగోళ్లకు డీఏసీ అనుమతి

రక్షణ శాఖకు డ్రోన్లు, రాడార్లు, మిస్సైల్ వ్యవస్థలు

న్యూఢిల్లీ: భారత రక్షణ శాఖ అమ్ములపొదిలోకి అత్యాధునిక లాంగ్ ఎండ్యూరెన్స్ డ్రోన్లు, మౌంటైన్ రాడార్లు, మిస్సైల్ వ్యవస్థలు చేరబోతున్నాయి. రూ.67,000 కోట్ల వీటి కొనుగోలుకు రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ నేతృత్వంలోని రక్షణ సేకరణ మండలి(డీఏసీ) ఆమోద ముద్ర వేసింది. డ్రోన్లు, రాడార్లు, మిస్సైల్ వ్యవస్థలతో మన సైనిక సామర్థ్యం మరింత బలోపేతం అవుతుందని అధికార వర్గాలు తెలిపాయి. కొనుగోలు చేసేవాటిలో భారత నావికాదళానికి అవసరమైన కాంపాక్ట్ అటానమస్ సర్ఫేస్ క్రాఫ్ట్, బ్రహ్మోస్ ఫైర్ కంట్రోల్ వ్యవస్థ, లాంచర్లు కూడా ఉన్నాయి. బరాక్–1 పాయింట్ డిఫెన్స్ మిస్సైల్ వ్యవస్థను కూడా అప్‌గ్రేడ్ చేయబోతున్నారు. వైమానిక దళంలో ప్రస్తుతం పని చేస్తున్న స్పైడర్ వెపన్ సిస్టమ్ స్థానంలో మౌంటైన్ రాడార్లు ప్రవేశపెట్టబోతున్నారు. దేశ సరిహద్దులో వీటిని మోహరిస్తారు.

గురూజీకి కన్నీటి వీడ్కోలు

- జార్ఖండ్‌లో శిబూ సోరెన్ అంత్యక్రియలు పూర్తి
- కడసారి దర్శనం కోసం తరలివచ్చిన వేలాది మంది అభిమానులు

నెమ్రా: జార్ఖండ్ ముక్తిమోర్చా వ్యవస్థాపకుడు, జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి, కేంద్ర మాజీ మంత్రి శిబూ సోరెన్ అంత్యక్రియలు మంగళవారం పూర్తయ్యాయి. వేలాది మంది అభిమానులు, పార్టీ నేతలు, కార్యకర్తలు తమ గురూజీకి కన్నీటి వీడ్కోలు పలికారు. చాలారోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న శిబూ సోరెన్ సోమవారం ఢిల్లీ ఆసుపత్రిలో కన్నుమూసిన సంగతి తెలిసిందే. పార్థివదేహాన్ని తొలుత ఢిల్లీ నుంచి విమానంలో జార్ఖండ్ రాజధాని రాంచీకి తరలించారు. రాష్ట్ర అసెంబ్లీలో శిబూ సోరెన్ పార్థివదేహం వద్ద గవర్నర్ సంతోష్ గంగ్వార్, స్పీకర్ రవీంద్రనాథ్ మహతో, పలువురు కేంద్ర మంత్రులు, రాష్ట్ర మంత్రులు, ప్రజాప్రతినిధులు నివాళులర్పించారు. అనంతరం రామ్‌గఢ్ జిల్లాలోని శిబూ సోరెన్ స్వగ్రామం నెమ్రాకు భౌతికకాయాన్ని తరలించారు. కడసారి దర్శనం కోసం భారీగా జనం తరలివచ్చారు. గురూజీ అమర్ రహే అంటూ నినదించారు. అనంతరం అంతిమ యాత్ర మొదలైంది. ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు జరిగాయి. పోలీసులు గాల్లోకి తుపాకులు పేల్చి వందనం సమర్పించారు. శిబూ సోరెన్ చితికి ఆయన పెద్ద కుమారుడు, జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ నిప్పంటించారు. ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్, కేంద్ర మాజీ మంత్రి అర్జున్ ముండా తదితరులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. కాంగ్రెస్ అగ్రనేతలు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ హాజరు కాలేకపోయారు. వారు తొలుత విమానంలోని ఢిల్లీ నుంచి రాంచీకి చేరుకున్నారు. అక్కడి హెలికాప్టర్‌లో బయలుదేరాల్సి ఉండగా, సాంకేతిక సమస్యలతో హెలికాప్టర్ టేకాఫ్ కాలేదు. దాంతో రోడ్డు మార్గంలో సాయంత్రం కల్లా నెమ్రాకు చేరారు. హేమంత్ సోరెన్‌తోపాటు ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. మరోవైపు జార్ఖండ్ ప్రభుత్వం మూడు రోజులపాటు సంతాపం దినాలు ప్రకటించింది. మంగళవారం జార్ఖండ్‌లో పాఠశాలలు మూసివేశారు. జార్ఖండ్ అసెంబ్లీ సమావేశాలు సైతం నిరవధికంగా వాయిదా పడ్డాయి.


శిబూ సోరెన్ అంతిమ యాత్రలో పెద్ద సంఖ్యలో పాల్గొన్న జనం

కల్యాణ్ బెనర్జీ రాజీనామా ఆమోదం

- చీఫ్ విప్‌గా మరొకరి నియామకం
- పార్టీ నేతల మధ్య విభేదాలపై టీఎంసీ చీఫ్ మమత సీరియస్

కోల్‌కతా: తృణమూల్ కాంగ్రెస్‌లో అంతర్గత విభేదాలు, అసమ్మతి గళాలను ఆ పార్టీ చీఫ్, పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీ తీవ్రంగా పరిగణిస్తున్నారు. సోమవారం లోక్‌సభలో పార్టీ చీఫ్ విప్ పదవికి సీనియర్ నేత కల్యాణ్ బెనర్జీ సమర్పించిన రాజీనామాను ఆమె ఆమోదించారు. ఆవెంటనే, కల్యాణ్ బెనర్జీ స్థానంలో కకోలీ ఘోష్‌కు చీఫ్ విప్ బాధ్యతలు అప్పగించారు. లోక్‌సభలో పార్టీ ఉపనేతగా శతాబ్ది రాయ్‌ను నియమించారు. కేవలం 24 గంటల వ్యవధిలోనే ఇవన్నీ చకచకా జరిగిపోయాయి. అసమ్మతిని, తిరుగుబాటు వైఖరిని సహించే ప్రసక్తేలేదని దీనిద్వారా ఆమె చెప్పకనే చెప్పినట్లయింది. 'పార్టీ కంటే తామే మిన్న అని భావించే వారికి ఇదో హెచ్చరిక. వారికి ఇటువంటి గట్టి సందేశం ఇవ్వాల్సిన అవసరం ఉంది'అని టీఎంసీ సీనియర్ నేత ఒకరు పేర్కొన్నారు. మమతా బెనర్జీ మేనల్లుడు, టీఎంసీ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీకి లోక్‌సభలో పార్టీ నేతగా సోమవారం బాధ్యతలు అప్పగించడం తెల్సిందే. పార్లమెంట్ సమావేశాలకు సరిగ్గా రాని ఎంపీలను వదిలేసి, తనది సమన్వయ లోపమని టీఎంసీ చీఫ్ మమత తప్పుబడుతున్నారంటూ కల్యాణ్ బెనర్జీ సోమవారం బహిరంగంగా వ్యాఖ్యానించడం తెల్సిందే. కొంతకాలంగా కల్యాణ్ బెనర్జీ, పార్టీకే చెందిన మరో ఎంపీ మహువా మొయిత్రాలు మధ్య సోషల్ మీడియా వేదికగా రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసుకుంటున్న నేపథ్యంలోనే ఈ పరిణామాలు సంభవించడం గమనార్హం.

ఎన్నికల కోసం ఎన్ఎస్‌యూఐ నిరసన

- సచిన్ పైలట్ సహా కాంగ్రెస్ నేతలపై వాటర్ కెనన్లు
- 30 మందిని అరెస్ట్ చేసిన పోలీసులు

జైపూర్: రాజస్తాన్‌లో విద్యార్థి సంఘాల ఎన్నికలను నిర్వహించాలంటూ కాంగ్రెస్ అనుబంధ ఎన్ఎస్‌యూఐ కార్యకర్తలు, ఆ పార్టీ నేతలు చేపట్టిన ఆందోళన ఉద్రిక్తతకు దారి తీసింది. జైపూర్‌లోని షహీద్ స్మారక్ వద్ద జరిగిన నిరసన కార్యక్రమంలో కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి సచిన్ పైలట్ కూడా పాల్గొన్నారు. వీరిని చెదరగొట్టేందుకు పోలీసులు వాటర్ కెనన్లను ప్రయోగించారు. బారికేడ్లను దాటి సివిల్ లైన్స్ ప్రాంతంలో ఉన్న సీఎం నివాసానికి వెళ్లేందుకు ప్రయత్నించిన ఆందోళనకారులను పోలీసులు అడ్డుకున్నారు. వారిపైకి వాటర్ కెనన్లను ప్రయోగించారు. ఈ సందర్భంగా ఇరువర్గాల మధ్య తోపులాట చోటుచేసుకుంది. కాంగ్రెస్ ఎమ్మెల్యే ముకేశ్ భాకర్, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు వినోద్ జాకడ్ సహా 30 నాయకులు, కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కార్యక్రమంలో అంతకుముందు పైలట్ మాట్లాడారు. 'ఢిల్లీలోని ప్రభుత్వాన్ని ఆదర్శంగా తీసుకుని రాష్ట్రంలోని బీజేపీ ప్రభుత్వం నియంతృత్వంతో వ్యవహరిస్తోందని నిప్పులు చెరిగారు. నిలిపివేసిన విద్యార్థి సంఘాల ఎన్నికలను తిరిగి నిర్వహించాలని డిమాండ్ చేశారు. పార్లమెంట్‌లో ప్రతిపక్ష నేతలను మాట్లాడకుండా చేసినట్లే ఇక్కడి రాష్ట్ర ప్రభుత్వం కూడా వ్యవహరిస్తోందని విమర్శించారు. రాజకీయాలు విద్యార్థి దశ నుంచే ప్రారంభం కావాలని, గెలుపోటములు కాకుండా ఎన్నికల ప్రక్రియను చేపట్టడమే ముఖ్యమైన అంశమన్నారు. ప్రజల్లో విశ్వసనీయత కోల్పోయిన రాష్ట్రంలోని బీజేపీ ప్రభుత్వం పంచాయతీ, మున్సిపల్ ఎన్నికలను సైతం జరిపేందుకు భయపడుతోందని పైలట్ ఆరోపించారు.

ఇమ్రాన్ విడుదల కోరుతూ ఆందోళనలు

500కు పైగా పీటీఐ మద్దతుదారుల అరెస్ట్

ఇస్లామాబాద్: మాజీ ప్రధానమంత్రి ఇమ్రాన్ ఖాన్‌ను వెంటనే విడుదల చేయాలని డిమాండ్‌తో పాకిస్తాన్ తెహ్రీక్–ఇ–ఇన్సాఫ్(పీటీఐ) శ్రేణులు మంగళవారం దేశవ్యాప్త నిరసనలు చేపట్టాయి. అవినీతి ఆరోపణలపై 2023 ఆగస్టులో లాహోర్‌లో అరెస్ట్ చేసిన అధికారులు ఆయన్ను రావల్పిండిలోని అడియాలా జైలులో ఉంచారు. ఆ తర్వాత మరికొన్ని ఆరోపణలు రావడంతో దర్యాప్తు జరుగుతోంది. జైలు నుంచి ఇమ్రాన్ ఇచ్చిన పిలుపు మేరకు కార్యకర్తలు ఆందోళనలకు దిగారు. దేశవ్యాప్తంగా తమ పార్టీకి చెందిన 500 మందికి పైగా నాయకులు, కార్యకర్తలను పోలీసులు అరెస్ట్ చేశారని పీటీఐ తెలిపింది. అత్యధికంగా పంజాబ్ ప్రావిన్స్‌కు చెందిన వారిని అరెస్ట్ చేశారంది. లాహోర్‌లో జరిగిన లాయర్ల ర్యాలీకి పెద్ద సంఖ్యలో జనం హాజరయ్యారు. పలు చోట్ల పోలీసులు, పీటీఐ శ్రేణుల మధ్య ఘర్షణలు చోటుచేసుకున్నాయి. 'మా నేతను రెండేళ్లుగా జైలులో ఉంచారు. లాయర్లను, కుటుంబసభ్యులను ఆయన కలుసుకోకుండా ఆంక్షలు విధించారు. ఒకరిద్దరు పార్టీ నేతలకు మాత్రమే ఇమ్రాన్‌తో మాట్లాడేందుకు అనుమతిస్తున్నారు. మా పార్టీ సమావేశాలపై ప్రభుత్వం నిషేధం విధించింది. దేశంలో ప్రజాస్వామ్యం, మానవహక్కులు లేనేలేవు'అని సీనియర్ నేత జుల్ఫి బొఖారి ఆరోపించారు. మీడియాలో పీటీఐ ర్యాలీల కవరేజీపై యంత్రాంగం నిషేధం అమలు చేస్తోందన్నారు.

డేరా బాబాకు 40 రోజుల పెరోల్

చండీగఢ్: డేరా సచ్చా సౌదా చీఫ్ గుర్మీత్ రామ్ రహీమ్ సింగ్ అలియాస్ డేరా బాబాకు మరోసారి తాత్కాలిక స్వేచ్ఛ లభించింది. కోర్టు 40 రోజుల పెరోల్‌మంజూరు చేయడంతో మంగళవారం హరియాణా రాష్ట్రం రోహతక్‌లోని జైలు నుంచి బాబా బయటకు వచ్చారని లాయర్ జితేందర్ ఖురానా తెలిపారు. సిర్సాలో ఉన్న డేరా ప్రధాన కార్యాలయంలోనే ఆయన వచ్చే 40 రోజులు గడపాల్సి ఉంటుందన్నారు. డేరా వద్దకు ఎవరూ రావద్దంటూ అనుచరులనుద్దేశించి విడుదల చేసిన వీడియోలో బాబా కోరారు. ఇద్దరు శిష్యురాళ్లపై అత్యాచారం చేశారన్న కేసులో కోర్టు డేరా బాబాకు 2017లో 20 ఏళ్ల జైలు శిక్ష విధించింది. ఈ ఏడాది జనవరి, ఏప్రిల్ నెలల్లోనూ ఆయన ఫర్లో, పెరోల్‌పై బయటకు వచ్చారు. తాజా పెరోల్‌తో కలిపితే ఈ ఏడాది దాదాపు మూడు నెలలపాటు జైలు బయట గడిపినట్లవుతుంది. 2024, 2022 సంవత్సరాల్లోనూ ఆయనకు కోర్టు ఫర్లా వెసులుబాటు కల్పించింది. 2017లో జైలుకు వెళ్లిన తర్వాత కనీసం 13 సార్లు ఆయన బయటకు వచ్చారు. డేరా సచ్చా సౌదాకు హరియాణా, పంజాబ్, రాజస్తాన్ తదితర రాష్ట్రాల్లో చెప్పుకోదగ్గ సంఖ్యలో అనుచరులున్నారు.

కెనడాలో 'ఖలిస్తాన్ ఎంబసీ'..!

ఒట్టావా: కెనడాలోని కరుడుగట్టిన ఖలిస్తాన్ వాదులు ఎంబసీ ఆఫ్ ది రిపబ్లిక్ ఆఫ్ ఖలిస్తాన్ పేరుతో బ్రిటిష్ కొలంబియా ప్రావిన్స్‌లో ఓ ఆఫీసును ఏర్పాటు చేయడం కలకలం రేపుతోంది. ఖలిస్తాన్ ఉగ్రవాది హర్దీప్ సింగ్ నిజ్జర్ హత్య, అనంతర పరిణామాలతో తీవ్రంగా దెబ్బతిన్న భారత్–కెనడాల సంబంధాలు ఇటీవలి కాలంలో తిరిగి గాడిన పడుతున్న సమయంలో ఈ పరిణామం చోటుచేసుకోవడం ఆందోళన కలిగిస్తోంది. సర్రేలోని గురు నానక్ సిఖ్ గురుద్వారాలోని ఓ భాగంలో ఈ 'ఎంబసీ'ని ఏర్పాటు చేశారు. ఈ గురుద్వారా 2023లో హత్యకు గురైన హర్దీప్ సింగ్ నిజ్జర్ ఏర్పాటు చేసింది కావడం గమనార్హం. ఈ గురుద్వారా పార్కింగ్ ప్రదేశంలో ఉండగా దుండగులు నిజ్జర్‌ను కాల్చి చంపారు. 'ఖలిస్తాన్ రెఫరెండం'చేపట్టేందుకు నిషేధిత సిఖ్స్ ఫర్ జస్టిస్(ఎస్ఎఫ్‌జే) ఏర్పాట్లు సాగుతుండగానే ఈ ఎంబసీని ఏర్పాటు చేయడం గమనార్హం. ఇక్కడి పరిణామాలను భారత భద్రతా విభాగాలు నిశితంగా పరిశీలిస్తున్నాయని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. దేశ భద్రతకు ఖలిస్తానీ ఉగ్రవాదులు ముప్పుగా మారారంటూ భారత దేశం తరచూ వ్యక్తం చేస్తున్న ఆందోళనలపై తగు చర్యలు తీసుకోవడంలో కెనడా ప్రభుత్వం విఫలమైందనడానికి ఎంబసీ ఏర్పాటును మరో ఉదాహరణగా భావిస్తున్నారు. అంతేకాదు, కెనడా గడ్డపై ఖలిస్తానీ తీవ్రవాదుల చర్యలు భద్రతకు భంగకరంగా మారాయంటూ కెనడా సెక్యూరిటీ ఇంటెలిజెన్స్ సర్వీస్(సీఎస్ఐఎస్)ఇటీవల విడుదల చేసిన నివేదికలో మొట్టమొదటిసారిగా బహిరంగంగా ఒప్పుకోవడం గమనార్హం.

ధర్మస్థలలో కొనసాగుతున్న తవ్వకాలు

యశవంతపుర: కర్ణాటక రాష్ట్రం దక్షిణ కన్నడ జిల్లాలోని ధర్మస్థల పుణ్యక్షేత్రం పరిసరాల్లో తవ్వకాలు కొనసాగుతున్నాయి. ఇక్కడ వందలాది మందిని హత్య చేసి, మృతదేహాలను ఖననం చేశారని ఆరోపణలు వచ్చిన సంగతి తెలిసిందే. పారిశుధ్య కార్మికుడు చెప్పిన 13 పాయింట్లకుగాను 10 ప్రదేశాల్లో తవ్వకాలు జరిగాయి. మంగళవారం 11వ పాయింట్‌లో సిట్ అధికారులు, పోలీసులు కూలీలతో తవ్వించారు. అక్కడ అస్థిపంజరాలేవీ లభించలేదని సమాచారం. సోమవారం 10వ పాయింట్ వద్ద కొన్ని అస్థిపంజరాల అవశేషాలు దొరికాయి. దీంతో మంగళవారం ఇంకా ఎక్కువ ఆధారాలేమైనా దొరుకుతాయా? అనే ఉత్కంఠ ఏర్పడింది. 11వ పాయింట్‌లో రెండున్నర గంటల పాటు ఆరు అడుగుల లోతు వరకు తవ్వకాలు జరిపారు. ఎలాంటి కళేబరాలు లభించలేదు. తరువాత ఆ గుంతను పూడ్చివేశారు. మధ్యాహ్నం తర్వాత 12వ పాయింట్‌లో తవ్వకాలు చేపట్టగా, భారీ వర్షం కురవడంతో ఆటంకం ఏర్పడింది. కార్మికులు మట్టిని తోడే పనిలో నిమగ్నమయ్యారు. ఇప్పటిదాకా ఆరు పాయింట్లలో మానవ అస్థిపంజరాల అవశేషాలు లభించాయి. 13వ పాయింట్‌లో తవ్వాల్సి ఉంది.

దేశంలో మొదటి దళిత ముఖ్యమంత్రి?

రాష్ట్ర శాసనసభ

శాసనసభ్యుల అనర్హతలు

ఆర్టికల్ 191 ప్రకారం రాష్ట్ర శాసనసభ్యుల సభ్యత్వం ఈ కింది సందర్భాల్లో రద్దవుతుంది.

- ఎన్నికైన తర్వాత ప్రభుత్వంలోని లాభదాయక పదవుల్లో కొనసాగినప్పుడు.
- మానసిక స్థిమితం కోల్పోయినట్లు సంబంధిత కోర్టు ధ్రువీకరించినప్పుడు.
- దివాలా తీసినట్లు కోర్టు ధ్రువీకరిస్తే.
- విదేశీ పౌరసత్వాన్ని పొందినప్పుడు లేదా ఇతర దేశాల పట్ల విధేయత ప్రకటించిన సందర్భంలో.
- పార్టీ ఫిరాయింపులకు పాల్పడినప్పుడు
- సభాధ్యక్షుల అనుమతి లేకుండా వరుసగా 60 రోజులు శాసనసభా సమావేశాలకు గైర్హాజరు అయినప్పుడు.
- పార్లమెంటు నిర్ణయించిన ఇతర సందర్భాల్లోనూ సభ్యత్వం రద్దవుతుంది.

ఆర్టికల్ 192 ప్రకారం శాసనసభ్యుల అనర్హతను గవర్నర్ నిర్ణయిస్తారు. కేంద్ర ఎన్నికల సంఘం సలహా మేరకు శాసనసభ్యుల సభ్యత్వాన్ని రద్దు చేయవచ్చు. గవర్నర్‌దే తుది నిర్ణయం. పార్టీ ఫిరాయింపుల చట్టం ప్రకారం ఆయా సభాధ్యక్షులు సంబంధిత పార్టీ అధ్యక్షుడి సలహా మేరకు శాసనసభ్యుల సభ్యత్వాన్ని రద్దు చేయవచ్చు. శాసనసభ్యులు తమ రాజీనామాను లిఖిత పూర్వకంగా ఆయా సభాధ్యక్షులకు వ్యక్తిగతంగా సమర్పించాలి.

పదవీ ప్రమాణ స్వీకారం

శాసనసభ్యుల ప్రమాణ స్వీకారం గురించి ఆర్టికల్ 188 తెలుపుతుంది. విధాన సభ సభ్యులు, విధాన పరిషత్ సభ్యులతో రాష్ట్ర గవర్నర్ లేదా ఆయన నియమించిన ప్రతినిధి ప్రమాణ స్వీకారం చేయిస్తారు.

ఈ వివరాలను మూడో షెడ్యూల్‌లో పొందు పరిచారు.

జీతభత్యాలు

శాసనసభ్యుల జీతభత్యాలను శాసనసభ ఒక చట్టం ద్వారా నిర్ణయిస్తుంది. వీరి జీతాలను రాష్ట్ర సంఘటిత నిధి నుంచి చెల్లిస్తారు. పదవీ విరమణ తర్వాత పెన్షన్ సౌకర్యం ఉంటుంది.

శాసన నిర్మాణ ప్రక్రియ

శాసన నిర్మాణ ప్రక్రియ పార్లమెంటు శాసన నిర్మాణ ప్రక్రియను పోలి ఉంటుంది. సాధారణ బిల్లుల విషయంలో పార్లమెంటులో రాజ్యసభకు లోక్‌సభతో సమానమైన అధికారాలు ఉంటాయి. కానీ రాష్ట్ర శాసనసభలో దిగువ సభ అయిన విధానసభకు ఆధిపత్యం ఉంటుంది. విధానసభ నిర్ణయమే అంతిమంగా చెల్లుబాటు అవుతుంది.

విధాన సభ ఒక బిల్లును ఆమోదించి విధాన పరిషత్‌కు పంపితే ఎగువ సభ దానిపై మూడు నెలల్లోగా తన అభిప్రాయాన్ని తెలపాలి. ఒకవేళ విధాన పరిషత్ ఆ బిల్లును తిరస్కరిస్తే, విధాన సభ రెండోసారి ఆ బిల్లును ఆమోదించి, ఎగువ సభ ఆమోదం కోసం మళ్లీ పంపవచ్చు. ఈసారి ఎగువ సభ నెల రోజుల్లోగా తన అభిప్రాయం తెలపాలి. ఆ తర్వాత ఎగువసభ అభిప్రాయంతో నిమిత్తం లేకుండా బిల్లు ఆమోదం పొందినట్లు పరిగణిస్తారు.



సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

పాలిటీ

ఆర్టికల్ 196 ప్రకారం సాధారణ బిల్లులను ఉభయ సభల్లో ఏ సభలోనైనా ప్రవేశపెట్టవచ్చు.

ఎగువసభ ఒక సాధారణ బిల్లును గరిష్ఠంగా నాలుగు నెలల వరకు వాయిదా వేయవచ్చు. కానీ అంతిమంగా విధాన సభ నిర్ణయమే చెల్లుబాటు అవుతుంది. ఉభయ సభల మధ్య బిల్లు విషయంలో వివాదం తలెత్తితే సంయుక్త సమావేశానికి ఆస్కారం లేదు. ఒకవేళ బిల్లు ఎగువ సభలో ప్రవేశపెట్టి, ఆమోదించిన తరువాత దాన్ని దిగువ సభ ఆమోదానికి పంపితే, విధాన సభ ఆ బిల్లును తిరస్కరిస్తే బిల్లు వీగిపోతుంది. దీన్నిబట్టి విధాన పరిషత్‌కు సాధారణ బిల్లు విషయంలో కూడా విధాన సభతో సమాన అధికారాలు లేవని అర్థమవుతోంది. ఎగువ సభ బిల్లును వాయిదా వేస్తుందే కానీ అడ్డుకోలేదు. ఆర్థిక, ద్రవ్య బిల్లుల విషయంలో కూడా విధాన సభదే అంతిమ అధికారం.

సభాధ్యక్షులు

(స్పీకర్, డిప్యూటీ స్పీకర్, చైర్మన్, డిప్యూటీ చైర్మన్)

శాసనసభలో ఉభయ సభలకు వేర్వేరుగా సభాధ్యక్షులు ఉంటారు. సభా కార్యక్రమాల నిర్వహణలో వీరు కీలక పాత్ర వహిస్తారు.

స్పీకర్/డిప్యూటీ స్పీకర్

రాష్ట్ర విధాన సభ స్పీకర్, డిప్యూటీ స్పీకర్ పదవుల గురించి ఆర్టికల్ 178 తెలుపుతుంది. విధాన సభ సభ్యులే వీరిని ఎన్నుకుంటారు, తొలగిస్తారు. స్పీకర్‌గా, డిప్యూటీ స్పీకర్‌గా ఎన్నికయ్యే వ్యక్తి విధాన సభలో సభ్యుడై ఉండాలి. ఆర్టికల్ 179 ప్రకారం స్పీకర్ తన రాజీనామాను డిప్యూటీ స్పీకర్‌కు, డిప్యూటీ స్పీకర్ తన రాజీనామాను స్పీకర్‌కు సమర్పించాలి. రాష్ట్ర విధాన సభ రద్దయినా, తిరిగి నూతన విధాన సభ ఏర్పడే వరకు స్పీకర్ తన పదవిలో కొనసాగుతాడు. ఆర్టికల్ 186 ప్రకారం స్పీకర్, డిప్యూటీ స్పీకర్, విధాన సభ చైర్మన్, డిప్యూటీ చైర్మన్ల జీతభత్యాలను శాసనసభ నిర్ణయిస్తుంది. ఈ అంశాలను రాజ్యాంగంలోని రెండో షెడ్యూల్‌లో పేర్కొన్నారు. వీరి జీతభత్యాలను రాష్ట్ర సంఘటిత నిధి నుంచి చెల్లిస్తారు.

స్పీకర్ అధికారాలు, విధులు

లోక్‌సభ స్పీకర్‌కు ఉన్న అధికారాలు, విధులే రాష్ట్ర శాసనసభ స్పీకర్‌కు కూడా ఉంటాయి. ఆర్టికల్ 181 ప్రకారం స్పీకర్ శాసనసభకు అధ్యక్షత వహించి, సభా కార్యక్రమాలు నిర్వహిస్తాడు. సభలో సభ్యుల ప్రవర్తన, ఇతర ప్రక్రియలను నియంత్రిస్తాడు. సభా కార్యక్రమాలను వాయిదా వేస్తాడు. వివిధ కమిటీలకు చైర్మన్‌లను నియమిస్తాడు. సభావ్యవహారాల కమిటీ, రూల్స్ కమిటీల చైర్మన్‌గా వ్యవహరిస్తాడు. ఒక బిల్లు ద్రవ్య బిల్లా, సాధారణ బిల్లా అనే అంశాన్ని స్పీకర్ ధ్రువీకరిస్తారు. ఈ విషయంలో స్పీకర్‌దే తుది నిర్ణయం.

స్పీకర్‌కు నిర్ణయాత్మక ఓటు ఉంటుంది. పార్టీ ఫిరాయింపుల చట్టం ప్రకారం సభ్యులను అనర్హులుగా ప్రకటించే అధికారం స్పీకర్‌కు ఉంది. సభలో స్పీకర్ తీసుకున్న నిర్ణయాలను ఏ న్యాయ స్థానంలోనూ ప్రశ్నించరాదు.

విధాన పరిషత్ చైర్మన్/డిప్యూటీ చైర్మన్

విధాన పరిషత్ చైర్మన్, డిప్యూటీ చైర్మన్ పదవుల గురించి ఆర్టికల్ 182 తెలుపుతుంది. వీరిని విధాన పరిషత్ సభ్యులే ఎన్నుకుంటారు, తొలగిస్తారు. చైర్మన్ తన రాజీనామా పత్రాన్ని డిప్యూటీ చైర్మన్‌కు, డిప్యూటీ చైర్మన్ తన రాజీనామాను చైర్మన్‌కు సమర్పించాలి.

అధికారాలు, విధులు

విధానసభ స్పీకర్‌కు ఉండే అధికారాలు, విధులే పరిషత్ చైర్మన్‌కు ఉంటాయి. సభకు అధ్యక్షత వహించడం, కార్యక్రమాల నిర్వహణ, సభ్యుల క్రమశిక్షణ నియంత్రణ, కార్యక్రమాల వాయిదా, నిర్ణయాత్మక ఓటు హక్కు కలిగి ఉండటం మొదలైనవాటిని ఉదాహరణగా పేర్కొనవచ్చు. ద్రవ్యబిల్లు విషయంలో విధాన సభ స్పీకర్‌కు ప్రత్యేక అధికారం ఉంటుంది. పరిషత్ చైర్మన్‌కు అలాంటి అధికారాలు లేవు.

వివరణ: రాష్ట్ర శాసనసభలోని ప్రక్రియలు, పద్ధతులు, ఇతర వ్యవహారాలు పార్లమెంటు ప్రక్రియతో సమానంగా ఉంటాయి. కోరం, ప్రశ్నోత్తరాలు, తీర్మానాలు, ప్రతిపాదనలు, తదితర విషయాల్లో శాసనసభకు, పార్లమెంటుకు తేడాల్లేవు.

శాసనసభలో అధికార భాష

ఆర్టికల్ 210 ప్రకారం శాసనసభ కార్యక్రమాలను హిందీ లేదా ఆంగ్ల భాష మాధ్యమంలో నిర్వహిస్తారు. అయితే సభాధ్యక్షుల అనుమతితో సభ్యులు మాతృభాషలో కూడా మాట్లాడవచ్చు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల శాసనసభ సభ్యులు ఇంగ్లిష్, తెలుగు, హిందీ, ఉర్దూ భాషల్లో ప్రసంగించవచ్చు.

శాసనసభ కమిటీలు: కమిటీల గురించి రాజ్యాంగంలో ప్రత్యక్ష ప్రస్తావన లేదు. అయితే ఆర్టికల్ 194లో పరోక్షంగా ప్రస్తావించారు. పార్లమెంటులో మాదిరిగానే రాష్ట్ర శాసనసభలో కూడా కమిటీలు ఉంటాయి. కమిటీల నిర్మాణం, సభ్యుల సంఖ్య, విధులను రాష్ట్ర శాసన సభ ఒక చట్టం ప్రకారం నిర్ణయిస్తుంది. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ఈ కమిటీల విధులకు సంబంధించి సవరణ చేయాలని ప్రతిపాదించారు.

శాసన నిర్మాణం- పార్లమెంట్, రాష్ట్ర శాసన సభ-పోలికలు, తేడాలు

పార్లమెంటు	రాష్ట్ర శాసన సభ
సాధారణ బిల్లులను ఏ సభలోనైనా ప్రవేశపెట్టవచ్చు.	సాధారణ బిల్లులను ఏ సభలోనైనా ప్రవేశపెట్టవచ్చు.
ఒక బిల్లు చట్టంగా మారడానికి మూడు దశలుంటాయి.	ఒక బిల్లు చట్టంగా మారడానికి మూడు దశలు ఉంటాయి.
సాధారణ బిల్లు విషయంలో ఉభయ సభల మధ్య ప్రతిష్టంభన ఏర్పడితే సంయుక్త సమావేశం ఏర్పాటు చేస్తారు.	ఈ విషయంలో ఉభయసభల మధ్య సంయుక్త సమావేశానికి ఆస్కారం లేదు. దిగువ సభ నిర్ణయమే చెల్లుబాటవుతుంది.
ఒక సభ ఆమోదం పొందిన బిల్లు మరో సభకు వచ్చినప్పుడు, ఆ సభ ఆరు నెలల వరకు ఆ బిల్లును వాయిదా వేయవచ్చు.	విధాన సభ ఆమోదం పొందిన బిల్లు పరిషత్ ఆమోదానికి వచ్చినప్పుడు, ఆ బిల్లును గరిష్ఠంగా నాలుగు నెలల వరకు వాయిదా వేయవచ్చు.
సాధారణ బిల్లు విషయంలో పార్లమెంట్ ఉభయ సభలకు సమాన అధికారాలు ఉంటాయి.	సాధారణ బిల్లు విషయంలోనూ విధాన సభ నిర్ణయమే అంతిమంగా చెల్లుబాటు అవుతుంది.
ద్రవ్య బిల్లు విషయంలో లోక్ సభదే అంతిమ నిర్ణయం.	ద్రవ్యబిల్లు విషయంలో విధాన సభదే అంతిమ నిర్ణయం.
ద్రవ్య బిల్లుపై రాజ్యసభలో చర్చించవచ్చు. ఓటింగ్ అధికారం లేదు. రాజ్యసభ 14 రోజుల్లోగా ద్రవ్య బిల్లుపై తన నిర్ణయాన్ని తెలపాలి.	ద్రవ్యబిల్లుపై విధాన పరిషత్‌లో చర్చించవచ్చు. ఓటింగ్ అధికారం లేదు. విధాన పరిషత్ 14 రోజుల్లోగా ద్రవ్యబిల్లుపై తన నిర్ణయాన్ని తెలపాలి.
రాజ్యాంగ సవరణ బిల్లును పార్లమెంట్ ఏ సభలోనైనా ప్రతిపాదించవచ్చు.	రాజ్యాంగ సవరణ బిల్లులను ప్రతిపాదించే అధికారం శాసన సభకు లేదు. కానీ పార్లమెంటు ఆమోదించిన కొన్ని రాజ్యాంగ సవరణలను శాసనసభల అంగీకారం కోసం నివేదిస్తారు.

గతంలో అడిగిన ప్రశ్నలు

1. గవర్నర్‌ను అభిశంసించే అధికారం ఎవరికి ఉంటుంది?
ఎ) పార్లమెంట్ బి) రాష్ట్ర అసెంబ్లీ
సి) సుప్రీంకోర్టు డి) ఎవరూ కాదు
2. కింది ఏ రాష్ట్రానికి ఇప్పటి వరకు మహిళ ముఖ్యమంత్రిగా పని చేయలేదు?
ఎ) కర్ణాటక బి) కేరళ సి) ఏపీ డి) పైవన్నీ
3. రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ సభ్యులను ఎవరు నియమిస్తారు?
ఎ) గవర్నర్ బి) ముఖ్యమంత్రి
సి) రాష్ట్రపతి డి) యూపీఎస్సీ

సమాధానాలు: 1) డి; 2) డి; 3) ఎ.

మాదిరి ప్రశ్నలు

1. కింది వాటిలో సరైంది?
ఎ) విధాన సభ్యుల సంఖ్యాపరంగా ఆంధ్రప్రదేశ్‌కు 10వ స్థానం
బి) విధాన సభ్యుల సంఖ్యాపరంగా తెలంగాణకు 14వ స్థానం
సి) విధాన పరిషత్ సభ్యుల సంఖ్యాపరంగా ఆంధ్రప్రదేశ్‌కు 5వ స్థానం
డి) పైవన్నీ
2. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనసభ పదవీకాలాన్ని ఎన్ని పర్యాయాలు పొడిగించారు?
ఎ) ఒక పర్యాయం
బి) రెండు పర్యాయాలు
సి) మూడు పర్యాయాలు డి) పైవేవీ కాదు
3. రాష్ట్ర విధాన పరిషత్ బిల్లును తిరస్కరిస్తే జరిగే పరిణామం?
ఎ) బిల్లు వీగిపోతుంది
బి) సంయుక్త సమావేశం ఉంటుంది
సి) విధాన సభ నిర్ణయం నెగ్గుతుంది
డి) గవర్నర్ విచక్షణ అధికారంపై ఆధారపడి ఉంటుంది.
4. రాష్ట్ర ఎగువ సభ ఉనికి ఎవరి విశ్వాసంపై ఆధారపడి ఉంటుంది?
ఎ) పార్లమెంట్ బి) రాష్ట్రపతి
సి) రాష్ట్ర దిగువ సభ డి) పైవేవీ కాదు
5. దేశంలో మొదటి దళిత ముఖ్యమంత్రి?
ఎ) జగ్జీవన్‌రామ్-ఉత్తరప్రదేశ్
బి) కాన్షీరామ్-బిహార్
సి) దామోదరం సంజీవయ్య-ఆంధ్రప్రదేశ్
డి) మాయావతి-ఉత్తరప్రదేశ్
6. రాష్ట్ర విధానసభ స్పీకర్ రాజీనామా లేఖను ఎవరికి అందజేయాలి?
ఎ) రాష్ట్రపతి బి) గవర్నర్
సి) ముఖ్యమంత్రి డి) డిప్యూటీ స్పీకర్

సమాధానాలు:
1) డి; 2) ఎ; 3) సి; 4) సి; 5) సి; 6) డి.

హిమాలయాలు ఎన్ని దేశాల్లో విస్తరించాయి?

హిమాలయాలు

భారత్‌కు ఉత్తర సరిహద్దుగా విస్తరించిన హిమాలయాలు నవీన ముడత పర్వతాలు.. ఇవి టెర్షరీ యుగానికి చెందినవి. దాదాపు 60 మిలియన్ ఏళ్ల క్రితం ఏర్పడ్డాయి. హిమాలయ పర్వతోద్భవం.. ఆల్ఫైన్, జాగ్రోస్, హిందూకుష్ పర్వతపంక్తుల ఆవిర్భావంతో ముడిపడి ఉంది. యురేషియా ఖండం భారత ద్వీపకల్పంతో ఢీకొనడం వల్ల హిమాలయాలు ఏర్పడ్డాయి. ఈ పర్వతశ్రేణులున్న చోట గతంలో 'టెథిస్' సముద్రం ఉండేది.

హిమాలయ పర్వత శ్రేణులు భారత్, భూటాన్, పాకిస్తాన్, అఫ్గానిస్తాన్, నేపాల్, చైనాల్లో(ఆరు దేశాలు) వ్యాపించి ఉన్నాయి. హిమాలయ పర్వత పంక్తులు పశ్చిమాన పాక్‌లోని పోట్వార్ తీరం నుంచి తూర్పున మయన్మార్- నాగాలాండ్ సరిహద్దుల వరకు 5,200 కి.మీ. మేర విస్తరించాయి. ఉత్తరాన టిబెట్ పీఠభూమి, దక్షిణాన గంగ బ్రహ్మపుత్ర మైదానాల మధ్య ఇవి వ్యాపించి ఉన్నాయి. హిమాలయాలను తూర్పు-పడమరలుగా..

1) పంజాబ్, కశ్మీర్ హిమాలయాలు
2) కుమవున్, గఢ్వాల్ హిమాలయాలు
3) నేపాల్ హిమాలయాలు
4) అరుణాచల్ అసోం హిమాలయాలుగా విభజిస్తారు. ఇవి వరుసగా సింధూ-సట్లెజ్, సట్లెజ్-కాళి, కాళి-తీస్తా, తీస్తా- బ్రహ్మపుత్ర నదుల మధ్య విస్తరించి ఉన్నాయి.

టిబెటన్ హిమాలయాలు

భారత్‌లో.. కశ్మీర్‌లోని కారకోరం, జస్కర్, లడఖ్ పర్వతశ్రేణులు టిబెటన్ హిమాలయాల కోవకు చెందినవి. కారకోరం పర్వతాలను ఆసియా ఖండానికి వెన్నుముకగా పేర్కొంటారు. టిబెటన్ హిమాలయాల సగటు ఎత్తు 4500 మీటర్లు. ఇందులో 7000 మీటర్ల కంటే ఎత్తైన పర్వతశిఖరాలు అనేకం ఉన్నాయి. ఉదా: కె2/గాడ్విన్ ఆస్టిన్, నంగపర్బత్, నామ్చాబారుమా. టిబెటన్ హిమాలయాల్లో అనేక హిమనీనదాలు, హిమనీనద సరస్సులున్నాయి. ఉదా: సియాచిన్ (హిమాలయాల్లో పెద్దది), జైపూ, మానస సరోవరం, రాకాస్‌తాల్.

గ్రేటర్ హిమాలయాలు

అన్నిటికంటే ఎత్తైనవి మధ్యగ్రేటర్ హిమాలయాలు. వీటి సగటు ఎత్తు 6000 మీటర్లు. ఇవి అవిచ్ఛిన్న పర్వతశ్రేణిగా జమ్మూకశ్మీర్ నుంచి అరుణాచల్ ప్రదేశ్ వరకు విస్తరించాయి. ప్రపంచంలో ఎత్తైన పర్వతశిఖరాలైన ఎవరెస్టు, నందాదేవి, గైరీశంకర్, మకాలు, కామెత్ మధ్యగ్రేటర్ హిమాలయాల్లోనే ఉన్నాయి. గంగోత్రి, యమునోత్రి, పిండామ్ తదితర హిమనీనదాల జన్మస్థానం కూడా ఇదే. కశ్మీర్‌లోని గ్రేటర్-టిబెటన్ హిమాలయాల మధ్య సన్నని మైదానాలు ఉన్నాయి. ఉదా: దేవసాయి మైదానాలు.

నిమ్న హిమాలయాలు:

వీటి సగటు ఎత్తు 2500 మీటర్లు. వీటిని వివిధ ప్రాంతాల్లో వేర్వేరు పేర్లతో పిలుస్తారు. జమ్మూ కశ్మీర్‌లో పిర్‌పంజాల్ పర్వతాలు, హిమాచల్‌ప్రదేశ్‌లో దవులాధార్ పర్వతాలు, ఉత్తరాఖండ్‌లో ముస్సోరి కొండలు, నేపాల్‌లో మహాభారత్, నాగాటిబ్బా పర్వతాలని పిలుస్తారు. ఈ పర్వతశ్రేణి వేసవి విడిది కేంద్రాలకు ప్రసిద్ధి. ఉదా:సిమ్లా, కులూ, మనాలి, నైనిటాల్, డార్జిలింగ్. నిమ్న హిమాలయ సానువుల్లో దట్టమైన కోనిఫర్ అడవులున్నాయి.

శివాలిక్ పర్వతాలు:

వీటి సగటు ఎత్తు 1000-1500 మీటర్లు మాత్రమే. అందుకే వీటిని ఉప హిమాలయాలుగా పరిగణిస్తారు. ఇతర హిమాలయ పర్వత పంక్తుల శిఖరాలు శంఖాకారంలో ఉంటే.. శివాలిక్ పర్వతాలు కురచగా ఉంటాయి. వీటిని జమ్మూకశ్మీర్‌లో జమ్మూ కొండలని.. ఉత్తరాఖండ్, నేపాల్‌లో శివాలిక్ కొండలని పిలుస్తారు. అసాం, అరుణాచల్ ప్రదేశ్‌లలో ఇవి అంతగా అభివృద్ధి చెందలేదు. శివాలిక్ పర్వతాలు దట్టమైన సమశీతోష్ణ మండల ఆయనరేఖా ఆకురాల్చే అరణ్యాలకు ప్రసిద్ధి. హిమాలయ నదులు శివాలిక్ పర్వతాలను ఛేదించుకుంటూ.. లోతైన ఇరుకు దారుల ద్వారా ప్రవహిస్తాయి. నిమ్న హిమాలయాలు, శివాలిక్ కొండల మధ్య ఉన్న సరస్సు హరివణాలను 'డూన్'లని పేర్కొంటారు. ఉదా: డెహ్రాడూన్. శివాలిక్ పర్వతాలు, గంగా మైదానం మధ్య గిరిపద మైదానం ఏర్పడింది. దీన్ని 'బబ్బర్', 'తెరాయి' మైదానాలుగా విభజించారు. బబ్బర్ మైదానం గులకరాళ్లు, ఇసుకతో నిండి ఉంది. తెరాయి మైదానం చిత్తడి నేలలకు ప్రసిద్ధి. ఈ మైదానంలో దట్టమైన రుతుపవన అరణ్యాలు ఉన్నాయి. జిమ్‌కార్బెట్, రాజాజీ నేషనల్ పార్కులు తెరాయి మైదానంలోనే ఉన్నాయి.



టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

జాగ్రఫీ

గంగ-సింధు-బ్రహ్మపుత్ర మైదానం

గంగ-సింధు-బ్రహ్మపుత్ర మైదానం 1.5-2.5 మిలియన్ ఏళ్ల క్రితం ఏర్పడింది. ఈ మైదానంలో ప్రవహించే అనేక నదులు.. వరద మైదానాలను ఏర్పరచాయి. ఇవి సారవంతమైన ఒండ్రు మట్టిని కలిగి ఉన్నాయి. వీటిని 'కద్దర్', 'బంగర్' మైదానాలుగా విభజించారు. కద్దర్ మైదానాలు పల్లపు ప్రాంతాలు. ఇవి తరచుగా వరద ముంపునకు గురవుతుండటంతో.. తాజా ఒండ్రుమట్టి వచ్చి చేరుతుంది. వరదమైదానాల్లో ఎత్తైన ప్రాంతాలు బంగర్‌లు. ఇక్కడ వరద ముంపు అరుదు. దాంతో ఈ ప్రాంతాల్లో పాత ఒండ్రు మట్టే ఉంటుంది. నదీమైదాన ప్రాంతంలో... నదుల మధ్య ఉండే నదీ విభాజక ప్రాంతాలను 'డోబ్'లని పిలుస్తారు.

బాగార్

పశ్చిమ రాజస్థాన్‌లోని థార్ ఎడారి.. సింధూ మైదాన ప్రాంతానికి చెందినది. ఆరావళి పర్వతాలకు ఆనుకొని ఉన్న ఈ ఎడారి ప్రాంతం పాక్షికంగా శుష్క మండలం. దీన్ని 'బాగార్' ప్రాంతంగా పిలుస్తారు. ఇక్కడ అనేక ఎడారి నదులు, ఉప్పునీటి సరస్సుల్లోకి ప్రవహిస్తున్నాయి. ఈ ప్రాంతంలో సాంబార్, శబర్, దీద్వానా తదితర ఉప్పునీటి సరస్సులున్నాయి. 'లూనీ' పెద్ద ఎడారి నది. బాగార్‌కు పశ్చిమంగా.. పాకిస్తాన్‌లోని సింధ్ రాష్ట్రాన్ని ఆనుకొని ఉన్న థార్ ఎడారి ప్రాంతాన్ని 'మరుస్థలి' అంటారు.

ద్వీపకల్ప పీఠభూమి:

భారతదేశంలో అతిపెద్ద నైసర్గిక విభాగం.. ద్వీపకల్ప పీఠభూమి ప్రాంతం. ఇది చిన్న, పెద్ద పీఠభూములు, కొండలు, నదీలోయలతో నిండి ఉంది. ఉత్తరాన గంగా మైదానం, ఈశాన్యంలో రాజమహల్ కొండలు, వాయవ్య దిశలో ఆరావళి కొండలు, పశ్చిమాన పశ్చిమ కనుమలు, తూర్పున తూర్పు కనుమలు, దక్షిణాన కన్యాకుమారి మధ్య ద్వీపకల్ప పీఠభూమి విస్తరించి ఉంది. ఇది అత్యంత పురాతన ఆర్కియాన్ (కాంబ్రియన్) మహాయుగపు శిలలతో ఏర్పడింది. దక్కన్ పీఠభూమి ప్రాంతం స్థిరమైన శిలావరణం.

నదులకు పుట్టినిల్లు.. భారత్

భారతదేశంలోని నదులను హిమాలయ నదులు, పీఠభూమి నదులని రెండు రకాలు వర్గీకరించవచ్చు. హిమాలయ నదులు జీవ నదులు. పీఠభూముల్లో పుట్టేవి వర్షాధారాలు. ఈ నదుల పుట్టుక, ప్రవాహ రీతి, సముద్రంలో కలయికల గురించి సమాచారం గ్రూప్స్ పరీక్షల్లో కీలకం.

భారతదేశాన్ని 'నదులదేశంగా' పిలుస్తారు. వందల సంఖ్యలో చిన్న నదులు ప్రవహిస్తున్నా, దేశంలోని ప్రధాన నదీహరివాణాలు 38. భారతదేశనదులను హిమాలయ నదీవ్యవస్థ, ద్వీపకల్ప నదీవ్యవస్థలుగా విభజించవచ్చు.

హిమాలయ నదీ వ్యవస్థ: హిమాలయ పర్వత శ్రేణుల్లోని హిమనీ నదాలు, హిమనీనద సరస్సులు ఈ నదీ వ్యవస్థకు మాతృకలు. హిమాలయ నదులు జీవనదులు. వీటిలో ఏడాది పొడవునా నీరు ప్రవహిస్తుంది. గంగ, సింధు, బ్రహ్మపుత్ర నదీ వ్యవస్థలు దీనికి ఉదాహరణ. ద్వీపకల్ప నదీ వ్యవస్థలకు ద్వీపకల్ప పీఠభూములు, ద్వీపకల్ప పర్వతాల శిఖరాలు మాతృకలు. ద్వీపకల్ప నదుల్లో శీతాకాలంలో నీటి పరిమాణం చాలా తక్కువగా ఉంటుంది. గోదావరి, కృష్ణా, కావేరి, నర్మద నదులు ద్వీపకల్ప నదులు. హిమాలయ నదుల నీటి పరిమాణం, ప్రవాహ వేగం ఎక్కువ. వీటి ప్రవాహ దిశలు తిన్నగా ఉండటం వల్ల ఈ నదులపై ఆనకట్టలు నిర్మించడం కొంచెం కష్టం. ద్వీపకల్ప నదుల ప్రవాహ వేగం తక్కువ. వీటి గమన మార్గాల్లో నదీ వక్రతలు ఎక్కువగా ఉంటాయి. హిమాలయ నదులు పురాతన లోయల ద్వారా ప్రవహిస్తున్నాయి. హిమాలయాల ఆవిర్భావానికి ముందే ఈ లోయలు ఏర్పడ్డాయి. ద్వీపకల్ప నదులు ప్రవహించే లోయలు పీఠభూములు, పర్వతాలు ఆవిర్భావించాక ఏర్పడ్డాయి.

ఈ రెండు నదీ వ్యవస్థలు చివరకు సముద్రంలో కలుస్తాయి. కానీ కొన్ని నదులు సముద్రంలో కలువకుండానే భూభాగం మీదే అంతరిస్తాయి. వీటిని అంతర్గత లేదా ఖండాంతర నదీ వ్యవస్థలుగా పిలుస్తారు. పశ్చిమ రాజస్థాన్‌లోని లూనీ నది లాంటి ఎడారి నదులు ఈ కోవకు చెందినవి. ఈ నదులు థార్ ఎడారిలో అంతర్థానమవుతాయి లేదా ఎడారిలోని సాంబార్, దీద్వానా లాంటి ఉప్పునీటి సరసుల్లో కలుస్తాయి. కొన్ని ఎడారి నదులు రాన్ ఆఫ్ కచ్‌లోని చిత్తడి నేలల్లోకి ప్రవహిస్తాయి. దక్కన్ పీఠభూమి తూర్పు-ఆగ్నేయ దిశగా వాలి ఉండటంతో గోదావరి, కృష్ణా, పెన్న, కావేరి నదులు తూర్పు దిశగా ప్రవహించి బంగాళాఖాతంలో కలుస్తాయి. మాల్వా, బాగేల్‌ఖండ్, బుందేల్‌ఖండ్ పీఠభూములు ఉత్తరం వైపు వాలి ఉండటంతో చంబల్, బేత్వా, కేన్, సోన్‌లాంటి నదులు ఉత్తరం దిశగా ప్రవహించి గంగా-యమున నదీ వ్యవస్థలో కలుస్తాయి. నర్మద, తపతి నదులు రిఫ్ట్‌వ్యాలీల ద్వారా తూర్పు నుంచి పశ్చిమానికి ప్రవహిస్తూ అరేబియా సముద్రంలో కలుస్తాయి. పశ్చిమ కనుమల వాలుల ద్వారా జాలువారుతూ పశ్చిమ తీరమైదానం ద్వారా ప్రవహించే నదుల వేగం ఎక్కువ. ఉదాహరణకు పంబన్, ఇడుక్కి, మండొవి, జువారి మొదలైనవి. ఈ నదులు అపారమైన జల విద్యుచ్ఛక్తి సామర్థ్యాన్ని కలిగి ఉన్నాయి.

అతిపెద్ద నదీ వ్యవస్థ: గంగానదీ వ్యవస్థ భారతదేశంలోకెల్లా అతి పెద్ద నదీ వ్యవస్థ. గంగోత్రి హిమానీనదంలోని గొముఖ్ వద్ద ఆవిర్భవించే భగీరథీ నది గంగానదికి మాతృక. భగీరథీ, అలక్‌నంద నదులు దేవ ప్రయాగ్ వద్ద కలుస్తాయి. తర్వాత ఏర్పడిన ఉమ్మడి ప్రవాహాన్నే గంగానదిగా పిలుస్తారు. గంగానది హరిద్వార్ వద్ద హిమాలయ పర్వతాలను వీడి మైదానాన్ని చేరుతుంది. యమునా, రామ్‌గంగా, గండక్, అరుణ్, గాగ్రా, కోసిలు గంగానది ఉపనదులు వీటన్నింటిలో యమునా నది ప్రధానమైనది. హిమాలయాల్లోని యమునోత్రి హిమానీనదం యమునా నది ఆవిర్భావ ప్రాంతం.

ద్వీపకల్ప నదీ వ్యవస్థ: ద్వీపకల్ప పీఠభూముల్లో ఆవిర్భవించే కొన్ని ద్వీపకల్ప నదులు కూడా ఉత్తరంగా ప్రవహించి గంగానదీ హరివాణాన్ని చేరతాయి. ఉదాహరణకు బేతూల్ పీఠభూమిలో ఆవిర్భవించిన చంబల్‌నది యమునానదిలో కలుస్తుంది. చంబల్-యమునా నదీలోయల మధ్య ప్రాంతం 'బాడ్‌లాండ్స్'గా ప్రసిద్ధి. టాన్స్, బేత్వా, కేన్‌లు యమునా నదికి ఇతర ఉపనదులు. పేంద్రా పీఠభూమిలో ఆవిర్భవించిన సోన్ నది కుడా ఉత్తరంగా ప్రవహించి పాట్నా వద్ద గంగా నదిలో కలుస్తుంది. గంగా-సోన్‌ల సంగమ ప్రాంతానికి ఎగువన సోన్‌నదిపై రిహాండ్ వద్ద పెద్ద ఆనకట్ట కట్టారు. ఈ రిజర్వాయర్‌ను 'గోవింద్‌వల్లభ్ పంత్‌సాగర్' గా పిలుస్తారు. గంగానది పశ్చిమ బెంగాల్‌లోని ఫరక్కా వద్ద రెండు పాయలుగా చీలుతుంది. ఇక్కడ ఫరక్కా ఆనకట్ట నిర్మించారు. ప్రధాన పాయ బంగ్లాదేశ్‌లో ప్రవహిస్తుంది. గంగా నదిని బంగ్లాదేశ్‌లో 'పద్మ' నదిగా పిలుస్తారు. కలకత్తా వైపుగా ప్రవహించే చిన్న పాయను హుగ్లీగా పిలుస్తారు. బ్రహ్మపుత్ర నది టిబెట్ హిమాలయాల్లోని కైలాస పర్వతాల్లో ఉన్న మానససరోవరం నుంచి ఆవిర్భవిస్తుంది. టిబెట్‌లో బ్రహ్మపుత్రను 'సాంగ్‌పో'గా పిలుస్తారు. ఇది సయాడియా పర్వత శ్రేణుల ద్వారా అరుణాచల్‌ప్రదేశ్‌లోకి ప్రవేశిస్తుంది. ఇక్కడ దీన్ని దిహాంగ్ అని పిలుస్తారు. అరుణాచల్ హిమాలయాలను వీడి అసోంలో కోవాఘాట్ వద్ద మైదానాన్ని చేరుతుంది. అసోంలో ఈ నదిని బ్రహ్మపుత్రగా పిలుస్తారు.

ప్రపంచంలోకెల్లా అతిపెద్ద నదీ దీవి 'మాజులి' అసోంలో బ్రహ్మపుత్ర నదిలో ఉంది. అసోంలోని ధుబ్రి పర్వతశ్రేణులు బ్రహ్మపుత్రానదిని దక్షిణంగా మళ్లించి బంగ్లాదేశ్‌లోకి ప్రవహించేలా చేస్తాయి. బంగ్లాదేశ్‌లో ఈ నదిని 'జమున'గా పిలుస్తారు.

జీతానికి బదులుగా ఇచ్చే జాగీర్లు.. తనఖా

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

తెలంగాణ ఎకానమీ

భారతదేశంలోని రైతాంగ పోరాటాల్లో తెలంగాణ, పశ్చిమ బెంగాల్‌లో జరిగిన ఉద్యమాలే విప్లవాత్మకమైనవని కొందరు చరిత్రకారుల భావన. తెలంగాణలో జరిగిన పోరాటం ఒక్కటే విప్లవాత్మకమైందని మరికొందరు పేర్కొన్నారు. నిజాం కాలంలో అనేక రకాల భూస్వామ్య విధానాలు అమలులో ఉండేవి. వీటిలో సంస్థానాలు, జాగీర్లు, ఇనాంలు, సర్ఫేఖాస్, దివానీ లేదా ఖలసా లేదా రైత్వారీ పద్ధతులు ముఖ్యమైనవి. నిజాం నవాబుకు ప్రత్యేకంగా సేవ చేసినవారికి దానంగా ఇచ్చిన భూములను జాగీర్లు అనే వారు.



భూసంస్కరణల ఆవశ్యకత - కారణాలు

స్వాతంత్ర్యానంతరం భారతదేశం, రాష్ట్రంలోనూ వ్యవసాయ రంగంలో భూ సంస్కరణల పేరుతో భూ సంబంధాలు, వ్యవసాయక నిర్మాణంలో విప్లవాత్మకమైన మార్పులు రావడానికి అనేక కారణాలున్నాయి.

రాష్ట్రంలో భూ సంస్కరణలను ప్రధానంగా రెండు దశలుగా వర్గీకరించవచ్చు. మొదటి దశ 1947 నుంచి 1970 వరకు, రెండోదశ 1970 తర్వాత వచ్చిన భూ సంస్కరణలుగా పేర్కొనవచ్చు.

మొదటిదశ (1947-1970): భూ సంస్కరణలు రావడానికి మూడు అంశాలు ప్రధాన పాత్ర వహించాయని చెప్పొచ్చు.

1. **వ్యవస్థాపూర్వక అంశాలు:** ఇందులో భూస్వామ్య పద్ధతులు, కౌలు విధానాలు, భూ కేంద్రీకరణ మొదలైనవి ఉన్నాయి.
2. **రాజకీయ అంశాలు:** జాతీయస్థాయిలో అఖిల భారత కాంగ్రెస్, రాష్ట్ర కాంగ్రెస్ తీర్మానాలు, విధానాలు.
3. **రైతాంగ ఉద్యమాలు:** ఫ్యూడల్ దోపిడీకి వ్యతిరేకంగా తెలంగాణ రైతాంగం పోరాటం చేసింది. ఉదా: 1920లో విస్నూరు దేశ్ ముఖ్‌కు వ్యతిరేకంగా జరిగిన రైతు పోరాటం.

భారతదేశ రైతాంగ పోరాటాల్లో తెలంగాణ, పశ్చిమ బెంగాల్‌లో జరిగిన రైతాంగ పోరాటాలే విప్లవాత్మకమైనవని కొందరు భావిస్తే, మరికొందరు తెలంగాణ పోరాటం ఒక్కటే విప్లవాత్మకమైందిగా పేర్కొంటారు.

I. వ్యవస్థాపూర్వక అంశాలు

రాష్ట్రంలో వ్యవస్థాపూర్వకమైన అంశాల్లో భూస్వామ్య వ్యవస్థలు, కౌలు విధానాలు, భూమి కేంద్రీకరణ మొదలైనవన్నీ వ్యవసాయ రంగం అభివృద్ధికి నిరోధంగా ఉన్నాయి. అయితే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ (1956) కు ముందు తెలంగాణ ప్రాంతం హైదరాబాద్ రాష్ట్రంలో, ఆంధ్రా ప్రాంతం 1953 అక్టోబర్ 1 వరకు మద్రాసు రాష్ట్రంలో భాగంగా ఉన్నాయి. ఆంధ్ర, తెలంగాణ ప్రాంతాల్లోని భూస్వామ్య పద్ధతుల్లో కొంత సారూప్యం ఉన్నప్పటికీ వీటిని సమగ్రంగా అర్థం చేసుకోవడానికి వేర్వేరుగా అధ్యయనం చేయడం ఉత్తమం.

- భారతదేశంలో బ్రిటిష్, నైజాం ప్రాంతాల్లో ప్రవేశపెట్టిన భూస్వామ్య పద్ధతులు రెండూ అభివృద్ధి నిరోధకాలే.
- తెలంగాణ, ఆంధ్రా ప్రాంతాల్లో ప్రవేశపెట్టిన జాగీర్దారీ లేదా జమీందారీ, రైత్వారీ మొదలైన పద్ధతులు వ్యవసాయాభివృద్ధికి ఉపయోగపడకపోగా స్తబ్దతకు దారితీశాయి.
- జమీందారీ, రైత్వారీ పద్ధతులు రెండూ బ్రిటిష్ అధికారులు ప్రవేశపెట్టిన వ్యవసాయక విప్లవ రూపాలు. ఇవి ఒకదానికొకటి విరుద్ధమైనవిగా కార్ల్ మార్క్స్ గుర్తించారు. జమీందారీ విధానం పెత్తందారీ వ్యవస్థ కాగా, రైత్వారీ విధానాన్ని ప్రజాతంత్ర వ్యవస్థగా పేర్కొన్నారు.
- జమీందారీ విధానం బ్రిటిష్ భూస్వామ్య వ్యవస్థకు, రైత్వారీ విధానం ఫ్రెంచి రైతుస్వామ్య వ్యవస్థకు ప్రతిబింబాలు. కానీ ఈ రెండు పద్ధతులు హానికరమైనవేనని గుర్తించాలి. ఇవి రెండూ పరస్పర విరుద్ధ అంశాల మేళవింపుతో రూపొందాయి.
- ఈ పద్ధతులు భూమిని దున్నే రైతు, భూయజమానుల ప్రయోజనాలకు ఉద్దేశించినవి కావు. భూములపై పన్ను వేసి, ప్రభుత్వానికి ఉపయోగపడే సాధనాలుగా గుర్తించారు.

హైదరాబాద్ రాష్ట్రంలో భూస్వామ్య విధానాలు

- హైదరాబాద్ రాష్ట్రం నిజాం పరిపాలనలో ఉండేది. వీరి కాలంలో అనేక రకాల భూస్వామ్య విధానాలుండేవి. అవి సంస్థానాలు, జాగీర్లు, ఇనాంలు, సర్ఫేఖాస్, దివానీ లేదా ఖలసా లేదా రైత్వారీ విధానాలు ముఖ్యమైనవి.

1. జాగీర్లు

నిజాం నవాబుకు ప్రత్యేకంగా సేవ చేసినవారికి లేదా ఆ వ్యక్తి గౌరవాన్ని నిలబెట్టడానికి దానపూర్వకంగా ఇచ్చిన భూములను జాగీర్లు అనే వారు. వీటిలో అనేక రకాలైన జాగీర్లుండేవి. కొన్ని నిజాంకు కొంత బాటకం చెల్లించాల్సినవి. కొన్ని భాటకం చెల్లించనవసరం లేని జాగీర్లు.

2. ఇనాందారులు

- హైదరాబాద్ ప్రాంతంలో కొన్ని విధులను నిర్వహించినందుకు పారితోషికంగా ప్రభుత్వం ఇచ్చిన భూములను ఇనాం భూములంటారు.
- ఈ భూముల నుంచి వచ్చే భూమి శిస్తును పొందే హక్కు పూర్తిగానో, పాక్షికంగానో ఇనాందారుడికి సంక్రమిస్తుంది.
- ఉద్యోగులు, సమాజానికి సేవలు అందించిన వారికి కూడా ఇనాం భూములు ఇచ్చేవారు.
- దేవాలయాలు, ధర్మాలయాల నిర్వహణ కూ ఇనాంలు ఇచ్చేవారు.
- హైదరాబాద్ సంస్థానంలో మొత్తం ఇనాందారుల సంఖ్య 82,000 కాగా వీరిలో 57,000 మంది దివానీప్రాంతంలో ఉండగా 26000 మంది జాగీరు ప్రాంతంలో ఉండేవారు. వీరి ఆధీనంలో సుమారు 8 లక్షల ఎకరాల భూమి ఉండేది. వీటిలో కూడా అనేక రకాలైన ఇనాంలు ఉండేవి.

ఉదా: అరాజమక్తా, అరాజ అగ్రహార్, మజరాను బేసరి ఇనాం, బలవతా ఇనాం, నీరడి ఇనాం, చిధుమతి ఇనాం మొదలైనవి.

3. సర్ఫేఖాస్

- సర్ఫేఖాస్ భూములు నిజాం సొంత ఖర్చుల కోసం నిర్దేశించిన భూమి లేదా గ్రామాలు. వీటి నుంచి వచ్చే ఆదాయం లేదా భాటకం నిజాం ఖజానాకు వెళ్లేది. ఈ భూములు 5,682 చదరపు మైళ్ల విస్తీర్ణంలో 1,374 గ్రామాల్లో వ్యాపించి ఉండేవి.

4. ఖల్సా/దివానీ/రైత్వారీ పద్ధతి

- ఈ పద్ధతి హైదరాబాద్ ప్రాంతంలోని 60 శాతం విస్తీర్ణంలో ప్రభుత్వ ప్రత్యక్ష పాలన కింద ఉండేది. ప్రభుత్వ యంత్రాంగమే శిస్తు వసూలు చేసేది.
- ప్రభుత్వ యంత్రాంగమే శిస్తును వసూలు చేసే ప్రభుత్వ ప్రత్యక్ష పాలనలో ఉండే భూమిని ఖలీసా భూమి అంటారు.
- దివానీ భూములు సర్ఫేఖాస్ భూముల్లో భాగాలే.
- క్రమబద్ధమైన సర్వే సెటిల్‌మెంట్ పద్ధతిని మొదటి సాలార్‌జంగ్ 1875లో ప్రవేశపెట్టారు.
- క్రమబద్ధమైన సర్వే సెటిల్‌మెంట్ విధానాన్ని ప్రవేశపెట్టడానికి (1875) ముందు ఖల్సా/దివానీ భూముల్లో దళారీలు ఉండేవారు.

పామిగా జమీయత్

- పామిగా అంటే గుర్రాలను కట్టేసే స్థలం
- సైన్యానికి అవసరమైన గుర్రాలను పోషించడానికి ప్రతిఫలంగా ఇచ్చే జాగీర్లు.

జాత్

- విస్తృతమైన ప్రాంతాల్లో సేవ చేసినందుకు ఎలాంటి షరతులు లేకుండా ఇచ్చిన జాగీర్లు

అవతమామ్

- శిస్తు చెల్లించకుండానే వంశ పారంపర్యం గా వచ్చే హక్కులు ఉన్న జాగీర్లు

తనఖా

- జీతానికి బదులుగా ఇచ్చే జాగీర్లు

మాదద్ మాష్

- ఉద్యోగుల పోషణకు జీతానికి తోడుగా ఇచ్చే జాగీర్లు

మసురూదీ

- మత, సైనిక, పౌర సంబంధమైన సేవ చేసే షరతులపై ఇచ్చే జాగీర్లు
- పై విధంగా అనేక రకాలైన జాగీర్లు ఉండేవి. ఈ జాగీర్లు హైదరాబాద్‌లో 6535 గ్రామాల్లో 40,000 చదరపు మైళ్ల విస్తీర్ణంలో వ్యాపించి ఉండేవి. 1922లో జాగీర్ల సంఖ్య 1,167 కాగా, 1949 నాటికి 1500 వరకు పెరిగింది.

5. సంస్థానాలు

- హైదరాబాద్ ప్రాంతంలో మొదటి నుంచి అనేక చిన్న చిన్న ప్రాంతాలకు హిందూ రాజులు అధిపతులుగా ఉండేవారు. నిజాం వీరి హక్కులను అంగీకరించడానికి వీరు ఏటా నిజాంకు 'పేష్కష్' పేరుతో నిర్ణీతమైన డబ్బు చెల్లించాలి. వీరికి ఆయా ప్రాంతాల్లో విస్తృతమైన పరిపాలనా అధికారాలుండేవి.
- హైదరాబాద్ రాష్ట్రంలో మొత్తం 14 సంస్థానాలు ఉన్నప్పటికీ, వీటిలో ఐదు ప్రధానమైనవి. అవి
  1) గద్వాల్ (అతి పెద్దది)
  2) వనపర్తి 3) జట్రప్రోలు
  4) అమరచింత 5) పాల్వంచ.
- ఈ ఐదు సంస్థానాల్లో పరిపాలన అంతా సంస్థానాధీశులదే. వీరి ఆధీనంలో 497 గ్రామాలు, 5,080 చదరపు మైళ్ల విస్తీర్ణంలో వ్యాపించి ఉండేవి. వీరికి సర్‌బస్తా, పాన్‌మక్తా, ఇజారా అనే మధ్యవర్తులుండేవారు.

సర్‌బస్తా: వేలంపాట ద్వారా శిస్తు వసూలు చేసుకునే హక్కును పొందినవారు.

పాన్‌మక్తా: స్థిరమైన కౌలును చెల్లించేవారు.

ఇజారా భూములు: నిర్మానుష్యమైన గ్రామాల్లోని భూములు. ఇక్కడ పునరావాసం ఉండే వారికి తక్కువ కౌలు చెల్లించే వెసులుబాటు ఉండేది.

- ప్రాంతీయంగా ఉండే వీరినే దేశ్‌ముఖ్, సర్ దేశ్‌ముఖ్, దేశాయ్, సర్‌దేశాయ్, దేశ్‌పాండేలుగా పిలిచేవారు. వీరికి శిస్తు వసూలు చేసే అధికారం ఉండటం వల్ల అనేక మార్గాల ద్వారా వేల ఎకరాలు తమ పేరున రాసుకొని 1875 తర్వాత ఖల్సా / దివానీ ప్రాంతాల్లో అతిపెద్ద భూస్వామ్యులుగా చెలామణి అయ్యారు.
- పై భూస్వామ్య విధానాలన్నింటిలోనూ జాగీర్దార్లు, ఇనాందార్లు, సంస్థానాధీశులు చివరకు భాటకాన్ని పొందే ఖల్సా ప్రాంతంలోని పెద్ద భూస్వాములందరూ భాటకాన్ని పొందే అనుపస్థితి (అబ్సెంటీ ల్యాండ్‌లార్డ్స్) భూస్వాములుగా మారారు. వీరి సంఖ్య 1891లో లక్ష ఉండగా 1921 నాటికి 7.6 లక్షలకు పెరిగింది.
- ఈ ప్రాంతంలో భాటకం వసూలు చేసేవారు వ్యవసాయాభివృద్ధి కంటే కౌలును పెంచుకునే మార్గాలను అన్వేషించేవారు.
- భూమి శిస్తును ఉత్పత్తితో సంబంధం లేకుండా పెంచడం, కౌలు గడువు పెంచుకోవాలన్నా కొత్తగా సేద్యం చేసుకోవడానికి భూమిని తీసుకోవాలన్నా వీరికి 'నజరానాలు' (బహుమతులు) చెల్లించాల్సి వచ్చేది.
- భూమిశిస్తుతోపాటు ఇంటి పన్ను, వృత్తిపన్ను, మగ్గపు పన్ను..ఇలా అనేక అక్రమ పన్నులు నిర్బంధంగా వసూలు చేసేవారు.
- వీరి ఇళ్లలో ఏ శుభకార్యం జరిగినా రైతులు, కౌలుదారులు విధిగా చేసే వెట్టి చాకిరీ తోపాటు కట్నాలు, కానుకలు చెల్లించేవారు.
- ఫలవృక్షాలు, చింతచెట్లు మొదలైనవి జాగీర్దార్ల ఆస్తిగా భావించేవారు.
- వీరి దోపిడీ హైదరాబాద్ ప్రాంతంలో చాలా ఎక్కువగా ఉండేది. హైదరాబాద్ సంస్థాన రెవెన్యూ ఆదాయం రూ. 8 కోట్లు కాగా హైదరాబాద్ ప్రాంతంలోని 110 మంది జమీందార్ల ఆదాయం రూ. 10 కోట్లు ఉండేది.
- నిజాం జారీ చేసిన ఫర్మానాలో 82 రకాలైన అక్రమ నిర్బంధ వసూళ్లు ఉండేవని తెలుస్తుంది.
- కులమతాలు, వయసు, లింగ భేదాలతో సంబంధం లేకుండా అందరూ వెట్టి చాకిరీ చేయడం ఈ ప్రాంతం అంతటా ఉండేది.
- అత్యధికమైన భూ కేంద్రీకరణ, అధికార బలం, ఆర్థికబలం, అంగబలం వల్ల ఫ్యూడల్ దోపిడీ నిరాటంకంగా కొనసాగింది. దీంతోపాటు వడ్డీ వ్యాపారం, నిర్బంధ లేవీ పద్ధతి, ఆర్థికమాంద్యం మొదలైనవాటితో రైతాంగం పూర్తిగా కుంగిపోయింది. రైతాంగం కౌలుదారులు, వ్యవసాయ కూలీలు మారడమో, వలస వెళ్లడమో జరిగింది.

కౌలుదారీ విధానాలు

- హైదరాబాద్, ఆంధ్రా ప్రాంతంలోనూ భూస్వామ్య పద్ధతుల్లో ఉండే లోపాల వల్ల భాటకం వసూలు చేసేవారి సంఖ్య విపరీతంగా పెరగడం వల్ల కౌలుదారీ సంబంధాలు ఉండడం సర్వ సాధారణ విషయంగా మారింది.

హైదరాబాద్ రాష్ట్రంలో కౌలు విధానాలు

- హైదరాబాద్ సంస్థానంలో 1354 ఫసలీ (1944)లో ఆసామీ షిక్మి చట్టం అమలులోకి వచ్చే నాటికి రెండు రకాలైన కౌలుదార్లు ఉండేవారు.

షిక్మీదారులు

వీరే శాశ్వత కౌలుదారులు. కౌలుదారునికి రక్షణ, భూమిని సాగు చేసుకునే హక్కులు ఉన్న వారే షిక్మీదారులు.

ఆసామీ షిక్మీదారులు

వీరు ఏ హక్కులు లేని కౌలుదారులు. ఆసామీ షిక్మీదారులు కౌలుభూమిని 12 ఏళ్ల తన స్వాధీనంలో ఉంచుకోగలిగినప్పుడు షిక్మీదారులుగా గుర్తింపు లభించేది. కానీ హైదరాబాద్ సంస్థానం వంటి ఫ్యూడల్ వ్యవస్థలో ఏ హక్కులు లేని కౌలుదారుడు పన్నెండేళ్లు కౌలు భూమిని తన స్వాధీనంలో ఉంచుకోవడం జరగదు. ఒకవేళ పన్నెండేళ్లు ఒకే భూమిని కౌలు పద్ధతిలో సాగు చేస్తున్నప్పటికీ దాన్ని రుజువు చేసుకోవడం అంత సులభం కాదు. దీంతో కౌలుదారులందరూ ఆసామి షిక్మీదారులు (రక్షణలేని కౌలుదారులు)గానే ఉండేవారు.

Gilt edged securities refer to___



BANK EXAMS

BANKING AWARENESS

1. Who is the Chairman of NABARD (National Bank for Agriculture and Rural Development)?
a) Shaji. K.V.
b) Mrs V.R.Iyer c) HR Kamath
d) B Bhattacharya
e) R Rajendran
2. For recovery of NPA from the defaulted borrowers, SARFAESI Act 2002, is implemented. What does the letter 'S' stands for in SARFAESI
a) Social b) Security
c) Seasonal d) Stamp
e) Systematic
3. Bank holidays under Sec.25 of N.I. Act are declared by
a) RBI
b) State govt. for the respect state
c) Central govt.
d) LHO e) Prime Minister
4. One rupee coin issued under _____ Act
a) Coinage Act 1906
b) RBI c) BR
d) All the above
e) None of these
5. Clean Note policy has been introduced as per
a) Banking Regulation Act
b) RBI Act c) SBI Act
d) PNB Act e) None of these
6. Under prevention of Money laundering Act 2002, the financial transaction records have to be preserved for _____ years.
a) 5 b) 10 c) 20 d) 40
e) None of these
7. Under prevention of Money laundering Act 2002, banks have to report suspicious transaction to _____
a) RBI b) CBI c) FIU-IND
d) LHO e) Central Govt.
8. RBI Has relaxed KYC norms for small account holders who do not intend to make deposits over Rs.50,000/- and total credits in the account in a year is limited to Rs. 1 lakh. Total withdrawls/ Transfer in a month does not exceed Rs. ____
a) 10,000 b) 20,000
c) 50,000 d) 60,000
e) None of these
9. When form15-H has been received, the bank shall forward the same to I.T. Department on or before ____ day of next month.
a) 3rd b) 5th c) 7th
d) 15th e) 17th
10. In which of the following transaction PAN should be quoted?
a) A time deposit exceeding Rs.50,000
b) Payment in cash to purchase bank draft or banker's cheque for an amount aggregating Rs.50,000 or more during any one day
c) Deposit cash aggregating Rs. 50,000 or more during any one day
d) All the above e) None of these
11. Currency Notes are printed at:
a) Nasik b) Dewas c) Mysore
d) Salboni e) All of these
12. If the customer does not cooperate for making their accounts KYC compliant, despite repeated communication/ contacts, their accounts should be ____.
a) Frozen b) Closed
c) Close the account only after compliance of KYC
d) a or c e) a & b
13. As per KYC Norms / AML measures risk categorization of all customer accounts should be done and review of risk categorization should be cared out at ____ months intervals every year.
a) 3 b) 6 c) 9
d) 12 e) 15
14. SLR has to be maintained by banks under _______
a) Sec. 24 of BR Act
b) Sec. 24 of RBI Act
c) Sec. 42 of RBI Act
d) Sec. 42 of BR Act
e) None of these
15. Who is the Chairman of IRDA?
a) Ajay Seth
b) Dr. Rangarajan c) M.V.Nair
d) J.S. Bhatnagar e) HR Khan
16. Who is the authority for referring appeals against the award of banking ombudsman?
a) Deputy Governor, RBI
b) RBI Governor
c) CMD of concerned bank
d) Group of CMDs formed by RBI
e) None of the above
17. The sponsoring bank's share in RBIs is:
a) 50% b) 35% c) 15%
d) 75% e) None of these
18. Can a HUF join as a partner in a partnership firm?
a) Can be included
b) Can be included with company
c) Cannot join
d) Can join subject to the approval of CMD
e) None of the above
19. Bank's Lien is:
a) General lien b) Particular lien
c) Contingent lien
d) b & c e) None of these
20. Within how many days the CPIO (Central Public Information Officer) has to provide information under RTI Act?
a) 30 days b) 15 days
c) 45 days d) 10 days
e) 60 hours
21. Which of the following is not a negotiable instrument as per N.I. Act?
a) Promissory note b) Draft
c) TDR (Term Deposit Receipt)
d) Cheque
e) None of the above
22. Which of the following is not correct in respect of issue of CP:
a) It can now be issued as a stand-alone facility
b) Minimum issue is Rs. 5 lakh
c) CPs can be underwritten by a bank
d) Minimum Tangible net worth of the Corporate should be Rs. 4 crore
e) All the above
23. The maximum period for which a CD can be issued is _____
a) 1 month b) 3 months
c) 180 days d) 1 year
e) None of these
24. What is not true about CDs?
a) It is transferable from the data issues
b) It can be issued for a minimum period of 7 days
c) It is not all transferable
d) It can be issued in demat form only
e) None of these
25. Gilt edged securities refer to ___
a) Govt. securities
b) Shares of first class companies
c) Securities issued by first class companies
d) Duplicate securities
e) Securities issued by RBI Identified Companies
26. The standard rate at which the RBI is prepared to buy or rediscount export bills or other commercial paper eligible for purchase from banks under the RBI Act is known as _____
a) Bank rate b) Repo Rate
c) Card rate d) PLR
e) Base Rate
27. The result of increase in SLR by RBI is
a) Decrease in lendable resources of banks
b) Increase in loadable resources of banks
c) There will not be any change in loan able resources of banks
d) Only b and c
e) None of these
28. Blue chip securities mean ____
a) Shares of progressive, well managed companies with excellent record of payment of dividends.
b) The shares which are in blue ink
c) Securities issued by Chip Manufacturing companies
d) Securities identified by the concerned state governments
e) None of the above
29. Cash kept in the currency chest is owned by
a) Currency Chest Branch Bank
b) Central Government
c) Reserve Bank of India
d) State Bank of India
e) None of the above
30. Bank can't proceed against the borrower under SARFAESI Act where:
a) Security is agricultural land
b) Liability is less than Rs.1 lakh
c) Liability is less than 20% of the principal
d) Pledge of movables
e) All the above
31. The minimum capital required to start a new private sector bank is________
a) 100 crore b) 200 crore
c) 300 crore d) 400 crore
e) 500 crore
32. RBI injects liquidity through
a) Increase Bank Rate
b) Reduction of Repo Rate
c) Reduction of Reverse Repo
d) Increase CRR
e) Increase SLR
33. A customer requested to include his wife and daughter as nominees after one year of opening of the account. Will it be accepted?
a) It can be accepted since the nominees are the family members of the depositor
b) Cannot be considered since the request is not received at the time of opening of account
c) Can be considered with 50% share each
d) Nomination should be made only in favor of single name. Hence can't be considered
e) None of the above

KEY

1) a; 2) b; 3) b; 4) a; 5) a; 6) b; 7) c; 8) a; 9) c; 10) d; 11) e; 12) b; 13) b; 14) a; 15) a; 16) a; 17) b; 18) c; 19) a; 20) a; 21) c; 22) c; 23) d; 24) c; 25) a; 26) a; 27) a; 28) a; 29) c; 30) e; 31) e; 32) b; 33) d.